# మల్లాది వెంకట కృష్ణమూర్తి

నవల

# మ్యూజికాలజిస్ట్ రాజా



శ్రీ
కౌముది
మీ మునివేళ్లలో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 235

కౌముది మాసపత్రికలో

జనవరి 2020 సంచిక నుంచి జూన్ 2021 సంచిక వరకూ వచ్చిన

సీరియల్ నవల

*ప్రియ పాఠకులకు,*

*'రాజా' రాస్తున్న సీరియల్ 'మల్లాది వెంకటకృష్ణమూర్తి' కథని నాకు మొదటిసారి చెప్పినప్పుడు ఆయన 'మీ ఫోటో ఇంతదాకా ఎక్కడా రాకపోవడం వల్ల నేననుకున్న రచయిత పాత్రకి మీ పేరు వాడుకుంటాను. అభ్యంతరం లేదు కదా?' అని అడిగారు. ఆ తర్వాత నాలుగైదుసార్లు ఈ కథ గురించి చర్చించాం. ఆయనలో మంచి స్పార్క్ ఉంది కాబట్టి ఆరువారాల కోసం అనుకున్న కథని దాదాపు పదిహేను వారాలదాకా ఎక్కడా విసుగు పుట్టకుండా పెంచి రాయగలిగారు.*

*వ్యక్తిగతంగా నాకు సంబంధించిన కొన్ని విషయాలని కథలో సహజత్వం కోసం వాడుకోవడానికి చెప్పడం మినహా, ఇందులో నా ప్రమేయం ఏం లేదు. కొంతమంది వ్యక్తులు, ప్రసిద్ధులు, ఫోన్ చేసి అడిగారు. 'రాజా అనే మీ సీరియల్ చదువుతున్నాం బాగుంది' అని. మరికొందరు 'రాజా' అనే పేరుతో నేనే ఆ నవల రాస్తున్నానని కూడా అభిప్రాయపడ్డారు. అందులో నిజం లేదు. పత్రికా సాహిత్యంలో సంబంధం లేని ఓ సుప్రసిద్ధ చిత్ర దర్శకుడే ఆ 'ఆ సీరియల్ ఎవరు రాస్తున్నారని' అడగడాన్ని బట్టి చూస్తే ఈ నవల విశేషంగా అన్ని వర్గాల చేత ఆకర్షింపబడిందనిపించింది. రచయితగా కొన్నివేల ప్రాతలు సృష్టించిన నన్నే తన తొలి నవల్లో ఓ పాత్రని చేయడంలో 'రాజా' విజయవంతం అయ్యారనే నా అభిప్రాయం. ఆయన రాసే తర్వాత సీరియల్ నవల కూడా ఇదే ఒరవడిలో సక్సెస్ అవాలని రాజాకి నా బెస్టు విషెస్ తెలియజేస్తున్నాను.*

*మల్లాది వెంకటకృష్ణమూర్తి.*

❀❀❀

*(రచనాకాలం: 1987)*

*(ప్రారంభం)*

మౌళవిక కర్చీఫ్ తడితడిగా అయిపోయింది. ఒక్క ఆటో కూడా దొరకటం లేదు. ఆ చిరాకంతా ఆమె ముఖం మీదనే ప్రతిఫలిస్తోంది.

"ఇవాళ మనకి కారు కావాలని మీ డాడీకి చెప్పలేదా?" అంటూ అడిగింది జయశ్రీ

"ఓ అయిదు నిమిషాలవరకూ నన్ను మాట్లాడించకు."

మౌళవిక సంగతి తెలిసిన జయశ్రీ ఊరుకుంది. వెంటనే "నేను తీసుకొస్తానుండు" అంటూ బయలుదేరింది ఓ క్షణం తర్వాత.

"ఆటో" అంటూ బిగ్గరగా పిలిచింది. ఆ దారిన పోతున్న ఒకరిద్దరు జయశ్రీవైపు చూశారు కూడా. మౌళివిక కోసం అటువంటివి లెక్కచేయదు ఆమె. ఓ ఆటో ఆగింది.

"అశోక్ నగర్. సిటీ సెంట్రల్ లైబ్రరి చెల్తే ?"

"నయిజీ. కోఠీ జానాహై" అన్నాడా ఆటో డ్రయివర్.

"దస్ రుపై దేతే..ఆతే హై క్యా?" అంది మౌళవిక గట్టిగా.

"చలో అన్నాడు ఆటో డ్రైవర్ మీటర్ డౌన్ చేస్తూ.

నిజానికి నాలుగు రూపాయలు కూడా మించదు. పైగా అది ఉదయం తొమ్మిది గంటల సమయం. బేరం ఆడొచ్చు. పోలీసుని పిలవచ్చు. ఓపికపడితే ఇంకో ఆటో దొరుకుతుంది కూడా. కానీ మౌళవిక అనుభవిస్తున్న ఆ బాధని చూసి తిరిగి మాట్లాడలేకపోయింది జయశ్రీ

ఆటో బయలుదేరింది. 'ఉఫ్' అంది మౌళవిక సీటుకి చేరబడి రిలాక్స్ అవుతూ.

"ఎందుకంత టెన్షన్ నీకు?" అంది జయశ్రీ మౌళవిక మూడ్స్ ఆమెకు బాగా తెలుసు.

"అయామ్ సారీ జై.. అనవసరంగా నిన్ను కసురుకున్నాను."

"అది సర్లే. సిటీ సెంట్రల్ లైబ్రరీ కెందుకు? మనం పిక్నిక్ కి వెళ్ళటం లేదా?"

"అది తర్వాత. ముందు లైబ్రరీకి వెళ్ళాలి. రచయితల మీటింగ్ వుంది. ఎనిమిదిన్నరకే అని 'ఈనాడు'లో వేశారు."

"అక్కడికి మల్లాది వస్తున్నాడా?" అడిగింది జయశ్రీ

"ఎగ్జాట్లీ.. నీకెలా తెలుసు?"

"ఇన్నాళ్ళుగా నీతో సావాసం. బహుశా ఆ దోషం ఏదయినా అంటుకుని ఉండొచ్చు."

"ఈసారి ఎలాగయినా అతన్ని చూసి తీరాలి" అంది మౌళవిక ధృఢంగా.

"మరి ఎనిమిదిన్నర లోపునే బయలుదేరొచ్చుగా ఈ టెన్షన్లన్నీ ఎందుకు?"

"నీకు తెలియందేముంది కారులో డైరెక్టుగా గండిపేటకి వస్తాం అని చెప్పానా సడెన్‌గా 'ఆడిటర్‌తో పనుంది ఇప్పుడే వచ్చేస్తానని' కారు తీసుకుని చెక్కేశారు డాడీ. అప్పట్నుంచీ మొదలయింది తిక్క."

మౌళవిక ఇప్పుడు పూర్తిగా రిలాక్సు అయిపోయింది.

"ఎలా ఉంటాడంటావ్? బావుంటాడంటావా?" అని మళ్ళీ తనే అంది మరో నిమిషం తర్వాత.

"ఏమో తల్లీ? ఎవరికి మాత్రం తెలుసు? తీరా యిద్దరు ఆడపిల్లలు వెళ్ళి మాట్లాడితే తెగ ఫోజు కొట్టేస్తాడో ఎమిటో?"

"కొడితే కొట్టనీ. ఒక్కసారి చూసి ఆటోగ్రాఫ్స్ తీసుకోగలిగితే చాలు" అంది మౌళవిక.

"అదేవిటే ఆటోగ్రాఫ్స్ అంటున్నావు?"

"ఇదిగో ఇటు చూడు" అంటూ వ్యానిటీ బ్యాగ్‌లోంచి కొత్త ఆటోగ్రాఫ్ బుక్ తీస్ చూపించింది మౌళవిక.

"అతని కోసం కొన్న ఆటోగ్రాఫ్ బుక్ ఇది. అన్ని పేజీలలోనూ అతని సంతకం తీసుకుంటా. అతని సంతకం తప్ప ఈ బుక్‌లో ఇంకేమీ కనిపించడానికి వీలులేదు."

"ఇదేం పిచ్చే?" అంది జయశ్రీ విస్తుబోతూ. మల్లాది వెంకటకృష్ణమూర్తి అంటే మౌళవికకి విపరీతమయిన అభిమానమని ఆమెకు తెలుసు. అతనికి వ్యతిరేకంగా ఒక్కమాట ఎవరు మాట్లాడినా మౌళవిక సహించలేదన్న సంగతీ తెలుసు. అయినా ఉండబట్టలేక అనేసింది.

"నీకిది పిచ్చిలా ఉండొచ్చు. నాకు ఆరాధన కావచ్చు. అతనికి అభిమానంలా కనిపించొచ్చు" అంది మౌళవిక ఈజీగా.

"సరేలే ఎవడి పిచ్చి వాడికానందం."

"అది మగాళ్ళ నుద్దేశించి అన్నదే ఆడ వాళ్ళకా సామెత వర్తించదు" అంది మౌళవిక హుషారుగా.

అసలు మౌళవిక ఎప్పుడూ హుషారుగా వుంటుంది. ఆమె చలాకీతనానికి అలవాటు పడిన వాళ్ళు రోజుకి ఒకసారయిన్ ఆమెతో మాట్లాడకుండా ఉండలేరు. దానికి తోడు ఆకర్షించే చక్రాల్లాంటి కళ్ళు నవ్వితే కనిపించే ఓ దొంతి పన్ని ఆమెకు వరాలు.

ఆటో ఆగింది. బ్యాగ్ లోంచి పది రూపాయలు తీసి ఇచ్చేసి పరుగెడుతున్నంత వేగంగా ముందుకు నడిచింది మౌళవిక.

"అబ్బ. కాస్త స్లోగా నడవ్వే బాబూ. జాంబవంతుడి అంగలూ నువ్వునూ" అంది జయశ్రీ

"అసలు హనుమంతుడిలా ఎగరాలనుందే కుదరక జాంబవంతుడి టైపులో ప్రాక్టీస్ చేస్తున్నానంతే."

మరికొన్ని నిమిషాలలో 'మల్లాది'ని చూడపోతున్నాననే ఆమె ఉత్సాహం మీద నీళ్ళు జల్లటం ఇష్టంలేక "పద పద" అంటూ కూడా పరుగెత్తింది జయశ్రీ "మల్లాదిగారు లోపలున్నారా?" అని అడిగింది మౌళవిక అక్కడే ఓ రిజిష్టర్ ముందేసుకుని కూచున్న ఒకతనిని.

ఆటో ఆగిన దగ్గర్నుంచీ అతడు వీళ్ళిద్దర్నే చూస్తున్నాడు. లోపల జరుగుతున్నది రచయితల మీటింగైతే ఆడవాళ్ళెందుకు వచ్చారా అన్నది అతని మొదటి సందేహం. వచ్చిన వాళ్ళకి పరుగులాంటి నడక ఎందుకో, అంత

అర్థంటేమిటో నన్నది అతని రెండో సందేహం. నిజానికతడు కూడా మల్లాడిని ఎప్పుడూ చూడలేదు. కానీ వీళ్ళిద్దరూ కాస్త చదువుకున్న పెద్దింటి అమ్మాయిల్లాగా కనిపించటం వల్ల దబాయించేస్తారేమోనని కొంచెం భయపడ్డాడు.

"తె...తెలీదండీ. అక్కడ ఆదివిష్ణుగారున్నారు. ఆయన్ని అడగండి" అన్నాడు.

"ఆదివిష్ణు అంటే"

"అదేనండీ ఆదివిష్ణు అని మంచి హ్యూమర్ రైటరు సగటు మనిషి, వాంటెడ్ ఫార్స్, సిద్దార్థ, అతిథి దేవుళ్ళొస్తున్నారు జాగ్రత్త"

"అవన్నీ మేమూ చదివామండీ. అక్కడున్న వాళ్ళలో ఆదివిష్ణు ఎవరూ అని?"

అతను ఖంగుతిన్నాడు. "అదిగో ఆ మూల నిల్చుని తెల్లటి జుట్టు, కళ్ళజోడు చేతిలో గోల్డ్ ఫ్లేక్ సిగిరెట్టూ ఆయనేనండి" అంటూ ఒదిలించేసుకుని వాళ్ళిద్దరూ ముందుకి నడవగానే "హమ్మయ్య" అని అనుకున్నాడు.

"ఎక్స్క్యూజ్ మీ" అంది మౌళవిక ఆదివిష్ణు దగ్గరికి వెళ్ళి.

"ఏంటండీ?" అన్నాడు అతను.

"మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఈ మీటింగుకి వచ్చారండీ?"

"లేదే" అన్నాడు ఆదివిష్ణు సిగిరెట్ పారేస్తూ.

"లేదా?" ఒక్కసారిగా గాలి తీసేసినట్టయిపోయింది మౌళవికకి.

"నిజమేనాండీ డెఫినెట్‌గా ఆయన రాలేదా?" అడిగింది జయశ్రీ

మౌళవిక పరిస్థితిని అర్థం చేసుకుని ఓ నిమిషంపాటు ఆమె మాట్లాడలేదని జయశ్రీకి బాగా తెలుసు.

"లేదండీ విజయవాడలో పబ్లిషర్స్‌తో ఏదో పనుంది. మీటింగుకి రాలేకపోతున్నానని నిన్న సాయంత్రమే చెప్పాడు. ఇవాళ రాత్రికి గానీ తిరిగిరాడు" అని అన్నాడు ఆదివిష్ణు.

"మరి ఆయన్ని కలవాలంటే ఎలాగండీ?" అంది జయశ్రీ

"ఏ పత్రిక ఆఫీసుకెళ్ళినా అతని అడ్రసు ఇస్తారు కదా?"

"మాకివ్వరండీ చాలాసార్లు ప్రయత్నించాను" అంది మౌళవిక గొంతు పెగుల్చుకుని.

ఆమె కళ్ళలోకి చూశాడు ఆదివిష్ణు. అప్పటికే ఓ సన్నటి నీటి పొర కమ్ముకుని ఉంది ఆ కళ్ళలో, ఆవెనక దాగిన నిరాశని, ఆ నిరాశని ప్రతిబింబచేస్తున్న నిస్పృహని పూర్తిగా ఒక్క క్షణంలో క్షుణ్ణంగా చదవగలిగాడతను.

"ఓ పని చెయ్యండి. మీ అడ్రసు ఇవ్వండి. రేపో ఎల్లుండో అతను కలిసినప్పుడు ఇస్తాను. మీకు ఉత్తరం రాస్తాడు."

''రాయరండీ ఒకవేళ రాసినా తన పోస్టు బాక్స్ నెంబరు ఆ80 టి అని ఇస్తారు. ఆ అడ్రసుకే మేం రాయాలి'' అంది మౌళవిక.

''మల్లాది అంటే మా మౌళవికకి చాలా ఇష్టం అండీ. ఒకసారి ఎలాగైనా సరే ఆయన్ని కలుసుకునేట్టు చేయండి. మీరందరూ ఎప్పుడూ కలుసుకుంటూ ఉంటారు కదా.. ప్లీజ్'' అమి జయశ్రీ

''చిచ్చిచ్చి చ్చి చ్చి.. మీరంతగా ఫీలవక్కర్లేదండీ మీ అడ్రసివ్వండి చెప్తాను. అతని సెక్రటరీకో, అతనికో నేనే స్వయంగా ఇచ్చి మిమ్మల్ని కలుసుకునేటట్టు చేస్తాను'' అన్నాడు అతను.

''ప్రామిస్?'' అంది మౌళవిక హుషారుగా చనువు తీసేసుకుంటూ.

''సరస్వతోడండి బాబూ. తప్పకుండా ఇస్తాను'' అన్నాడు ఆదివిష్ణు మరో సిగిరెట్ వెలిగిస్తూ.

''మీరు ఆర్టీసీలో పనిచేస్తుంటారు కదండీ'' అంది ఆమె తన అడ్రస్ రాస్తూ.

''అవునండీ.''

''మరి మీకింత కర్టెసీ ఎలా వచ్చిందండీ?''

''అదేంటండీ. ఆర్.టి.సీ అంటే రాదు, తెలీదు, చెప్పరు అని అంటారు కదా. మీరింత హెల్పింగ్ నేచర్‌తో మాట్లాడుతుంటే'' అంది ఆమె.

''మీరు భలేవారండీ బాబూ. భలే తమాషాగా మాట్లాడుతున్నారే?'' అతను ఖిస్ ఖిస్ ఖిస్ మని నవ్వుతూ.

''మల్లాదిగారిని పరిచయం కానివ్వండి. మరింత రెచ్చిపోతుంది మా మౌళివిక'' అంది జయశ్రీ

''చాలా సంతోషం అండీ. మంచి అభిమానుల్ని చూసేనివాళ'' అన్నాడు ఆదివిష్ణు అడ్రసు కాగితాన్ని మడిచి జేబులో పెట్టుకుంటూ.

''చాలా థాంక్సండీ వెళ్ళొస్తాం'' అంటూ బైటికి నడిచారిద్దరూ.

''ఏంట్రా ఇంత ఆలస్యం?'' అంటూ బిలబిలమని చుట్టుముట్టారు సుమారు పదిమంది అమ్మాయిలు ఆలస్యంగా వచ్చిన మౌళివిక, జయశ్రీని.

''అబ్బే. కారు మా డాడీ తీసుకెళ్ళారు. బస్సు కోస్మె వెయిట్ చేస్తే దొరకలేదు. గండిపేట దాకా రమ్మంటే ఒక్క ఆటోవాడూ ఎక్స్ట్రా తీసుకోకుండా రాలేదు అందుకని'' అంది మౌళవిక.

''మధ్యలో మల్లాది గురించి కొంత వేట జరిగిందిలే. అది చెప్పవేం? అఫ్ కోర్స్ చూడ్డం ఈసాఇర్ కూడా కుదర్లేదనుకో'' అంది జయశ్రీ

''అదన్నమాట సంగతి ఆయనొకవేళ కలిసుంటే ఇవాళ పిక్నిక్‌కి డుమ్మా కొట్టేసే దానివన్నమాట?'' అంది సంయుక్త.

"చూడు సంయుక్తా సూక్ష్మగ్రాహీ ఆయన్నొకవేళ కలిస్తే మరి కొంచెం ఆలస్యం అయివుండేదేమోగానీ మొత్తానికి పిక్నిక్కే ఎలా ఎగ్గొట్టేస్తాను చెప్పు" అంది మౌళవిక.

"ఏమో తల్లీ ఆ మల్లాది పేరు చెపితే చాలు నీకు ఒళ్ళూపై తెలీదు కదా అందుకని"

ఇక వీళ్ళు తనని ఆటపట్టించడం మొదలుపెడతారని గ్రహించింది మౌళవిక.

"సరి సరి అదలా ఉంచి ఈ పిక్నిక్‌లో మనం ఆడుకోవాలి కదా. నేనో మంచి బ్రెయిన్ టీజింగ్ క్వొశ్చన్ ఇస్తాను చెప్పండి. ఎవరు చెప్పగలరో?" అని సంభాషణను మళ్ళించింది.

"చెప్పు...చెప్పు"

"అర్ధనారీశ్వరుడైన శివుడు ధరించే బ్రా ఏది?" అంది మౌళవిక.

"శివుడు బ్రా ధరించడమేమిటే? పాడు" అంది సంయుక్త.

"అందులోనే వుంది టెక్నిక్. ఊఁ చెప్పండి. సాయంత్రం దాకా గడువిస్తున్నా."

"లాభంలేదే త్వరగా చెప్పేయ్ ఆన్సరు సస్పెన్స్ భరించలేకపోతున్నాం."

"త్వరగా చెప్పాలంటే మళ్ళీ మల్లాదిని గురించి తక్కువగా మాట్లాడనని ప్రామిస్ చెయ్యండి. ఇప్పుడే చెపుతా. లేదా సాయంత్రం దాకా బుర్రలు బద్దలు కొట్టుకోండి" మౌళవిక అంది గర్వంగా.

"ఓ.కే మహా తల్లీ. నిన్నూ, మల్లాదినీ ఇంకే అనం. ప్లీజ్ చెప్పేయ్. కడుపుబ్బిపోతోంది.

"కడుపుబ్బిపోతే ఆ పక్కకి పోయి కూచో. తరంగిణీ ఓ తరంగిణీ అని పాడుకుంటూ" అంది మౌళవిక సస్పెన్స్‌ను మరింత సాగదీస్తూ.

అందరూ మూకుమ్మడిగా చేరి బ్రతిమాలేసరికి చివరికి చెప్పిందామె

"శివుడు ధరించే బ్రా కోబ్రా!"

"హమ్మయ్య ఇంతేనా? ఎంత ఏడిపించావే బాబూ ఈ మాత్రందానికి శివుడు అనొచ్చుగా 'అర్ధనారీశ్వరుడైనా' ఎందుకో?"

"దాన్నే మిస్ డైరెక్షన్ అంటారు" అంది మౌళవిక మరింత గర్వంగా.

"ఒప్పుకున్నాం. నీకు, నీ మల్లాది టైప్ క్విజ్‌లకి జోహార్లు. అన్నట్లు మీ మల్లాదిగారికి హేట్సాఫ్" అన్నారు సంయుక్త అండ్ కో సంయుక్తంగా.

"మనం హేట్సాఫ్" అనకూడదు - "టెయిల్స్ ఆఫ్" అనాలనుకుంటాను.

అలా సాయంత్రం వరకూ కేరింతలతో హాయిగా గడిచిపోయింది. మౌళవిక ఇంటికి చేరేసరికి ఏడున్నర.

"డాడీ ఏరీ?" అని అడిగింది వంటవాడ్ని.

"ఇప్పటిదాకా మీ గురించే చూసి పావుగంట కిందటే మీటింగ్ ఉందంటూ బయటికి వెళ్ళారు. మిమ్మల్ని భోంచేసెయ్యమన్నారు" అన్నాడు యాదగిరి. పేరుకి యాదగిరే అయినా అతని భాషలో తూర్పు జిల్లాల యాసే ఎక్కువ ఉంటుంది. అప్పుడప్పుడు మాత్రం తెలంగాణాతనం తొంగిచూస్తూ ఉంటుంది.

"ముందు కాఫీ ఇవ్వు, స్నానం చేశాక భోంచేస్తాను" అంది మౌళవిక వాచీ, ఉంగరాన్ని తీసి బ్యాగ్‌లో వేసుకుంటూ.

"అలాగేనమ్మా అన్నట్టిందాక మీ గురించి ఓ బాబు ఎవరో వచ్చారు."

"ఎవరు పేరడిగావా?" అంది మౌళవిక. తన గురించి ఇంటికి వచ్చే మగాడెవరయి ఉంటారు? తన బాయ్ ఫ్రెండ్స్, క్లాస్‌మేట్స్‌కూడా ఎవరూ లేరే?

"అడిగానమ్మా చాలా పెద్ద పేరుంది. యాదుకి రాలేదు మర్చిపోయా."

"అందుకే నీకు 'యాదగిరి' అని పేరు పెట్టి ఉంటారు. సర్లే కాఫీ ఇవ్వు" అంది ఆమె టవల్ భుజం మీద వేసుకుని.

కాఫీ తాగుతుండగా కాలింగ్ బెల్ మోగింది.

"ఇందాక వచ్చిన బాబుగారేనమ్మా" అన్నాడు యాదగిరి తలుపు తీసొచ్చి.

సగం తాగుతున్న కప్పుని అలాగే ఉంచేసి హాలులోకి వచ్చింది మౌళవిక.

కుర్చీలో కూర్చుని ఉన్నాడతను. మంచి పొడవు. పొడవుకి తగ్గ విగ్రహం. కళ్ళజోడు.

"మీరు...?" అంది మౌళవిక.

అతడు లేచి సమాధానం చెప్పాడు.

ఆమె చెవులు గింగురుమన్నాయి.

"ఆ" అంది కళ్ళు విప్పార్చి.

"అవునండీ. నా పేరు మల్లాది వెంకట కృష్ణమూర్తి" అని అన్నాడతను.

2

**గుండెల్లో** ఒక్కసారి "దఢక్" మంటూ ఏదో ఓ జర్కు ఇచ్చినట్టుగా అయింది మౌళవికకి. చూస్తున్నది నిజమా కాదా అనే సందిగ్ధంలో ఉందామె. ఒంట్లోని రక్తం మొత్తం అదే మీమాంసతో, జరుగుతున్నది నిర్ధారణ చేసుకునేందుకు శరవేగంతో పరుగెత్తి ముఖంలోకి కళ్ళలోకి వచ్చినట్టుగా ముఖం ఎర్రగా మారింది. కళ్ళలో ఎర్రటి జీరలు బలంగా కనిపించాయి.

"నిజం?" అందామె.

సంతోషం. ఉద్వేగం ఒకేసారి గొంతులోంచి బైటికి రావడం వల్ల ఆమె కంఠం జీరపోయింది.

"నిజమేనండీ.. నేనే మల్లాదిని" అన్నాడతను. జేబులోంచి ఓ కాగితాన్ని తీసి ఇచ్చాడామెకు. అది ఉదయాన్నే ఆదివిష్ణుకి మౌళవిక రాసి ఇచ్చిన అడ్రసు కాగితం. తనని తాను నిగ్రహించుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తోందామె.

"కూర్చోండి సార్.. కూర్చోండి" అంది. అతడు కూర్చోగానే ఆమె కూడా కూర్చోబోయింది. బాగా టెన్షన్లో ఉందేమో ఇంచుమించుగా కూలబడిపోయినట్టే 'దబ్' మంటూ కూర్చుందామె.

ఆమె వైపు ఎంతో ఆశ్చర్యంగా చూస్తున్నాడతను.

"నేనెంతో అదృష్టవంతురాల్ని మల్లాదిగారూ" అంది మౌళవిక రెండు చేతులూ జోడిస్తూ.

ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు మల్లాది. చక్రాల్లాంటి ఆమె కళ్ళల్లో, ఏకాగ్రత కోసం కొందరు సాధకులు తెల్లటి గోడమీద పెట్టుకునే నల్లటి పెద్ద చుక్కలాగా, తెల్లటి సూర్యుడు ఉదయించినట్లు గుండ్రటి కనుపాప, దాన్ని అటూ ఇటూ లాగుతున్నట్లు దారాల్లాంటి ఎర్రటి జీరలు. ఆ ఎర్రటి జీరల్ని ప్రక్షాళన చేసి తిరిగి ఆ కళ్ళని స్వచ్ఛంగా చేయడానికా అన్నట్టు సన్నగా అలుముకుంటున్న కన్నీటి పొర. చూస్తూండగానే అవి బొట్లుగా మారి టప్ మంటూ ఆమె చేతిమీద పడ్డాయి.

"అరె అదేంటండీ?" అడిగాడతను. తల అడ్డంగా తాటించిందామె 'ఏం లేదన్నట్టు'. చూపుడు వేలితో ఎడమ కంటిని బొటనవేలితో కుడికంటిని ఏకకాలంలో రాపాడిస్తూ కన్నీటిని తుడిచేసింది.

"మామూలుగా సినిమాల్లోనూ, సీరియల్స్‌లోనూ మీ రచయితలు రాసే రొటీన్ డైలాగే. ఇవి కన్నీళ్ళు కావు ఆనంద భాష్పాలు" అని అందామె చిన్న నవ్వు అంటే నిజంగా 'చిరు' నవ్వు తొంగి చూస్తూ ఉండగా.

"పోనీ అది రొటిన్ డైలాగ్ అని అనుకుంటే ఇవి కన్నీళ్ళు కావు. జల పుష్పాలు అని మార్చుకుంటే వెరైటీగా ఉంటుందా?"

ఆమె పెదవుల మీది చిరునవ్వు మందహాసంగా మారి తెల్లటి దొంతి పన్ను తళుక్కుమంది.

"జల పుష్పాలు అంటే ఇంకో మీనింగ్ కూడా ఉంది కదా మల్లాదిగారూ" అందామె.

"అవును చేపల్ని జలపుష్పాలు అని అంటారు. కళ్ళని చేపలతో పోలుస్తారు కాబట్టి కన్నీటిని జలపుష్పాలు అని అనకూడదంటారా?"

"మీకు చెప్పేటంత దాన్నంటారా?" అని అందామె సోఫాలో చేరబడి కళ్ళుమూసుకుని.

టిక్కెట్ దొరుకుతుందో దొరకదోనన్న గాభరాతో ఉన్నవాడికి అకస్మాత్తుగా ఆఖరు నిమిషంలో రిజర్వేషన్ దొరకగానే సీట్లో కూర్చున్న తర్వాత వచ్చే సంతృప్తితో కూడిన నిస్త్రాణ వంటి అనుభవం అప్పుడామెని ఆవహించుకుని ఉంది.

"అదేమిటలా అయిపోయారు?" అని అడిగాడు మల్లాది.

"అదే సార్. మిమ్మల్ని ఎప్పటికయినా చూస్తానని తెలుసు. ఎలాగయినా సరే చూసి తీరుతాననీ తెలుసు. కానీ ఈ అనెక్స్‌పెక్టెడ్ ప్లెజెంట్ సర్‌ప్రైజ్ ఒక్కసారిగా తట్టుకోలేక" అంటూ ఆగింది మౌళవిక. ఆమె వంకే చూస్తున్నాడు మల్లాది.

"అయామ్ సారీ సర్! ఇదేంటి నాతో బాగా పరిచయం ఉన్నట్టుగా ప్రవర్తిస్తున్నది ఇదా? అనే భావం మీకు కలిగించినట్టయితే కైండ్ లీ ఎక్స్‌క్యూజ్‌మీ. మిమ్మల్ని నేను ఎప్పటికయినా కలిస్తే మాట్లాడదాం అని అనుకున్నవి కొన్ని వందలు వేలు లక్షలు ఉన్నాయండి, నేను మిమ్మల్ని కొంచెం బోర్ కొట్టచ్చా?"

"చూడండి మౌళవికగారూ ఎంతో ఆప్యాయతతో ఒక రచయితని అభిమానించే వారి హృదయ స్పందనని అంత తేలికగా, తక్కువగా అంచనా కట్టేవాడిని కాదు నేను. నా రచనల ద్వార నాతో పరిచయం స్పిరిచ్యుయల్‌గా ఎప్పుడో పెంచుకున్నారు మీరు. ప్లీజ్ గో హెడ్ రియల్లీ ఐ లైక్ యువర్ ఎడ్మిరేషన్" అని అన్నాడు మల్లాది.

"మీరేం అనుకోకపోతే ఇవాళ రాత్రి యిక్కడే భోంచేస్తారా?" అంది మౌళవిక.

ఇప్పుడామె పూర్తిగా నార్మల్ కండిషన్‌లోకి వచ్చేసింది.

"ఆ!" అన్నాడతను ఊహించని ఆ ప్రశ్నకి.

"ఏం లేదూ వంట పూర్తయి భోజనం చేసేలోగా నాకు కలిసొచ్చే ఆ టైములో మిమ్మల్ని అడగాలంటున్న ఆ వంద వేలు లక్షప్రశ్నల్లో కనీసం నాలుగయిదైనా అడుగుదామని."

ఆమె కళ్ళల్లోకి మళ్ళీ చూశాడు మల్లాది. వాటిలో చెక్కు చెదరని పవిత్రమయిన ఆరాధనాభావం. బాపూ 'సీతా కళ్యాణం'లో చిన్న సీత ఓ పెద్ద హాలులో తిరుగుతూ సంభ్రమాశ్చర్యాలతో చూసిన ఆ చిన్నారి కళ్ళలో కనిపించిన అలౌకిక, అద్వైత దృక్కులకి అనిర్వచనీయమయిన భాష్యం చెప్పే చూపులవి.

"ఒక మాట చెప్పనా? మీకు కష్టం కలిగించినా సరే" అన్నాడతను.

"చెప్పండి. మీరసలు నాకే కష్టమూ కలిగించలేరు. ఎందుకంటే నా యిష్టమంతా మీ ఇష్టాలకు అనుగుణంగా మార్చుకున్నాను కాబట్టి" మౌళవిక అంది.

"అంటే..?"

"మీ కథలో హీరోయిన్స్ యాంకీ కూడిల్ ఐస్ క్రీమ్ తింటూ వుంటారు కదా? నిజంగా కొన్నేళ్ళ క్రితం వరకూ నాకు ఐస్ క్రీం అంటే అంత యిష్టం వుండేది కాదు. మీ కథల్లో ఆ ముక్క చదివిన దగ్గరనుంచే ఆ ఐస్‌క్రీమ్ మీద ఇష్టాన్ని పెంచుకున్నాను.  ఇప్పుడు ఎముకలు కొరికే చలిలోనయినా సరే హ్యాపీగా తినగలను ఐస్‌క్రీమ్‌ని. సో అలాంటి అనుమానాలేమీ పెట్టుకోకండి. చెప్పండి" అంది మౌళవిక.

సన్నగా నవ్వాడతను. "అబ్బెబ్బే అంత కష్టపెట్టేది కాదనుకోండి. నిజంగా నాకిప్పుడు భోజనం చెయ్యాలని లేదు. మరోసారి ఎప్పుడైనా. బట్ ఇది మీరేదో ప్రశ్నలు అడిగేసి విసిగించేస్తారన్న ఫీలింగుతో తప్పించుకోవటం లాంటిది కాదు ప్రామిస్."

"నిజంగా చెప్పాలంటే నాకూ ఆకలిగా లేదు. మిమ్మల్ని చూసిన ఆనందంతోనే సగం కడుపు నిండిపోయిందనుకుంటా. పోనీ టిఫెను కొద్దిగా ఏదైనా" అంది మౌళవిక. మూసిన ఎడం కన్ను దగ్గర ఎడంచేతి చూపుడు వేలిగోరుతో బొటనవేలి గోరు కలిపి టిక్ మనిపిస్తూ 'పిసరంతే సుమా' అనే అర్థం వచ్చేట్టు.

ఆ చిలిపి భంగిమతో మౌళవికను చూస్తే తట్టుకోవటం కష్టం ఎవరికైనా సరే.

"మీ యిష్టం" అన్నాడతను.

"థాంక్యూ..! యాదగిరీ" అంటూ .కేకేసిందామె.

"ఈలోగా ఇంకోమాట చెప్పనా. బహుశా మీకది సంతోషం కలిగించేదే" అన్నాడు మల్లాది.

"చెప్పండి" అంది మౌళవిక ఉత్సాహంగా ముందుకు జరిగి.

"ఈ ఏరియాలో నాకో రూం చూపించగలరా? విత్ ఎటాచ్డ్ బాత్"

"మీకెందుకూ?"

"నాకు రాసుకోవడానికి ప్రయివేట్‌గా ఉండే రూమ్ ఒకటి కావాలి. అదే గనక చూపించగలిగితే నేనెప్పుడూ మీ ఇంటికి దగ్గరలోనే ఉంటాను. ఒక విధంగా చెప్పాలంటే అసలు ఆ రూమ్‌లోనే పూర్తిగా మకాం పెట్టేస్తానన్నమాట.

ఇంక మీ ఇష్టం వచ్చినంతసేపు నన్ను బోరు కొట్టియ్యొచ్చు అఫ్ కోర్స్. అది మీరు వాడిన మాటే... మరోలా అనుకోరనుకుంటా" అన్నాడు మల్లాది.

"మీరెప్పుడూ ఇక్కడే వుండిపోతే మరి మీ ఇంట్లో వాళ్ళు ఘొల్లుమనరూ?"

"నాకా ప్రాబ్లమ్స్ లేవు లక్కీగా" అంటూ ఆగి "ఇక్కడే అంటున్నారు అంటే రూమ్ ఏదైనా రెడీగా వుందా?" అని అడిగాడు మల్లాది.

మౌళవకి అప్పటికే ఆలోచనల్లో పడిపోయింది. ఆ ప్రాబ్లమ్స్ అంటే చిన్న అలజడిలాంటి వణుకేదో దడలా ఓ క్షణంపాటు ఆమె గుండెల్లో.

"ఏంటమ్మా...?"

తుళ్ళిపడి పక్కనే చూసిందామె యాదగిరిని.

"వడ్డించమంటారా?" అని అడుగుతున్నాడు.

"భోజనం వద్దుగానీ అర్జంటుగా టిఫినేదైనా మా ఇద్దరికీ చెయ్యి. చెప్పండి సార్. ఏం చేయించమంటారు?" మౌళవిక తమాయించుకుని.

"భలేవారే ఇదేమన్నా హోటలా మనిష్టం వచ్చింది ఆర్డరు చెయ్యడానికి? ఇళ్ళలో వండేవాళ్ళదే పై చెయ్యి. కాబట్టి ఛాయిస్ మీ యాదగిరికే వదిలెయ్యండి" అన్నాడు మల్లాది.

"అలా అయితే దోసెలే చేసేస్తానమ్మా. పిండి కూడా కలిపి రెడీగా ఉంది" అంటూ లోపలికి పరిగెత్తాడు యాదగిరి.

"అసలు దోసెలకు ఆ పేరు ఎలా వచ్చిందో తెలుసాండి మీకు?"

"ఊహు" తల అడ్డంగా ఊపిందామె.

"ఈ దోసె అనే పదాన్ని ముస్లిమ్స్ కనిపెట్టారటండి. మనం అట్లు వేసుకోవడం అదీ చూసి వాళ్ళు కూడా అలా అట్లు చేసుకోవాలని సరదాపడ్డారట. పిండి కలిపి పెనం మీద పోస్తే "ఉస్.." అంటూ సౌండ్ వచ్చిందంట. "ఏక్ ఉస్" అన్నారట. బాగా కాలాక రెండో పక్క తిప్పి మళ్ళీ పెనం మీద వేశాక మళ్ళీ "ఉస్" అనే సౌండ్ వచ్చిందట. "దో ఉస్" అని అనుకున్నారట. సరే చెయ్యడం వచ్చేసింది కదా దానికి పేరేం పెడదాం అని అనుకుంటుంటే "ఎలాగూ సౌండ్ రెండుసార్లు 'ఉస్' అంటూ వస్తోంది గదో 'దో ఉస్' అని పిలుద్దాం అని అనుకున్నారట. ఆ 'దో ఉస్' అనే పేరె దోస్...దోస్ అంటూ దోసెగా స్థిరపడిపోయిందట" అని ముగించి మౌళవిక వంక చూశాడతను.

రెప్పయినా వెయ్యకుండా అతనివంకే చూస్తోందామె. "ఏమండీ బాలేదా ఈ ఎక్స్‌ప్లనేషన్?" అని అడిగాడు.

"మల్లాదిగారూ నిజం చెపుతున్నాను. మిమ్మల్ని ఎప్పట్నుంచో అడుగుదామనుకుంటున్న ప్రశ్నల్లో ఇదొకటి ఇలా ప్రతిదాన్ని డీప్‌గా చూసి దానికో రిసెర్చి టైపు ఎక్స్ ప్లనేషన్స్ మీరు రాస్తుంటారే - ఎలా వస్తాయండి ఇన్ని మీకు?" అంది మౌళవిక.

"ఎలా అంటే దానికి నా ప్రొఫెషనల్ సీక్రెట్స్ అన్నీ చెప్పేయాలి. బట్ వన్ థింగ్. ఏదైనా ఒక సబ్జెక్టు అనుకున్నప్పుడు దానికి సంబంధించిన మేటర్ పూర్తిగా సంపాదించడానికి, అందులో జనాకర్షణ కోసం పెట్టే తమాషాల్ని పోగు చేయడానికి,

ఒక్కొక్క ప్లాటుకి ఒక సంవత్సరానికి పైగా వెచ్చించటం జరుగుతుందండీ" అంటూ సగ్మ చెబుతుండగానే అందుకుంది మౌళవిక.

"ఇప్పుడు నాకు చెప్పిన ఈ దోసె వృత్తాంతం ఎందులోనూ రాయలేదు కదూ?" అంటూ.

"అబ్బే! ఇది ఇప్పటికిప్పుడు మీ కోసం అల్లుకుంది. మిమ్మల్ని మూడ్‌లోకి తీసుకురావటం కోసం."

"నిజం! ఎందుకూ" అడిగిందామె.

"ఎందుకేమిటి? ఇందాక రూమ్ గురించి అడుగుతుంటే ఏదో లోకాల్లోకి వెళ్ళిపోయారు మీరు" అని మల్లాది అంటుంటే సిగ్గుతో తలదించేసుకుంది మౌళవిక.

ఓ క్షణం తర్వాత తల ఎత్తి 'పదండి' అందామె.

"ఎక్కడికి?"

"రూమ్ చూపిస్తాను పదండి" అంటూ దారి తీసింది. ఆమె వెనుకే నడిచాడతను.

అదే కాంపౌండ్‌లో వేరేగా గెస్టు హౌస్‌లా ఉందది. తలుపు తెరిచి లైటు వేసిందామె ఒక రూమ్, కిచెన్ బాత్రూమ్, రెండు మంచాలు, నాలుగైదు కుర్చీలు.

"బావుందా?"

"బ్రహ్మాండం ఇది మీదేనా? నాకివ్వగలరా?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

"ఇది మా అన్నయ్య కట్టించుకున్నది. ఫారిన్ నుంచి తనెప్పుడు వచ్చినా ఇందులోనే ఉంటాడు. శుభ్రం చెయ్యడానికి తప్ప తన పర్మిషన్ లేకుండా ఎవ్వరం ఈ కాటేజ్‌ని ఓపెన్ చెయ్యం" అని చెప్పుతూనే ఉంది.

"అయామ్ సారీ. అనవసరంగా ఆశపడ్డాను" అని అన్నాడు మల్లాది.

"లేదు సార్. ఇది మీదే మా అన్నయ్యని ఒప్పించే పూచీ నాది. పైగా తను లాస్టుమంతే వెళ్ళాడు. మరో రెండు సంవత్సరాల వరకూ రాడు" అంది మౌళవిక.

"రిస్కేమైనా తీసుకుంటున్నారేమో!?"

"నో ప్రాబ్లెమ్ - మీ గురించి ఈ మాత్రం చెయ్యకపోతే నేను శుద్ధ వేస్టు కింద లెక్కండి పైగా మీకిస్తున్నానని చెప్తే మా డాడీ ఎంతో సంతోషిస్తారు కూడా ఎప్పుడొచ్చి దిగుతారు మీరు"

ఆమె కంఠంలో ధ్వనించిన ధృఢత్వం ఆమె విల్ పవర్‌ని అద్దం పట్టినంత స్పష్టంగా ఉంది.

"ఏ క్షణానైనా రెడీ.. మరి అద్దె..?"

"అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం. మీరు ఆ దో ఉస్‌కు తినేసి వెళ్ళి మీ సరంజామాతో ఇవాళే వచ్చెయ్యరాదూ. మీ మాన్యు స్క్రిప్టులు చదవాలని ఉంది" అంది ఆమె.

"ఆ... అదీ ... అదీ. మొత్తం పూర్తయితేనే తప్ప మధ్యలో నా మాన్యూస్క్రిప్టు చదవడం ఇష్టం ఉండదు నాకు. మీరు మరోలా అనుకోకూడదు మరి" అన్నాడు మల్లాది.

"రండి. దో ఉస్‌లు రెడీ" అందామె.

"మీకీ వర్డ్ బాగా పట్టినట్టుందే?"

"మీరు ప్రయోగించే ఏ పదాన్ని మర్చిపోలేనండీ నేను. 'ఈ గంట గడిస్తే చాలు' నవల్లో ఇల్స్, పిల్స్, కిల్స్, అంటూ రాసారు మీరు. దాన్ని మా ఫ్రెండ్స్ మీద ఎన్నిసార్లు ప్రయోగించానో అలాంటిది మరో తమాషా చెప్పరా" అంది ఆమె చట్నీ వడ్డిస్తూ.

"ఆల్ఫాబెట్స్ అంటే ఎ.బి.సి.డిలలో బికి జలుబు చేసిందిట ఎందుకో తెలుసా?" అన్నాడు మల్లాది.

"ఊహూ" అందామె చాలా సిన్సియర్‌గా ఎంతోసేపు ఆలోచించాక.

"ఆలోచించండి. అదే క్విజ్ మీకు ఇవాల్టికి. రేపు రూమ్‌లోకి దిగడానికొస్తాను కదా అప్పుడు చెప్తాను సమాధానం అప్పటిదాకా మీకు తట్టకపోతే?"

"మీరిప్పుడు అచ్చం. సావిరహేలో రాజ్ కృష్ణలా కనిపిస్తున్నారు" అంది ఆమె.

టిఫెన్ ముగించేసి లేచాడు మల్లాది.

"మల్లాదిగారూ నేనో విషయం అడుగుతాను నిజం చెప్తారా?" అందామె టవల్ అందిస్తూ.

"అడగండి నన్నెంతో అభిమానించే మీరు. అడగ్గానే అద్భుతమయిన రూమ్ నిచ్చిన మీరు అడిగితే ఎందుకు చెప్పను. పైగా నేను అబద్ధం చెప్పానని మీకెవరైనా చెప్పారా?"

"లేదుగానీ, ఇప్పటిదాకా మీ కథలలోనూ, నవలలలోనూ, మీరు ఉపయోగించని, ఉపయోగిద్దాం అనుకుంటున్న పేరేదైనా ఉందా?"

"ఎందుకు లేదూ, ఆ పేరుతో 'మందాకిని' నవల్లోలాగా మంచి కేరక్టర్‌ని సృష్టించి అదే పేరుతో ఆ నవలకి పెట్టాలని ఉంది. త్వరలో చేస్తానేమో కూడా" అన్నాడు మల్లాది తన రాజ్‌దూత్ ఎ.బి.యక్స్ 0570 వంక నడుస్తూ.

"నేను ముందుగా తెలుసుకోవచ్చా? నాకు చెప్తారా? అఫ్ కోర్సు మీకు అభ్యంతరం లేకపోతేనే" అని అడిగింది మౌళవిక.

అతడు చెప్పే ఆన్సరును ఆమె ఊహిస్తోంది. తన మనసుకు తడుతున్న ఆ సమాధానమే అతడు చెప్తాడని ఆమె కోరుకుంటోంది. ఆమెలో టెన్షన్ మళ్ళీ పెరుగుతుంది.

"చెప్పనా. డెఫినెట్‌గా అది నిజం. దాన్ని మీరు నమ్మి తీరాలి. నమ్మకపోతే ఋజువు చేసి చూపిస్తాను కూడా"

"చెప్పండి" అందామె ఆతృతగా - మనసులో "భగవంతుడా ప్లీజ్" అనుకుంటోంది.

"ఆ పేరు మౌళవిక" అన్నాడు మల్లాది మోటారు సైకిల్ని స్టార్టు చేస్తూ.

3

**"అబ్బ! ఎవరే అది?"** తుళ్ళిపడి లేచింది జయశ్రీ ఎదురుగా మౌళవిక.

చేతిమీద మంటగా ఉండటంతో చూసుకుందామె గిల్లినట్టుగా చర్మం కమిలి ఉంది.

"ఇంత తెల్లవారు ఝామునే ఇదేమిటే?"

"అది తర్వాత చెప్తానుగానీ గట్టిగా గిల్లేసానా?" అడిగింది మౌళవిక జయశ్రీ చేతిని మృదువుగా నిమురుతూ.

"అబ్బే అదేం లేదుగాని ఎలా వచ్చావే ఇంత పొద్దున్నే? ఎనీథింగ్ సీరియస్?"

"డాడీతోపాటు మార్నింగ్ వాక్‌కు బయల్దేరి ఆయన్నింకో రూట్‌లో పంపించి నేనీ రూట్లో వచ్చాను. మరో పావుగంటలో ఆయన నన్ను పికప్ చేసుకోవడానికి వస్తారు. ఈలోగా నువ్వు వెంటనే లేచి, కొంచెం కాఫీ కాచి, ముందు తోముకో పళ్ళమీద పాచి."

"అమ్మో నీకేదో అయిందే ఉదయాన్నే ఉగాది కవిత్వం మొదలుపెట్టావంటే డెఫినెట్లీ సమ్‌థింగ్ రాంగ్" అంటూ మంచం దిగింది జయశ్రీ

"రాంగూ లేదు ఏ గుడ్డూ లేదుగానీ ముందు పదవే" అంటూ పేస్టువేసిన బ్రష్ అందించింది మౌళవిక.

"సరే తోముకుంటాను నా దంతం. వివరంగా చెప్పు ఉదంతం" అంది జయశ్రీ మౌళవికని అనుకరిస్తూ.

"ఇవాళనుంచీ మల్లాది మా ఇంట్లోనే ఉంటాడే"

"ఆ.." నోరు వెళ్ళబెట్టింది జయశ్రీ

"ఛీ ముందు నోరుముయ్యవే. పేస్టేసిన నోరు తెరిస్తే ఛండాలంగా వుంటుంది గబగబా కానీ-"

"సరే నువ్వెళ్ళాక మళ్ళీ తోముకుంటాను గానీ ముందు 'విలయ' విద్వాంసుల గాత్ర కచేరి వినలేకపోతున్నాను చెప్పేయ్ అదేమిటో" అంది జయశ్రీ ముగించేస్తూ.

"నిన్నరాత్రి మల్లాది మా ఇంటికి వచ్చారు. టిఫిన్ కూడా చేశారు."

''ఏంటి? అప్పుడే మల్లాది విజయవాడ నుంచి రావటం మన ఆదివిష్ణు నీ అడ్రస్సు ఇవ్వడం, ఆయన అది వెతుక్కుంటూ వచ్చెయ్యటం ఇంత ఫాస్టా?''

''అంతకన్నా ఫాస్టుగా మరికొన్ని విషయాలు జరిగాయే అది చెప్దామనే.''

''ఆ...అప్పుడే నువ్వూ, మల్లాది మాట్లాడేసుకోవటం.''

''ఊ'' అంది మౌళవిక గర్వంగా తల ఊపుతూ.

''ఆయన ఓకె అనెయ్యడం. దానికి మీ నాన్నగారు యస్సనెయ్యడం.''

''ఏవిటే ఏమిటి నువ్వంటున్నది?'' అంది మౌళవిక గాభరాపడుతూ.

''అదే.. మీ.... పెళ్ళికి...''

''మొత్తానికి ఆడదానివనిపించావే'' అంది మౌళవిక జయశ్రీ వీపు గుద్దుతూ.

''ఏం నువ్వు కాదా?''

''నేను అవుననుకో. నువ్వు మాత్రం తెలుగు ఆడదానివి'' అంది మౌళవిక పంచదార డబ్బా అందిస్తూ.

''ఇదిగో అట్టే షంటక అసలు విషయం చెప్పేయ్ చస్తున్నానిందాకణ్ణించి'' మది జయశ్రీ కాఫీ కలుపుతూ.

''అదంతా చెపుతానుగానీ, ఒకమ్మాయి ఒకతన్ని అభిమానిస్తే పెళ్ళి తప్ప మరింకేమీ తట్టదా మన బుర్రకి?'' మౌళవికకి కోపం వచ్చిందని తెలుస్తూనే ఉంది జయశ్రీకి.

''సరేలే నేనుగాబట్టి అంత సభ్యంగా అడిగాను. అదే మన సంయుక్తావాళ్ళు అయివుంటే ఇంకా అడ్వాన్సుగా చెలరేగిపోయి మాట్లాడేవారు. అప్పుడు నువ్వు వాళ్ళని 'భారత ఆడవాళ్ళు' అని ఓ తప్పుడు సమాధానం సమర్పించి ఉండేదానివి అంతేనా?''

జయశ్రీ అంచనా తప్పులేదు. వెంటనే నవ్వేసింది మౌళవిక.

''ఈ కబుర్లు తర్వాతగానీ మా డాడీ వచ్చే టైమ్ అయింది. ముందిది వినేయ్'' అంటూ పూసగుచ్చినట్లు, అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టు, సినిమాని ఫాస్టు ఫార్వర్డులో పెట్టి చూపించినట్లు స్పీడ్గా, డిటైల్డుగా అంతా వివరంగా చెప్పింది మౌళవిక.

''సో రేపట్నుంచి ఇంక మనం కలవం అన్నమాట'' అంది జయశ్రీ

''అవేం మాటలే. నాకు మల్లాది అంటే ఎంత అభిమానం ఉన్నా గత అయిదు సంవత్సరాలుగా ఇవాళ్టివరకూ మనం కలుసుకోని రోజంటూ వుందా చెప్పు?''

"కాలేజీ వున్న రోజుల్లో అయితే తప్పదనుకో. కానీ ఇదివరకులాగా ఆదివారాలు కూడా కలవగలవా? నీ అభిమాన, ఆరాధ్య అభేద్య మల్లాది నీ ఇంట్లోనే ఉంటుంటే? పోనీలే. నేనే వచ్చి నిన్ను చూస్తూ ఉంటానే అఫ్‌కోర్స్ మీకు డిస్టర్బెన్స్ అని నువ్వు ఫీలవకుండా ఉంటే"

"ఇదిగో నువ్వు కూడా సంయుక్తలాగా చీప్‌గా మాట్లాడుతున్నావ్."

మళ్ళీ మౌళవికకి కోపం వస్తోందని గ్రహించింది జయశ్రీ ఆమె మూడ్స్‌ని గ్రహించి మసలుకోవటం జయశ్రీకి అలవాటు. అందుకే ఒకరంటే ఇంకొకరికి విపరీతమైన ఇష్టం.

"ఇంతకీ మల్లాదిగారి దర్శన భాగ్యం నాకెప్పుడు ప్రసాదిస్తావు చెప్పు?" అంది జయశ్రీ

అంతే మల్లాది పేరు మంచి యాంగిల్‌లో వినిపిస్తే చాలా కదిలిపోతుంది మౌళవిక.

"ఆయన ప్రజల మనిషి. ఎవరయినా ఆయన్ని చూడవచ్చు. నేనేమయినా ఆయన్ని కట్టేసుకున్నానా? ఏమన్నానా?"

"ముందు ఆకట్టేసుకోవే, తర్వాత కట్టేసుకుందువుగాని."

"అదుగో మళ్ళీ"

"నువ్వు హుషారుగా మాట్లాడతావు. మేం కాస్త సరదాపడేసరికి చీప్‌గా మాట్లాడుతున్నాం అంటావు. నీతో భలే చిక్కొచ్చిందే" అంది జయశ్రీ

దొంతిపన్ను పూర్తిగా కనపడేట్టు గలగలా నవ్వేసింది మౌళవిక.

"ఆ కట్టేసుకోవటం ఈ బ్యాండేజి తగిలించుకోవడంలాంటి మాటలు తర్వాతగానీ ముందు గబగబా తెమిలి ఒక గంటలో మా ఇంటికి వచ్చెయ్. సాయంత్రం మల్లాది వచ్చి దిగేలోగా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి."

"మరి కాలేజీకి?"

"ఖాళీగా ఉండే లేజీ ఫెలోస్‌కేనే కాలేజ్. మనకెన్ని పనులున్నాయి? బ్యాంక్‌కి వెళ్ళాలి. డబ్బులు డ్రా చెయ్యాలి. ఆ తర్వాత" అంటూ ఆగిపోయింది మౌళవిక క్రితం రోజు రాత్రి మల్లాది ఇచ్చిన క్విజ్ గుర్తుకురాగానే.

"ఊ...తర్వాత?"

"ఊహూ చెప్పను సస్పెన్స్. నిన్న రాత్రి మల్లాది నాకో సమస్య ఇచ్చారు. దాన్ని ప్రాక్టికల్‌గా సాల్వ్ చేస్తాను" అంది మౌళవిక చిరునవ్వు బయటకు దొర్లకుండా విశ్వప్రయత్నం చేస్తూ.

"నాకు తెలియక అడుగుతాను. రాత్రసలు నువ్వు నిద్రపోయావే?"

"ఊహూ. ఏమి చెప్పనే." ఆమె మనసులో ఇంకా ఆ క్విజ్ అన్నదే కదలాడుతోంది.

"క్విజ్ ఏమిటో చెప్పవు సరే. నిద్రపోయావో లేదో కూడా చెప్పవా?"'

"అసలేదీ చెప్పనే. ముందు నువ్వు తయారవడం మొదలుపెట్టు."

"ఇప్పుడు నీతోనే వచ్చేయమంటావేమిటి కొంపదీసి? నేను మళ్ళీ పళ్ళు తోంకోవాలి. అన్నట్టు మీ డాడీ ఏరే. వస్తారన్నావ్?" అంటూ హాల్లోకి తొంగి చూసింది జయశ్రీ.

"నేనొచ్చి చాలాసేపయింది తల్లీ. పేపరు చూస్తూ మీ మాటలేవో అంతకన్నా ఇంట్రెస్టింగ్‌గా ఉంటే ఓ చెవి అటు పారేసి కూచున్నా ఇక్కడ."

ఒక్క గంతులో హాల్లోకి వచ్చిపడ్డారు జయశ్రీ మౌళవిక.

"ఏం తల్లీ వెళదామా?" అంటూ సోఫాలోంచి లేచాడు పార్ధసారథి.

మౌళవిక అలాగేనని తలాడించింది. యిదంతా తన తండ్రికి ఎలా చెప్పాలా అని రాత్రి నుంచి రిహార్సిల్ వేసుకుంటోందామె. ఈ విధంగా ఆయనకు తెలిసిపోయినందుకు ఆనందంగా ఉన్నా మరోవైపు అంతా తెలిసిపోయిందే అన్న సిగ్గు ఆమెని కమ్మేసింది.

"అరె అదేమిటే ఆయన్ని కాఫీ తాగనీ" అంది జయశ్రీ.

"ఒద్దమ్మా థాంక్యూ ఇప్పుడ్ కాఫీ తాగితే ఇమ్మీడియట్‌గా ప్రాబ్లం వచ్చేస్తుంది."

"అదేనే సంచికావిష్కరణ కార్యక్రమం" అంది మౌళవిక.

కిసుక్కున నవ్వింది జయశ్రీ.

"ఓహో.. అర్ధమయిపోయిందా. అయితే ప్రాబ్లమేలేదు" అన్నాడు పార్ధసారథి.

"మరయితే కాఫీ తాగుతారా?"

"భలే, ప్రాబ్లం లేదంటే అలా తీసుకున్నావా మాటకారివే. ఎనీవే థాంక్యూ వన్స్ ఎగైయిన్ మళ్ళీ వస్తాం" అంటూ ముందుకు నడిచాడు పార్ధసారథి.

"నేను మాటకారినే అంకుల్. మీ అమ్మాయి మాత్రం మాటల పిచికారీ"

"అదేనమ్మా ఆరునెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారట. మీ అయిదు సంవత్సరాల స్నేహంలోని మొదటి ఆరునెలల్లో వారు వీరయి, వీరు వారయి, తర్వాత ఆరునెలల్లో వీరు వారయి వారు వీరయి అలా ప్రతి ఆరునెల్లకీ ప్రతివారు ప్రక్కవారయిపోయి ప్రస్తుతానికి ఎవరు ఎవరిలా ఉన్నారా అని లెక్కలు కడుతున్నా" అన్నాడు పార్ధసారథి గేటు తీస్తూ.

"హమ్మా ఏమో అనుకున్నానుగానీ అంకుల్ ముందు మనం ఎవ్వరం నిలబడేటట్టులేం? ఆయన చమత్కారీ పిచికారీ."

"మరి ఏమనుకున్నావే ఓల్డు ఈజ్ గోల్డు" అంది మౌళవిక.

"బట్ యూత్ మస్టు బి బోల్డు. పదమ్మా" అన్నాడు పార్ధసారధి. పూర్తిగా రోడ్డుమీదకు వచ్చేసింది.

"డాడీ ఇవాళ కారు స్పేర్ చేయగలరా?" అంది మౌళవిక నడక కొంతసేపు సాగాక.

"ఓ యస్. నో ప్రాబ్లం. నీ అకౌంట్‌లో అమౌంట్ వుందా నేనేమైనా డ్రాచేసి పంపించనా?"

"ఒద్దు డాడీ మొత్తం ఇవాళ వర్కంతా నా బాలెన్స్‌తోనే చేయిద్దామనుకుంటున్నాను."

"డోన్ట్ వర్రీ వెన్ వుయ్ ఆర్ మెంటల్లో బాలెన్స్‌డ్ డోన్ట్ బాదర్ ఎబౌట్ బ్యాంక్ బాలెన్స్" ఓకే అన్నాడు పార్ధసారధి.

అతని మాటల్లో వెన్నుతట్టి నిలబెట్టే ప్రోత్సాహం ఉంది. పడిపోకుండా వెన్ను నిమిరే హెచ్చరిక వుంది. ఇవన్నీ ఒక్క ముక్కలో గ్రహించుకోగలిగే తెలివితేటలూ, సంస్కారం తన కూతురికి ఉన్నాయన్న నమ్మకమూ ఉంది.

"ఓకే..డాడీ" అంది మౌళవిక. ప్రత్యక్షమయిన కొండంత దేవుని అభయహస్తాన్ని చూసిన భక్తుడిలా నీరు నిండిన కన్నులతో. చనువు, క్రమశిక్షణా ఏకకాలంలో నడిపించటం ఒక వ్యక్తి సామర్ధ్యానికి గర్వంతో చలించిపోయే ఓ కూతురి గుండెల్లోని ఆరాధనకు బాహ్యరూపం ఆ కన్నీళ్ళు.

పార్ధసారధి నడుస్తూనే గమనించాడు. తనకు కనబడకుండా మౌళవిక తన కంటి నీటిని తుడుచుకునే ప్రయత్నాన్ని.

"నా టెల్ మీ ఏమిటి ఇవాళ కొంటున్నావ్?"

"అన్నయ్య రూమ్ ఏసీ చేయిద్దామని."

"ఇప్పుడు అది అన్నయ్య రూమ్ కాదమ్మా కన్నయ్య రూం" అన్నాడు పార్ధసారధి.

మౌళవిక తండ్రి కళ్ళల్లోకి చూసింది ఇదేమిటన్నట్టు.

"కృష్ణమూర్తిని కన్నయ్యా అని పిలిచేవారటమ్మా అతని పెద్దవాళ్ళు. మరి నేనూ మల్లాది వెంకటకృష్ణమూర్తి కంటే పెద్దవాణ్ణేకదమ్మా. ఎనీవే గో ఎ హెడ్ విక్కీ. ఆ కుర్రాడు బాగా రాస్తాడు. హిజ్ నావెల్స్ ఆర్ వెరీ జంటిల్."

మౌళిక దొంతిపన్ను తళుక్కున మెరిసింది. లోకానికి చిరుకిరణాలతో ఆశ కలిగిస్తున్న సూర్యుడి నీరెండ వెలుగుపడి.

"ఇప్పుడింటికెళ్ళగానే కిర్లోస్కర్‌కి ఫోన్ చేస్తానమ్మా. వాళ్ళే వచ్చి ఇన్‌స్టాల్ చేస్తారు. చెక్కు ఇచ్చేసెయ్యి. ఇంకా దేనికయినా క్యాష్ కావాలంటే బ్యాంకుకి వెళుదువుగాని. ఓ.కే?"

"ఓకే డాడీ. సో నైసాఫ్ యూ" అంది మౌళవిక రెట్టించిన ఉత్సాహంతో.

"రియల్లీ? దెన్ డోన్ట్ మిస్ ది క్లాసెస్ గో టు కాలేజ్, ఈవినింగ్ ఫోర్ కల్లా వచ్చేస్తావు కదా? ఫైవ్ లోగా ఏసీ ఇన్‌స్లేషన్ పూర్తయిపోతుంది. ఈలోగా ఏం చెయ్యాలో చెప్పు. అంతా యాదగిరి చూసుకుంటాడు. అన్నట్టు యాదగిరిని ఇవాళ, రేపూ రాత్రుళ్ళు మనింట్లోనే పడుకోమను. మూడొంతులు ఇవ్వాళ సాయంత్రమే నేను ఢిల్లీ వెళ్ళాల్సుంటుంది. మళ్ళీ ఎల్లుండికి గానీ రాలేకపోవచ్చు" అన్నాడు పార్ధసారధి.

ఏ విషయాన్నైనా మనసుకి హత్తుకునేంత స్పష్టంగా, దృఢంగా మనసుకి నొప్పి కలగనంత సున్నితంగా, నిశితంగా చెప్పగలగటం పార్థసారథి ప్రత్యేకత. అందుకే అతని మాట సుగ్రీవాజ్ఞ, శిలాశాసనం, వేదవాక్కులాంటి పదాలకన్నా శక్తివంతమైనది. ఆ సంగతి ఆమెకి బాగా తెలుసు.

అలాగే జరిగింది కూడా.

సాయంత్రం కాలేజీ నుంచి ఇంటికొచ్చేసరికి ఔట్‌హౌస్‌లో మల్లాది ఉండబోయే రూమ్ స్వరూపమే మారిపోయింది. ఓ పెద్ద లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్స్ ఛాంబర్స్‌లా తయారయింది.

"మొత్తం అంతా మీ డాడీ చెక్ చేసి ఇప్పుడే వెళ్ళారు మేడమ్. మీరొచ్చిన తర్వాత చెక్కు తీసుకోమని చెప్పారు" అని చెప్పాడు పని పూర్తిగా సంతృప్తికరంగా ముగించిన మెకానిక్.

"మీ డాడీ భలే నిగూఢమైన మనిషే" అంది జయశ్రీ రూమ్ అంతా చూస్తూ.

"యా హి ఈజ్ ఏ గ్రేట్ పర్సనాలిటీ" అంది మౌళవిక సంతకం పెట్టిన చెక్కు మెకానిక్‌కి ఇచ్చి వస్తూ.

"చీకటి పడేలోగా మీ మల్లాది వస్తాడంటావా? ఇంకా లేటవ్వొచ్చా?"

"ఏమోనే సాయంత్రంకల్లా ఉంటానన్నాడాయన. అవునుగానీ జై, మల్లాది మన ఇంట్లో దిగుతున్న శుభసందర్భంగా రేపు మనందరం మళ్ళీ పిక్నిక్ వేసుకుని మన ఫ్రెండ్స్‌ని మల్లాదికి, మల్లాదిని మన ఫ్రెండ్స్‌కి ఇంట్రడ్యూస్ చేస్తే ఎలా వుంటుంది?"

"నీ పిచ్చిగానీ మన మొహాలు మల్లాది గొప్పతనాన్ని గుర్తిస్తాయనే?"

"తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుంటారే ఎంత కుళ్ళుబోతు మొహాలయినా వాళ్ళూ మన ఫ్రెండ్స్ కదా! ఈ రూపంలోనైనా మల్లాది అభిమానుల సంఖ్య మరింత పెరిగితే నాకంతే చాలు."

"పిక్నిక్‌కి అతను ఒప్పుకుంటాడా?"

"నా రిక్వెస్టు కాదనడనే నా ఉద్దేశం. వస్తాడుగా. అడుగుదాం" అంది మౌళవిక.

"మరి రేపు కాలేజి? మీ డాడీ?"

"ఫరవాలేదే మల్లాది ఒప్పుకోవాలిగానీ రేపుదయం డాడీ ట్రంకాల్ చేసినప్పుడు పర్మిషన్ తీసుకుంటాను. ముందు ఈ మల్లాదిగార్ని మనింటికి చేరనీ."

"మరీ ఇంత లేటు మనిషి అన్ని ఎలా రాస్తున్నాడే?" అంది జయశ్రీ

"ఉండు చూద్దాం ఓసారి" అంటు బయటకు వచ్చి చూసి గట్టిగా అరిచింది మౌళవిక.

"జల్దీ రా జై. ఇమ్మీడియట్."

వీధి మలుపు తిరుగుతూ ఉన్న ఓ రిక్షా, సామాన్లతో ఆ రిక్షాని ఫాలో అవుతూ మోటార్ సైకిల్ మీద మల్లాది.

**4**

"ఏమిటి రోడ్డుమీద నిలబడి ఏదో సైగలు చేస్తున్నారు?" అన్నాడు మల్లాది మోటారు సైకిల్‌ని ఆఫ్ చేస్తూ.

"సైగలూలేదు, ముఖేషూ లేదు. మీరొస్తున్నారని మా ఫ్రెండ్ జయశ్రీకి చెపుతున్నాను అంతే"

"సౌంజ్ఞ అనే వర్డుకి మంచి కాయినింగే వేశారే."

"అన్నట్లు మీరిప్పటిదాకా సౌంజ్ఞ కేరక్టర్‌ని పెట్టలేదు కదూ?" అడిగింది మౌళవిక.

"కరెక్టేనండి. మంచి సజెషన్ ఇచ్చారు. థాంక్యూ" అంటూ రిక్షాలోని సామాన్లను దింపడానికి అటువైపు కదిలాడతను.

"వన్ మినిట్ ఆగండి. యువర్ హాండ్స్ ఆర్ నాట్ మెంట్ ఫర్ దట్."

'యాదగిరి' అంటూ కేకేసింది ఆమె.

"వస్తున్నానమ్మా! జయమ్మగారు చెపుతూనే ఉన్నారు" అంటూ వచ్చాడూ యాదగిరి.

"అదేదీ. లోపలేం చేస్తోంది?"

"నన్ను సామాన్లు దింపి సర్దమని చెప్పి కాఫీ కలపడానికెళ్ళారు" అన్నాడూ యాదగిరి రిక్షాకి కట్టిన తాడు విప్పుతూ.

"దటీజ్ జ మా ఫ్రెండండి. జయశ్రీ నా ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడు అన్నీ తానే. సాధారణంగా మా డాడీ టూర్‌లకి వెళుతుంటారు కదా జయశ్రీయే నా కేర్ టేకర్, లోపలికి రండి" అంటూ దారితీసింది మౌళవిక.

"రూమ్‌లో అన్నీ సర్ది" అంటూ నసిగాడు మల్లాది.

"అవన్నీ నేను చూసుకుంటానండీ. మీరేం పరేషాన్ కాకుండా గమ్మున కాఫీ తాగి జమ్మున కబుర్లు చెప్పుకోండి" అన్నాడు యాదగిరి.

"మీ ఇంట్లో వంటవాళ్ళకి కూడా యతిప్రాసలు పడతాయనుకుంటాను?"

ట్రేలో కాఫీ కప్పుల్తో వచ్చింది జయశ్రీ

"జై. ఈయనే ఆయన. తనేనండి తను" అంటూ పరిచయం చేసింది మౌళవిక ఒకరినొకరికి.

"మా జై కాఫీ తాగండి. ఇంకా టచింగ్‌గా ఉంటుంది."

**"అంటే నాలుక** అంటుకు పోతుందా?"

ఒక్కసారి ముగ్గురూ గట్టిగా నవ్వారు.

ఆత్మీయతా, ఆరాధనా, అభిమానం మూడు కలిసి హిపోక్రసీ పొరల్ని ఛేదించుకుని నవ్వితే ఎంత స్వచ్ఛంగా వినిపిస్తుందో ఆ హాలంతా అంత హాయిగా ధ్వనించింది.

"అన్నట్లు మన నోట్లో నాలుకకి ఆ పేరెట్లా వచ్చిందో తెలుసాండి?" అన్నాడు మల్లాది.

ఇద్దరూ తలాడించారు తెలీదన్నట్లు.

"నాస్తా కోసం లుకలుకలాడుతూ నోరంతా తిరుగుతూ ఉంటుంది కదండీ అందుకని" పూర్తిచేశాడు.

మౌళవిక గర్వంగా చూసింది జయశ్రీ వైపు, ఆమె మౌళవికని కళ్ళతోనే అభినందించింది.

"నాస్తా అంటే గుర్తుకొచ్చింది. ఇవాళ మనం ముగ్గురం కలిసి భోంచేస్తున్నాం. మీరు మా ఇంట్లో దిగిన శుభ సందర్భంగా."

"నాకో ఫ్రెండ్ ఉండేవాడు. సంతోషం కలిగితే హాపీస్ అని తాగేవాడు. బాధ కలిగితే వర్రీస్ అని తాగేసేవాడు. ఆ రెండూ లేని మూడ్స్‌లో అతన్ని చూడ్డం ఇప్పటిదాకా కుదర్లేదు. అలా మీరు మాట్లాడితే చాలు భోజనం అంటున్నారు." అన్నాడు మల్లాది.

"నిన్న మీరు చేసింది టిఫిన్ కాబట్టి ఈ ఉదాహరణ ప్రస్తుతానికి వర్తించదు" అంది మౌళవిక.

"సర్దేశానండి" అంటూ వచ్చాడు యాదగిరి.

"అప్పుడే" ఆశ్చర్యపోయాడు మల్లాది.

"మరి మా యాదగిరి అంటే ఏమనుకున్నారు? పదండి మీ రూమ్ చూద్దురుగాని" అంటూ లేచింది మౌళవిక.

"నువ్వు ఆయనకి రూమ్ చూపిస్తూ ఉండవే, నేను యాదగిరికి వంటలో సాయం చేస్తూ ఉంటాను" అంది జయశ్రీ

ఆమె జయశ్రీ వైపు ఆశ్చర్యంగా చూసింది. ఒక్క నిమిషంలోనే ఆమె హృదయాన్ని అర్థం చేసుకుంది.

"అది సరేగాని నీకో చిన్న విషయం చెప్పాలి. ఇప్పుడు చెప్పనా? తర్వాత చెప్పనా?" అంది.

మౌళవిక నొచ్చుకుందన్న సంగతి జయశ్రీకి అర్థమయింది. "తర్వాతే చెబుదువుగాని పద ఆయనకి రూం చూపిద్దాం" అంటూ లేచింది జయశ్రీ

"మీ కోడ్ ఏమిటో భలే తమాషాగా ఉంది" అన్నాడు మల్లాది నడుస్తూ."

"అంది ఇంకొకరు అర్థం చేసుకోలేని ఇంటర్నల్ కోడ్ లెండి. దాన్నలా ఉంచి నిన్న మీరో క్విజ్ యిచ్చారు. అది మళ్ళీ చెప్పండి" అంది మౌళవిక. రూమ్ తలుపులు తెరుస్తూ.

"ఎబిసిడిలలో బికి జలుబు చేసింది ఎందుకు? అదీ క్విజ్, లైటెక్కడుంది?"

"లైటు తర్వాత వేద్దురుగాని, ముందు మీ ఎడమచేతివైపు ఉన్న స్విచ్ బోర్డులో పైన ఉన్న స్విచ్‌ని నొక్కండి మీ క్విజ్‌కి జవాబొస్తుంది."

"ఇది మరీ బావుందండీ. క్విజ్ ఇచ్చాను కదాని నన్ను పజిల్ చెయ్యడం న్యాయమా?" అంటూ తడుముకుంటూ స్విచ్ నొక్కాడు అతను. ఎయిర్ కండిషనర్ నుంచి చల్లనిగాలి రివ్వుమంటూ గది అంతా కమ్ముకుంది. తుళ్ళిపడిన మల్లాది చెయ్యి మరో స్విచ్‌ని నొక్కింది లైటు వెలిగింది. గది అమర్చబడిన తీరు. అందులో తన సామాన్లు సర్దబడిన పద్ధతి అంతా చూసి సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయాడతను.

"ఏం సార్ కరెక్టేనా?" అడిగింది మౌళవిక. అంగీకారసూచకంగా తలుపాడతను. ఆ ప్లెజెంట్ సర్‌ప్రైజ్ నుంచి తేరుకోలేదతనింకా.

"ఏంటే ఈసారి మీ కోడు నాకర్థంకావడంలేదు" అంది జయశ్రీ

"మార్నింగ్ చెప్పాను కదే ఆయనకి క్విజ్‌కి జవాబు ప్రాక్టికల్‌గా ఇస్తానని అదే ఇది. అంటే ఎబిసిడీలలో బి - ఏసి మధ్యలో కూర్చుంది కాబట్టి జలుబు చేసిందన్నమాట" అంది మౌళవిక గర్వంగా మల్లాదిని, జయశ్రీని చూస్తూ.

"యు ఆర్ రియల్లీ స్మార్ట్" అన్నాడు మల్లాది పూర్తిగా తేరుకుని ప్రశంసాపూరిత నయనాలతో.

"బట్ దీసీజ్ ఎ స్మాల్ పార్టు బిఫోర్ యు సర్" అంది మౌళవిక.

"నిన్న మీరు చూపించినప్పుడు ఈ రూమ్‌లో ఏసి ఉన్నట్టు లేదే?"

"అవునండీ లేనట్టుంది" అంది మౌళవిక కొంటెగా.

"దటీజ్ మౌళవిక అండీ. ఉదయాన్నే వాళ్ళ డాడీని ఒప్పించి సాయంత్రంకల్లా దీన్ని ఇన్‌స్టాల్ చేయించింది." అంది జయశ్రీ

"ఏవండీ మీరు తెలుగు రచయితలంటే లక్షాధికారులనో కోటీశ్వరులనో అనుకుంటున్నారా? ఇన్ని మంచి ఫెసిలిటీస్‌కి తగ్గ అద్దె నేనివ్వగలననే?" అని అడిగాడు మల్లాది.

"మల్లాదిగారూ దయచేసి హాస్యానికి కూడా నా ముందు మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోకండి. ఈ ఏసీకి, అద్దెకి సంబంధం లేదు. అసలా అద్దెకూడా మీరు దిగనంటారేమోనన్న భయంతో తర్వాత మాట్లాడుకోవచ్చు అని అన్నాను. మీరు అద్దె ఇవ్వడంకన్నా ఇవ్వకపోతేనే ఎక్కువ సంతోషిస్తాను. ఒక అభిమానిగా చాలా గర్వంగా ఫీలవుతాను కూడా" అంది మౌళవిక.

ఎంత వద్దనుకున్నా ఆమె ముఖంలో ఆవేశం కనబడుతూనే ఉంది.

"మరోలా అనుకోండి. మా మౌళవిక చాల సెన్సిటివ్" అంది జయశ్రీ

''సెన్సిబుల్ పీపుల్ సెన్సిటివ్‌గా ఉంటారండి. ఏవండీ మౌళవికగారూ అంతేనా? కొంచెం చల్లబడ్డారా? ఏసీ ఇంక్రీజ్ చెయ్యనా?'' అంటూ అటూ ఇటూ చూశాడు మల్లాది.

''అయాం సారీ మల్లాదిగారూ! నేనేదో మీకు భద్రకాళి నన్న ఇంప్రెషన్ ఇచ్చేసినట్టున్నాను. అయామ్ రియల్లీ సారీ'' అంది మౌళవిక. అకస్మాత్తుగా కోపం తెచ్చేసుకుని మనసులోని భావాల్ని యధాతథంగా అందరి ముందూ వ్యక్తపరచటం అప్పుడప్పుడు సభ్యతగా ఉండదన్న సంగతి మొదటిసారి గ్రహించిందామె.

''అదేం మాటండీ? నా పర్స్ ఖాళీ కాకుండా నన్ను భద్రంగా చూసుకునే మిమ్మల్ని భద్రకాళి, అది నిజంగా గౌరవమేనండీ. ఇప్పుడు చెప్పండి. మీ అభిమానానికి ఎలా థ్యాంక్స్ చెప్పమంటారు?'' మౌళవిక ఇప్పుడు పూర్తిగా నార్మల్ కండిషన్‌కి వచ్చేసింది. ''చెప్పమంటారా తర్వాత మాట తప్పరుగా'' అంది ముఖంలోకి చిరునవ్వు తొంగి చూస్తుండగా.

''ఆ ప్రసక్తి లేదు. చెప్పండి.''

''రేపు మీరు మాతో పిక్నిక్‌కి వస్తున్నారు. మా ఫ్రెండ్స్‌కి మిమ్మల్ని పరిచయం చెయ్యాలి.''

మల్లాది ఒక్క నిమిషం మౌనం వహించాడు.

''ఏం సార్? ఎనీ ప్రాబ్లమ్'' అడిగింది మౌళవిక.

''అబ్బే అదేం లేదండీ. ఏదో గుట్టుగా ఓ మూల కూచుని రాసుకుందామనుకునే నన్ను మరీ పబ్లిక్ చేసేస్తే ఏమవుతుందా అని ఆలోచిస్తున్నానంతే.''

''పబ్లిక్ ఏముందండీ? మేం పదిమందిమే. జస్టు టెన్ దట్సాల్.''

''సాధారణంగా ఒక పత్రిక ఓ కాపీ సేల్ అయితే నలుగురు చదువుతారనే లెక్క ఒకటుంది సర్క్యులేషన్ అంతా'' అని కొన్ని పత్రికలు తెలివిగా చెప్పుకుంటాయి కూడా. అలాగే ఒక అమ్మాయికి ఓ విషయం తెలిస్తే పదిమందికి పాకుతుందనే నమ్మకం ఉందికదా మన ప్రపంచంలో. ఇప్పుడు ఈ పిక్నిక్‌లో పదిమంది అంటే ఎల్లుండికి వందమందికీ''

''కరెక్టేనా కదా ఆలోచించండి'' అన్నాడు మల్లాది.

''మీరా భయం ఏదీ పెట్టుకోకండి మీ ఉనికిని జాగ్రత్తగా కాపాడే బాధ్యత నాది. ఇంతకీ మీరు ఓకేనా?'' అంది మౌళవిక.

''ఏం ఓకేయో ఏమిటో, నిన్ననే పరిచయం అయ్యారు. రేపటికి పదిమందికి, మరో వారం రోజులలో ఎంతమంది లోకుల దృష్టిలో పడిపోతానో ఏంటో?''

''లోకులు పలు గాకులు అన్నారు. కాబట్టి ముందా కాకుల లెక్క మానెయ్యండి. పిక్నిక్ కన్నా ముందు ప్రస్తుతం భోజనానికి పదండి. అవతల యాదగిరి గంట కొట్టేస్తూ ఉంటాడు'' అని మౌళవిక అంటూనే ఉంది. లోపల్నుంచి బెల్

కొట్టినట్లు యాదగిరి ప్లేటు మీద స్పూన్‌తో గణగణమని వాయించిన శబ్దం వినిపించింది. "కరెక్టు పదండి కాస్త ఎంగిలిపడదాం" అంది అప్పటివరకూ నిశ్శబ్దంగా ఉన్న జయశ్రీ

"ఎంగిలెందుకండీ.. ఒరిజినల్లే పడదాం" అన్నాడు మల్లాది.

ఇద్దరూ ఆశ్చర్యంగా చూశారు అతడివైపు.

"అవునండీ ఎందుకంటారో తెలీదుగానీ చాలామంది ఎంగిలి పడడం అనే ఉంటారు. ఎవరి భోజనం వాళ్ళే కలుపుకుని తింటూ వుంటే ఎంగిలి పడడం ఎక్కడుంటుందండీ? ఒక్క భార్యాభర్తల విషయంలోనే ఆ మాట వాడొచ్చనుకుంటాను" అని వివరించాడు మల్లాది.

"ప్రతి విషయాన్నీ ఎందుకంత డీప్‌గా ఆలోచిస్తారండీ మీరు?" అంది జయశ్రీ

ఇంతవరకు మల్లాదిని మౌళవిక ద్వారానే చూసిందామె. ఇప్పుడు ఆమెకు కూడా మల్లాది ఎంతో ఉన్నతంగా కనిపిస్తున్నాడు.

భోజనాలు ముగిసిన తర్వాత "రేపు ఏడున్నరకల్లా రెడీగా ఉంటారు కదూ" అడిగింది మౌళవిక.

"తప్పదంటారా?" మరీ బెట్టు చేయకండి సార్. ఎబ్బెట్టుగా ఉంటుంది" అంది జయశ్రీ

"హమ్మో హమ్మో పదాన్ని విరవటం, కాయిన్ చెయ్యటం, చమత్కారంగా మాట్లాడటం మా జైకి కూడా వచ్చేసింది. మరో నెల తర్వాత మన యింట్లో మాములు భాషలో మాట్లాడతాం అనుకోను అంతేనా మల్లాదిగారూ."

"ఏమోనండీ మీ అభిమానాన్ని ఎంతవరకూ నిలబెట్టుకోగలనా అనే భయం వేస్తోందిప్పుడు"

ఒక్క నిమిషంపాటు అందరూ నిశ్శబ్దంగా అయిపోయారు.

ఎవరికివారే అనకూడని మాటేదో అనేసినట్టు అలా అయిపోవడం మల్లాదికే నచ్చలేదు. చివరిమాట తనదే కాబట్టి తిరిగి తానే పూనుకున్నాడు.

"ఇంతకీ మీ ఫ్రెండ్సందరికీ ఎప్పుడు చెపుతారు? లేక పిక్నిక్‌ని ముందే ప్లాన్ చేసుకున్నారా?" ఇద్దరి ముఖాల్లోనూ సంతోషం తళుక్కున మెరిసింది మళ్ళీ.

"అబ్బే మీరు రాకముందే అనుకున్నాం రేపు మనం కార్లో ఏడున్నర ఎనిమిదిలోగా బయలుదేరి మనవాళ్ళందర్నీ పికప్ చేసుకుని ఏ జూకో ఇందిరా పార్కులో వెళ్ళిపోదాం" అంది మౌళవిక.

నాతో కలిపి పదకొండుమంది మీ ఒక్క కారులో పడతామా?" అన్నాడు మల్లాది.

"మాకింకో ఫ్రెండుందిలెండి. సంయుక్త అని. తనక్కూడా కారుంది. ఫరవలేదు. మేనేజ్ చేసెయొచ్చు" అంది మౌళవిక. మనసులో ఎవరెక్కడెక్కడ కూర్చోవాలో లెక్కలు వేసుకుంటూ.

"లేకపోతే మీరు కరెక్టు టైము. వెన్యూ చెప్పండి. నా బండిమీద నేనొచ్చేస్తాను. ఓ చిన్నపనొకటి చూసుకుని."

"అదే బెటరనుకుంటానే" అంది జయశ్రీ

"హేండిచ్చెయ్యరు కదా? అనవసరంగా అందర్లోనూ అభాసుపాలయిపోతాను."

"ఆ ప్రసక్తే లేదండీ ఈ హేండ్ షేక్ చెయ్యడానికే తప్ప షేమ్ చెయ్యడానికి కాదు. మిమ్మల్ని అభాసుపాలు చెయ్యకుండా సెభాసుపాలు చేస్తానుగా డోంట్ వర్రీ" అన్నాడు మల్లాది. ముగ్గురి హృదయాలూ తేలికపడ్డాయి.

"మల్లాదిగారూ రేపు పిక్నిక్‌లో మీరు మా ఫ్రెండ్స్‌ని అదరగొట్టేయాలి. మీ టైపు క్విజ్‌లు, తమాషాలు చెప్పి మనవాళ్ళని థ్రిల్ చేసెయ్యాలి" అంది మౌళవిక. ఉత్సాహంగా మానసికంగా ఆమె మరుసటి రోజులోకి వెళ్ళిపోయిందప్పుడే

"అలా అయితే రేపు మిమ్మల్ని డిసప్పాయింట్ చేస్తానేమో మౌళవికగారూ ఎందుకంటే ఈ రాత్రికి రాత్రే సీరియల్ ఇన్‌స్టాల్‌మెంట్ పూర్తి చేసేసి రేపు ఉదయాన్నే కంటెయినర్‌లో పంపించేయాలి. బాగా ఆక్యుపై అయి ఉంటాను కాబట్టి మిమ్మల్నింత ఎంటర్ టైన్ చెయ్యలేనేమో ఆలోచించండి. లేదా పిక్నిక్ మరో రోజు పెట్టుకుందామా?" అడిగాడు మల్లాది.

గాభరాపడింది ఆమె.

"అమ్మయ్యో అంతపని చెయ్యకండి. నేను ఆల్రెడీ మెంటల్‌గా ప్రిపేరయిపోయాను ప్లీజ్ పోస్ట్‌పోన్‌లు, ఆర్.ఎస్.వి.పీలు పెట్టకండి ప్లీజ్" అందామె.

" మా మౌళవిక ఒకటేదైనా అనుకుంటే చాలు అది అయిపోవాలండీ లేకపోతే ఆ రోజంతా యమా మూడీగా ఉంటుంది ఎలాగూ అనుకున్నాంగా మళ్ళీ మార్చకండి" అంది జయశ్రీ కూడా బ్రతిమాలుతున్న ధోరణిలో.

"అబ్బెబ్బే అలా వర్రీఅయిపోకండి. తప్పకుండా వెళ్ళాం. జస్ట్ సెకెండ్ థాట్ ఇచ్చానంతే. అది సరే మీరిందాక ఆర్.ఎస్.వి.పీ అన్నారు అంటే ఏమిటండీ?" అన్నాడు మల్లాది మళ్ళీ వాతావరణాన్ని ఆహ్లాదంగా ఉంచడానికి ప్రయత్నిస్తూ.
"అదేనండీ ఇన్విటేషన్లలలో ఆర్. ఎస్. వి.పీ అని ప్రింట్ చేస్తూ ఉంటారు కదా అదే నేనన్నాను" అంది మౌళవిక.

"అది నాకు తెలుసండీ. ఆ ఆర్. ఎస్. వి.పీ మీనింగ్ మీకు తెలుసా? అన్నాడు వారి మెదడుకు పదును పెడుతూ, నిజానికి వారికి కావాల్సింది కూడా అదే -"

"అంటే రాలేకపోతే ఈ అడ్రసుకో, ఈ టెలిఫోన్ నెంబర్‌కో చెప్పండి అనే మీనింగు వస్తుందనే తప్ప అసలు ఒరిజనల్‌గా దాని సంగతింకేమీ తెలియదండి ఏం జై అంతేనా?"

"అంతేనండి" అంది జయశ్రీ

"అసలు ఆర్.ఎస్.వి.పీ అనేది ఒక ఫ్రెంచి ఎబ్రివియేషన్. రెస్పాన్స్ ద సిల్ వు ప్లె అని వస్తుందని విడగొడితే. ప్లీజ్ రిప్లయి టు ది ఇన్విటేషన్ అని ఇంగ్లీషు మీనింగ్. అదీ దాని వెనుకనున్న కథ"

"అబ్బ ఫ్రెంచ్ వర్డు నెవరు గుర్తుంచుకుంటారండీ? సింపుల్‌గా షార్ట్ కట్టేదీ లేదూ?"

"లేకేం రాలేనివారు సమయానికి వర్తమానం పంపండి" అని తెలుగులో గుర్తుంచుకోండి. అదే ఆర్.ఎస్.వి.పీ అవుతుంది" అన్నాడు మల్లాది.

"చాలండీ ఈ మాత్రం మీరు మావాళ్ళని గిల్లేస్తే చాలు సాయంత్రం దాకా కొట్టుకు చస్తారు" అంది మౌళవిక ఆనందంగా, సంతోషంగా.

"సో నే వెళ్ళి రాసుకోనా. కెనై సే గుడ్ నైట్" అన్నాడు మల్లాది.

"యస్! ఇటీజ్ రియల్లీ ఎ వెరీ గుడ్ నైట్ సర్."

"నాకు ఎంతో గర్వంగా ఉందండీ. మా మౌళవిక ద్వారా మీలాంటి ఎంతో ఉన్నతమైన వ్యక్తుల్ని కలుసుకోగలిగినందుకు" అంది జయశ్రీ

"గుడ్‌నైట్" అంటూ మల్లాది తన రూమ్ వైపు నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

"పదవే పడుకుందాం" అంది మౌళవిక.

"ఏం పడుకోవటం? రేపు పిక్నిక్ కావాలసిన సరంజామా అంతా సర్దుకున్న తర్వాతే"

"అవన్నీ యాదగిరి చూసుకుంటాడే ముందు పద పడుకుందాం. రేపు మనవాళ్ళని ఎలా ఫట్ ఫట్‌లాడించేయాలో ఆలోచించుకుందాం పద పద" అంటూ జయశ్రీని చెయ్యి పట్టుకుని జరజరా లాక్కుంటూ వెళ్ళిపోయింది ఆమె.

మర్నాటి పిక్నిక్ గురించి ఆలోచిస్తూ ఆ రాత్రంతా ఇన్‌స్టాల్‌మెంట్స్‌లోనే నిద్రపోయిందామె.

5

"ఇదేమిటి? గేటు బైట నిలబడ్డారు?" అన్నాడు మల్లాది బ్రేకు వేస్తూ.

"లోపల మీకు వెతుక్కునే శ్రమ తప్పిద్దామని" అంది మౌళవిక.

"చాలా ఆలస్యం చేశాను కదూ. క్షమించాలి."

"మీరిక రారేమోనని అనుకున్నాను. మా ఫ్రెండ్సు కూడా ఆట పట్టించటం మొదలుపెట్టారు."

మోటారు సైకిల్‌ని పార్క్ చేస్తూ ఆమె వంక చూశాడు మల్లాది. తెల్లటి ఆమె ముఖం ఎర్రగా మారి, ఆ ఎరుపు కూడా నల్లగా తయారవడానికి సిద్ధంగా ఉంది.

"చాలా సేపట్నించి ఎండలో నిలబడ్డారు అవునా?" అడిగాడు. గిల్టీగా ఫీలవుతూ.

"ఫరవాలేదు లెండి"

ఒక్క క్షణంపాటు ఏం మాట్లాడాలో అర్థంకాలేదు మల్లాదికి. క్రితం రోజు మాటల మధ్యలోనే టెన్షన్ పెంచేసుకుని ఎంతో ఇంపల్సివ్‌గా కనిపించిన ఈమె ఇంతగా నిభాయించుకున్నదంటే ఒక్కరోజులో ఎంత నిగ్రహాన్ని సాధించింది అని అనుకున్నాడతను. లేకపోతే ఎర్రటి ఎండలో ఒక వ్యక్తి గురించి ఎదురు చూసిన తర్వాత ఆ వ్యక్తి కనిపించగానే ఉద్వేగాన్ని అదుపులో ఉంచుకుని మాట్లాడడం అతడి మీద ఎంతో ఇష్టం ఉంటేనేగానీ సాధ్యపడదు.

సరిగ్గా అదే విధంగా ఆలోచిస్తోంది మౌళవిక కూడా తన కోపం ఆవేశం అన్ని ఏమయిపోయాయి? మల్లాది సహచర్యం తనలో ఒక్కరోజులోనే ఎంత మార్పు తెచ్చింది?

"సారీ నిజంగా మీరు నన్ను క్షమించాలి. పోనీ ఈ చెట్టు నీడనే నిల్చోకపోయారా?" అన్నాడు మల్లాది నడుస్తూ.

"ఎందుకూ?"

"ఈ ఎండలో వడదెబ్బ తగిల్తే?"

"ఇవ్వాళ పిక్నిక్‌లో మనందరికీ ఎలాగూ వడదెబ్బలు తప్పవు అంత ఎక్స్‌పోజ్‌కాం అనుకుంటా."

"వడదెబ్బంటే ఎండ దెబ్బకాదు సారూ ఇవాళ పిక్నిక్‌కి తన వంతు కాంట్రిబ్యూషన్‌గా వడలు తెచ్చిందట మా సంయుక్త" అంది మౌళవిక ప్రసన్నంగా నవ్వుతూ.

"ఫరవాలేదులెండి. ఏ మగాడైనా ఆడపిల్లల చేత్తో దవడ దెబ్బలు తినలేడుగానీ ఇలాంటి వడదెబ్బలెన్నయినా తట్టుకోగలడు. కరెక్టేనా?"

"నా దృష్టిలో మీరెప్పుడూ కరెక్టే. ఇప్పుడు కుడిచేతి పక్కగా తిరగాలి మనం. అదిగో దూరంగా కూర్చుని ఉంది చూడండి అదే మా పటాలం" అంటూ చూపించింది ఆమె.

ఎత్తయిన చెట్లు. గుబురుగా ఉన్న మొగలిపొదలు ఆ వేపు నుంచి కనిపించే టాంక్ బండ్ గోడ. ఆ పక్కనే ఉన్న బ్రిడ్జీ మీద నుండి వెళ్ళే బస్సులు, కార్లు ఈ గోడమీద వెళుతున్నట్లు కనిపిస్తున్నాయి.

"ఈ మధ్య ఇందిరా పార్కు భలేగా డెవలప్ అయిపోయిందండీ" అన్నాడు మల్లాది.

"అవునండీ బోట్ షైర్ కూడా చెయ్యొచ్చు. ఇవాళ మనం డెఫనిట్‌గా బోట్ షైర్ చేసి తీరాలి" అని ఆమె అంటూనే ఉంది.

వీళ్ళిద్దరినీ చూసిన జయశ్రీ బృందం ఒక్కసారిగా లేచి పరిగెత్తుకుంటూ వచ్చారు.

"ఇదిగోనండి. వీళ్ళంతా మా ఫ్రెండ్స్ సరళ, ఉమ, ఉషా కుమారి, సుబ్బులు, సుధ, విజయలక్ష్మి, స్వర్ణకుమారి. సరే జయశ్రీ మీకు తెలుసు. అదిగో అదేనండి సంయుక్త" అని పరిచయం చేసింది మౌళవిక.

తాపీగా నడుచుకుంటూ వచ్చి చేరిన సంయుక్త తదితరులందరు నమస్కరించారు మల్లాది.

"రండి అలా కూర్చుని మాట్లాడుకుందాం" అని దారి తీసింది జయశ్రీ

"మల్లాదిగారూ మీ మొదటి రచన ఏదండీ?" అడిగింది సుబ్బులు అందరూ కూర్చున్న తర్వాత.

"అదిగో అదండీ సంగతి. ఇక కాచుకోండి మా వాళ్ళు విజృంభించేస్తారు" అంది మౌళవిక.

"1970 ఆగస్టు చందమామలో ఉపాయశాలి అనే కథ పడిందండీ అదే ప్రచురించబడిన మొదటి రచన" జవాబిచ్చాడు మల్లాది.

"మీరు సీరియల్స్ ఒకేసారి రాసేస్తారా? వారం వారం రాస్తారా?" అన్నది ఉషాకుమారి ఇంక తనవంతు అన్నట్లుగా.

"వారం వారం ఇన్‌స్టాల్ మెంట్సేనండి."

"మరి వారానికి ఎంత రాయాలో ఎలా తెలుస్తుంది?" అడిగింది సుబ్బులు.

"సబ్జెక్ట్ ముందు అనుకుంటాం కాబట్టి సినిమాలో సీన్ డివిజన్‌లాగా ఈ వారానికి కథ ఇక్కడదాకా నడపాలి అనే అయిడియా. ఆటోమేటిగ్గా ఏర్పడిపోతుందండి."

"ఒక సీరియల్‌కి ఒక వారానికి ఎన్ని పేజీలు రాయాల్సుంటుంది?"

"నా రైటింగ్‌లో పన్నెండు అరటావులు పడుతుంది."

"మీరు రాస్తున్న ప్రతిదానికీ కాపీ పెట్టుకుంటారని చదివాం. మంచి ఫ్లోలో రాస్తున్నప్పుడు కార్బన్‌లు ఇన్‌సర్ట్ చెయ్యడం, మార్చడం ఒక అడ్డంగా ఫీలవరా?

"కరెక్టే. అందుకే నేను ఒకేసారి పన్నెండు కార్బన్‌లు వైట్ పేపర్లకి పిన్‌లతో గుచ్చేసి రెడీగా ఉంచుకుంటాను."

"మీరు ఈనాడు ఆదివారంలోనూ, సితార స్పెషల్ ఇష్యూలలో కూడా రాసినవి కూడా చదివాం. బహుశా మీరు అతి తక్కువగా రాసింది ఒక్క ఈనాడు వాళ్ళకేనేమో?"

"లేదండీ ఈనాడు క్కూడా చాలా రాశాను. పది కలం పేర్లు పెట్టుకుని రాయడం వల్ల అందరికీ ఆ విషయం తెలియదు."

"పది కలం పేర్లా? నిజం?" అంది మౌళవిక. ఇది ఆ రోజువరకు ఆమె గమనించని విషయం. మనకు బాగా తెలుసునన్న విషయంలో ఇంకా తెలుసుకోవలసింది ఉండిపోయిందనే సంగతి తెలియగానే వచ్చే అనుభూతి ఆమె కళ్ళలో తొంగి చూసింది.

"పృధ్వీరాజ్, రేవతి, రాజు, కిష్టప్ప, క్రిష్ణ, వెంకట్, ఆశ్లేష, మల్లాది, రాణి ఇవన్నీ ఈనాడుకి నేను వాడిన కలం పేర్లే. అలాగే పల్లకి వారపత్రికకలో 'కిష్ణ' పేరుతో జోక్స్ కొన్ని రాసాను."

"ఏవండీ మా ఇంటర్వ్యూయింగ్‌తో మిమ్మల్ని జోరు కొట్టెయ్యడం లేదు కదా?" అంది జయశ్రీ

తల అడ్డంగా ఊపాడు మల్లాది చిరునవ్వుతో. "తన రచనల గురించి, తన గురించి ఎంతో ఉత్సాహంగా అడుగుతున్న పాఠకుల పట్ల ఏ రైటరూ బోరు ఫీలవడండి" అన్నాడు తాపీగా.

"మీ రైటర్లందరూ ఇంగ్లీషు నవల్సు చదివేసి కాపీ కొట్టేస్తారెందుకండీ?"

ఆనంద సమయంలో అపశ్రుతిలాంటి ఆ ప్రశ్నకి అందరూ అటువైపు తిరిగారు అడిగింది సంయుక్త. మల్లాది మళ్ళీ చిరునవ్వు నవ్వాడు.

"ఎక్కడో ఒక సంఘటన ఆధారంగా తీసుకుని నవలను మలచుకోవడం వేరు. ఒక నవలను దృష్టిలో పెట్టుకుని పేరలర్ లైన్స్‌లో మరో నవలను రాయడం వేరు. మొదటది ఇన్‌స్పిరేషన్, రెండవది ఇమిటేషన్. అలాగాక ఒక భాషలోని నవలను, ఇంకో భాషలోకి పేరొక్కటే మార్చు చేసి, సంఘటనలు సన్నివేశాలతో సహా దించెయ్యటం వేరు. ఇది మీరన్న కాపీ. ఇన్ని రకాల వ్యత్యాసాలను పెట్టుకుని వీరు మొత్తం మన రైటర్లని, వాళ్ళు రాసిన వాటన్నిటినీ కట్టకట్టేసి ఒకే బ్రాండ్ ముద్ర వేసేస్తే ఎలా?" అని అన్నాడు.

అక్కడున్న వారందరికీ మల్లాది ఇచ్చిన వివరణ ఎంతో నచ్చింది ప్రశంసపూర్వకంగా మౌళవిక వంక చూశారు. ఆమెకు కావలసింది కూడా అదే

"అది కాదండీ.. అసలు" అంటూ చెప్పబోతున్న సంయుక్తని అడ్డుకున్నారు మిగిలిన బృందంలోని సభ్యులు.

ఏది కాదే నువ్వసలు తెలుగు నవల ఎన్ని చదివావు చెప్పు? అంటూ నిలదీసి అడిగేసరికి ఉక్కిరిబిక్కిరి అయిపోయిందామె ఒక్కసారిగా అందరూ తనకు ఎదురు తిరుగుతారని ఆమె ఎప్పుడూ ఊహించలేదు.

"ఏమోనండి? బట్ ఐ హేట్ అవర్ తెలుగు రైటర్స్" అంది అసహనంగా. అప్పటికే ఆమె అహం దెబ్బతిన్నది.

"అది మా దురదృష్టం అనుకుంటాంలెండి అంతకుమించి ఏం చెయ్యగలం చెప్పండి? ప్రతి ఒక్కరిని పిలిచి మీటింగ్ పెట్టి 'మా నిజాయితీ ఇది' అని నిరూపించుకుంటూ కూచోలేం కదా" అని అన్నాడు మల్లాది చెదరని చిరునవ్వుతోనే.

"ఇంక ఈ డిస్కషన్ ఆపేయండి సార్. సరదాగా ఏదయినా ఆడదాం" అంది మౌళవిక.

"అవునండీ" అంటూ ముందుకు వచ్చింది సరళ "మల్లాదిగారూ మీ 'సావిరహే'లో రకరకాల క్విజ్‌లు గమ్మత్తులు రాసారు. అలాంటిదొకటి ఇప్పుడు చెప్పారా? మేం కూడా మా ఇంట్లో వాళ్ళని అదరగొట్టేట్టుండేది" అని అడిగిందామె.

"రైట్. ఓ తమాషా అయిన ఆట చెప్పాను వినండి" అని మొదలుపెట్టాడు మల్లాది. అందరూ ఎంతో ఉత్సాహంగా అతడిని చూస్తూ కొద్దిగా ముందుకు జరిగారు.

"నేను నాలుగు ప్రశ్నలు వరసగా అడుగుతాను. వాటికి సమాధానాలు వరసగా చెప్పాలి. ఎన్నిసార్లు అడిగినా సరే మీ సమాధానాలు వరస క్రమం తప్పకూడదు. ఎట్టి పరిస్థితులలోనూ మీ సమాధానాల ఆర్డరు మారకూడదు. అలా చెప్పగలరా?" అని అడిగడు.

"ఇందులో పెద్ద గొప్పేముంది? నాలుగే కదా ఆ మాత్రం గుర్తుండదంటారా?" అంది సంయుక్త.

"అదే అసలు ట్రిక్కు. నా ప్రశ్నల మాట అటుంచి మీరు చెప్పే మీ సమాధానాలు మీకు వినిపిస్తున్నంత కాలం అవి ఆర్డరులోనే వస్తాయి. అదే మీరు రెండు చెవులు మూసుకుని చెప్పడానికి ప్రయత్నించండి అప్పుడు డెఫినెట్‌గా ఫెయిలవుతారు. కావాలంటే పరీక్షించండి. ఇది మీ జ్ఞాపక శక్తికి ఓ టెస్ట్" అన్నాడు మల్లాది చాలెంజింగ్‌గా.

"సరే ఇదేమిటో చూస్తాను. నువ్వు ముందుకురా విజయలక్ష్మీ ఈ రహస్యాన్ని ఛేధించేస్తాను. ఆయన ప్రశ్నలకు సమాధానం చెప్పు" అంది సంయుక్త విజయలక్ష్మిని ముందుకు లాగుతూ.

"నేను రెడీ సార్" అంది విజయలక్ష్మి.

"సరే మొదలు పెడదాం. మొదటి ప్రశ్న. మీరిష్టపడే వ్యక్తి ఎవరు?" అన్నాడు మల్లాది.

"ఎన్.టి.రామారావు"

"మీ కిష్టమయిన ఊరు? గుర్తుంచుకోండి ఇది రెండో ప్రశ్న."

"ఎన్.టి.రామారావు పుట్టిన నిమ్మకూరు."

"మీకు నచ్చే సమయం? ఇది మూడు."

"ఎన్.టి.ఆర్ టీవీలో ప్రసంగించే సమయం."

"మొత్తానికి కాలేజీ అమ్మాయి అనిపించుకున్నారు. సరే మీరిష్టపడే నాణెం ఏది? అయిదు పైసలా, పదిపైసలా, పావలానా, అర్ధా? చెప్పండి దీసీజ్ లాస్టు" అన్నాడు మల్లాది.

"ఎన్.టి.రామారావు బొమ్మ ఏ నాణెం మీదైనా ప్రింట్ చేస్తారో అదే నాకిష్టమయిన నాణెం" అని ముగించింది విజయలక్ష్మి.

"వండ్రఫుల్. ఆన్సర్లు గుర్తున్నాయి కదా - ఇప్పుడు చెవులు మూసుకోండి. నా వేలువైపే చూస్తుండండి. నేనొక వేలు ఆడిస్తాను. అప్పుడు ప్రశ్న అడిగినట్టు గుర్తున్నమాట. ఎందుకంటే మీరు చెవులు మూసుకుంటారు. కాబట్టి నా ప్రశ్న మీకు వినిపించదు లేదా లిప్ మూమెంట్‌ని బట్టి చెప్పగలిగినా సరే. ఓకే యేనా?"

అందరూ ఎంతో ఉత్సాహంగా చూస్తున్నారు. విజయలక్ష్మి చెవులు మూసుకుంది. మల్లాది తన ప్రశ్నలని నెమ్మదిగా అడుగుతున్నాడు. ఆమె కరెక్టుగా చెప్పింది సమాధానాలని అందరూ చప్పట్లు చరిచారు.

"ఏం సార్. ఓడిపోయినట్టేనా?" అంది సంయుక్త.

"అప్పుడేనా? ఇదే ఆర్డరులో మరో రెండుసార్లు చెప్పమను చూద్దాం" అన్నాడు మల్లాది.

"ఓస్ ఇంతేనా? వినండి. ఎన్.టి.ఆర్. ఆయన పుట్టింది నిమ్మకూరు. ఆయన ప్రసంగించే సమయం, ఆయన బొమ్మ ప్రింట్ చేయబోయే నాణెం - మరోసారి చెప్పనా?" అంది విజయలక్ష్మి.

"యస్ - చెవులు మూసుకోవడం మర్చిపోయారు."

"ఓహ్ - సారీ" అంటూ చెవులు మూసుకుని గడగడా చెప్పేసింది విజయలక్ష్మి.

"ఎన్.టి.ఆర్. టీవీలో ప్రసంగించే సమయం, ప్రింట్ చెయ్యబోయే నాణెం తర్వాత తర్వాత" అంటూ నట్లు కొట్టేసింది.

అందరూ మరోసారి చప్పట్లు చరిచారు సంతోషంగా.

"ఇదేమంత పెద్ద కష్టమయిన గేమ్ కాదే విజయలక్ష్మి ఆన్సర్లు పెద్దవిగా ఉన్నాయి కాబట్టి లాస్టులో తప్పిందేమో? అవునా మల్లాదిగారూ. అదే నా ట్రిక్కు?" అడిగింది సంయుక్త.

"పోనీ మీరు చిన్న ఆన్సరిచ్చి ట్రై చేయండి."

"ఓకే - స్టార్ట్" అంతకుముందొకసారి దెబ్బతిన్న ఆమె అహం ఈసారి అతడ్నెలాగయినా కించపరచాలని తాపత్రయపడుతుంది.

"బట్ వన్ థింగ్ సంయుక్తగారూ. యు మస్ట్ బి స్పోర్టివ్. ప్లీజ్ ఏ ట్రిక్కీ గేమ్" అన్నాడు మల్లాది.

"నాతో ఫరవాలేదండీ. మీరోడిపోతే ఏం చేస్తారో చెప్పండి?" అంది సంయుక్త పంతం తొణికిసలాడుతున్న స్వరంతో.

"ఫారిన్ నుంచి ఇండియాకు వచ్చే ప్రతి పుస్తకం మీద త్రీ హండ్రెడ్ ఫర్సెంట్ కస్టమ్స్ డ్యూటీ వెయ్యమని రాజీవ్ గాంధీకి రిక్వెస్టు చేసి ఒప్పిస్తాను. సరేనా?"

అందరూ ఘొల్లుమన్నారు. సంయుక్త ముఖం జేగురించింది. "మొదలుపెట్టండి. అయామ్ రెడీ" అంది.

"నంబర్ వన్. మీరిష్టపడే వ్యక్తి ఎవరు?"

"అమితాబ్"

"మీ కిష్టమైన ఊరు?"

"బొంబాయి"

"మీరిష్టపడే సమయం"

"రాత్రి"

"మీ కిష్టమైన నాణెం?"

"పది పైసలు"

"రైట్. ఇదే ఆర్డర్‌లో చెవులు మూసుకుని చెప్పండి అంటూ ప్రశ్నలడిగాడు మల్లాది.

సంయుక్త చెవులు మూసుకుని చెప్పింది కరెక్టుగా.

"మళ్ళీ" అన్నాడు అతడు.

తిరిగి కరెక్టుగానే చెప్పింది సంయుక్త. అందరూ ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు వీరిద్దరివైపు. మల్లాది చెయ్యి ఎవరికీ తెలియకుండా పక్కనున్న టేప్ రికార్డర్‌ని నొక్కింది.

"ఇప్పుడు చెప్పండి. మీ వుడ్ బి ఎవరు?" అడిగాడు అతడు సౌండ్ తక్కువగా వచ్చేట్టు, పెదాలు కదలికతో దొరకనట్టు.

"అమితాబ్" అంది సంయుక్త సీరియస్‌గా చెవులు మూసుకుని. అందరూ ఒక క్షణం పాటు నివ్వెరపోయారు. నవ్వాలో నవ్వకూడదో తెలియక ఆశ్చర్యపోతూ గమనించసాగారు.

"ఎంగేజ్‌మెంట్ జరిగిన ఊరు"

"బొంబాయి."

"పెళ్ళి ముహూర్తం ఎప్పుడు?"

"రాత్రి."

"మీరు కట్నం ఎంతిచ్చారు?"

"పది పైసలు."

"అప్పటికి అర్థమయింది అందరికీ ఈ గేమ్ పడీ పడీ నవ్వసాగారు. చెవుల నుంచి వేళ్ళు తీసి అటూ ఇటూ చూసింది సంయుక్త. టేప్ రివైండ్ చేసి ప్లే బటన్ నొక్కాడు అతడు ఒక్క క్షణంలోనే సంయుక్త ముఖంలో రంగులు మారాయి.

"మీరు నన్ను చీట్ చేశారు" అంది కీచు స్వరంతో.

"అదే ఈ గేములోని ట్రిక్కు. మీరు యిది చాలా స్పోర్టివ్‌గా తీసుకోవాలని ముందే చెప్పాను" అన్నాడు మల్లాది.

మౌళవిక. జయశ్రీ ముఖాలు చూసుకున్నారు. ఈ గేము సంయుక్తతో కాక ఇంకెవరితోనైనా ఆడివుంటే బాగుండుననిపించింది ఆ క్షణంలో ఇద్దరికీ.

సంయుక్త తమాయించుకుంది.

"మరి విజయలక్ష్మిని అడిగినప్పుడు ప్రశ్నలు మార్చలేదేం?" అని అడిగింది.

"ఈ గేమ్ లో ఎవరో ఒకరు ఎస్కేప్ గోట్ కాక తప్పదు. దానికి ముందు ఇద్దరు ముగ్గురుతో ఏమీ తెలీనట్టు కరెక్టుగా ఆడాలి. వాళ్ళు ఎస్కేప్ గోట్‌లు అన్నమాట" అని వివరించాడు అతడు.

మళ్ళీ మరోసారి అందరూ చప్పట్లు చరిచారు. ఈ గేమ్ అక్కడున్న వారందరికీ ఎంతో నచ్చింది సంయుక్తకి తప్ప.

"ఏమయినా అమ్మాయిలతో ఇటువంటి గేమ్స్ ఆడడం మంచిది కాదనుకుంటా" అని అందామె. ఆమెకింకా కోపం తగ్గలేదని తెలుస్తూనే ఉంది.

"సో.. స్టిల్ యు ఆర్ ఫీలింగ్ బాడ్ ఎబౌటిట్. అంతేనా సంయుక్తగారూ?" అడిగాడు మల్లాది సంయుక్తవైపు సూటిగా చూస్తూ.

ఆ చూపులో "నువ్వు ప్రగల్భాలు పలికినంత స్పోర్టివ్ టైపుకాదన్నమాట" అనే అర్ధం ఉంది.

"నో...నో...నాటెటాల్" అంది సంయుక్త. మనసులో మాత్రం మరిగిపోతూనే ఉందామెకు. తప్పనిసరి పరిస్థితులలో ఒకే లీవిట్" అందొక నిముషం తర్వాత.

"మల్లాదిగారూ మీరిప్పుడు రాయబోతున్న నవలలు ఏమున్నాయండి?" అని అడిగింది.

"రెండు మూడు నెలల్లో ఓ వారపత్రికలో మరో కొత్త సీరియల్ మొదలవుతుంది. ప్రస్తుతం ఎయిర్ హోస్టెస్ సబ్జెక్టు మీద టెర్రరిస్టు సబ్జెక్టు మీద రెండు నవలలు తయారవుతున్నాయి. ఓ సంవత్సరంలోగా పూర్తవచ్చు."

"వన్ ఇయరా? మైగాడ్ " అంది సరళ.

"మరి కావాల్సినంత మెటీరియల్ సమకూర్చుకుని పాయింట్స్ అవీ యాడ్ చేసుకుని ఎంత అవస్థపడాలి? అంతేగాక గ్రిప్ పోకుండా సీన్ డివిజన్ చేసుకుని ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉందండి. మేం ఇంత కష్టపడినా సంయుక్తగారిలాంటివాళ్ళు మేం ఏదో ట్రాన్స్ లేషన్ వర్క్ చేసేస్తున్నాం అంటారు" అన్నాడు మల్లాది.

"మధ్యలో నన్నెందుకు లాగడం. మరోసారి ఎస్కేప్ గోట్ చేద్దామనా?" అంది సంయుక్త.

ఆమె బాగా ఉడుక్కుందనీ అక్కడున్న వాళ్ళందరికీ అర్థమయిపోయింది మళ్ళీ ఈ ప్రస్తావన రాకుండా జాగ్రత్త పడాలని ఒకరికొకరు కనుసైగలు చేసుకున్నారు.

"మల్లాదిగారూ మీరేం అనుకోకపోతే ఓ చిన్న సందేహం" అంటూ అప్పటిదాకా నిశ్శబ్ధంగా ఉండి గమనిస్తున్న స్వర్ణకుమారి ముందుకు వచ్చింది.

"చెప్పండి"

"ఓ రచయితగా మీ జీవితంలో మీకు ఏదైనా ఓ బ్యాడ్ ఎక్స్‌పీరియన్స్ ఉందా?"

ఒక్కసారిగా అందరూ నిశ్శబ్దం అయిపోయారు. అతని ముఖంలో తాండవించిన గంభీరత్వాన్ని చూసి.

కళ్ళు పైకెత్తి కిందకి దించాడతను. అలా దించుతూనే ఓ క్షణం పాటు కళ్ళు మూసుకున్నాడు.

"ఉంది. నిజంగా అటువంటి చిత్తక్షోభ పగవాడికి కూడా వద్దనిపించే రోజది" అన్నాడు.

"ఇఫ్ యూ డోంట్ మైండ్ మేం తెలుసుకోవచ్చా?" అంది జయశ్రీ అందరి చూపులూ 'మా అభ్యర్థన కూడా అదే' అన్నట్లున్నాయి.

"రైట్. చెబుతా వినండి" అన్నాడు అతను గట్టిగా ఊపిరి పీల్చి వదులుతూ.

కూర్చున్న పిల్లలందరూ ఎంతో ఉత్సుకతతో ముందుకి జరిగారు.

## 6

"1983 డిసెంబరు ముప్పైవ తేదీ 'చంటబ్బాయి' సీరియల్ క్లయిమాక్స్ రాస్తున్నాను. తండ్రిని ద్వేషించిన కొడుకు ఆ తండ్రిని తిడుతూ ఉత్తరం రాసే సీను. సరిగ్గా అదే సమయానికి టెలిగ్రాం వచ్చింది. మా ఫాదర్‌కి పెరాల్సిస్ స్ట్రోక్ వచ్చిందంట. ఆ స్ట్రోక్ వచ్చి కూడా రెండు రోజులయిందట. వెంటనే రమ్మనమని కబురు.

అటు మా నాన్నగారెలా ఉన్నారోనన్న ఆతృత ఓ వైపు. ఇటు సీరియల్ ఇన్‌స్టాల్‌మెంటు ఇవ్వాల్సిన డెడ్ లైన్. అదీ తండ్రిని తిడుతూ రాయాల్సిన సీను. ఊహించుకోండి. ఒక రచయిత మనోవ్యథ" అని ఆగి ఊపిరి పీల్చుకున్నాడు మల్లాది.

కూర్చున్న వారందరూ ఎంతో ఆసక్తితో వింటున్నారు నిజాయితీగా. నిట్టూర్చడం కూడా మరిచిపోయారేమోనన్నంత నిశ్శబ్దంగా ఉంది వాతావరణం. ఇసుకలో పిన్ను పడినా కూడా వినిపించేటంతటి చిక్కటి నిశ్శబ్దం అది.

"సాధారణంగా రచయితకి అన్ని పాత్రలు తానై తాదాత్మ్యం చెందుతూ రాయాల్సిన అవసరం ఉంటుంది. అలా రాయగలిగినవాడే పదికాలాలపాటు నిలబడగల రచయిత అవుతాడు. అలా రాసినప్పుడే ఆ రచన పదికాలాలపాటు నిలబడుతుంది. అలా మెంటల్‌గా ఇన్‌వాల్వ్ అవుతూ తండ్రిమీద ద్వేషం పెంచుకునే ఓ కొడుగ్గా కసినింపుకుంటూ, వాచీ చూసుకుంటూ నన్ను నేను నిగ్రహించుకుంటూ అరకొరగా రాసినట్టు ఉండకుండా ఉండడానికి శాయశక్తులా ప్రయత్నం చేసినా ఆ నాటి రాత్రి నా మెదడులో నరాలెంతగా ఒత్తిడికి గురి అయ్యాయో, నా గుండెల్లో తంత్రులెంతగా టాంపర్ చెయ్యబడ్డాయో తలుచుకుంటే ఇప్పటికీ ఒక్కసారిగా ఓ జర్కు..." అంటూ ఆగాడు మల్లాది.

అందరి కళ్ళలోనూ సానుభూతి. మౌళవిక కళ్ళలో కమ్ముకుంటున్న కన్నీరు మరో నిమిషంలో ధారాపాతంగా వర్షించడానికి సిద్ధంగా ఉంది. అది ముందే గ్రహించిన జయశ్రీ ఎవరికీ కనపడకుండా మౌళవిక చేతిని నొక్కుతోంది 'కాస్త కంట్రోల్ చేసుకో' అన్నట్లు.

ఈలోగా వెక్కుతున్నట్లు బరువుగా ఊపిరి పీల్చిన శబ్దం. అందరూ అటువైపు చూశారు. సుధ తన కన్నీటిని తుడిచేసుకుంటోంది.

"ఏయ్ ఏంటది? డోంట్ బి సిల్లీ" అంది సంయుక్త. ఆమె స్వరంలో ఓదార్పు కన్నా అధికారమే ఎక్కువగా ధ్వనించింది.

"లేదే మనస్ఫూర్తిగా ఏడవడానికి కూడా వీలులేని జీవితం నిజంగా దుర్భరం. అతడెంత గొప్పవాడు కానీ" అంది సుధ.

"అందుకే తోడొకరుండిన అదే భాగ్యము అన్నాడు శ్రీశ్రీ" అంది ఉషాకుమారి.

"ఇక్కడ సమస్య తోడు కాదు" అంది మౌళవిక.

"కరక్టే ప్రపంచంలో ఎవరైనా ఒంటరితనాన్ని ఫీలవుతారేమోగానీ రచయిత మాత్రం కాదు. ఎప్పుడూ చక్కటి క్రియేటివిటీని అనుభవించగల రచయితకి తన పాత్రలే తనకెప్పుడూ తోడు" అంది జయశ్రీ

"ఎగ్జాట్లీ. కానీ ఇక్కడ తను ఆల్రెడీ సృష్టించిన పాత్రే తన మానసిక పరిస్థితికి వ్యతిరేకంగా ఆయువుపట్టులాంటి ఓ సన్నివేశానికి జీవంగా నిలబడాలంటే ఓహ్.. హేట్సాఫ్ మల్లాదిగారు. నిజంగా నాకు ఈరోజే ఆ రోజేమో అన్నంత టచింగ్‌గా ఉంది" అంది సరళ. ఆమె కళ్ళలో కూడా సన్నటి కన్నీటి పొర.

"మీరెందుకింత గొప్ప రచయిత అయ్యారో నాకిప్పుడు అర్థం అయింది మల్లాదిగారూ" అంది సంయుక్త.

అందరూ ఆమెవైపు ఆశ్చర్యంగా చూశారు. ఇంత త్వరగా అర్థం చేసుకోగల అవగాహన ఈమెకెప్పుడు అలవడిందా అని.

"దేన్నైనా సరే అతి తక్కువ వ్యవధిలో కళ్ళకు కట్టేలా హృదయానికి హత్తుకునేలా, మెదడుని స్థంభింపచేసేలా చెప్పగల నేర్పు మీకుంది" అంది సంయుక్త.

ఒక్క క్షణంలోనే ఆ మాటల వెనుక ఉన్న వ్యంగ్యం అందరికీ అర్థం అయింది.

"ఇది కామెంటా, కాంప్లిమెంటా?" అడిగాడు అతను. తలచుకుంటే వెంటనే తగిన రిపార్టీ, అప్పటికప్పుడే ఇవ్వగలగడతను. కానీ అప్పటికే 'డెఫ్ గేమ్' ద్వారా ఆమెను రెచ్చగొట్టేనన్న ఓ రకమైన గిల్టీ కాన్షస్‌తో, మౌళవిక, జయశ్రీల మీద గౌరవంతో సాధ్యమైనంత త్వరగా నిభాయించుకున్నాడతను.

"నన్ను అందరూ క్షమించాలిప్పుడు. అనవసరంగా హాపీగా ఉండాల్సిన వాతావరణాన్ని నేనే చెడగొట్టేసాను" అంది స్వర్ణకుమారి చేతులు జోడిస్తూ.

"నో..నో అలా ఫీలవకు స్వర్ణా! నీ ద్వారా మల్లాదిగారి పర్సనల్ లైఫ్ కొంత తెలిసిందన్న గర్వం మాకే కలిగింది. ఇన్ ఎనీవే ఉయ్ ఆర్ రియల్లీ హాపీ" అన్నారు ఉమ, సుబ్బులు జంటగా.

మల్లాది అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలని ఉన్నా ఇంతమంది ఏకం కావటంతో తిరిగి మాట్లాడకలేకపోయింది సంయుక్త. ఏ వైపు నుంచి చూసినా ఆమె అహం దెబ్బతింటోంది.

"పోన్లెండి. టాపిక్ ఇంకోటేదైనా మార్చరాదూ" అందామె.

"వద్దులే నో మోర్ గేమ్స్" అంది జయశ్రీ ఆమె అలా ఎందుకన్నదో అందరూ గ్రహించగలిగారు. అందుకు అంగీకార సూచకంగా ఎవరిమటుకు వారే తలలు ఊపారు. అదంతా గమనిస్తూనే ఉంది సంయుక్త. దాంతో తనని మరింత వెలివేసినట్టు అనిపించిందామెకు.

"ఏం ఫరవాలేదు మల్లాదిగారు ఆడదామా మరో గేమ్?" అంది ఉక్రోషంగా.

"ఒద్దులెండి ఇటువంటి పిక్నిక్‌లు సరదాగా గడిచిపోవాలన్నా, కలకాలం గుర్తుండిపోవాలన్నా అందరికీ ఇష్టమైనవే చెయ్యాలి మనం" అన్నాడు అతను.

"అది నిజమేననుకోండి. నా మట్టుకు నేను రెడీ" అంది సంయుక్త పౌరుషంతో.

"అది నేనూ గమనించానండీ. యు ఆర్ వెరీ స్పోర్టివ్ కానీ జయశ్రీగారికి యిష్టం లేదంటున్నారుగా ఆపేద్దాంలెండి. అందరికీ ఇష్టమైన టాపిక్ మాట్లాడదాం."

అతడి మాటల వెనకనున్న విన్న వ్యంగ్యపు ఘాటు ఆమెకి మొహం పగిలేలా తగిలింది.

"అనవసరంగా నాతో పెట్టుకుంటున్నాడు ఇతను. ఖచ్చితంగా మర్చిపోలేని దెబ్బతిని తీరతాడు అని అనుకుంది మనసులో.

"అందరికీ ఇంట్రెస్టు ఉన్న టాపిక్ అంటే ఇంకేమున్నాయ్, సినిమాలు" అంది సుధ. వారానికి కనీసం రెండు మూడు సినిమాలు అయినా చూడకపోతే ఆమెకు నిద్రపట్టదు.

"సినిమాలంటే మా సుధకి తెగ పిచ్చండి" అని మొదలుపెట్టింది మౌళవిక.

మల్లాది చెపుతున్న విషయాలమీద తనకెంత ఆసక్తి ఉన్నా తన స్నేహితులు అతని గురించి చెడుగా అనుకోకూడదని, అతని ఎదురుగా వారు ఒక్క మాటకూడా తూలే అవకాశాన్ని కల్పించకూడదని, వాతావరణాన్ని ఆహ్లాదంగా ఉంచాలని ఆమెకూడా మనస్ఫూర్తిగా కోరుకుంటోంది. "కావాలంటే ఎప్పుడయినా తన టైమ్ టేబుల్ తెచ్చి చూపిస్తాను చూడండి. మధ్యాహ్నం క్లాసుల్లో ఏయే సబ్జెక్ట్స్ చెప్తారో అవి రాసి ఉండవు. దానికి బదులుగా సోమవారం దిల్షాద్, మంగళవారం రాయల్, బుధవారం జమ్రుద్, గురువారం రామకృష్ణ, శుక్రవారం సంతోష్ అని సినిమా థియేటర్ల పేర్లు ఉంటాయి."

"మరి శనివారం?"

"ఆ రోజు టీ.వీలో తెలుగు సినిమా ఉంటుంది కదండీ. అందుగురించి బుద్ధిగా ఇంటికెళ్ళిపోతుంది. ఆదివారం కూడా అంతే. మిగతా రోజులు మాత్రం అతికష్టం మీద కంట్రోల్ చేసుకుని రెండు లేక మూడు సినిమాలు చూస్తుంది పాపం" అని ముగించింది మౌళవిక.

"అంటే కాలేజ్ డేస్‌లో ఫిల్మ్ ప్లానింగ్ ఆవిడ పాటిస్తారన్న మాట."

అందరూ ఒక్కసారిగా "ఓ..." అంటూ అరిచారు సరదాగా.

"ఈ మధ్య హిట్టయిన 'రెండు రెళ్ళు ఆరు' మీ నవలే కదండీ? అందులో రాజేంద్రప్రసాద్ ప్రీతికి ఇచ్చిన క్విజ్ చాలా బావున్నాయండీ" అంది ఉషాకుమారి.

జయశ్రీ నెమ్మదిగా కేరియర్‌లు విప్పి తెచ్చినవన్నీ కాగితపు ప్లేట్లలో అమర్చి ఒక్కొక్కరికీ పాస్ చెయ్యసాగింది.

"రెండు రెళ్ళు ఆరుకి సంబంధించినదే ఓ తమాషా ఇన్సిడెంట్ ఉందండీ. ఆ ఇన్సిడెంట్ నవల్లో లేదు. అది సినిమాలో జంధ్యాలగారు పెట్టినదే" అని ప్రారంభించాడు మల్లాది.

అందరూ తింటూ ఉత్సాహంగా వింటున్నారు.

"జంధ్యాలగారు ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా రెగ్యులర్‌గా కలిసే స్నేహితుల్లో ఆదివిష్ణుగారు ఉంటూ ఉంటారు. అన్నట్టు మీకు ఆదివిష్ణు తెలుసుకదా?"

"తెలుసండి మౌళవిక చెప్పింది. ఆయన మీకు మా మౌళవిక అడ్రసు ఇవ్వడం అదీ" అంది సరళ.

"అదే ఆయన, జంధ్యాలగారు మంచి స్నేహితులు. అసలు తనలోని కామెడీకి ఇన్‌స్పిరేషన్ ఆదివిష్ణే అని అంటూ ఉంటారు జంధ్యాల."

ఆ రోజు ఏం జరిగిందంటే వాళ్ళిద్దరూ మెజీషియన్ పట్టాభిరాం మరికొంతమంది స్నేహితులూ హోటల్ అశోకాలోని ఆయన రూమ్‌లో కబుర్లు చెప్పుకుంటూ ఉన్నారు. ఆ టైమ్‌లో నేనూ ఉన్నాను. పట్టాభిరాం కొన్ని మేజిక్‌లు అవీ చేసి చూపించాడు సరదాగా.

ఇంతలో 'ఆదీ నేనో మంచి మేజిక్ చెయ్యనా' అని అన్నారు జంధ్యాలగారు. మన ఆదివిష్ణుగారు సరేనన్నారు. ఒక టేబుల్ మీద ఆదివిష్ణుని నిలబెట్టి 'నేను మూడుసార్లు ఈ టేబుల్ చుట్టూ తిరిగేలోగా నువ్వు దిగిపోతావు చూస్తూ ఉండు' అని అన్నారాయన.

"నేను ఛస్తే దిగను పందెం" అని అన్నాడు ఆదివిష్ణు.

"సరే నా కళ్ళలోకి చూడు తిరుగుతున్నాను. ఒకటోసారి అబ్రకదబ్రా" అని తిరిగారు జంధ్యాల.

ఆదివిష్ణు కదలకుండా స్థిరంగా నిలబడ్డాడు.

"ఆదీ జాగ్రత్త రెండోసారి తిరుగుతున్నా. అబ్రకదబ్రా" అంటూ రెండోసారి తిరిగాయన. ఆదివిష్ణు మరింత దృఢంగా నిలబడి ఉన్నారు ఆ టేబుల్ మీద.

రెండు సార్లు తిరగటం పూర్తయ్యాక జంధ్యాలగారు వచ్చి మంచం మీద కూర్చున్నారు. పక్కనే ఉన్న సితార, జ్యోతిచిత్ర పేజీలు తిరగేశారు. అక్కడున్న తక్కిన స్నేహితులతో కొంతసేపు మాట్లాడారు. ఇప్పుడే వస్తానని బాత్ రూమ్‌కి వెళ్ళి వచ్చారు. ఇన్ని చూస్తున్నా ఆదివిష్ణు వైపు చూడనయినా చూడలేదు. తర్వాత నా పక్కకి తిరిగి ఏదో అనబోయారు ఇంతలో –

"మూడోసారి ఎప్పుడు తిరుగుతావయ్యా" అని అడిగాడు ఆదివిష్ణు కాళ్ళు పీకుతుండగా.

"ఆది ఇంత టైములోగా తిరగాలని మన పందెంలో లేదు కదయ్యా. నాకు ఇష్టం వచ్చినప్పుడు తిరుగుతాను. ఇప్పుడు కుదరకపోతే నేను మళ్ళీ హైదరాబాద్ వచ్చినప్పుడు తిరుగుతాను" అని అన్నారు జంధ్యాల.

"ఏయ్.. ఇది మోసం గురువా" అంటూ టేబుల్ మీదనుంచి దిగిపోయారు ఆదివిష్ణు.

"అదీ.. ఈ ఇన్సిడెంట్. జంధ్యాలగారు తన 'రెండు రెళ్ళు ఆరు' సినిమాలో పెట్టారు. మీకు గుర్తుండే ఉంటుంది" అని ముగించాడు మల్లాది.

"అవును సముద్రం దగ్గర రాతిబండల మీద రాజేంద్రప్రసాద్ ప్రీతి దగ్గర ఈ మేజిక్ చేస్తాడు" అంది సుధ సంతోషంగా.

మల్లాది చెప్పిన సన్నివేశం అందరికీ నచ్చింది. సంయుక్త కూడా ఆపుకుందామనుకున్నా ఆపుకోలేక ఆనందాన్ని ముఖంలో వ్యక్తపరిచేసింది. అది చూసిన జయశ్రీ, మౌళవిక మొహాలు కాస్త తేటపడ్డాయి. అలా లంచ్ బ్రేక్ ఆహ్లాదంగా గడిచింది అందరికీ.

ముందురోజు మల్లాది చెప్పిన నాలుక నిర్వచనం, ఆర్.యస్.విపి. ఎబ్రివియేషన్, ఎంగిలిపడడం జోకు అన్నీ చెప్పింది మౌళవిక అందరికీ.

"బోట్ షైర్ చేద్దామా?" అంది జయశ్రీ చేతులు కడుగుకుంటూనే.

"నేను అదే అన్నానే మార్నింగాయన వస్తుంటే" అంది మౌళవిక.

"ఇక్కడ బోట్ షైర్ అంటే నాకో తమాషా గుర్తొస్తోంది" అన్నాడు మల్లాది.

మళ్ళీ అందరు అతని చుట్టూ చేరారు ఉత్సాహంతో.

"ఈ లేక్‌లో బోట్‌లు ఏర్పాటు చేశారని విన్నాక ఓ రోజు వచ్చానిక్కడికి. ఇప్పుడున్నంత రష్ లేదప్పుడు. నేనొక్కడ్నే ఉన్నాను బోట్ ఎక్కే వాళ్ళలో. ముందు టిక్కెట్టుకని డబ్బులు తీసుకున్నారు. నాతోపాటు బోటు నడపడానికి ఒకతను వచ్చాడు. సగం దూరం వెళ్ళాక 'పైసలివ్వండి' అని అన్నాడతను. 'అదేమిటి టిక్కెట్టుకొన్నాగా' అని అన్నాను. 'అది వేరే. ఇవి నా చాయ్ పైసలు' అని అన్నాడతను. బోటు నది నీట్లో ఉంది. నాకేమో ఈత రాదు. తగువు పెట్టుకుందామంటే ఒక్కడ్నే ఉన్నాను ఏం చేస్తాం మరి. చచ్చినట్టిచ్చాను వాడి చాయ్ పైసలు.

"ఇప్పుడింతమంది అమ్మాయిలం ఉన్నాం కాబట్టి ముందు మిమ్మల్ని అడగడులెండి పదండి" అంది సంయుక్త.

"ఏమో? ఇంతమంది అమ్మాయిల ముందు డాబుకోసం కాదనడని అడగొచ్చుగా" అన్నాడు మల్లాది.

"అప్పుడు నేనిస్తాలెండి. చాయ్ పైసలు" అంది సంయుక్త గర్వంగా.

"సరే పదండి."

ఇప్పుడామెకి తృప్తిగా ఉంది. చివరి మాట తనదే అయినందుకు బిలబిలమంటూ అందరూ బోట్ ఎక్కారు. బ్యాగ్ లోంచి కెమెరా తీసింది సంయుక్త.

"చాలా ఫోటోజెనిక్ ఉందిక్కడ. మల్లాదిగారూ ఇటు తిరగండి ఓ ఫోటో తీస్తాను" అని అందామె.

"నో థాంక్యూ. దయచేసి నా ఫోటో మాత్రం తియ్యకండి" అన్నాడు మల్లాది ఆదుర్దాతో.

"ఏం?"

"ఏం లేదూ?" అని అందుకుంది మౌళవిక.

"ఇప్పటిదాకా ఆయన ఫోటో ఏ పేపర్లోనూ పడలేదు. అలా ఫోటో పడని రచయితగా ఆయనకో ప్రత్యేకమయిన పేరుంది అందుకని."

"ఇప్పుడు నేనీ ఫోటో పేపర్లకిస్తాననుకున్నావా? భలేదానివే ఏదో గుర్తుకోసం."

"ఎందుకులెండి ఇఫ్ పాసిబుల్ నన్ను ఎవాయిడ్ చెయ్యండి? అన్నాడు మల్లాది అర్థింపు స్వరంతో.

"సార్... జర చాయ్ పైసలు" అన్నాడు బోట్ నడుపుతున్న వాడు.

"కూర్చున్న వారందరూ ఒక్కసారిగా "ఓ..." అంటూ మళ్ళీ అరిచారు. సంయుక్త ముఖం మాడిపోయింది. మల్లాది పర్సు తెరిచాడు.

"మల్లాదిగారూ.. ప్లీజ్ ఆగండి. అది నా ప్రామిస్ నేను ఇస్తాను" అంటూ బ్యాగ్ లోంచి రెండు రూపాయలనోటు తీసి ఇచ్చింది సంయుక్త.

''మీకు మరీ అంత పౌరుషం ఏంటండి సంయుక్తగారూ?'' అడిగాడు మల్లాది 'దయచేసి రెచ్చగొట్టద్దు' అన్నట్టుగా మౌళవిక కళ్ళతోనే ప్రార్థించింది అతడిని.

''ఆడపిల్ల అన్నాక ఆ మాత్రం ఉండాల్లెండి ఆత్మాభిమానం'' అని సర్దుకున్నాడతను. తిరిగి సంయుక్త తనే సమాధానంతో పొడిగించకుండా. అతడి ప్రశ్న, సమర్థింపూ రెండు సంయుక్తకి నచ్చలేదు. అగ్నికి ఆజ్యం పోసినట్టు ఫీలయిందామె. వెంటనే చేతిలోని కెమేరాని మల్లాదివేపు ఫోకస్ చేసి ''క్లిక్'' మనిపించిందామె.

''అదిగో వద్దంటున్నా తీసేశారు'' అన్నాడు మల్లాది కంగారుగా.

అతను మరీ అంతగా ఎందుకు అభ్యర్థిస్తున్నాడో అర్థం కాలేదు మౌళవికకు.

''మిమ్మల్ని తీశానని ఎవరు చెప్పారండీ? ఆ సీనరీని తీశాను. మీ పక్కనున్న మౌళవికను తీశాను. ఒకవేళ మిమ్మల్ని తీసినా మీకొచ్చిన నష్టం ఏమిటండీ? మరీ స్టయిల్ కొట్టేస్తున్నారు.''

ఇక ఆమెతో ఆర్గ్యుమెంటు అనవసరం అనిపించింది మల్లాదికి. అతడేమీ అనకుండా ఉంటే బావుండునని మనసులో వెయ్యి దేవుళ్ళకి లక్షదండాలు పెట్టుకున్నారు మౌళవిక, జయశ్రీ

''సరేలెండి యు కెన్ విన్ యాన్ ఆర్గ్యుమెంట్. బట్ యు కాంట్ విన్ ఎ పర్సన్ అని అన్నారెవరో'' అని అన్నాడు మల్లాది.

సంయుక్తకి ఆ మాట వెనకనున్న అర్థం పూర్తిగా అర్థంకాలేదు, కనుక అక్కడితో సంభాషణ ఆగిపోయింది.

''బాప్ రే బాప్. నాలుగున్నర అయిందే కాలేజీ ఎప్పుడో వదిలేసుంటారు నేను తార్నాకా దాకా వెళ్ళాలి'' అంది సుబ్బులు అకస్మాత్తుగా.

అందరూ ఒక్కసారిగా అవునంటే అవునన్నారు. బోటు త్వరగా ఒడ్డుకు మళ్ళించబడింది.

ఒకరి తర్వాత ఒకరు దిగుతుంటే జయశ్రీ కెవ్వుమంటూ కాలు పట్టుకుని ఒడ్డునున్న గట్టుమీద పడిపోయింది. అందరూ నిర్ఘాంతపోయారు అనుకోని ఈ పరిణామానికి.

''ఏమయిందే?'' అంటూ వచ్చి జయశ్రీని పట్టుకుంది మౌళవిక.

''కాలు స్లిప్పయింది గట్టు ఎక్కుతుంటే బెణికినట్లయింది'' అంది జయశ్రీ

''నొప్పిగా ఉందా?''

''డాక్టర్ దగ్గరికెళ్ళాల్సినంత సీరియస్ కాదులే. కాస్త అయొడెక్స్. జండుబామో రాస్తే తగ్గిపోతుంది. సంయుక్తా! మీ ఇల్లు ఇక్కడికి దగ్గరేకదా మీ ఇంట్లో పెయిన్ రిలీఫ్స్ ఏవయినా ఉన్నాయా?'' అడిగింది జయశ్రీ కాలును రాసుకుంటూ.

"మా ఫాదర్ మొన్ననే తెప్పించిన ఇన్‌ఫ్రారెడ్ లాంప్ ఉంది ఒక్క అయిదు నిమిషాల్లో నొప్పీగిప్పీ అంతా ఫినిష్" పద మనింటికెళదాం అంది సంయుక్త.

"మాకు టైమవుతుందే" అన్నారు ఉమ, సుబ్బులు.

"ఓ చిన్న పని చేద్దాం, మా ఇంట్లోకి ఒక్కసారి వెళ్ళివచ్చేద్దాం. వీళ్ళకా ఇన్‌ఫ్రారెడ్ ల్యాంప్ యిస్తాను. అది అయ్యేలోగా మీ అందర్నీ నేను డ్రాప్ చేసేస్తాను."

"ఓకే మల్లాదిగారూ మీరు కూడా ఇప్పుడు మా ఇంటికి రావాలి. దిసీజ్ మై రిక్వెస్టు" అంది సంయుక్త అందరూ తలలూపుతుండగా.

బయలుదేరిన రెండు కార్లూ రెండు క్షణాలలో సంయుక్త ఇంటికి చేరుకున్నాయి. మరో అరక్షణంలో మల్లాది కూడా తన రాజ్ దూత్‌లో అక్కడికి చేరుకున్నాడు.

"అందరూ వన్ మినిట్ పాటు కూచోండే" అంటూ టీపాయ్ మీద హేండ్ బ్యాగ్, కెమెరా పెట్టి లోపలికి వెళ్ళింది సంయుక్త.

"చాలా నొప్పిగా ఉందా?" అని మౌళవిక అడిగింది. మళ్ళీ అవునన్నట్టూ తలాడించింది జయశ్రీ పళ్ళబిగువున బాధ సహిస్తున్నట్టుందామె.

"సారి జయశ్రీ మేం వెళ్ళక తప్పదు. ఇంకోలా అనుకోకు" అని మిగిలినవారు అంటూ ఉండగానే ఇన్ ఫ్రారెడ్ లాంప్ తీసుకుని వచ్చింది సంయుక్త.

"ఈ సోఫాలో కూచో" అంటూ ప్లగ్ కనెక్షన్ ఇచ్చిన లాంప్ ఎదురుగా ఉన్న టీపాయ్ మీద పెట్టిందామె.

"కాలు ఇలా పెట్టి దీని 'రేస్' ఎక్కడ నొప్పో అక్కడ పడేట్టు చూడు. మౌళవిక నువ్వు ఆపరేట్ చేస్తూ ఉండు. విజయలక్ష్మి నువ్విక్కడే ఉండు. కారులో చోటు చాలదు. నేను మళ్ళీ వచ్చి నిన్ను ఇంటిదాకా డ్రాప్ చేస్తాను. మల్లాదిగారూ ఇప్పుడే వచ్చేస్తా" అందరినీ తరలించుకుంటూ బయలుదేరింది.

మరునిమిషంలో అక్కడంతా నిశ్శబ్దం అలుముకుంది. మౌళవిక లాంప్ రేస్ సరిగ్గా జయశ్రీ కాలుమీద పడేట్టు చేస్తోంది.

"అబ్బ.. చాలా వేడిగా వుందే ఓ నిమిషం అటు తిప్పు" అంటూ జయశ్రీ ఆ లాంప్ తన కాలుకి పక్కగా జరిపింది. పది నిమిషాలలోనూ నాలుగయిదుసార్లు పైగా జరిపింది.

ఆమె అలా చేయడంలోని అంతరార్థం రెండు జతల కళ్ళు మాత్రమే గమనించసాగాయి.

"ఏం జయశ్రీ ఏమయినా రిలీఫ్ కనిపించిందా?" అంటూ అడుగుపెట్టింది సంయుక్త ఓ అయిదునిమిషాల తర్వాత.

"రియల్లీ ఫార్ బెటర్. ఇంక అది ఆపేస్తావా?" అంది జయశ్రీ

"ష్యూర్" అంటూ స్విచ్ ఆఫ్ చేసేసి లోపల పెట్టెయ్యడానికి ఇన్‌ఫ్రారెడ్ లాంప్‌ని తీసుకువెళ్ళింది ఆమె.

వెళదామా? అన్నట్టుగా సౌంజ్ఞలు చేస్తున్నారు మౌళవిక, జయశ్రీ సోఫాలోనే నిర్లక్ష్యంగా పడేసి వున్న 'రీడర్స్ డైజెస్టు'ను తిప్పి చూస్తున్నాడు మల్లాది. కేవలం ఒక ప్రేక్షకురాలిగా మాత్రమే మిగిలిపోయింది విజయలక్ష్మి.

"అదేమిటే అందరూ నిలబడిపోయారు?" అంటూ వచ్చింది సంయుక్త లోపల్నుంచి.

"ఇంక వెళతాం" అంది మౌళవిక.

"నువ్వు సరేలే. ఎప్పుడూ వెళ్ళిపోతాననే అంటావు. ఏం జయశ్రీ బయలుదేరగలవా? లేక ఇవాళ మా యింట్లోనే వుండి.." అని సంయుక్త అంటూండగానే చెయ్యి అడ్డం పెట్టి వారించేసింది జయశ్రీ

"లేదు సంయుక్తా నిన్న రాత్రికూడా ఇంటికి వెళ్ళలేదు. ఇవాళ కూడా వెళ్ళకపోతే బావుండదు. మరోసారి ఉంటానులే" అంది.

"అంటే నిన్న మల్లాదిగారు దిగిన రోజంతా మౌళవికతోనే ఉన్నావన్నమాట" అంది సంయుక్త సగర్వంగా.

మౌళవిక, జయశ్రీ మళ్ళీ ముఖాలు చూసుకున్నారు. నేరకపోయి ఇరుక్కున్నాం బాబూ అనే భావన ఇద్దరి కళ్ళలోనూ ప్రతిఫలించింది.

"అయామ్ సారీ. నాకు కొంచెం పనుంది. కెన్ ఐ టేక్ లీవ్ ప్లీజ్" అన్నాడు మల్లాది.

"అరెరె... అదేమిటండీ మా ఇంటికొచ్చి ఏం తీసుకోకుండా నో నో నో" అంది సంయుక్త హ్యాండ్ బ్యాగ్‌లో చెయ్యిపెట్టి.

మరునిమిషంలోనే ట్రేలో అయిదు కూల్ డ్రింకులు తీసుకొచ్చి టీపాయ్ మీదపెట్టి వెళ్ళిపోయిందొకామె.

"ఈ ఏర్పాట్లేమిటేవ్? భలే తమాషాగా ఉంది. అసలు నువ్వెప్పుడు ఇవి తెమ్మని చెప్పావ్?" అడిగింది విజయలక్ష్మి.

"చెప్పండి చూద్దాం?" అంది సంయుక్త గర్వంగా. మౌళవిక, జయశ్రీ పెదవి విరిచారు తెలీదన్నట్లు. అసలు అక్కడ్నించి ఎంత త్వరగా కదిలితే అంత బావుండునని ఇద్దరూ మనసులో అనుకుంటున్నారు.

అయిష్టంగానే కూల్ డ్రింక్‌లు అందుకున్నారు.

"మరి మీరు మల్లాదిగారూ" అందామె బాటిల్‌ని అతనికిస్తూ.

"హాండ్ బ్యాగ్‌లో కార్డులెస్ కాలింగ్ బెల్ ఉంది. దాన్ని అయిదుసార్లు నొక్కారు. అవునా?" అన్నారు మల్లాది సిప్ చేస్తూ.

ఆమె మొఖం పాలిపోయింది. "ఈ దెబ్బతో అందర్నీ అదరగొట్టేస్తున్నాను" అనుకుందామె నిజానికి. కానీ మల్లాది సరిగ్గా చెప్పేసరికి ముఖంలోని భావాన్ని కనపడనీయకుండా విశ్వప్రయత్నం చేస్తూ మీకెలా తెలుసు? అని అడిగిందామె.

"ఇట్స్ వెరీ సింపుల్. మీరు నాతో మాట్లాడుతూ హేండ్ బ్యాగ్‌లో చెయ్యి పెట్టారు. మోచేతి మీద నరం అయిదుసార్లు కదిలింది. మనిషి చేతివేళ్ళలో బొటనవేలు తప్ప మరే వేలు ఆడించినా మోచేతి దగ్గర నరం కదలడం బాగా కనిపిస్తుంది. ఈసారి ఇలాంటి థ్రిల్ ఎవరికైనా కలిగించదలచుకుంటే బొటనవేలితో ఆ కాలింగ్ బెల్ నొక్కడం ప్రాక్టీస్ చెయ్యండి. అప్పుడు ఆ నరం కదలడం అంత స్పష్టంగా తెలియదు."

మళ్ళీ సంయుక్తని మల్లాది దెబ్బతీసినందుకు అరికాల్లో కితకితలు పెట్టినంత జలదరింపుగా ఉంది మౌళవిక, జయశ్రీకి.

"ఏదీ ఆ కార్డ్‌లెస్ కాలింగ్ బెల్ చూడనీ" అడిగింది విజయలక్ష్మి.

నెమ్మదిగా హేండ్ బ్యాగ్ నుంచి ఓ స్విచ్‌ని తీసి యిచ్చింది సంయుక్త.

"మీ డాడీ ఫారిన్ నుంచి తెచ్చారా?" అడిగింది మౌళవిక. కాస్త వెటకారంగా అడుగుదామనుకుంది కానీ ఆమె గొంతులో ఆ తత్వం సరిగ్గా పలకలేదు.

"ఇప్పుడవి హైదరాబాద్‌లోనే తయారవుతున్నాయండీ" అన్నాడు మల్లాది.

"ఏవిటి ఇక్కడే?" ఆశ్చర్యపోయింది విజయలక్ష్మి.

"యస్. పటాన్ చెరులోని ఓ ఫ్యాక్టరీలో తయారు చేస్తున్నారు. సుమారు మూడు వందలుంటుంది ఒక్కో సెట్టు ఏవండీ అంతేనా?" అన్నాడూ అతను.

అవునన్నట్లు తలాడించింది సంయుక్త.

"ఏవైనా మీకు అబ్జర్వేషన్ ఎక్కువండి" అంది విజయలక్ష్మి.

"మరి..? లేకపోతే రైటర్‌గా పేరు ఉత్తినే వచ్చేసిందనుకున్నావా?" అంది మౌళవిక.

ఇదేదో మళ్ళీ పాకాన పడేట్టుందని "నే వెళ్తానండి. థాంక్యూ ఫర్ ది హాస్పిటాలిటీ" అని లేచాడు మల్లాది.

"మేం కూడా వస్తాం. సంయుక్తా సీ యూ టుమారో" అంటూ లేచారు మౌళవిక, జయశ్రీ

"పదండి. నేను కూడా విజయలక్ష్మిని డ్రాప్ చెయ్యాలి కదా" అంటూ బయటకు నడిచింది సంయుక్త.

"ఏవైనా ఇవాళ మనం సంయుక్తని ఎవాయిడ్ చేసి ఉండాల్సింది" అంది జయశ్రీ కారు కదిలిన ఓ రెండు క్షణాల తర్వాత.

"అది మరీ ఇంత ఇగోయిస్టు అని నేనూ అనుకోలేదే అయినా ఈ సంవత్సరం పూర్తయి, ఎగ్జామ్స్ అయిపోయేవరకు మనకి దాన్ని ఎవాయిడ్ చెయ్యడం కుదరదనుకుంటా. ఒకవేళ చేస్తే అదొకటి మనసులో పెట్టుకుని మరింత కుళ్ళుతుంది" అంది మౌళవిక డ్రైవ్ చేస్తూ.

"ఏమైనా ఇంక ఈ పిక్నిక్కులు అవీ కట్టిపెట్టి సీరియస్‌గా చదివెయ్యడం బెటరనుకుంటా"

ఆమె ఆశ్చర్యంగా చూసింది జయశ్రీ వైపు. ఇంతవరకూ జయశ్రీ ఏ సలహా ఇచ్చినా తనతోపాటు బాధని పంచుకునేట్టుగా ఉండేది. అనునయంతో కూడిన అభ్యర్ధనలా ఉండేది అలాకాక, పెద్ద వాళ్ళలాగా ముందే ఓ నిర్ణయానికి వచ్చేసినట్టున్న దృఢమైన కంఠస్వరం ఆమె నోటినుండి వినడం ఇదే ప్రధమం.

"అదేమిటి జై అలా అంటున్నావ్? ఇప్పుడు మనం చదువుకేం లోపం చేశాం?" అంది హీనస్వరంతో.

"సారీ యే. నిన్ను హర్ట్ చెయ్యాలని అనలేదు. నిన్నట్నించి పుస్తకం ముట్టుకోలేదేమో. బహుశా ఆ గిల్టీ కాన్షన్‌తో అలా అనేసి ఉంటాను" అంది జయశ్రీ ఆప్యాయంగా చెయ్యి వేస్తూ.

**ఆ మాత్రం ఊ**రడింపు చాలు మౌళవికకి కరిగిపోయింది.

"జై ఇవాళ కూడా మనింట్లో పడుకోరాదంటే. డాడీ వస్తారో రారో?"

"ఒద్దే నిన్న బయల్దేరేటప్పుడు ఇంట్లో అలా చెప్పేసి ఉంటే బావుండేది. ఇప్పుడు వెళ్ళి 'ఇవాళ కూడా రావటంలేదు' అని అంటే సబబుగా ఉండదు. రేపు ఉదయానికి మీ డాడీ రాకపోతే ఆయనొచ్చేదాకా ఉంటానని చెప్పేసి వస్తాను సరేనా?"

"రైట్" అంది మౌళవిక.

"మనం ఇప్పుడు తిరగాల్సింది లెఫ్టుకే. బాగానే పట్టింది మల్లాది అలవాటు 'రైట్' అంటూ" అంది జయశ్రీ

ఆమె సన్నగా నవ్వుకుంటూ కారుని ఆపింది.

"ఉంటానే రేపు ఉదయం వస్తాను" అంటూ డోర్ తెరుచుకుని దిగింది జయశ్రీ

మౌళవిక అప్రయత్నంగా తలాడించి, తిరిగి డోర్ వేసి కారు స్టార్టు చేసిందేకానీ అన్నీ అసంకల్పితంగా మెకానికల్‌గా చేస్తోంది. మనసంతా మల్లాదిమీదే ఉంది.

ముందు మల్లాది రచనలు చదువుతున్నప్పుడు అతనికి ఎంతో వయసుందేమో అనుకుంది తను. రాను రాను అతని రచనల్లో, సమకాలీనపు సమాజానికి కావలసిన మేటర్ ఉండటం, పత్రికలలో అతనిచ్చిన ఇంటర్వ్యూలలో హుషారైన సమాధానాలు ఉండటం, ఇవన్నీ అతడు ఖచ్చితంగా కుర్ర వయసులోనే ఉన్నాడనిపించేది.

తనకా ప్రాబ్లం లేదని పెళ్ళి గురించి ముందే చెప్పేశాడు. అందంగానే ఉన్నాడు. మరి తన గురించి అతడేమనుకుంటున్నాడో, పెళ్ళి చేసుకోమంటే నిన్నగాక మొన్న పరిచయం అయ్యారు. అప్పుడే ప్రేమ పుట్టేసిందా? అని అంటే? తను తట్టుకోగలదా?

లేదు.. డెఫినెట్‌గా అలా అనడు. స్పిరుచ్యువల్‌గా ఎప్పుడో దగ్గరయ్యానై మొదట్లోనే అన్నాడు కదా. మనుషుల తత్వాన్ని అంత అర్థం చేసుకోలేనివాడేం కాదాయన. మంచి పరిశీలన ఉంది ఆ కళ్ళలో. తప్పకుండా తన మనసులోని మాటను ఈ పాటికి గ్రహించే ఉండాలి.

మౌళవిక ఒక్కసారి సిగ్గుపడింది. తన ఆలోచనల సరళిమారినందుకు ఇదివరకు మల్లాదిని గురించి ఆలోచించినప్పుడు అతను అని అనుకునేది. ఇప్పుడు తనకు తెలియకుండానే ఆయన అని అనుకుంటోంది. అందుకేనేమో మనస్సాక్షిని మించిన దైవం లేదంటారు.

త్రుళ్ళిపడి బ్రేకు వేసింది మౌళవిక. రోడ్డుమీద ఓ పక్కగా నడుస్తున్న మల్లాదిని చూసి.

"అదేంటిసార్ ఇంకా నడిచి వస్తున్నారు రండి" అంది కారు అతని పక్కనే నడిపిస్తూ డోర్ తెరిచి.

"ఏమయింది మీ బండి" అంది అతను కూర్చున్న తర్వాత.

"ఇప్పుడే ఓ ఫ్రెండ్ అడిగితే ఇవ్వాల్సి వచ్చింది."

"అయితే మీరు స్నేహానికి మంచి విలువనిస్తారన్నమాట"

"మరి మీరు మాత్రం? మీకు మీ ఫ్రెండ్ జయశ్రీ అంటే ప్రాణం కదూ?"

ఔనన్నట్లు తలూపింది మౌళవిక.

"అన్నట్లు మీ జయశ్రీకి చాలా థాంక్సండీ ఎంతో హెల్ప్ చేసిందివాళ."

"మీకా?" అడిగింది ఆశ్చర్యంగా.

"అవునండీ. చాలా రిస్కు తీసుకున్నారావిడ. ఆ లాంప్ రేస్‌ని కెమెరా మీద ఎంతో నేర్పుతో పడేట్టు చేసింది."

మౌళవిక కారు స్లో చేసింది.

"మీరనేది నాకసలేమీ అర్థంకావటంలేదండీ మీరు మాట్లాడుతున్నది ఇందాక సంయుక్త ఇంట్లో విషయమేనా?"

"ఎగ్జాట్లీ నేను ఎంత వద్దంటున్నా మీ సంయుక్త నా ఫోటో తీసేసింది కదా. జయశ్రీగారు ఆ ఇన్ ఫ్రారెడ్ లాంప్‌ని మాటిమాటికీ పక్కకి జరుపుతూ ఆ రేస్ కెమెరా మీదికి వచ్చేట్టు చేశారు. దాంతో ఆ కెమెరాలోని ఫిల్మ్ ఫాగ్ అయిపోతుంది" అన్నాడు మల్లాది.

"మా జై ఇంత ఆలోచించి చేసిందంటారా? నిజంగా తనకు ఆ ఇన్‌ఫ్రారెడ్ రేస్ గురించి తెలుసుననే అంటారా?"

"ఏమో అది మీరే చెప్పాలి. ఇన్‌ఫ్రారెడ్ మాత్రం ఎక్స్‌రే కిరణాలకన్నా శక్తివంతమయినవి. కస్టమ్స్ వాళ్ళు ఏదైనా ఇంపార్ట్ ఫిల్మ్‌ని నాశనం చెయ్యాలంటే కెమెరాని ఓపెన్ చెయ్యకుండా ఈ ఇన్‌ఫ్రారెడ్ రేస్‌ని ఉపయోగిస్తారు. అంతవరకు నాకు తెలుసు.

మౌళవిక ఆలోచనలో పడింది.

"మరి తనకు కాలు బెణకడం?" అందామె గొణుక్కుంటున్నట్లు.

"అదే ఆవిణ్ణి అడగాలి మనం. మొత్తం అంతా నాటకం అయితే మటుకు నేనావిడకు చాలా చాలా ఋణపడి ఉన్నట్లు లెక్క."

"భలేగా ఉందే మా జై నన్ను సస్పెన్సులో పెట్టడం ఇదే ఫస్ట్ టైమ్" అంటూ షెడ్‌లో కారు పార్కు చేసింది మౌళవిక.

కారు దిగి ఇద్దరూ పోర్టికో వైపు నడుస్తుండగా మరో కారు ప్రవేశించింది గేట్లోకి. పార్థసారథి దిగాడు ఆ కారులోంచి.

"మా డాడీ" అందామె మల్లాదివైపు చూసి.

"రండి ఇంట్రడ్యూస్ చేస్తాను" అంటూ నడక స్పీడు చేస్తూ పార్థసారథిని చేరుకుంది.

"హౌ ఆర్ యు విక్కీ ఏమంటున్నారు రైటర్‌గారు?" అంటూ పలకరించాడతను.

ఇద్దర్నీ ఒకరికొకరిని పరిచయం చేసింది మౌళవిక.

"నమస్కారం సార్" అన్నాడు మల్లాడి.

"ఏవండీ మా ఇల్లు కంఫర్ట్‌బుల్‌గా ఉందా? ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించే నవలలు మీరు రాయాలి మా ఇంట్లో" అన్నాడు పార్థసారథి.

"మా డాడీ కూడా మీ నావెల్స్ చదివారండీ ఆయనక్కూడా తమాషాగా, హుషారుగా మాట్లాడే వాళ్ళంటే ఎంతో యిష్టం" అంది మౌళవిక.

"ఇదేనా అయ్యా రావటం?" అంటూ వచ్చి పార్థసారథి చేతిలోని బ్రీఫ్‌కేస్ అందుకున్నాడు యాదగిరి.

"సామాన్లు నువ్వేకదయ్యా దింపుతోంది. మళ్ళీ ఇదేనా రావటం అంటావేంటి - చిల్లీ ఫెలో" అన్నాడు పార్థసారథి నవ్వుతూ.

"మల్లాది ఆశ్చర్యంగా చూశాడు ఆ పదప్రయోగానికి.

"అదంతేనండి వాడు కూరల్లో కారం ఎక్కువేస్తాడని వాడిని 'చిల్లీ ఫెలో' అని ముద్దుగా అంటారు మా డాడీ."

"నేను సిల్లీ ఫెలో అని తిడుతున్నారనుకున్నా"

"వాడడిగిన ప్రశ్నకి సిల్లీఫెలో అనే తిట్టానండీ నిజానికి - ఈ మధ్యే ఏదో సినిమాలో చూశాను ఇదే సీను.. అదేంటంటే" అంటూ తడుముకోసాగాడు పార్ధసారథి.

"శ్రీవారికి ప్రేమలేఖలోనండీ. చేతిలో సంచితో, సామానుతో వస్తున్న వీరభద్రరావుని చూసి నరేష్ "ఇదేనా నాన్నా రావటం?" అంటాడు.

"లేదు నిన్ననే వచ్చి మెట్లకింద దాక్కున్నాను" అంటాడు వీరభద్రరావు కోపంగా అదేనాండీ?" అన్నాడు మల్లాది.

"కరెక్ట్. నేనెంతో లైక్ చేసిన డైలాగ్ అది. మీకు బాగానే గుర్తుంటాయే సినిమాలు, డైలాగులు" అన్నాడు పార్ధసారథి ప్రశంసాపూర్వకంగా.

"ఆయన కూడా ఓ డైలాగ్ రైటరేకదా డాడీ?" అంది మౌళవిక.

"మన వాళ్ళలో పాతుకుపోయిన నమ్మకం ఏమిటంటే డైలాగ్ రైటరంటే సినిమాలకు డైలాగులు రాసేవాడనే. అందువల్ల ఈయన్ని మనం కేవలం నావలిస్టు అని మాత్రమే అనాలి" అన్నాడు పార్ధసారథి కరెక్టు చేస్తూ.

"ఒక విధంగా మౌళవికగారు కూడా కరెక్టేనండి 'డబ్బెవరికి చేదు' అనే నా సీరియల్‌ని సినిమాగా తీస్తున్నారు. మొదటిసారిగా సినిమాకి నేను డైలాగులు రాయబోతున్నాను. బహుశా నెక్స్ట్ వీక్ మద్రాస్ వెళ్ళాల్సి వుంటుంది" అన్నాడు మల్లాది.

"రియల్లీ? దెన్ కంగ్రాట్స్. మరి ఇంతవరకూ మాకు చెప్పలేదేం?" అంది మౌళవిక.

"ఇందాకే నా వెహికల్ ఓ ఫ్రెండ్ కిచ్చానని చెప్పాను కదా అతనికి మెసేజ్ వచ్చింది."

"సో మా ఇంట్లో అడుగుపెట్టిన వేళా విశేషం అన్నమాట. అయామ్ డబల్లీ హ్యాపీ" అన్నాడు పార్ధసారథి యాదగిరి యిచ్చిన కాఫీని అందుకుంటూ.

"నేనూ అలాగే అనుకున్నానండీ.. బట్.. ఆ వార్తకన్నా మీ 'చిల్లీ ఫెలో' డైలాగే నాకెంతో బావుందండి."

పార్ధసారథి తనలో తను నవ్వుకున్నాడు మరోసారి.

"కొన్ని కొన్ని అలవాట్లు మనలో ఎంతో ఇన్ హెరింట్‌గా ఉండిపోతాయో చెప్పడానికి యీ సంగతే ఓ ఉదాహరణ. అలాగే సినిమాకి వెళ్ళినప్పుడు కూడా ఎవరో కలుస్తారు. ఇంట్రవెల్‌లో ఏదో సినిమా మొదలు పెట్టేటప్పుడో, ఒదిలేటప్పుడో అయితే జనం వస్తూపోతూ ఉంటారు కాబట్టి అనుకోవచ్చు. కానీ ఇంట్రవెల్‌లో కనిపిస్తే అడుగుతారండీ 'సినిమాకొచ్చారా' అంటూ. భలే సిల్లీగా ఉంటుంది కదూ" అన్నాడు.

"ఒకసారి నాకూ ఇలాంటి అనుభవమే ఎదురయిందండీ. ఒకాయన రెగ్యులర్‌గా సినిమా హాల్‌లోనే కలిసేవాడు. కలిసినప్పుడల్లా అదే అడిగేవాడు 'సినిమాకొచ్చారా' అంటూ. ఓ రోజు చూసి చూసి లేదండి. ఇక్కడ సమోసాలే తప్ప పకోడీలు అమ్మేవాళ్ళు ఎవరూ లేరని, అవి అమ్ముకుందామని వచ్చాను' అని అన్నాను. అంతే ఆ తర్వాతనుంచి అతను నన్నామాట అడిగితే ఒట్టు" అన్నాడు మల్లాది.

పెద్దపెట్టున నవ్వారు శ్రోతలిద్దరూ "బాగా చెప్పారండి. ఈసారి ఆన్సరిచ్చి చూస్తాను. దెబ్బకి దిమ్మ తిరిగిపోతుంది. లేకపోతే ఇంట్రవెల్‌లో బైటకి రావాలంటేనే ఇరిటేటింగ్‌గా ఉంటోంది" అన్నాడు పార్థసారథి నవ్వాపుకోడానికి ప్రయత్నిస్తూ.

"మీకు ఫోన్ వచ్చిందయ్యా" అంటూ వచ్చాడు యాదగిరి చేతిలో చిన్న చీటీ ఉంది.

"ఎవరది" అంటూ లేవబోయాడు పార్థసారథి.

"మీరు లాన్‌లో ఉన్నారు పిల్చుకొస్తానని చెప్పేసరికి కొంతసేపాగి మిమ్మల్నే చెయ్యమని ఈ నంబర్ ఇచ్చారండి" అంటూ చేతిలోకి చీటిని అందించాడతను.

దాన్ని చూస్తూనే తలపంకించి "ఓకే మిస్టర్ కృష్ణమూర్తీ నేను అటెండ్ అవాల్సిన కొన్ని పనులున్నాయి. సో.. గుడ్ నైట్" అన్నాడు పార్థసారథి లేస్తూ.

"రైట్ సార్. నేనూ రాసుకోవాలి" అంటూ మల్లాది కూడా లేచాడు.

"అరె రైటర్సందరూ తెల్లవారుఝామున రాస్తారని విన్నానే. మీరిప్పుడు రాయడం ఏమిటి?"

"నా టైమింగ్స్ చాలా డిఫరెంటండీ. సాయంత్రం ఏడు, ఎనిమిది దగ్గర్నుంచి, మూడయినా ఉదయం లేచేసరికి ఖచ్చితంగా తొమ్మిది దాటుతుంది. ఇదిగో ఈ ఆడ్ టైమిగ్స్ నుంచే ఎవరికి డిస్టర్బెన్స్ లేకుండా, నేను డిస్టర్బ్ కాకుండా ఇలా వేరే రూమ్ చూసుకోవటం" అన్నాడు మల్లాది.

"చూశావా విక్కీ. ఇప్పుడు ఎవ్వరం డిస్టర్బ్ కాకుండా ఎవరి డ్యూటీలకు వాళ్ళు అటెండ్ అవుదాం. ఓ..కే? కమాన్ లెట్స్ గో" అన్నాడు పార్థసారథి.

మల్లాది ఔట్ హౌస్ వైపు నడకసాగించాడు. మౌళవిక లేచింది అయిష్టంగానే. ఆమెకింకా మరికొంతసేపు కూర్చుని మల్లాది మాటలు వినాలనుంది.

తండ్రి మాట కొట్టెయ్యడం ఇష్టంలేక తన రూమ్‌లోకి వెళ్ళాక పుస్తకం ముందు పెట్టుకుని కూచుందిగానీ ఒక్క అక్షరం ముక్క కూడా ఆమె కంటికెక్కలేదు మనసంతా మల్లాది మీదే

ముందు మల్లాదిని అభిప్రాయం అడిగి పార్థసారథికి చెప్పాలా లేక పార్థసారథిని ఒప్పించాక మల్లాదిని అడగాలా అనే విషయం మీద తర్జన భర్జన పడిపోతోందామె.

మొత్తానికి ఆ రోజు రాత్రి కూడా ఆమె తక్కువగా నిద్రపోయింది.

సరిగ్గా అదే సమయానికి మౌళవిక, మల్లాది గురించి ఇంకో ప్రాణికూడా ఆలోచిస్తోంది.

8

"విక్కీ...విక్కీ"

బరువుగా రోజాయ్‌లా పడిపోతున్న కనురెప్పల్ని బలవంతాన విప్పిచూసింది మౌళవిక.

పార్థసారథి.

స్నానం కూడా చేసేసి నీట్‌గా ఉన్నాడు. అంటే ఠంచన్‌గా ఎనిమిదిన్నర అయిందన్నమాట.

"సారీ డాడీ రెండు రోజుల నుంచి నిద్రసరిగ్గాలేదు" అంటూ మంచం దిగింది.

రాత్రి పొద్దుపోయే వరకూ ఆమె గదిలో లైటు వెలుగుతూ ఉండడం అతడు గమనించినట్లు ఆమెకు తెలియదు.

"ఇట్సాల్ రైట్ విక్కీ గెట్ యువర్ సెల్ఫ్ ఫ్రెష్ ఇమ్మీడియట్లీ. ఇవాళ మనతో బ్రేక్ ఫాస్టుకి రైటర్ గారిని కూడా రమ్మనమని కబురుపెట్టాను" అన్నాడూ.

అంతే. మౌళవిక ఒక్క ఉరుకునపోయి బాత్‌రూం తలుపు వేసుకుంది.

సన్నగా నవ్వుకుంటూ హాల్లోకి వచ్చి పేపరు తెరిచి కూర్చున్నాడు పార్థసారథి.

'బయటికి వెళ్ళినట్టున్నారయ్యా' అంటూ వచ్చి చెప్పాడు యాదగిరి.

"అంటే టిఫెన్‌కి రమ్మని చెప్పనే లేదా?" బాత్ రూమ్‌లో మౌళవికకి హాల్లోని మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ఉదయాన్నే చెప్పానయ్యా టిఫెన్ రెడీ అయిందని చెప్పడానికి ఇప్పుడు మళ్ళీ వెళితే తలుపు తాళం వేసుందయ్యా."

"సరేలే చెప్పావు కదా. డెఫినెట్‌గా వచ్చేస్తాడు" అన్నాడు పార్థసారథి.

ఉదయం తొమ్మిదిదాకా లేవనన్న మనిషి ఇంత పొద్దున్నే ఎక్కడికి వెళ్ళుంటాడు చెప్మా? అనుకుంటూ స్నానం కూడా ముగించేసింది మౌళవిక.

పూర్తిచేసిన పేపర్ని పక్కనే పెట్టేసి నిల్చున్నాడు పార్థసారథి. అటూ ఇటూ పచార్లు చేయసాగాడు. రాత్రిపూట భోజనం మానేసిన దగ్గర్నుంచి ఉదయాన్నే ఎనిమిదిలోగా టిఫెన్ తినడం అలవాటు చేసుకున్నాడతను. ఎప్పుడయినా వేళ తప్పితే చాలా అనీజీగా ఫీలవుతాడు.

"ఏం డాడీ మల్లాదిగారు ఇంకా రాలేదా?" అంటూ హాల్లోకి వచ్చింది మౌళవిక మెడ తుడుచుకుంటూ, అడ్డంగా తలూపాడతను.

"పోనీ మీరు కూర్చోకూడదు. బాగా లేటవుతుందేమో?"

"లేదమ్మా మరో పదినిమిషాలదాకా వెయిట్ చేయగలను" అని పార్థసారధి అంటూనే ఉన్నాడు అంతలో మోటార్ సైకిల్ శబ్దం.

బయటకి తొంగి చూసింది మౌళవిక. గేటు తలుపు తీస్తోంది జయశ్రీ ఆ పక్కనే రాజ్ దూత్ మీద మల్లాది.

"సారీ సార్ లేట్ చేసినట్లున్నాను" అన్నాడతను లోనికి అడుగుపెడుతూనే.

"నో ప్రాబ్లమ్. లెటజ్ స్టార్టు" అన్నాడు పార్థసారధి.

"ఏం లేదండి. డాడీ రాత్రిళ్ళు భోంచెయ్యరు. పైగా ఉదయాన్నే మార్నింగ్ వాక్. దాంతో ఎనిమిది అయ్యేసరికల్లా ఆవురావురమంటూ ఉంటారు" అంది మౌళవిక.

"అటువంటప్పుడు ఔర్ ఔర్ (మరికొంచెం, మరికొంచెం) అంటూ తింటారా?" అన్నాడు మల్లాది నవ్వుతూ.

"అబ్బెబ్బె రాత్రి ఫాస్టు కదా ఆ ఫాస్టుని బ్రేక్ చేద్దామని బ్రేక్‌ఫాస్టు త్వరగా తీసుకుంటాను గాని ఈ వయసులో ఔర్‌లు రంజితా కౌర్‌లు మనకు సూట్ అవుతాయంటారా?" అన్నాడు పార్థసారధి నర్మగర్భంగా.

మల్లాది బిత్తరపోయి చూశాడు ఆయన మాటలకు. మౌళవిక నవ్వు ఆపుకుంటోంది.

తిరిగి గేటు వేసిన జయశ్రీ లోనికి అడుగుపెట్టింది 'శుభోదయం' అంటూ.

"రామ్మా.. రా... ప్లీజ్ జాయిన్ విత్ అజ్" అంటూ ఆహ్వానించాడు పార్థసారధి.

నలుగురూ టేబుల్ చుట్టూ కూర్చున్నారు. యాదగిరి వేడివేడి ఇడ్లీలు తెచ్చి ముందు పెట్టాడు.

"ఏంటంకుల్ రంజితా కౌర్ అంటున్నారు? ఈ చిలిపిమాటలెప్పుడు మొదలుపెట్టారు?" అంది జయశ్రీ

"నిన్న మన రైటర్ గారిని చూసినప్పటినుంచే అయినా ఆఫ్టర్ ఫార్టీ యు కెన్ బి నాటీ అని ఎవరో అన్నారులే -"

"అబ్బ.. ఇది ఏ 'నాటి' మాటండి" అన్నాడు మల్లాది 'నాటి' అనే మాటని ఒత్తి పలుకుతూ.

శ్రోతలందరూ నవ్వారు.

"ఉదయాన్నే ఇంత హాయిగా నవ్వుతూ ఇంత రుచికరమయిన బ్రేక్‌ఫాస్ట్ చేస్తే యింతకన్నా ఆరోగ్యం ఎక్కడ దొరుకుతుంది డాడీ. మార్నిక్గ్ వాక్‌ల కోసం టైం వేస్ట్ చేయకపోతే?" అంది మౌళవిక చట్నీ అందరికీ వడ్డిస్తూ.

"మార్నింగ్ అంటే నాకో ప్రాక్టికల్ జోక్ ఒకటి గుర్తుకొస్తోంది" అని ప్రారంభించాడు పార్థసారధి.

మల్లాది ఆసక్తితో ముందుకు ఒంగాడు. జయశ్రీ, మౌళవిక కూడా పార్థసారధి వేపు తలలు తిప్పారు.

"గులాం గౌస్ అని ఓ మంచి కవి, సితారలో పనిచేసేవాడు. అతని కవితలు సితారలో న్యూస్ కవర్ చేసే పద్ధతి అంతా చూసి నేనే ఓసారి అతనికి ఫోన్ చేసి అభినందనలు చెప్పాను. తనుకూడా అప్పుడప్పుడు నాకు ఫోన్ చేసి

మాట్లాడేవాడు. ఓ రోజు మన ఫ్యాక్టరీకి మధ్యాహ్నం పూట వెళ్ళాను. అక్కడ మేనేజర్ 'ఎవరో గౌసట. మన ఆఫీస్ నంబరు ట్రై చేస్తే దొరకలేదట. అందుకని ఫ్యాక్టరీకి ఫోన్ చేశానని చెప్పమన్నాడు. ఉదయం నుంచీ ఫోన్ చేస్తున్నానని మరీ మరీ చెప్పమన్నాడు' అంటూ అతను ఇచ్చిన ఫోన్ నెంబరు ఇచ్చాడు. నేనే వెంటనే ఆ నంబరుకి ఫోన్ చేసి 'సారీ గౌస్ గారూ మార్నింగ్ నుంచి ఫోన్ చేస్తున్నారట' అని అన్నాను. దానికతడు 'లేదండీ ఇప్పుడే ఓ అరగంట క్రితమే ఫోన్ చేశాను' అన్నాడు. మరి ఉదయం నుంచీ ఫోన్ చేస్తున్నానని నాతో ఎందుకు మరీ మరీ చెప్పమన్నాడో అర్థంకాలేదు. ఓ క్షణం పాటు తర్వాత మాటల సందర్భంలో తెలిసింది, అతను సితారలో రిజైన్ చేసి 'ఉదయం' డెయిలీలో జాయినయ్యాడనీ, అక్కడ్నించే ఫోన్ చేసి నంబరిచ్చాడని, అప్పట్నించీ మార్నింగ్ అన్నా, ఉదయం అని అన్నా ఈ జోకే నాకు గుర్తొస్తుంది."

మెత్తగా నవ్వాడు మల్లాది.

"ఉదయం అంటే నాకింకో ఇన్సిడెంట్ జ్ఞాపకం వస్తోంది" అని అన్నాడు.

చెట్నీ వెయ్యటం ఆపుచేసి తండ్రి చేతిని వినండన్నట్టుగా తట్టింది మౌళవిక.

"ఒక పెద్ద రైటరు ఓసారి ఆడవాళ్ళకి సంబంధించిన ఓ కథల పోటీకి ఆడపేరుతో కథ పంపాడు. ఆ కథ సెలక్టయింది. 'బహుమతి పార్శిల్‌లో పంపుతున్నాం' అని ప్రకటించారు ఆ పత్రికవాళ్ళు. బహుమతి కోసం ఎదురు చూడడం మొదలు పెట్టాడు ఆ రైటరు. కొన్నాళ్ళకి పార్సిల్ వచ్చింది. ఎంతో ఆతృతతో ఆ పార్శిల్‌ని విప్పాడతను అందులో చీర, గాజులు, పసుపు కుంకుమ ఉన్నాయి" ఇదీ సంగతి.

'ఉదయం' అనగానే సమయానికి 'సమయం' గుర్తొచ్చి చెప్పానంతే అన్నాడు మల్లాది.

"చాలా ఫన్నీ ఇన్సిడెంట్ కదూ డాడీ" అని అడిగింది మౌళవిక.

తన తండ్రి మల్లాదిని మెచ్చుకోవాలని ఆమె తపన.

"అంతేకాదమ్మా జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటననీ తనలోని లక్ష్యానికి ఓ స్ఫూర్తిగా మలచుకోగలగటం ఒక వరం. అది ఈయనలో నాకు బాగా కనపడుతుంది" అన్నాడు పార్థసారథి ప్రశంసాపూర్వకంగా.

"అదొక్కటే కాదు మల్లాదిగారు పజిల్స్, క్విజ్‌లు భలేగా చెప్తారు తెలుసా?"

"ఊహూ" అన్నాడు పార్థసారథి 'అలాగా' అన్నట్టు, 'అయితే నేనో చిన్న ట్రిక్కున్న జోకులాంటి క్విజ్ ఇస్తాను చెప్పండి చూద్దాం' అన్నాడు.

"రైట్" అన్నాడు మల్లాది.

మౌళవిక, జయశ్రీ ఆసక్తితో ఇద్దర్నీ చూస్తున్నాడు.

"ఓ మగ దోమ ఓ ఆడదోమ వెంట పడుతుంది. వద్దని ఆ ఆడదోమ ఎంత బతిమాలినా వినిపించుకోకుండా తెగ షంటేస్తోంది. దీని బారి నుంచి ఎలా తప్పించుకోవాలా అని బాగా ఆలోచించి ఝుమ్మని పక్కగదిలోనున్న డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరకెళ్ళి తిరిగి ఓ నిమిషంలో మగదోమ ఉన్న గదిలోకి వచ్చింది ఆ ఆడదోమ. అంతే ఇప్పుడు ఆ ఆడదోమ దగ్గరికొస్తే చాలు పరుగెడుతుంది మగదోమ. చెప్పండి. ఆ ఆడదోమ ఏం చేసింది?"

మౌళవిక అడ్డంగా తలూపింది తెలీదన్నట్టు.

"జయశ్రీగారు కూడా చెప్పలేకపోతే చెప్తాను" అన్నాడు మల్లాది.

"ఏంటి? అప్పుడే బాగా ఆలోచించకుండానే?" అని అడిగాడు పార్ధసారధి ఆశ్చర్యంగా.

"మల్లాదిగారికి ఇలాంటివి కొట్టిన పిండి అంకుల్. మీరు చెప్పండి సార్. నా వల్లకాదు" అంది జయశ్రీ

ఓ క్షణంపాటు హాలంతా నిశ్శబ్దం అయిపోయింది. రెండో వాయి ఇడ్లీలు తెస్తూ ఉన్న యాదగిరి కూడా ఆగిపోయాడు ఒడ్డించకుండా.

"ఆ ఆడదోమ ఒడోమస్ ట్యూబ్ దగ్గర ఓ నిముషం పాటు గడిపి వచ్చింది" అన్నాడు అతను నెమ్మదిగా.

"ఫెంటాస్టిక్" అని అరిచారు జయశ్రీ మౌళవిక ఒకేసారి, "యువార్ వెరీ షార్ప్" అంటూ ఎడమ చేతిని ముందుకు చాచి షేక్ హేండ్ ఇచ్చాడు పార్ధసారధి.

"భలేగా ఉందిలే" అంది మౌళవిక. అవునన్నట్టు తలూపింది జయశ్రీ

"మా డాడీకి ఇంత సెన్సాఫ్ హ్యూమర్ ఉందని నాకివాల్టి వరకూ తెలీదు. అవునూ ఆ ఒడోమస్ ఆ ఆడదోమకి మాత్రం ఎలా పడింది?"

"ఒంటిమీద బురద పడ్డట్టే" అన్నాడు మల్లాది.

"ఆ?" అంది మౌళవిక.

"ఇంచు మించు అంతేనండి - ఒక జోక్ గాని క్విజ్ గాని మెదడుని ఆ మాత్రం గిల్లి ఓ క్షణంపాటు చేయగలిగితే చాలు. రీజనింగ్స్. ఎక్స్‌ప్లనేషన్స్ అన్నీ ఇచ్చుకుంటే అది జోక్ అనిపించుకోదు."

"బట్... నిన్న మీరు చెప్పిన 'శ్రీవారికి ప్రేమలేఖ'లోని జోకు మాత్రం ఎంతో రీజనింగు. ఎక్స్‌ప్లనేషన్ ఉన్న సూపర్స్ జోకు తెలుసాండి? పైగా ఆ సినిమాలో గోడకి తల బాదేసుకుంటూ ఉంటాడొకాయన ఎవరదీ?" అంటూ ఆగాడు పార్ధసారధి.

"వీరభద్రరావు అంది మౌళవిక."

"యస్ సుత్తి వీరభద్రరావు. భలే మంచి యాక్టరండి అతను సాధారణంగా అతని సినిమాలు టైముంటే మాత్రం మిస్సవను నేను. నాకెందుకో అతను భలేగా నచ్చుతాడు. ఈ మధ్యనే ఓ సినిమాలో చొక్కాలు చింపుకునే పోర్షన్ బ్రహ్మాండంగా చేశాడు."

"అదే. రెండు రెళ్ళు ఆరులో" అన్నాడు మల్లాది.

"డాడీ మీకిది తెలుసా ఆ 'రెండు రెళ్ళు ఆరు' సినిమా ఆయన నవల ఆధారంగా తీశారు."

"ఈజిట్.. దెన్ కంగ్రాట్స్ అన్నట్లు ఈ సిన్మా శతదినోత్సవం కూడా చేసుకోబోతోందని పేపర్లో చదివాను. మరి నిర్మాతలు మిమ్మల్ని పిలిచారా?ఆ ఫంక్షన్‌కి?" అడిగాడు పార్ధసారథి.

"పిలిచారండీ. రేపే మద్రాసు పామ్ గ్రోవ్‌లో ఫంక్షన్. ఇవాళే బయలుదేరాలి మద్రాసుకి."

"ఇవాళేనా?" అంది మౌళవిక ఆదుర్దాగా.

"అవునండి తప్పదు"

ఆమె ముఖంలో కాంతి తగ్గడాన్ని ఎవరైనా కనిపెట్టెయ్యొచ్చు.

"ఈ ఫంక్షన్ అయిపోయాక కూడా రెండు మూడురోజులు ఉండాల్సి వస్తుంది మద్రాసులో. ఓ సినిమాకి సంబంధించిన డిస్కషన్స్ ఉన్నాయి. మొత్తం రానూపోనూ కలిపి ఓ వారం పట్టొచ్చు."

బెస్ట్ ఆఫ్ లక్ అంటూ షేక్ హాండ్ ఇచ్చాడు పార్ధసారధి.

వారం రోజులలోగా వచ్చేయడానికి అసలు కుదరదా?

మౌళవిక ముఖంలోని ఆందోళన చూస్తుంటే తమాషాగా వుంది జయశ్రీకి, పార్ధసారధికి.

కుదరదన్నట్టు తల ఊపి "ఓకే సార్. నేనింక బయల్దేరతాను. థాంక్యూ ఫర్ ద డెలీషియస్ బ్రేక్ ఫాస్టు. ఉంటానండీ" అని అందరితోనూ చెప్పి తన రూమ్ వైపు నడుచుకుంటూ వెళ్ళాడు మల్లాది.

ఒక్కసారిగా గాలి తీసేసిన బుడగలా, జీవకళ లేని మనిషిలా అయిపోయింది మౌళవిక. కారులో కూర్చుని పార్ధసారధి, జయశ్రీ చెప్తున్న వాటికి అన్యమనస్కంగానే సమాధానాలిస్తోంది గానీ తనలో తానే తర్కించుకుంటోంది.

"ఏమిటి? ఏమవుతుంది తనకి? నిన్నగాక మొన్న పరిచయం అయిన మనిషి కొన్నిరోజుల పాటు కనిపించడనగానే ఇంత డల్ అయిపోవాలా? అసలు మాటిమాటికి నిన్నగాక మొన్న అని అనుకోవటం ఏమిటి? ఒక మనిషి మీద ఇష్టం ఏర్పడడానికి ఇంతకాలం పట్టి తీరాలి అని రూల్ ఎక్కడయినా ఉందా? తను చేస్తోంది కరెక్టేనా? తన ఆలోచనా ధోరణి సమంజసమేనా? ఒకవేళ డాడీ ఒప్పుకున్నా మల్లాదికి తనంటే ఇష్టమేనా? ఏదో కాస్త చనువుగా సరదాగా మాట్లాడినంత మాత్రాన అది జీవితాల దాకా ముడిపెట్టుకోవటమేనా?" అని అంటాడా? ఏమిటో పిచ్చిగా వుంది మల్లాది మద్రాసు నుంచి

వచ్చేదాకా ఊర్మిళాదేవి నిద్రలా తనని ఏదైనా ఓ గాఢనిద్ర ఆవహించేస్తే బావుండును బహుశా భగ్నప్రేమికులు, విఫల మనస్కులు స్లీపింగ్ పిల్స్ మింగెయ్యడానికి కారణం వారి హృదయం తట్టుకోలేనంత సున్నితంగా తయారవడమే అయివుంటుంది. అంతేమరి నీటిలో తడిసిన కాగితాన్ని ఇలా అంటేనే చిరిగిపోతుందే అలాంటిది ప్రేమలో తడిసిన హృదయం. ఎంతసేపు? ఏమిటిది? తనెందుకింత పిచ్చిగా ఆలోచిస్తుంది? విషాలు, స్లీపింగ్ పిల్సు, తట్టుకోలేకపోడాలు, చచ్చిపోడాలు. అంటే మల్లాది తనతో జీవితాన్ని పంచుకోలేకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమా? తనెటుపోతోంది?"

"దిగవే కాలేజి వచ్చేసింది" అంటూ జయశ్రీ తన చేతిని లాగడంతో ఈ లోకంలోకి వచ్చిపడింది మౌళవిక.

"ఈవినింగ్ వచ్చేసరికి లేటవుతుందమ్మా" అంటూ చెయ్యి ఊపేసి ముందుకు సాగిపోయాడు పార్థసారథి.

మౌళవిక, జయశ్రీ నిశ్శబ్దంగా నడుస్తున్నారు కారిడార్‌లో 'జస్టు వన్ మినిట్‌లో వచ్చేస్తాను వెళుతూ ఉండవే' అంటూ టాయ్‌లెట్‌లో దూరింది జయశ్రీ.

"మధ్యాహ్నం కాలేజీ ఎగ్గొట్టేసి స్టేషన్‌కి వెళ్ళి మల్లాదికి సెండాఫ్ ఇస్తే" అని అనుకుంటూ నెమ్మదిగా జరుగుతున్న మౌళవిక తుళ్ళిపడింది భుజం మీద చెయ్యిపడడంతో.

సంయుక్త.

"జయశ్రీ ఏది?"

"టాయ్‌లెట్" అందామె నెమ్మదిగా.

"మొత్తానికి గట్టిదే నీతో స్నేహం నటిస్తూనే తన పబ్బం గడిపేసుకుంటోంది" అంది సంయుక్త.

"వాటార్యూ టాకింగ్?" అంది ఆమె కళ్ళు పెద్దవి చేసి.

"టాకింగ్ లేదు, గీకింగు లేదు. నీ థిక్కెస్టు ఫ్రెండ్ చూస్తూ ఉండు. ఎలా నిన్ను ముంచేస్తుందో?"

"సంయుక్తా కాస్త అర్థం అయ్యేట్టు మాట్లాడ్డం నేర్చుకో. జయశ్రీ గురించేనా నువ్వు చెప్పేది?" అంది మౌళవిక కోపంగా.

"ఆహా. అక్షరాలా ఆవిడ గురించే. నీకు తెలుసో తెలీదో మీ మల్లాదిని తను డీప్‌గా లవ్ చేస్తోంది."

"ఎవరు చెప్పారు నీకు. వాట్ బేస్ యు హేవ్?" అంది గట్టిగా.

టాయ్‌లెట్ తలుపు తీసుకుని రాబోయిన జయశ్రీ అక్కడే ఆగిపోయింది. ఆమెకీమాటలన్నీ వినబడుతూనే ఉన్నాయి.

"నిన్న తనకి కాలు నొప్పీలేదూ ఏం లేదు. నేను తీసిన ఫోటోని నాశనం చెయ్యడానికి జయశ్రీ మాస్టర్ ప్లాన్ వేసింది. విజయలక్ష్మి చెప్తుంటే నమ్మలేకపోయాను. మీరింత క్లోజ్‌గా ఉంటారు కదా. నువ్వు లైక్ చేస్తున్న మల్లాదిని

తనెందుకు లవ్ చేస్తుందా అని నేనూ అనుకున్నాను. అందుకు రాత్రికి రాత్రే ఫిల్మ్ డెవలపింగ్‌కి ఇచ్చాను. ఉదయాన్నే కాలేజ్‌కి వచ్చేముందు వెళ్ళి అడుగుదును కదా. మొత్తం రీల్ అంతా ఫాగ్ అయిపోయి ఉంది'' అంది సంయుక్త.

''అంత మాత్రం చేత దానికి లవ్ అనే పేరు పెట్టెయ్యాలా?''

''సరే ఒద్దు. ఆ మాత్రం అయిడియా మరీ నీకెందుకు రాలేదు. ఓ..కే నీకు అలాంటి కుళ్ళు కుత్తిరి ఆలోచనలు రావనే అనుకుందాం. పోనీ ఇలా చేశానే అని నీతో చెప్పిందా?''

మౌళవిక తల అడ్డంగా తాటించింది అప్రయత్నంగానే.

''అక్కడే తెలిసిపోవటంలే? నీకు తను పెద్ద హాండివ్వటం మాత్రం డెఫినెట్.''

మౌళవిక మనసు వికలమైపోయింది అనుకోని పరిణామానికి. పిక్నిక్‌లో జయశ్రీ కాలు పట్టుకుని పడిపోవటం, మొత్తం అంతా నాటకం అయితే నేను ఆవిడకు చాలా ఋణపడి ఉన్నట్లు లెక్క అని మల్లాది తనతో కారులో అనడం, ''మల్లాదిగారికిలాంటివన్నీ కొట్టిన పిండి అంకుల్'' అంటూ జయశ్రీ డైనింగ్ టేబులో దగ్గర అనడం ఇవన్నీ ఒక్కొక్కటిగా ఆమె స్మృతిపథంలో చోటుచేసుకుంటూ ఉదయాన్నే మల్లాది మోటార్ సైకిల్ మీద వస్తుంటే జయశ్రీ గేటు తియ్యటం దగ్గర ఆగాయి ఆమె ఆలోచనలు.

తొమ్మిదిదాకా లేవనన్న మల్లాది ఉదయాన్నే జయశ్రీ ఇంటికి వెళ్ళుంటాడా? జయశ్రీ ఇల్లు తనకెలా తెలుసు? మల్లాదిలాంటి ఐ.క్యూ ఉన్న వ్యక్తులకు ఇటువంటివి ఓ సమస్య కానేకాదు. అంటే ఇద్దరూ కలిసే తన ఇంటికి వచ్చారా మోటార్ సైకిల్ మీద కూచుని.

గుండె బద్దలయి కంట్లోకి వచ్చినంతగా ఎర్రగా అయినాయామె కళ్ళు. ''అదొస్తున్నట్టుంది. మిగతావి మీకు సాయంత్రం ఫోన్ చేసి చెపుతాను'' అని స్పీడుగా వెళ్ళిపోయింది సంయుక్త. దూరాన నిలబడి ఉన్న జయశ్రీని చూసి.

మౌళవిక కళ్ళెత్తి జయశ్రీ వంక చూసింది. మరొక్క సెకండులో బాంబు పేలబోతోందన్న విషం తెలిసిన వ్యక్తుల ఇద్దరి మధ్య నిశ్చేష్టతో కూడిన నిశ్శబ్దం.

## 9

మౌళవిక జయశ్రీనే చూస్తోంది.

ఊహించని ఆ పరిస్థితికి జయశ్రీ చూపులు కూడా బిత్తరపోయే ఉన్నాయి.

తన గుండెల్లో చెలరేగుతున్న దావాలనం పెల్లుబికి కనుగుడ్లను పెరేల్మంటూ పగలకొట్టుకుని ఉప్పెనలా, ఉప్పని కన్నీటి రూపంలోనో, రక్తం రూపంలోనో బయట పడుతుందేమోనన్న అనుమానంతో కనురెప్పల్ని గట్టిగా మూసి, కన్నీటిని, ఆవేశాన్ని నిగ్రహించుకుంటూ.

"జై లంచ్ రూమ్‌కి పద" అంది మౌళవిక.

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు. సహనానికి ప్రతిరూపాల్లా.

ఇద్దరి మనసులోనూ ఒకే సంఘర్షణ. అది మల్లాది.

కానీ ఆ రెండు హృదయాలలోని స్పందనకు వేర్వేరు పరమార్థాలున్నాయి. ఒకటి అర్థవంతమైనది. ఇంకొకటి సమర్థవంతమైనది.

ఒకటి స్నేహం, మరొకటి ధ్యేయం?

లంచ్ రూమ్ మరో రెండు అడుగులుండగానే వేగం మరికొంచెం ఎక్కువ చేసి విసురుగా ఆ రూమ్‌లోని టేబుల్ మీదికి ఒరిగిపోయి ఏడ్వడం మొదలుపెట్టింది మౌళవిక. అంతవరకూ ఆనకట్ట వేపు ఉంచిన ఆమె ఆవేదన కట్టలు తెంచుకుని ప్రవహించసాగింది.

తాపీగా గదిలోకి వచ్చిన జయశ్రీకి మొదట గుండె ద్రవించిపోయింది ఎగిరిపడుతున్న ఆమె భుజాలను చూస్తుంటే, ఓ అరనిముషం పాటు అలాగే నిలబడింది కావలసిన ధైర్యాన్ని మానసికంగా సమకూర్చుంటూ. మౌళవికను సముదాయించగలనన్న నమ్మకం కుదరగానే గుండెలనిండా గాలి పీల్చుకుని వదిలింది. లంచ్ రూమ్ తలుపు ఓరగా చేరవేసింది. మెత్తగా నడుచుకుంటూ వచ్చి ఆమె వీపుమీద చేయివేస్తూ పిలిచింది మృదువుగా.

"విక్కీ" అంటూ.

తోక తొక్కిన త్రాచు పడగ ఎత్తినంత వేగంగా తల ఎత్తింది మౌళవిక. "నన్నలా పిలవొద్దు" అంది కళ్ళను మరింత ఎరుపు చేసుకుంటూ.

"నిన్నిలా మీ అమ్మా, నాన్న మాత్రమే పిలుస్తారని నాకు తెలుసు విక్కీ. నేను కూడా నిన్నలా కడుపులో పెట్టుకుని కాపాడే దాన్నే తప్ప కడుపులో కుళ్ళు పెట్టుకుని మోసం చేసేదాన్ని కాదని చెప్పడం కోసమే నిన్నిలా పిలిచాను."

"మోసం కాకపోతే నువ్విప్పుడు నాకు చేసేందేమిటి?" అందామె ఉక్రోషంగా.

"అసలు నేను నీకు ద్రోహం చేస్తానని ఎలా అనుకున్నావు విక్కీ? ఇంతేనా నువ్వు నన్ను నమ్మింది? నువ్వు నా పట్ల చూపించిన అభిమానం, ఆప్యాయత, ఆపేక్షల విలువ యింత తక్కువా?"

"కాదు. నేన్నిన్నెంతో అభిమానించాను. నువ్వే.. నువ్వే" వెక్కిళ్ళ మధ్య మాటలు సరిగ్గా రావటం లేదామెకి.

"లేదు విక్కీ ఎక్కడయినా లోపం ఉందేమో చూసుకో."

"నో. మై ఎఫెక్షన్ ఈజ్ స్పాట్ లెస్" అంది మౌళవిక. గట్టిగా వెక్కిళ్ళను ఉగ్గపట్టుకుని.

"దెన్ వైడు యూ డౌట్ యువర్ ఎఫెక్షన్?" అంది జయశ్రీ సాధ్యమయినంత నెమ్మదిగా. ప్రతి అక్షరాన్ని తూచి తూచి వదిలిందేమో ఎంతో బలంగా వెలువడ్డాయామె మాటలు.

మౌళవిక ఓ క్షణం పాటు నిరుత్తరాలయిపోయింది ఆ ప్రశ్నకి.

"ఎంతో నిర్మలమయిన అభిమానాన్ని రుచి చూపిన వారెవరూ నీకు ద్రోహం తలపెట్టలేరు విక్కీ. నన్ను నమ్ము" అంది జయశ్రీ మౌళవిక చేతిమీద చేయివేస్తూ. భోరుమని ఆమె చేతుల్లోకి వాలిపోయింది మౌళవిక.

"నాకు పిచ్చెక్కిపోతోంది - జై ప్లీజ్ సేవ్ మీ" అంటూ.

"ఛ. నువ్వు మరీ ఇంత పిరికిదానివనుకోలేదు"

"షేమ్ లే. లేచి ముఖం కడుక్కో" అని ఆమెని ఆప్యాయంగా పొదవి పట్టుకుని వాష్ బేసిన్ దగ్గరికి తీసుకెళ్ళి టాప్ ఆన్ చేసింది జయశ్రీ

చేతులతో నీటిని ముఖం మీదకు పోసుకుంటూ ఒక్కసారిగా టాప్ కింద తన తల పెట్టేసిందామె ఆవేశాన్ని అదుపులో పెట్టుకోలేక.

జయశ్రీ అడ్డు చెప్పలేదు. నిజంగా అటువంటి సమయంలో కొంతసేపు ఊరుకోవటమే ఉత్తమం. అలాగే జరిగింది కూడా.

మౌళవిక లేచి రెండు చేతుల్ని వాష్ బేసిన్‌కి వేసి నొక్కుతూ, నీటి ధారలు కారుతున్న ముఖాన్ని వెనక్కి వంచి వెక్కిళ్ళని అదుపులో పెట్టుకుని "నాకు చచ్చిపోవాలనుంది జై" అంది.

"అలాగేలే. ముందిలారా" అంటూ ఆమె ముఖం తుడిచి కూచోపెట్టి మంచినీళ్ళ గ్లాసిచ్చింది జయశ్రీ మొత్తం గ్లాసుని గుక్కలో ఖాళీ చేసిందామె. టేబుల్ మీద ఆ గ్లాసుని పెట్టి రెండు చేతులతోనూ కణతలు నొక్కుకుంటూ 'నేను నిజంగా చచ్చిపోతాను' అంది మెల్లగా.

"చావుగానీ, అతన్నెవరు చేసుకుంటారు పెళ్ళి?" అంది జయశ్రీ

"నువ్వున్నావుగా నువ్వు చేసుకో. నీమీద నా అభిమానాన్ని ఇలాక్కూడా చూపించుకుంటాను" అంది మౌళవిక కసిగా.

"ఏం విక్కీ. మరీ ఇంత ఇండివిడ్యుయాలిటీ లేనిదానిలా కనిపిస్తున్నానా నీకు? మీరిద్దరూ ఒకర్నొకరు ప్రేమిస్తున్నారని తెలిసి కూడా అలాంటి పనులు చేయడానికి నేనేం బరితెగించిన దాన్ననుకున్నావా?"

"జై? అంది మౌళవిక గగుర్పాటుతో కూడిన జలదరింపుతో. ఆయన నన్ను ప్రేమిస్తున్నారా?" అడిగింది ఓ క్షణం తర్వాత నెమ్మదిగా.

"ఆహా. నిక్షేపంగా ఓ రకంగా నీకన్నా అతనిదే గొప్ప ప్రేమ అతడు నిన్ను చాలా డీప్‌గా లవ్ చేస్తున్నాడు" అంది జయశ్రీ

"నీకు ఎవరు చెప్పారు? అలా అని నువ్వే అనుకుంటున్నావా?"

"సరియైన సాక్ష్యం లేనిదే తొందరపడడానికి నేనేం సంయుక్తననుకున్నావా? ఉదయం మీ యింటికొస్తుంటే దారిలో అతనే కనిపించి చెప్పాడు. ఇద్దరం ఆ విషయమే మాట్లాడుకుంటూ వచ్చాం." అంటూ చెబుతున్న జయశ్రీ ఒక్కసారి వెనక్కి తూలిపడింది మీద మౌళవిక పడగానే.

"జై..ప్లీజ్ మరొక్కసారి చెప్పు. ఆయన నిజంగా నన్ను పెళ్ళి చేసుకుంటానన్నారా?"

ఆ సమయంలో మౌళవిక ముఖంలోని సంతోషాన్ని వర్ణించడానికి భాషకు బలం చాలదు. భావానికి ఆవేశం తోడవదు. కేవలం కళ్ళుండే మనసు మాత్రమే చూడగలదా ఆనందాన్ని.

"పిచ్చిదానా. దేన్నీ తట్టుకోలేవే నువ్వు?" అంది జయశ్రీ ఆమె బుగ్గలు చిదుముతూ.

"నిజం పూర్తిగా చెప్పనా?"

"ఊ.. హరియప్"

"నాకు మొన్న ఆయన్ని చూసినప్పుడే అనిపించింది. ఖచ్చితంగా నిన్ను లవ్ చేస్తున్నాడని, నిన్న పిక్నిక్‌తో మీ యిద్దరి మూమెంట్స్ నా అనుమానాన్ని మరింత బలపరిచాయి."

"మరీ అంత బయటపడేట్టు ప్రవర్తించలేదే ఆయన, అలాగయితే ముందు నాకు తెలిసుండేది" అంది మౌళవిక. ఇప్పుడామె పూర్తిగా నార్మల్ కండిషన్‌కి వచ్చేసింది.

"అదే ప్రేమలోని తమాషా ఒకరినొకరు ప్రేమించుకుంటూ ఉంటారు. అవతలివారు కూడా ప్రేమిస్తూనే ఉంటారని ఓ నమ్మకం. అది నిజం కాదేమోనని ఓ మూల సంకోచం. అప్పుడు అవసరమవుతుంది రాయబారం. ఒకసారి ఆ లైన్ క్లియర్ అయిపోయాక ఆ రాయబారం నడిపిన వాళ్ళని కూడా మర్చిపోతారు."

"ఛ..ఛ! నిన్నలా ట్రీట్ చెయ్యనే. తర్వాతేం జరిగిందో చెప్పవే బాబ్బాబూ" అంది మౌళవిక జయశ్రీ గడ్డం పట్టుకుని.

"ఏముందీ? ఉదయం మీ ఇంటికొస్తుంటే ఆయన కనిపించాడు. నిన్న ఆ రీల్ ఫాగ్ చేసినందుకు థ్యాంక్స్ చెప్పాడు. అలా నీ గురించి ఎత్తాడు. నీ అమాయకత్వం, ఆరాధనతో కూడిన కళ్ళు అని ఏమిటేమిటో అన్నాడు. నువ్వు ఒప్పుకోలేదుగాని నీకోసం జీవితాంతం ఎదురు చూస్తానన్నాడు."

"నేను ఒప్పుకోనని ఎందుకు అనుకున్నాడాయన?"

"అదేనే మొన్ననే పరిచయం అయి ఇవాళే ప్రేమిస్తున్నానంటే 'మీ మొగాళ్ళంతా ఇంతే' అని నువ్వెక్కడంటావోనని జంకుతున్నాట్ట."

"ఆయన అలా జంకారంటే అది ఆయన సిన్సియారిటీకి నిదర్శనం. మరి నువ్వు చెప్పొచ్చుగా ఆయనకి, నేను కూడా ఆయన్ని" అంటూ ఆగిపోయింది మౌళవిక సిగ్గు గుర్తొచ్చి.

"వార్నీ అప్పుడే ఎంత పెనవేసుకొస్తున్నావే? అయినా అప్పుడే చెప్పేస్తే మజా ఎక్కడుంటుందే పైగా చులకన అయిపోవూ? ఎలాగూ ఓ వారంలో తిరిగొచ్చేస్తాడుగా అప్పుడు చెపుదాంలే."

"లేదే నాకాయన్నిప్పుడే చూడాలని ఉంది. ట్రైన్‌కి వెళితే ఇంట్లో ఉంటాడంటావా 'పోనీ మధ్యాహ్నం వెళ్ళనా?" అంది మౌళవిక ఆదుర్దాగా.

"అతను ట్రైన్‌లో వెళ్తాడో, ఫ్లయిట్‌లో వెళ్తాడో నీకేమైనా చెప్పాడా" అడిగింది జయశ్రీ మౌళవిక లేదన్నట్టు పెదవి విరిచింది.

"మరెక్కడికి వెళ్తావు?"

ఆమె బిక్కముఖం వేసింది. "అందుకే విక్కీ మనసుకి కాస్త కళ్ళెం వెయ్యి. అంతా శుభ్రంగా ముగుస్తోంది ముందుగా ఈ ఫైనలియర్ పూర్తికాని ఈలోగా అల్లరి పడిపోకే. ఆడపిల్లలకి పరువు ముఖ్యం."

"ఇదుగో. నువ్వు పెద్ద ఆరిందాలా సలహాలిచ్చెయ్యకే. ఆయన ఒప్పుకుంటే ఈ చదువూ గిదువూ ఓ మూలకి విసిరేసి నెల తిరిగేలోగా పెళ్ళి చేసేసుకోనూ?" అంది మౌళవిక కలల్లో తేలిపోతూ.

"అలాగేలే ముందు ఇక్కడ మన సంగతి చూడు. సెకండ్ అవర్ కూడా అయిపోవచ్చింది. బుద్ధిగా కాస్త మనసుని కంట్రోల్ చేసుకుని క్లాసుకిరా. నిన్న కూడా కాలేజీ ఎగ్గొట్టాం నీ పుణ్యమా అని. ఇవాళైనా అటెండ్ కాకపోతే బావుండదు. అన్నట్టు లంచ్ టైమ్‌లో నేను ఇంటికి వెళ్ళాలి. మధ్యాహ్నం రాకపోవచ్చు" అంది జయశ్రీ గబగబా.

"అదేంటి మళ్ళీ?"

"వరసగా ఈ మూడురోజుల నుంచీ నీ కొలువేగా నాకు. అంచేత ఇంట్లో కాస్త పని పేరుకుపోయింది తప్పదు మరి."

"నువ్వు లేకుండా ఎలాగే?" అంది మౌళవిక బిక్కముఖం పెట్టి.

"నెల తిరక్కుండా పెళ్ళి చేసుకుంటానన్నావుగా. కొంచెం నన్నొదిలి ఉండడం కూడా ప్రాక్టీస్ చెయ్యి. లేకపోతే ఆయన నన్ను తిట్టుకుంటాడు అనవసరంగా."

అంతే మౌళవిక ఊహల్లోకి వెళ్ళిపోయింది. క్లాసుకి వెళ్ళడం, లంచ్ అవర్‌లో జయశ్రీ వెళ్ళిపోవటం, తిరిగి తను క్లాసులో కూర్చోవటం ఇవన్నీ అప్రయత్నంగానే చేస్తోందామె.

ఉదయం సంయుక్త రేపిన తుఫానువల్ల మౌళవిక మూడీగా ఉందని లంచ్ రూమ్‌లో ఆమె జయశ్రీతో ఘర్షణ పడిందని, అందుకే లంచ్ బ్రేక్‌లో జయశ్రీ ఇంటికి వెళ్ళిపోయిందని అనుకున్నారు స్నేహబృందంలోని తక్కిన సభ్యులు. కానీ ఒక్కరికీ మౌళవికను పలకరించడానికి ధైర్యం చాల్లేదు. ఆమె గనుక బరస్ట్ అయిందంటే దాన్ని కంట్రోల్ చేసే శక్తి ఒక్క జయశ్రీకే ఉందని అందరికీ తెలుసు.

సంయుక్తకి మాత్రం చాలా సంతోషంగా ఉంది.

"ఒక విధంగా తను పరోక్షంగా మల్లాది మీద కక్ష సాధించగలిగింది. ఇక ప్రత్యక్షంగా మొదలుపెట్టాలి. లేకపోతే పదిమంది ముందు తనని అంత తక్కువ చేస్తాడా?"

ఫైనల్ అవర్ అవగానే మౌళవిక కూర్చునే బెంచివంక చూసిందామె. ఖాళీగా ఉందక్కడ.

"ముందే వెళ్ళిపోయి ఉంటుంది. ఫర్వాలేదు. సయంత్రం ఇంటికి వెళ్ళో లేక ఫోన్ చేసో మాట్లాడొచ్చు" అని అనుకుంటూ కారు పార్కింగ్ చేసివున్న స్థలానికి వచ్చింది.

అక్కడ మౌళవిక.

"నాకు తెలుసు మౌళవికా. నువ్వు నన్ను కలుస్తావని. ఏమంది జయశ్రీ? ఏ పాపమూ ఎరగని నంగనాచి కబుర్లు చెప్పిందా? నా ఇష్టం అంటూ ఎదురు తిరిగిందా?" అడిగింది సంయుక్త.

"నీకు తెలియదు సంయుక్తా? జయశ్రీ నా పాలిటి దేవత. ఆయన నన్ను ప్రేమిస్తున్నారన్న శుభవార్త చెప్పింది. దయచేసి ఆ అమాయకురాలి మీద అభాండాలు వేసి దాని లైఫ్ నాశనం చెయకు ప్లీజ్" అంది మౌళవిక చేతులు జోడిస్తూ.

"నువ్వెంత పిచ్చిదానివి మౌళవికా ఎవరేం చెపితే అది నమ్మేయ్యడమే?"

"అలాగా చూస్తూ ఉండు నెలరోజుల్లోగా ఆయన్ని పెళ్ళి చేసుకోకపోతే?"

సంయుక్త కలవరపడింది. మార్నింగ్ ఇచ్చిన డోస్‌కు మౌళవిక ఈ జన్మలో జయశ్రీని దగ్గరికి రానివ్వదని అనుకుంది. వెంటనే తమాయించుకుంది.

"నెలరోజులెందుకూ? నువ్వొప్పుకుంటే రేపే ఆయన నిన్ను పెళ్ళి చేసుకుంటాడు. కాకపోతే అతడు నిజంగా మల్లాది అవునా కాదా అన్నదే నా అనుమానం" అంది వీలయినంత పుల్లవిరుపుగా.

వేగంగా కొట్టుకుంటున్న గుండెని ఆకస్మాత్తుగా ఎవరో పిడికిట్లో పట్టేసి గట్టిగా నొక్కేసినంత ఉక్కిరి బిక్కిరిగా సర్వావయాలు చచ్చుబడిపోయినంతగా నిర్విణ్ణురాలయిపోయింది మౌళవిక ఒక్కసారిగా.

"నాకు తెలుసు. నీకిది షాకేనని. అయినా చేతులు కలేక ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదని ఇప్పుడే చెపుతున్నాను. అతను నిజంగా మల్లాది కాడని ఇది కూడా ఆ జయశ్రీ మాస్టర్ ప్లాన్ లో ఒక భాగమేనని నా అనుమానం.

"సంయుక్తా.. నేన్నీకేం అపకారం చేశానని నన్నిలా చిత్రవధ చేస్తున్నావు?" అంది మౌళవిక ఇంక భరించలేక.

"ఛ. నేను నీకు అపకారం చెయ్యడమేమిటి? డోన్ట్ బీ సిల్లీ ఓ.కే. జయశ్రీ నిజంగా చాలా మంచిది. ఆమెకు మల్లాది అని చెప్పుకునే ఈ కుర్రాడికి అసలు సంబంధంలేదు. పోనీ ఇతను మల్లాది అని నువ్వు ఖచ్చితంగా చెప్పగలవా? ".

"వై.. నాట్. అతను మనకి ఎన్నో విషయాలు చెప్పాడు. అవన్నీ నిజం" అంది మౌళవిక ఆవేశంగా. నిజమే. అవన్నీ నిజమే కానీ అవన్నీ ఎంతోకాలంగా ఎన్నో పత్రికలలో ఒరిజనల్ మల్లాది యిస్తున్న ఇంటర్వ్యూల సమ్ అప్ అనే చెప్పొచ్చు. నేను కూడా రెగ్యులర్‌గా ఫాలో అయి అవన్నీ ఓ దగ్గిర పెట్టుకుని కంఠతా పట్టేసి వచ్చేస్తే నన్ను కూడా మల్లాదనే అంటావా?" అడిగింది సంయుక్త. ఆమెకు తెలుసు తను నాటుతున్న విషబీజాలు ఎంత శక్తివంతమైనవో.

"ఆయన నన్ను మొదట కలిసినప్పుడు నేను ఆదివిష్ణుగారికి రాసిచ్చిన నా అడ్రసు చీటీ"

"ఓస్.. ఇదో పెద్ద ఎవిడెన్స్? ఆదివిష్ణు చేతిలోంచి ఆ స్లిప్ ఎంతమంది చేతులైనా మారొచ్చు కదా? అసలీ డూప్లికేట్ ఎన్నాళ్ళ నుంచి నీమీద కన్నేసి ఉన్నాడో ఆ అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకోవచ్చుకదా?"

మౌళవిక అప్రతిభురాలయిపోయింది. ఆమె శరీరం సన్నగా ఒణుకుతుంది. "నువ్వు ఎప్పుడైనా మల్లాదిని చూశావా? కనీసం ఆయన ఫోటో గాని?"

లేదన్నట్టు తలాడించిందామె.

"ఎప్పుడైనా ఏ రేడియో ఇంటర్వ్యూలోనయినా అతని గొంతు విన్నావా?"

**మళ్ళీ అడ్డంగా** తలాడించిందామె అసంకల్పితంగానే.

"అందుకే నీలాంటి వాళ్ళని చూస్తే 'కావమ్మ మొగుడంటే అవును కామోసు అనుకున్నాం' అనే సామెత పుట్టింది. ఇప్పటికయినా బీ కేర్ ఫుల్. నీ వాళ్ళు ఎవరో తెలుసుకో. మీ ఇంట్లో నీ గురించి చేరిన ఆ డూప్లికేట్‌ని తన్ని తరిమేసెయ్. ఒకవేళ అతనే నిజమైన మల్లాది అయితే నేను స్వయంగా వచ్చి ఆయన కాళ్ళు పట్టుకుని క్షమాపణ చెప్పుకుని మీ పెళ్ళిలో భోజనాలకి అంట్లు తోముతాను. టేకిట్ ఫ్రమ్ మి దిసిజ్ మై ఛాలెంజ్" అంది సంయుక్త అక్కసుతో కూడిన ఆవేశంతో.

మౌళవికకి ఏం పాలుపోలేదు. హృదయాంతరాళంలో చెలరేగుతున్న ఘర్షణకి ఆమె చిన్న గుండె తట్టుకోలేకపోతోంది.

"జీవితంలో ఇన్ని రకాల మనస్తత్వాలు కలవారుంటారా? మనం ఎవరికీ ఏ అపకారమూ తలపెట్టకపోయినా మన జీవితాల్లోకి ప్రవేశించి ఎందుకు కొందరు ఆడుకుంటారు? ఎవరు కరెక్టు? సంయుక్తా... మల్లాదా?"

పరిపరివిధాల తలపోస్తోందామె ఉన్నట్టుండి వాచీ చూసుకుందామె. అయిదుంపావు. ఈ పాటికి మల్లాది ఎక్కిన ట్రైన్ సికింద్రాబాద్ దాటేసి ఉంటుంది. ఫ్లయిట్ అయితే మరో అరగంటలో మద్రాసులో లాండ్ అవడానికి రెడిగా ఉంటుంది. ఈ సమయంలో తనను ఆదుకునేది, తన ఆలోచనలని పంచుకునే ఒకే ఒక ప్రాణి జయశ్రీ

"మౌళవికా... ఆగు డ్రాప్ చేస్తాను" అని కేకేసింది సంయుక్త. కానీ ఆమె ఆగలేదు. సంయుక్తకు కావలసింది కూడా అదే. అందుకే మౌళవిక కనుమరుగయ్యేవరకు కారు స్టార్ట్ చేయలేదామె.

మౌళవిక పరుగెడుతుంది. రోడ్ మీద వెళుతున్నవారు తనను పిచ్చి చూపులు చూస్తున్నారన్న విషయాన్ని కూడా గమనించే స్థితిలో లేదామె.

కల్లోలం చెలరేగుతున్న తన గుండె ఇలా పరుగెడుతూండగానే ఆగిపోతే ఎంత బావుణ్ణు అని అనుకుంటోంది ఆమె. ఓ వైపు నిర్వేదం, ఓ వైపు కసి, పళ్ళు బిగించుకుని మరీ పరుగెడుతోందామె.

అదిగో..జయశ్రీ ఇల్లు.

"జై.. జై.. త్వరగా తలుపు తెరు జై" తలుపులు బాదుతోందామె ఎవరో తరుముకొస్తున్నట్లు.

తలుపులు తెరుచుకున్నాయి. జయశ్రీ రూపం మసకమసకగా కనబడుతోంది. ఆమె గుండెల్లో తలదాచుకోవాలనుకున్న మౌళవిక ఆమె చేతుల్లో వాలిపోయింది స్పృహ తప్పి.

## 10

చల్లటి స్పర్శ.

ముఖం మీద పురిసెడు నీళ్ళు పోసి ఆప్యాయంగా నిమురుతున్న అమృత స్పర్శ. మగతలోనే మౌళవిక గుర్తించిందా చేతిని.

"జై" అంది కళ్ళు విప్పకుండానే.

ఎంతో ఆర్ద్రంగా ఉందా పిలుపు.

మొదటి రోజు బడిలో వదిలేసి వెళ్ళిపోయిన తల్లిని బెల్ కొట్టిన తర్వాత చూసిన వెంటనే మూడేళ్ళ పసిపిల్ల గొంతులోంచి, గుండెల్లోంచి పెల్లుబికే రోదన స్వర స్పందన నిబిడీకృతమై వుంది ఆ పిలుపులో.

"ఆ.. ఇక్కడే వున్నాను విక్కీ. కొంచెం హార్లిక్స్ తాగుతావా?" అంది జయశ్రీ

"ఒద్దు జై. నువ్వెక్కడికీ వెళ్ళొద్దు" అంటూ ఆమె చేతిని గభాలున పట్టుకుంది మౌళవిక. కొద్ది కొద్దిగా స్పృహ వస్తోందామెకి. "లేదు విక్కీ. నీకేం భయంలేదు. లే.. లేచి కూచో" అంటూ మౌళవికను లేపి తన భుజం ఆమె వీపు వెనుకగా దన్నుపెట్టి మెల్లిగా హార్లిక్స్ తాగించింది జయశ్రీ

ఓ పది నిముషాలు గడిచాయి.

మౌళవికకు జరిగినవి ఒక్కొక్కటే గుర్తుకు వస్తున్నాయి.

"జై..జై" అందామె మళ్ళీ ఏడుపు గొంతుతో.

"ఎక్సయిటవకు విక్కీ నేనున్నానుగా. అంతా హాయిగా మరిచిపో. మరో అయిదు నిమిషాల్లో ఆటో వస్తుంది. మన ఇంటికి వెళదాం. అన్నీ సర్దుకుంటాయి. ఓ...కే?" అంది జయశ్రీ ఒక చిన్నపిల్లను బుజ్జగిస్తున్నట్టు.

"అది కాదు జై.. ఆయన.. ఆయన కారుట" మరొక రెండు సెకండ్లలో వెక్కిళ్ళు మొదలవటం తరువాయి అన్నట్టుగా ఉందామె గొంతు.

"ఎవరన్నారు? సంయుక్తేనా?"

రాబోతున్న వెక్కిళ్ళు ఆగిపోయాయామెకి.

"నీకెలా తెలుసు?" అడిగింది ఆశ్చర్యంగా.

"మన సంయుక్త బుద్ధి తెలియని దెవరికి? ఈ మాత్రం దానికేనా ఇలా పడిపోయావు?"

తల దించుకుంది మౌళవిక.

"సరే ఆయన మల్లాది కాకపోతే ఇంకెవరు? అదయినా చెప్పిందా ఆ సుందరి"

"...."

"అదొక కుళ్ళు గుమ్మడికాయ అని తెలిసి కూడా దాని మాటలెలా నమ్మావు?"

"ఒకవేళ కాకపోతే?" అంది మౌళవిక భయం భయంగా.

"నేను జయశ్రీ కాకపోతే నువ్వు మౌళవిక కాకపోతే - ఊ చెప్పు ఏమవుతుంది?"

"జోక్‌గా తీసుకోకు జై - ఇది నా లైఫ్ అండ్ డెత్ క్వశ్చెన్ తెలుసా?"

జయశ్రీ కళ్ళు పెద్దవి చేసి చూసిందామెను ఆశ్చర్యంగా. ఓ నిముషం పాటు మాట్లాడలేకపోయింది మౌళవిక అలా అనగానే.

"ఒకే విక్కీ ఆయన మల్లాది అని నేను ప్రూవ్ చేస్తాను. ఏవిటి పందెం?" అంది ధృఢస్వరంతో కొంతసేపు పోయాక.

"నువ్వా" అరిచినంత గట్టిగా అడిగింది మౌళవిక.

"ఏం నేనేం చెయ్యలేనా?"

"నీకు మల్లాది గురించి ఏం తెలుసని?"

"సంయుక్త కన్నా అట్టే మాట్లాడితే నీకన్నా కూడా బాగా తెలుసు. నీ కళ్ళు అభిమానంతోనూ, దాని కళ్ళు దురభిమానంతోనూ నిజం తెలుసుకోలేని స్థితిలో ఉన్నాయి. ఎటువంటి ఒడిదుడుకులు వచ్చినా నిదానంగా ఆలోచించగల శక్తి భగవంతుడి దయవలన కొద్దో గొప్పో వుంది. అది చాలు నాకు" అంది జయశ్రీ.

అంతలో గుమ్మం ముందు ఆటో ఆగిన శబ్దం. మరు నిమిషంలోనే ఓ కుర్రాడు లోపలికి వచ్చాడు. "ఆటో వచ్చింది మేడమ్" అంటూ.

"చాలా థాంక్స్ బాబూ సమయానికి ఆదుకున్నావు" అంది జయశ్రీ.

"ఫరవాలేదండీ" అంటూ సిగ్గుతో ముడుచుకుపోయి తుర్రుమన్నాడు ఆ కుర్రాడు.

"ఉండు విక్కీ ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికి వెళ్ళి బ్రీఫ్‌కేసుతో వచ్చిందామె.

"అదేంటి?" అడిగింది మౌళవిక ఆశ్చర్యంగా.

"చెప్తాలే పద" అంటూ ముందుకు నడిచిందామె. ఇద్దరూ ఆటో యెక్కారు.

"నిన్న రాత్రసలు నిద్రపట్టలేదు విక్కీ మొన్నంతా మనం తమాషాగా కబుర్లు చెప్పుకుంటూ పడుకున్నాం కదా అలా ఇవాళకూడా నీతో హాయిగా గడిపెయ్యాలనుంది" అంది జయశ్రీ ఆటో బయల్దేరగానే.

"అలా అయితే బ్రీఫ్ కేసెందుకు?"

"రేపు కూడా ఉండిపోదాం అనిపిస్తే నీతో ఉండిపోదాం అని, ఏం ఉండనివ్వవా?"

మౌళవిక పరీక్షగా చూసింది జయశ్రీ వైపు. ఏ భావనా కనిపించలేదా ముఖంలో."

"నేను ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతాననుకుంటున్నావు కదూ?

"ఛ..ఛ అవేం మాటలు? నువ్వేం పిచ్చిదానివా? పిరికిదానివా?" నిజంగానే ఇవాళంతా నీతోనే ఉండిపోవాలనుకుంది నాకు."

జయశ్రీ మెడ చుట్టూ చేయివేసి భుజం మీద తల వాల్చేసి "నన్ను క్షమించు జై నేనేదో నిజంగా ఓ సీను క్రియేట్ చేసేసి ఉంటాను. అంతేకదూ?" అంది మౌళవిక ఆమె కంఠంలో కొద్దిగా జీర.

"లేదు అదేదీ కాదు అన్నానుగా. నన్ను కూడా నమ్మవా నువ్వు?" అంది జయశ్రీ.

మౌళవిక కొంత స్థిమితపడింది. మరో కొంతసేపట్లో ఇల్లు దగ్గర పడుతుందనగా.

"జై.. నేనిలా పడిపోయినట్లు డాడీకి, యాదగిరికి ఎవ్వరికీ చెప్పకు" అందామె.

"చెప్తానని ఎందుకనుకుంటున్నావ్?"

"అది కాదు జై. మా డాడీ అలా తమాషాగా మాట్లాడుతూ కనిపిస్తారు గానీ ఎప్పుడూ నా గురించే ఆలోచిస్తూ ఉంటారు. అవికాక బిజినెస్ వ్యవహారాలు, దాంతో అప్పుడప్పుడూ తలనొప్పి వస్తూ వుంటుంది. నీకు తెలుసుగా, ఆయన గ్యాస్ట్రిక్ అల్సర్లు."

ఓ రోజు ఆయన గదిలోంచి మాటలు వినిపించాయి నాకు. యాదగిరి అంటున్నాడు. "ఎందుకయ్యా ఆ ఆస్ప్రో టాబ్లెట్లు వేసుకుంటారు? అవి వేసుకుంటే అల్సర్లకు మంచిది కాదని డాక్టర్ చెప్పాడుగా" అని.

దానికి డాడీ ఏమన్నారో తెలుసా జై. తల్చుకుంటే ఇప్పటికీ గుండె చెరువు అయిపోతుంది. "అమృతాంజనం రాసుకుంటే నాకు తలనొప్పని విక్కీకి తెలిసిపోతుందయ్యా" అన్నారు. నేను ఆ మాత్రం ఫీలవడం కూడా భరించలేరు జై.

ఆయన అంటూ మళ్ళీ ఏడుపు మొదలుపెట్టింది.

"ఏయ్ ఊరుకో నా సంగతేమోగానీ ఇప్పుడు నువ్వే బయట పెట్టేట్టున్నావు. ఇదిగో ఇల్లు దగ్గరకొచ్చేసింది. ముఖం తుడుచుకో" అంది జయశ్రీ ఆమె వీపు నిమురుతూ.

ఆటో ఆగింది.

పోర్టికోలో పుస్తకం చదువుతూ కూర్చున్న యాదగిరి వచ్చి గేటు తీశాడు. ఉదయం నుంచి ఏదో ఓ రూపంలో ఎంతో ఒత్తిడికి గురయి, వడలిపోయి వున్న మౌళవికని చూస్తూనే అడిగాడతను "అదేమిటమ్మా అలా ఉన్నారు?" అంటూ.

"ఏం లేదుగానీ, డాడీ వచ్చారా?" అందామె. తనను పట్టుకుని నడుస్తున్న జయశ్రీ చేతిని విడిపించుకుంటూ అతడికి అనుమానం రాకుండా జాగ్రత్తపడుతూ.

"వచ్చేరమ్మా అర్జంటుగా కలకత్తా వెళ్ళాలంటూ సామానులు సర్దుకుని వెళ్ళారు. మీకీ చీటీ ఇమ్మన్నారు" అన్నాడు పుస్తకంలో మడతపెట్టి ఉన్న కాగితాన్ని అందిస్తూ. ఈసారి తిరిగి వచ్చేసరికి నాలుగయిదు రోజులయినా కావచ్చునని, ఏదయినా అవసరం వుంటే ఫోన్ చెయ్యమని పార్థసారథి రాశాడా ఉత్తరంలో.

"ఇదీ ఒకందుకు మంచిదే డాడీకి ఈ బాధలన్నీ అనవసరం" అంది మౌళవిక తన గదిలోకి వెళ్ళాక.

"నువ్వు బాధ పడకూడదని ఆయన అనుకుంటారు. ఆయన బాధ పడకూడదని నువ్వు అనుకుంటావు ఏమయినా ఇద్దరూ ఆదర్శ తండ్రీ కూతుళ్ళే" అంది జయశ్రీ బ్రీఫ్ కేస్ మంచం కింద పెడుతూ.

"ఇది చూశారామ్మా" అంటూ లోపలికి అడుగుపెట్టాడు యాదగిరి.

"మన కృష్ణమూర్తిగారి సీరియల్లే కావలని పాఠకులందరూ అడిగారట. అలాగే రాస్తానంటూ ఈయన ఉత్తరం రాసారు. అదిక్కడ వేశారు చూడండి"

తటాలున మౌళవిక లేచి అతడి చేతిలోని 'పల్లకి' వారపత్రిక అందుకుంది. నిజమే ఉత్తరాల పేజీలో మల్లాది స్వంత దస్తూరితో వుందా ప్రకటన.

"యాదగిరీ భోజనం రెడీయేనా? నాకు బాగా ఆకలేస్తోంది అంది జయశ్రీ

"ఓ.. ఒక్క పదినిమిషాలు" అంటూ కిచెన్ వైపు పరిగెత్తాడతను.

"ఇది మల్లాదిగారి రైటింగేనా?" అని అడిగిందామె మౌళవికని.

"అవును.. జై. 'ఈ గంట గడిస్తే చాలు' నవల్లో కూడా ఇలాగే మల్లాదిగారి హ్యాండ్ రైటింగ్ వేశారు" అంది మౌళవిక ఆ పేజీనుంచి చూపు తిప్పకుండానే.

"విక్కీ ఇమ్మీడియట్‌గా పద" అంటూ ముందుకు నడిచింది జయశ్రీ

"ఎక్కడికే" అంటూ అనుసరించిందామె. ఒక్క నిముషంలో ఇద్దరూ ఔట్ హౌస్ చేరుకున్నారు. కిటికీ పైన పెల్మెట్ మీద వున్న తాళం చెవితో లాక్ తీసి లోపలికి వెళ్ళింది జయశ్రీ

"ఇది ఇక్కడుందని నీకెలా తెలుసు?"

"ఉదయం ఆయనిక్కడ పెడుతుంటే చూశాలే" అంటూ లైటు వేసిందామె.

లోపల టేబుల్ మీద ఒమేగా సిస్టమ్ క్యాబినెట్ వుంది. షార్ట్ స్టోరీస్, జోక్స్, ఫ్లాషెస్, సీరియల్స్ అంటూ వివిధ రకాలుగా వున్న ఆ క్యాబినెట్‌లో వున్న అరలపై రాసివుంది ప్రతి అరనీ లాగిందామె. లోపల వున్న కాగితాలని ఒక్కొక్కటే తీసి ప్రక్కన పెట్టిందామె.

"చూడు హ్యాండ్ రైటింగ్ ఒక్కలాగే వుందా లేదా?" అని అడిగింది. మౌళవిక సంభ్రమాశ్చర్యాలతో చూస్తోంది. జయశ్రీకి వచ్చిన ఆలోచనకి.

"ఆయన మల్లాదేనే" అని అరిచినంత పని చేసిందామె.

"ఇప్పటికైనా నమ్మకం కుదిరిందా?"

మౌళవిక ఆనందంగా తలాడించింది.

"పద కడుపునిండా భోం చేద్దాం" అంటూ జయశ్రీని లాగింది ఉత్సాహంగా.

"అరె నీకింకా ఆకలి గుర్తుందా? కడుపు నిండిపోయి ఉండాలే?"

"అది సరేగాని ఆయనతో ఫోన్‌లో మాట్లాడితే ఎలా వుంటుందంటున్నావ్?"

మౌళవిక కంట్రోల్ చేసుకోలేక పోతుందని గ్రహించింది జయశ్రీ

"భేషుగ్గా వుంటుంది. పామ్ గ్రోవ్‌కి యస్.టి.డి చెయ్యి" అంది.

పరుగు పరుగున హాల్లోకి వచ్చి డయల్ చేసింది మౌళవిక. రెండు మూడు నిమిషాల తర్వాత లైన్ దొరికింది.

"హలో... ఈజిట్ పామ్ గ్రోవ్.. కెన్ యు కనెక్టు మి టు మిస్టర్ మల్లాది వెంకట కృష్ణమూర్తి ఫ్రమ్ హైదరాబాద్. దిసీజ్ యస్.టి.డి. ప్లీజ్."

"యా.. రూమ్ నంబర్ ఆ0ఆ కాల్ ఫ్రమ్ హైదరాబాద్ స్పీకాన్"

ఒక్క సెకెండ్ నిశ్శబ్దం.

"హల్లో"

అంటూ లైన్‌లోకి వచ్చింది మల్లాది గొంతు.

"అది మల్లాది కంఠమే" అంది మౌళవిక జయశ్రీ వంక తిరిగి మౌత్ పీస్‌కి చెయ్య్ ఇఅడ్డంగా పెట్టి.

"సీరియల్ అనౌన్స్‌మెంట్‌కి కంగ్రాట్సు చెప్పు."

"హల్లో.. మౌళవికగారేనా? చెప్పండి" అంటున్నాడు మల్లాది అవతలినుంచి.

"ఆ మీరెలా పోల్చారు" అంది మౌళవిక. ఆమెకు తెలియకుండానే ఆమె గళం ఎంతో మార్ధవంగా తయారయింది. ఏ చీకూ చింతలేని మనిషి కులాసాగా మాట్లాడితే ఎలా వుంటుందో అలా వుందమె ఇప్పుడు. జయశ్రీ కూడా ఆశ్చర్యపోయింది ఆ ముఖంలో కనిపిస్తున్న ప్రసన్నతకి.

"మీరు మౌత్ పీస్‌కి చెయ్యి ఎంత అడ్డుగా పెట్టినా నాకు అన్నీ వినిపిస్తూనే వున్నాయి. మీకు వేళ్ళ మధ్య గ్యాప్ ఎక్కువ కదా!" ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది ఆమెకు. వెంటనే మౌత్ పీస్ మీద ఉంచిన చెయ్యి ఎత్తి లైటుకి ఎదురుగా పెట్టింది. నిజమే. తనకు వేళ్ళ మధ్య దూరం ఎక్కువే. ఇది ఈయనెప్పుడు గమనించాడు?

"ఏంటండీ మాట్లాడ్డంలేదూ? హలో..హలో"

"అబ్బే ఏం లేదండీ మీ సీరియల్ అనౌన్స్ మెంట్ చూశాను. కంగ్రాట్స్ చెబుదామని" అందామె అతి నెమ్మదిగా.

మల్లాది తననెంతో పరీక్షగా చూస్తాడని తెలిసిన దగ్గర్నుంచి ఆమెలో సిగ్గు, సంతోషం కలిసి ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి.

"ఓహ్.. అదా" అంటూ నవ్వేశాడు మల్లాది.

"ఇంకేమిటి చెప్పండి?" అన్నాడు ఓ క్షణం తర్వాత.

"ఎప్పుడొస్తారు?" అందామె ఆతృతగా.

"భలేవారండీ మీరు? హైదరాబాద్ వదిలి మూడుగంటలయినా కాలేదింకా."

వాచీ చూసుకుంది మౌళవిక ఎనిమిదవుతుంది. మల్లాది తనను వదిలి ఎన్నో యుగాలయినట్టుగా వుంది. ఆయన్ని చూసి పన్నెండు గంటలయినా కాలేదు. ఈలోగా ఎంత మానసిక చిత్రవధను అనుభవించింది తను? నిజమే, ఆయన్ని వదిలి వుండడం చాలా కష్టం.

"**ఐవాంట్ యు సర్**" అందామె అప్రయత్నంగానే. వింటున్న జయశ్రీ మల్లాది ఇద్దరూ తృళ్ళిపడ్డారా మాటకి.

"ఆ...ఆ ఏమన్నారు?" అన్నాడతను సరిగ్గా నిర్ధారించుకోలేక.

"ఐ వాంట్ యు టు బి బ్యాక్ యాజ్ ఎర్లీ యాజ్ పాసిబుల్" అందామె తమాయించుకుని.

"ఐ వి ట్రై మై లెవెల్ బెస్టు ఇక ఉండనా" అని. ఆమె 'ఊ' అనగానే ఫోన్ పెట్టేశాడతను.

"అదేంటే అంత డైరెక్టుగా చెప్పేశావు. ఐ వాంట్ యూ అని" అంది జయశ్రీ

"అదేనే ఎంత ప్రయత్నించినా కంట్రోల్ చేసుకోలేకపోయాను అయినా ఈ ముసుగులో గుద్దులాటలు అనవసరంలే - డాడీ రాగానే చెప్పేసి పెళ్ళాడేస్తానంతే" అంది మౌళవిక నిశ్చయంగా.

"మరి ఆయన మల్లాది కాదన్న అనుమానం పోయినట్టేనా?" అంది జయశ్రీ కవ్వింపుగా.

"ఇంక ఆ విషయాలు మాట్లాడొద్దే భోంచేద్దాం" అంటూ డైనింగ్ టేబుల్ దగ్గరికి నడిచిందామె.

"మౌళవికా అన్నీ అయిపోయాయా, ఇంకా ఉన్నాయా?" అంటోంది సంయుక్త.

"అరె. సంయుక్త ఎప్పుడొచ్చిందిక్కడికి? చుట్టూ కలయచూసింది మౌళవిక. పెళ్ళిపందిరి. ఇది కలా నిజమా సంయుక్త పక్కన బాగా తోమేసిన అంట్లు ఉన్నాయి. చెమటలు ధారాపాతంగా కారుతున్నాయామెకి. ఉండుండి రొప్పుతుంది కూడా."

"అయ్యో పాపం" అనిపించింది మౌళవికకి.

"ఇక చాల్లే సంయుక్తా అనవసరంగా లేనిపోని పంతాలకు పోతావు" అంటూ సంయుక్తను హాల్లోకి తీసుకువచ్చి నుదుటికి పట్టిన చెమటను తుడిచిందామె.

"నువ్వు చాలా మంచిదానివేకాదు, అమాయకురాలివి కూడా మౌళవికా" అంటూ ప్రారంభించింది సంయుక్త. మల్లాది సీరియల్ వస్తున్న ఏ పత్రికాఫీసుకైనా వెళ్ళి కాపుకాసినా గతవారం కంపోజ్ చేసేసిన పేపర్లు దొరుకతాయి. అలా

మల్లాది రైటింగు వున్న పేపర్లు సంపాదించడం పెద్ద కష్టమైన పనేం కాదు. ఈ డూప్లికేట్ మల్లాది రాస్తుండగా నువ్వెప్పుడూ చూడలేదుగా. అయినా ఇప్పటికి ఎన్ని ఫోర్జరీ కేసులు గురించి వినలేదు మనం అందామె.

"నేనాయనతో మద్రాసుకి ఫోన్‌లో మాట్లాడాను" అంది. మౌళవిక బితుకు బితుకుగా.

"ఏ హోటల్ వాళ్ళయినా పేరు, అడ్రసు అడుగుతారుగాని ఐడెంటిటీ అడగరు. మల్లాది పేరుతో ఎవరయినా రూమ్ బుక్ చేసుకోవచ్చు. అయినా నీకు యస్.టి.డి చెయ్యమని సలహానిచ్చింది జయశ్రీయేగా..?"

"జై.." అంటూ గట్టిగా అరిచింది మౌళవిక గుండెలు పగిగేలా గొంతు చిట్లేలా

"విక్కీ ఏంటిది? ఎందుకిలా ఒణుకుతున్నావు లే..లే" అంటూ జయశ్రీ తనని తడతున్నట్లనిపించిందామెకి. కళ్ళు విప్పి చూసింది.

## 11

జరిగినదానికి, జరుగుతున్న దానికి మధ్య వ్యత్యాసం ఒక్క క్షణంపాటు బోధపడలేదు మౌళవికకి.

అనుమానం తీరక రెప్పలు తాటించి మళ్ళీ చూసిందామె. ఎదురుగా జయశ్రీ మాత్రం ఉంది.

మల్లాది హాండ్ రైటింగ్ గురించి, మద్రాసు హోటల్ రూమ్ బుక్ చేసుకోవడం గురించి సంయుక్త చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. తిరిగి శరీరం ఒణకడం ప్రారంభమయ్యింది.

"ఏంటి విక్కీ ఆ బెదురు చూపులు? ఏం జరిగింది?" అంటూ అడిగింది జయశ్రీ

"జై ఆయనొచ్చేలోగా నా బుర్ర పేలిపోయి చచ్చిపోతానేమోనని అనిపిస్తోంది. జై ఈ బాధ భరించలేకపోతున్నాను" అందామె జరిగింది వివరిస్తూ.

"నాకు తెలుసు విక్కీ నీలో ఎలాంటి సంఘర్షణ జరుగుతుందో నువ్వెంతగా సఫర్ అవుతున్నావో. అందుకే నువ్వు ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు నీ కోసం ఉంచిన పులుసులో కాంపోజ్ టాబ్లెట్ మిక్స్ చేశాను. భోంచేస్తుంటేనే సగం నిద్ర వచ్చేసింది నీకు."

మౌళవిక ఆశ్చర్యంగా చూస్తోందామెను తనకోసం ఇంత శ్రద్ధ వహించే జయశ్రీ గురించి ఎలా చెడుగా కలగన్నానా అని.

"అయినా నీకు మనసులోని అట్టడుగు పొరల్లో ఏదో మూల ఆయన మల్లాది కాదేమోనన్న సంకోచం, దానికి నేను బాధ్యురాలనేమోనన్న అనుమానం ఉండిపోయాయి. అవే నీ సబ్‌కాన్షస్‌లో మేలుకుని కలరూపంలో నిన్ను తట్టాయి."

"నేనూ అదే ఆలోచిస్తున్నాను జై. ఇంత నీచంగా ఊహించగల శక్తి నాకెలా వచ్చిందా అని."

"అది నీ తప్పుకాదు విక్కీ సంయుక్త కెపాసిటీ అటువంటిది. ఇప్పటివరకూ ఏదో సినిమాలు, నవల్స్ నవలలో పాత్రలు, చదువు తప్ప బయటి మనుషుల మనస్తత్వాలు, హిపోక్రసీ లాంటివేవీ నిన్ను అంటలేదు. అసలు ఇదే రియల్ లైఫ్" అంది జయశ్రీ సానుభూతిగా.

"కరెక్టే జై. దానికింక సొల్యూషన్ లేదంటావా?"

"లేకేం ముందు ఆయన మల్లాది అవునా, కాదా అనే విషయం నీకు పూర్తిగా క్లారిఫై అయితేగాని నీ మనసు ఓ దారిలోకి రాదు."

"పోనీ మనం మద్రాసు వెళ్ళి అదేదో అక్కడే ఆయనతోనే తేల్చుకుంటే" అంది మౌళవిక ఆతృతగా.

జయశ్రీ నవ్వింది ఆప్యాయంగా చెయ్యి వేస్తూ.

"ఇదేమన్నా సినిమా అనుకున్నావా? వెళ్ళి చొక్కాపట్టుకుని 'చెప్పు. నిజం చెప్పు' అని బెదిరించడానికి. జీవితం. ఒకవేళ అతనే నిజమైన మల్లాది అయితే ఇక నీ మొహం చూస్తాడా? పోనీ కాదనే అనుకుందాం. పగ తీర్చుకోకుండా ఒదిలిపెడతాడా? లైఫ్‌లో ఎదుటి మనిషిని బాధపెట్టే ఫ్రాంక్‌నెస్ కన్నా ఎవర్నీ నొప్పించని రీతిలో వుండే డిప్లమసీ ఉత్తమం. అఫ్ కోర్స్ ఆ డిప్లమసీ పాళ్ళు ఎక్కువైతే హిపోక్రసీ అవుతుందనుకో. అది మనిషినే మసి చేసేస్తుంది. ఈ ప్రపంచంలో ప్రతి మనిషీ ఓ డిప్లమేటే లేదా ఓ హిపోక్రేటే. కాకపోతే దాని పరిధి ఎంతవరకు అనేది వారి వారి సంస్కారం మీద ఆధారపడి వుంటుంది. ఎక్కడో ఒకటీ, అరా నీలాంటివాళ్ళు వున్నా ఇలాంటి దెబ్బలు ఓ రెండు తగిలితేచాలు అందరిలాగానే అయిపోతారు."

మౌళవిక కళ్ళు విప్పార్చుకుని మరీ చూస్తోందామెను. తన ఊహల్ని, అనుభూతుల్నీ తనతోపాటు పంచుకుని తనతో సమానంగా స్పందించే తన స్నేహితురాలిలో ఇంత విచక్షణ, అవగాహనా ఉన్నాయా? మరి ఆ ఆలోచనా ధోరణి తనకెందుకు అలవడలేదు. అందుకు కారణం తను బాహ్య ప్రపంచం తెలియని ఓ పుస్తకాల పురుగులా ఉండటమేనా?

"అయితే ఇప్పుడు మనం ఏం చెయ్యాలి జై?" అందామె ఏమీ పాలుపోక.

"అతని గురించి మనం చేసే ఎంక్వయిరి అతనికేమాత్రం తెలియడానికి వీల్లేదు. అంతేకాదు, మనం ఇలా అతని గురించి తర్జన భర్జన పడుతున్నట్లు కూడా ఇంకెవ్వరికీ తెలియకూడదు. రేప్పొద్దున్న అంతా హ్యాపీగా ముగిసాక ఈ విషయాన్ని ఎవరయినా తిరగతోడే ప్రమాదం ఉంది. అందుకే ఇన్ని జాగ్రత్తలు"

ఔనన్నట్లు తలూపింది మౌళవిక.

"ఫస్టు మనం అడగాల్సింది ఆదివిష్ణుని" అంది జయశ్రీ ఊపిరి బలంగా పీల్చుకుంటూ.

"ఆర్టీసీకి వెళదామా అయితే?"

"వద్దు. అక్కడ ఆఫీసులో అందరిముందు మనం మాట్లాడితే బాగుండకపోవచ్చు. ఇంటికే వెళ్దాం."

"అడ్రస్?"

"ఆర్టీసీకి ఫోన్ చేసి కనుక్కుందాం. ఇప్పుడెవరయినా చెపితే వెంటనే వెళదాం. లేకపోతే పదిన్నర తర్వాత ఫోన్ చేసి ఆయనతోనే మాట్లాడి సాయంత్రం యింటికొస్తాం అందాం."

"సాయంత్రం దాకానా? పోనీ ఫోన్‌లోనే అడిగేస్తే?" అంది మౌళవిక ఆత్రుతగా.

"అదిగో ఇందాక వద్దన్న పొరపాటే తిరిగి చేద్దాం అంటున్నావ్. మనం ఇలా ఎంక్వయిరీ చేస్తున్నట్టు ఎవరికీ తెలియకూడదన్నాను."

అవునన్నట్టు తలూపింది మౌళవిక.

"జై.. తెల్లవారు ఝామున వచ్చిన కలలు నిజమౌతాయంటారు. అది నిజమేనంటావా?"

"అలా ఊహించుకుంటూ మనసు పాడు చేసుకోవటం కన్నా గబగబా తెమిలి నిజం తెలుసుకుని మనసులోని అనుమానాన్ని కడిగేసుకుని ముగ్గులు పెట్టుకోవటం బెటరు. లే మరి " అంది జయశ్రీ ఆమెను లేవదీస్తూ.

సుమారు ఏడు ఏడున్నర ప్రాంతంలో ఫోన్ ద్వారా ఆదివిష్ణు అడ్రస్ సంపాదించగలిగారిద్దరూ. "మరి డ్రైవర్ ఎనిమిదిన్నరకి గానీ రాడే ఆటోలో వెళ్ళిపోదమా?" అంది మౌళవిక.

"డ్రైవరున్నా సరే ఆటోలోనే వెళ్ళాలి" చెప్పానుగా మనం ఏం చేస్తున్నాం అన్నది ఎవరికీ తెలియకూడదని. ఇప్పుడు డ్రైవరుకి తెలిస్తే రేపు కలకత్తా నుంచి మీ డాడీ వచ్చాక ఆయనకి తెలుస్తుంది తెలుసా?"

"అవును జై డాడీకి ఈ గొడవలు తెలిస్తే అసలు తట్టుకోలేరు ఆయన గుండె ఆగిపోతుంది."

"తనకిష్టమైన వారి గురించి అలాగే అనుకోవటం ప్రతి మనిషికీ తప్పనిసరి చిక్కే. ఒక్కొక్కప్పుడు తన గురించి కూడా అలాగే అనుకోవటం జరుగుతుంది. కానీ ప్రతి వ్యక్తిలోనూ ఎంతటి దౌర్భల్యాన్నైనా భరించే శక్తి గూఢంగా బోలెడంత ఉంటుది. అందుకే మానసికంగా దేనికైనా తయారుగా వుండదలిస్తే ఆ మనిషిని ఏ దుర్ఘటనా అంతగా బాధించలేదు. ఆ దృఢత్వం నీకు రావలన్నదే నా కోరిక" అంది జయశ్రీ గేటు దగ్గరికి నడుస్తూ.

మౌళవిక మాట్లాడలేదు. ఆమె మనసంతా జయశ్రీ చెప్పిన మాటలమీదనే ఉంది.

అరగంటలోగా అశోక్ నగర్ మెహతా ఫ్లాట్స్ ముందు వారి ఆటో ఆగింది.

"మూడో అంతస్తులో అని చెప్పారు. మొదటి బ్లాకులోనా, రెండో బ్లాక్‌లోనా అన్నది సరిగా చెప్పలేదు ఏంచేద్దాం? రెండు బ్లాక్స్‌ల్లోనూ ట్రై చేద్దామా?" అని అడిగింది జయశ్రీ

"మల్లాదిగారి గురించి ఏడుకొండలైనా సరే ఎక్కి తీరతాను. జై ఉండు ఈయన్ని అడిగి చూద్దాం" అంటూ ముందుకి నడిచింది మౌళవిక.

మొదటి బ్లాకుకి ముందున్న మెట్ల ఎదురుగా తెల్లటి కారు బోనెట్ ఎత్తి లోపలికి చూస్తున్న ఒకాయన తలపక్కకి తిప్పాడు పక్కనే ఎవరో వచ్చి నిలబడినట్లనిపించడంతో.

"సర్ ఆదివిష్ణుగారి ఇల్లు ఎక్కడో కాస్త చెబుతారా?"

"అదిగో ఆ రెండో బ్లాకులోనే ఉంటారాయన"

"థాంక్స్ సర్" అంటూ రెండడుగులు వేసి ఆగిపోయారిద్దరూ ఒకేసారి.

"ఈయన్ని ఎక్కడో చూసినట్టు, గొంతు ఎక్కడో విన్నట్టులేదు?" అంది జయశ్రీ

"అవునే నాకూ అనిపిస్తోంది. యస్ ఎలక్షన్ టైమ్‌లో టీవీలో .. ఏయ్.. ఈయన పన్యాల రంగనాధరావుగారే" అని అరిచినంత పని చేసింది మౌళవిక.

"ఏది మన మల్లాదిగారు 'సమయం' అంటూ చెప్పిన.."

"కరెక్ట్ అంటూ వెనక్కి తిరిగి ఒక్క గంతులో ఆయన్ని చేరుకుందామె.

"నమస్కారం సార్ మీరు పన్యాల రంగనాథరావుగారు కదూ?"

"అవును" అన్నాడాయన బోనెట్ మూసేస్తూ.

"మీకు మల్లాదిగారు తెలుసుకదండీ"

"తెలుసుగానీ ఆయనిక్కడ ఉండడే అప్పుడప్పుడు ఆదివిష్ణు దగ్గరికి వస్తూ ఉంటాడంతే."

"అది తెలుసండీ ఒకసారి మీరు చెప్పిన ఇన్సిడెంట్ ఆయన స్టోరీగా రాశారు కదూ?"

"ఏమిటది?"

"అదే ఓ రచయిత ఆడపేరుతో రాయడం అతనికి గాజులు అవి బహుమతిగా రావటం"

"ఆ..ఆ...అదీ పదేళ్ళపైనే ఐంది. అప్పుడు 'అనామిక' అనే ఓ పత్రిక ఓపెనింగ్ ఫంక్షన్‌లో నేను మాట్లాడాల్సి వచ్చింది. అక్కడె చెప్పిన ఇన్సిడెంట్ అప్పుడే ఒకాయన మల్లాదిని రాచకొండ విశ్వనాథశాస్త్రికి పరిచయం చేస్తుంటే చూశానతన్ని" అన్నాడు రంగనాధరావు.

"ఎలా ఉంటారండీ ఆయన?"

"ఎవరు? మల్లాదేనా? మంచి ఒడ్డూ, పొడవు, కళ్ళజోడు పెట్టుకుంటాడు. తెల్లగానే ఉంటాడు. ఇంకా ఇ... ఇంకేం చెప్తాం. మొత్తం మీద మనిషి బాగానే ఉంటాడు. ఏం? ఏమిటి సంగతి?" అన్నాడాయన చిరునవ్వుతో.

కంగారుపడింది మౌళవిక. "అబ్బే ఏం లేదండీ ఆయన్నొక్కసారి చూద్దామని" అంటూ దాట వెయ్యబోయింది.

"అలా అయితే ఆదివిష్ణునే అడగండి. ఆయన మళ్ళీ ఎప్పుడు ఇక్కడికొస్తాడో?"

"అదేనండి అందుకే" అంటూ రెండో బ్లాకువైపు నడిచారిద్దరూ.

"ఆయన చెప్పినట్టే ఉన్నాడు కదే ఆయన?" అంది మౌళవిక.

"సరే వెనక్కి వెళ్ళిపోదాము అయితే"

"ఆదివిష్ణుని కలుసుకోకుండా ఇంటికి వెళ్ళడం అవుటాఫ్ ది క్వశ్చెన్."

నేమ్ బోర్డ్ బయటే ఉండడం చేత సులువుగానే దొరికింది ఆదివిష్ణు ఫ్లాట్.

"లేరండి ఇవాళ ఉదయాన్నే వెళ్ళిపోయారు" అన్నాడు తలుపు తెరిచిన కళ్ళజోడు కుర్రాడు.

"ఆఫీసుకా?"

"కాదండీ సెలవులో ఉన్నారు. ఆలిండియా రేడియోలో జీడిగుంట రామచంద్రమూర్తిగారని ఉంటారు. బహుశా ఆయన దగ్గరికి వెళ్ళుంటారు."

మౌళవిక వెనక్కి తిరగడం చూసి తలుపు వేశాడా కుర్రాడు.

"ఏం చేద్దాం ఇప్పుడు?" అంది జయశ్రీ

"ఆలిండియా రేడియోకి వెళదాం"

"ఇప్పుడింకా తొమ్మిది కూడా కాలేదు విక్కీ. పదిన్నరదాకా ఎవరూ రారేమో?"

"రాకపోతే అక్కడే కూర్చుందాం. ఉదయం నుంచీ ఏవో ప్రోగ్రాములు వస్తుంటాయి కదా ఆ టేపులు వేసే వాళ్ళకయినా తెలీదా జీడిగుంటగారు ఎప్పుడొస్తారో? ఆయన ఇల్లు ఎక్కడో?"

జయశ్రీ ప్రశంసాపూర్వకంగా చూసిందామెని. అంత టెన్షన్లోనూ షార్ప్‌గా ఆలోచిచించగలిగిందంటే మానసికంగా ఆమెలో ఖచ్చితంగా ఓ మార్పు వచ్చిందన్నమాటే.

"పదయితే" అంటూ దారి తీసింది.

అది మరో ప్రపంచం అని చెప్పొచ్చు. వీణలు మోసుకుంటూ వస్తున్నారు కొందరు. వయొలిన్ బాక్స్‌లు ఊపుకుంటూ వస్తున్నారు మరికొందరు. కొంతమంది టేపులు పట్టుకుని ఖంగారుగా తిరుగుతున్నారు. అప్పుడే అడుగుపెట్టిన

ఆడవాళ్ళ లాన్‌లో కూచుని మ్యూజిక్ ప్రాక్టీస్ చేస్తున్నారు. చేతిలో స్క్రిప్ట్ ఉన్న కొందరు కుర్రాళ్ళు చెట్టుకిందకుపోయి మాట్లాడుకుంటున్నారు.

పది నిమిషాల పాటు అక్కడ వాతావరణాన్ని పూర్తిగా పరికించిన తర్వాత "వీళ్ళలో ఎవరో ఒకర్ని అడగక తప్పదు" అంది జయశ్రీ అప్పటికే మౌళవిక ఎంక్వైరీ మొదలుపెట్టింది.

"కొందరు తెలీదన్నారు. కొందరు వెయిట్ చెయ్యండి ఇంకా టైముంది కదా అన్నారు."

"ఇప్పుడే ఇంత హడావుడిగా ఉందే, పదిన్నరయితే భరించలేమేమో."

"ఎ.ఐ.ఆర్ కే ఇలా అంటున్నావు? ఫిలిం ఫీల్డులో అసలు మనల్ని పట్టించుకునే నాధుడే ఉండడే అక్కడ మల్లాదిగారు ఎలా ఉన్నారో ఏమిటో?"

"అయిన దానికి కాని దానికి ఆయన్ని తల్చుకోందే ఉండలేవా విక్కీ"

"ఏం చెయ్యను కళ్ళు మూసినా తెరిచినా ఆయన రూపమే గుర్తొస్తుంటే?"

అంతలో ఓ ఆటో వచ్చి వారి పక్కన ఆగింది తెల్లటి దుస్తుల్లో, దబ్బపండులా మెరిసిపోతూ, ప్రస్తుతపు టీవీ అనౌన్సర్ల అదృష్టం కొద్దీ ఆ పోస్టుకి అప్లయ్ చెయ్యలేదనిపించేటంత స్ఫురద్రూపంతో ఒకాయన దిగాడు. వయస్సు సుమారు నలభై ఉండొచ్చు.

"ఈ ఆటోవాడ్ని పంపించే ఏర్పాట్లు చూడండి" అంటూ ముందుకి సాగిపోయాడతను. వెనక్కి తిరగకుండా. మౌళవిక ముందు నివ్వెరపోయింది. తర్వాత తమాయించుకుని పర్సు తీసింది.

"అదేమిటే నువ్వు ఇస్తున్నావు?" అంది జయశ్రీ వారిస్తూ.

"ఆయనెవరో మాకు కావలసిన వాడయి ఉంటాడు. లేదా మా డాడీకైనా డెఫినెట్‌గా తెలిసుండాలి. లేకపోతే అంత చనువుగా నాతో అలా అనడు. ఉండు ముందు ఆ ఆటోని పంపించి తర్వాత ఆయన ద్వారా జీడిగుంటగార్ని కలుద్దాం" అంటూ లెక్కపెట్టి డబ్బులిచ్చేసింది.

ఈలోగా జయశ్రీ చప్పట్లు కొట్టి పిలిచింది 'సార్..సార్' అంటూ.

రాంబాణంలా ముందుకుపోతున్న ఆ వ్యక్తి వెనక్కి తిరిగాడు.

"నమస్కారం సార్ మీరు నన్ను గుర్తుపట్టారా?" అడిగింది మౌళవిక ఒక్క పరుగున అతన్ని చేరుకుని, లేదన్నట్లు తలాడించాడతను.

**"మా డాడీ మీకు తెలుసు కదూ?**

''ఎవరాయన?''

''మరి.. మరి'' అంటూ సందేహంలో పడిపోయిందామె.

''ఊహూ'' అన్నారు మౌళవిక, జయశ్రీ ఏకకాలంలో.

''మీరిక్కడ స్టాఫ్ కాదా?''

''ప్చ్'' అంటూ పెదవి విర్చారు.

''మరయితే ఆ ఆటోకి డబ్బులెందుకిచ్చారు?'' అని అన్నాడాయన విస్తుపోతూ.

''మీరిమ్మన్నారు''

''భలేవారే అయామ్ సారీ'' జేబులోంచి ఐదురూపాయల నోటు తీసి ఇచ్చి 'చెప్పండి ఏంకావాలి?' అని అడిగాడు ఎంతో సౌమ్యంగా.

''జీడిగుంట రామచంద్రమూర్తిగారని.''

''అయితే మీరు యింటికి వెళ్ళిపోవటం బెటర్. ఎందుకంటే మీరిలా వెయిట్ చేస్తూనే ఉంటారు. పదకొండుకో, పదకొండున్నరకో లీవ్ లెటర్ రావచ్చు. ఇంటికి వెళ్ళిపోవడమే బెస్టులెండి.''

''అడ్రస్సు తెలీదండి''

''విజయనగర్ కాలనీలో ఉంటాడని తెలుసు కానీ నాకూ కరెక్టుగా తెలీదండి. ఉండండి. ఇక్కడ రవివర్మ అని మంచి కోపరేటివ్ పర్సన్ ఉన్నాడు. అతన్ని అడిగి చెప్తాను. అసలతను ఈపాటికే వచ్చెయ్యాలి.''

అంటూ అటూ ఇటూ కలియచూశాడతను. గబగబా అంగలు వేసుకుంటూ మోటార్ సైకిల్ స్టాండ్ దగ్గరకెళ్ళి 'వర్మా..వర్మా' అంటూ అరిచాడు.

''ఏంటి గురూ అరుస్తున్నావు. ఇవాళెవరు నీ బలిచక్రవర్తులు?'' అంటూ అడిగాడు రవివర్మ కాంటిన్‌లోంచి బయటకివస్తూ.

''నేనొచ్చేసరికి ఈ చెట్టు దగ్గర ఉండమన్నానా. నేను రాకుండానే కాంటిన్‌కి వెళ్ళిపోయావేంటి? పాపం ఇవాళ ఈ లేడీస్ అనవసరంగా బలయిపోయారు. అర్జంట్‌గా అయిదు రూపాయలు తియ్యి వాళ్ళకిచ్చెయ్యాలి'' అన్నాడతను. రవివర్మ జేబులోంచి పర్సు తీసేసుకుంటూ.

''ఫర్వాలేదు రేపు నువ్వు హేండివ్వకుండా డిపాజిట్‌లా ఉంచుతాన్లే''

మౌళవిక, జయశ్రీ విపరీతంగా ఆశ్చర్యపోతున్నారు ఈ లావాదేవీలకి.

"సారీ అండీ నా పేరు రవివర్మ. మావాడు మీకు అనవసరంగా ట్రబులిచ్చినట్టు ఉన్నాడు" అన్నాడు రవివర్మ వారిద్దరి దగ్గరికి వచ్చి.

"పెద్దగా ఇవ్వలేదులే తిరిగి నా దగ్గర డబ్బులిచ్చేశానుగాని ముందు వాళ్ళకి జీడిగుంట అడ్రస్ చెప్పు" అన్నాడతను పర్సు రవివర్మ జేబులో పెట్టేస్తూ.

"పేరుకి చాలా మంచి కవి. ఈయనెప్పుడూ ఇంతేనండి మేము ముద్దుగా అనిరుద్ధకుమార్ అని పిల్చుకుంటాం అంటే అన్నీ రుద్దేవాడని. మా మధ్య యివి చాలా మామూలులెండి."

"ముందు వాళ్ళకి అడ్రసు ఇవ్వు వర్మా. చాలా అర్జంట్‌గా ఉన్నారు. మన ఋణానుబంధ చరిత్ర తర్వాత వివరంగా విశదీకరిద్దువుగాని" అన్నాడాయన.

"విజయనగర్ కాలనీలో సెయింట్ ఆన్స్ హైస్కూలుందాండి ఆ స్కూల్ పక్కగా ఉన్న రోడ్డులో తిన్నగా పైకిపోతే రైట్ సైడ్ చివరి ఇల్లండి ఇక్కడ ఎవర్నడిగినా చెబుతారు" అన్నాడు రవివర్మ.

"చాలా థ్యాంక్సండీ మళ్ళీ ఎప్పుడయినా యిలా వచ్చినప్పుడు మిమ్మల్ని తీరికగా కలుస్తాం సార్. అన్నట్టు ఈయనపేరు" అంటూ అడిగింది జయశ్రీ

"ఒద్దులెండి. బయట ఈయన మంచి ఉద్యోగం చేస్తున్నాడు. మమ్మల్ని కలవడానికి సరదాగా వస్తూంటాడు. మేం ఈయన చేత పాటలు రాయించుకుంటాం. అంతగా కావాలంటే ఇక్కడికొచ్చిన 'విఖ్యాత కవి సార్వభౌమ' అని అడిగితే చాలు.

ఏ.ఐ.ఆర్‌లో బయలుదేరిన పదినిముషాల్లో జీడిగుంట రామచంద్రమూర్తి ఇంటి ముందున్నారు వారిద్దరూ.

"లేరండీ నిర్మాత రాఘవగారి రికార్డింగ్ థియేటర్‌కి వెళ్ళారు" అన్నారింట్లో.

"అదెక్కడుందండీ?"

"పద్మాలయా స్టూడియోకి వెళ్ళేదారిలో ఉందండి. ఉదయాన్నే వెళ్ళారాయన."

"కూడా ఆదివిష్ణుగారు ఉన్నారండీ?" అడిగింది మౌళవిక.

"ఆ...ఆ ఇద్దరూ కలిసే వెళ్ళారు."

"జై.. హరియప్" అంటూ ఆటోలోకి గెంతిందామె.

"రిటర్న్ నయి ఆతేతో పన్ద్రా రూపై దేనా పడ్తాజీ" అన్నాడు ఆ ఆటో డ్రయివర్.

"పర్వానై ఛలో."

ఒద్దని వారిద్దామనుకుంది జయశ్రీ కానీ మౌళవిక టెన్షన్ సంగతి తెలిసి ఊరుకుంది.

బేరం చేయకుండా, తగువాడకుండా పదిహేను రూపాయలకు ఒప్పుకోవడంతో మరింత రెచ్చిపోయాడు ఆటో డ్రయివర్.

"యే..సుబ్బిరామిరెడ్డి కా ఘర్ హై.. యే నాగేశ్వరరావు కా ... యహా హై అన్నపూర్ణా స్టూడియో. యే బాజూ జాతేతో భాగ్య నగర్ స్టూడియో ఆతా, యే చంద్రబాబు నాయుడు కా గర్ హై. వొ హీ హై పద్మాలయా స్టూడియో" అంటూ టూరిస్టు గైడ్‌లా అన్నీ చూపించుకుంటూ పోయాడు హుషారుగా.

"ఎక్కడికో వెళ్ళారండి ఎప్పుడొస్తారో తెలియదు" అంటూ చెప్పాడు అక్కడ ప్రొడక్షన్ అసిస్టెంట్.

"ఏం చేద్దాం విక్కీ ఆటోలో వెనక్కి పోదామా? తిప్పి పంపేద్దామా?"

"వెనక్కిపోయి ఏం చేస్తాం. ఎలాగయినా సరే ఆదివిష్ణుని కలిసి తీరాలి ఇవాళ మనం. ఆటో పంపెయ్ ఎంతసేపయినా ఇక్కడే వెయిట్ చేద్దాం."

మౌళవిక స్వరంలో వినిపించిన ధృఢ నిర్ణయానికి మనసులోనే మెచ్చుకుంటూ ఆటోని పంపేసిందామె.

మధ్యాహ్నం రెండయింది.

ప్రొడక్షన్ అసిస్టెంట్‌లు, రికార్డింగ్ థియేటర్‌కి సంబంధించిన వ్యక్తులు అటూ ఇటూ తిరుగుతూనే ఉన్నారు హడావిడిగా.

"మధ్యాహ్నం భోజనానికి రారండీ?" అని అడిగింది మౌళవిక మొదట కనిపించిన అసిస్టెంట్‌ని.

"భోజనం చేసే బయలుదేరారండి. అందుకే ఎప్పుడొస్తారో తెలీదన్నాను." అంటూ లోపలికి వెళ్ళి టీలు పట్టించుకుని వచ్చాడతను.

ఉదయం నుంచి టిఫెన్ కూడా చెయ్యకుండానే తిరుగుతున్నారేమో ఒక్క గుటకలోనే జుర్రేశారిద్దరూ.

"దగ్గర్లో హోటల్ కూడా ఉన్నట్టు లేదు. సమోసాలు అయినా తిని వచ్చేవాళ్ళం" అంది జయశ్రీ

"అక్కర్లేదు జై. ఇప్పుడే టీ తాగాంగా. దెబ్బతో ఆకలి చచ్చిపోతుందిలే" జయశ్రీ కంటనీరు గిర్రున తిరిగింది. కష్టం అంటే ఏమిటో ఎరుగని మౌళవిక ఉన్న పరిస్థితికి ఎదుర్కొంటున్న విధానానికి.

"విక్కీ ఒక విధంగా ఈ కండిషన్‌కి నేను బాధ్యురాలననే అనిపిస్తోంది. నన్ను క్షమించు ప్లీజ్."

"అదేమిటి జై నువ్వెలా రెస్పాన్సిబుల్ దీనికి?"

"ఈ అనుమానం తీర్చుకోమని చెప్పింది నేను ఆ రోజు రీలు పాడుచేసి సంయుక్త అలా అనడానికి అవకాశం ఇచ్చింది నేను. లేకపోతే మహారాణిలా వుండే నీకు ఈ కటిక ఉపోషం ఏమిటి చెప్పు?"

"నువ్వే చెప్పావుగా ఏ మనిషికైనా ఎంతటి దౌర్భాగ్యాన్నైనా సహించే శక్తి ఉంటుందని అది నిజం జై. నాకసలు ఉదయం నుంచి భోంచెయ్యలేదని, టిఫెన్ తినలేదని ఆ ధ్యాసేలేదు. నేను ఎంత త్వరగా ఈ సస్పెన్స్ నుంచి బయటపడతానా అని వుంది అంతే కాకపోతే దీనికంతటికీ నువ్వు కారణం అనుకుని కుమిలిపోకు. నువ్వేం చేసినా నా మంచికే చేస్తావని నా నమ్మకం నాకుంది."

సుమారు ఆరున్నర అవుతుండగా పోర్టికోలో కారు ఆగింది. ఆదివిష్ణు, నిర్మాత రాఘవ దిగారు.

"మార్నింగ్ నుంచి ఆదివిష్ణు గారి కోసం వెయిట్ చేస్తున్నారు వీళ్ళు" అని చెప్పాడు ఆ ప్రొడెక్షన్ అసిస్టెంట్. 'రె.. వీళ్ళు నాకు తెలుసు గురువా అంటూ విజిటర్స్ చెయిర్స్ పక్కకి వచ్చి 'సారీ అండి ఉదయం నుంచి పిచ్చిగా తిరగాల్సి వచ్చింది' అన్నాడు ఆదివిష్ణు.

"మీతో చిన్న పనుందండి. మీరింకా ఇక్కడే ఉంటారా?" అడిగింది మౌళవిక.

మల్లాదిని గురించి ఎంక్వయిరీ నలుగురు ముందు చెయ్యొద్దని తను చెప్పిన మాటను ఇంత నిస్త్రాణ దశలో కూడా ఆమె గుర్తుపెట్టుకున్నందుకు మనసులోనే అభినందించింది జయశ్రీ.

"ఇప్పుడిక్కడ పనేం లేదండీ ఇంటికి బయల్దేరడమే."

"అయితే ఆదివిష్ణు మీరు కారులో వెళ్ళి వెనక్కి పంపించండి. వీళ్ళని కూడా ఎక్కడ కావాలంటే అక్కడ డ్రాప్ చెయ్యండి" అన్నాడు నిర్మాత రాఘవ.

"చెప్పండి ఏమిటి పని అన్నారు?" అడిగాడూ ఆదివిష్ణు కారులో కూర్చున్నాక.

"జీడిగుంటగార్ని మీతో చూడొచ్చనుకున్నాం" అంది జయశ్రీ ఎలా మొదలు పెట్టాలో తెలియాక.

"మీరు భలేగా ఉన్నారండి. ఎంతదూరంలో ఉన్నా ఎంతసేపు పట్టినా అలా రచయిత కోసం చూస్తూ ఉంటారా? మరోలా అనుకోకండి. ఏదో చిన్న సందేహం వచ్చి అడిగాను. మధ్యాహ్నమే జీడిగుంట ఏ.ఐ.ఆర్‌కి వెళ్ళిపోయాడు."

"అంటే మీకు మేం మల్లాదిగారికి అడ్రసు ఇమ్మనమని అడిగిన సంగతి గుర్తుందన్నమాట."

"అదెలా మర్చిపోగలనండీ? ఆ అడ్రసు అతనికిచ్చాను. కలిశాడా?"

"ఆయనకే ఇచ్చారాండి?" అంది మౌళవిక ఉత్సుకతతో.

"ఆ.. అక్షరాలా మల్లాదికే ఇచ్చాను. ఏం ఇంకా కలవలేదా?" అడిగాడు ఆదివిష్ణు సిగరెట్ వెలిగించుకుంటూ.

"కలిశారండీ. మీరు, జంధ్యాలగారు మంచి ఫ్రెండ్సు అని చెప్పారు నిజమేనా అండీ?"

"స్నేహానికి విలువ, ప్రాణం యిచ్చే వ్యక్తుల్లో జంధ్యాల ఒకరండి. నిజం చెప్పాలంటే నాకు బెస్టు ఫ్రెండ్సులో జంధ్యాల మొదటివాడు.

"ఏం జంధ్యాలగారితో ఏమయినా పనిఉందా?"

"అవునండి" అంది జయశ్రీ

"ఆయనకో లెటర్ ఇమ్మని మల్లాదిగారు ఇచ్చారు. ఈ రెండు మూడురోజుల్లో ఆయన హైదరాబాద్ వస్తున్నారండీ?" అంది మౌళవిక.

"నాకు అటువంటి మెసేజ్ ఏదీ లేదండీ. పోనీ పోస్టు చేసెయ్యలేకపోయారా?"

"పర్సనల్గా యిమ్మన్నారండీ. ఆయన అవుట్ డోర్స్‌లో ఎక్కువగా ఉంటారు కదండీ. ఇంటికొచ్చి చూసుకునేసరికి లేటవుతుందని ఎక్కడుంటే అక్కడికే వెళ్ళి ఇమ్మన్నారండి."

"ఓ పని చెయ్యండి. రేపు ఉదయం బాలూ ఇక్కడికి వస్తున్నాడు. అతనికిచ్చెయ్యండి ఖచ్చితంగా జంధ్యాలకి అందితీరుతుంది. ఒకవేళ ఆయన మద్రాసులో లేకపోయినా ఎక్కడ వున్నాడో ఎప్పుడొస్తాడో అన్నీ వివరంగా బాలూకే తెలుస్తాయి" అన్నాడు ఆదివిష్ణు.

"బాలూ అంటే యస్పీ బాలసుబ్రహ్మణ్యం గారేనాండీ?"

"అవునండీ."

"వచ్చి ఎక్కడ దిగుతారండీ?"

"అశోకాగానీ, బంజారాగాని ట్రై చెయ్యండి. తప్పకుండా దొరుకుతాడు."

"థాంక్యూ సార్. ఆ జంక్షన్ దగ్గర ఆపేస్తారా దిగిపోతాం" అంది మౌళవిక.

"అలాగేనండి" అంటూ ఆపమని డ్రైవర్‌కి చెప్పాడు ఆదివిష్ణు.

మళ్ళీ థాంక్స్ చెప్పి సెలవు తీసుకున్నారిద్దరూ.

"ఏంటి విక్కీ తెగ కోసేశావు. పర్సనల్గా లెటర్ ఇమ్మన్నారంటూ" అడిగింది జయశ్రీ ఇంటివైపు సందులోకి తిరుగుతూ.

"మరి ఆదివిష్ణుగార్నే అడిగెయ్యమంటావా?" ఏమండీ మిమ్మల్ని స్టూల్ మీద నిలబెట్టి జంధ్యాలగారు మేజిక్ చేశారట ఆ సమయంలో మల్లాదిగారు ప్రక్కనే ఉన్నారట నిజమేనా అని?

"అడిగితే తప్పేముంది?"

"అలా అయితే మనం ఆయన్ని అనుమానిస్తున్నట్లు ఆదివిష్ణుగారికి తెలిసిపోదూ?"

"వెరీగుడ్ విక్కీ. ఈ ప్రయత్నంలో నువ్వు ఖచ్చితంగా విజయం సాధించి తీరుతావు. మంచి బాలెన్స్ వచ్చింది నీలో" అంది జయశ్రీ ఆమె భుజం తడుతూ.

"అవునూ. ఎలాగూ మల్లాదికే ఆ చీటీ ఇచ్చానని ఆదివిష్ణు చెప్పారు కదా! ఈ ఇన్విస్టిగేషన్ చెయ్యాలా మనం ?" అని జయశ్రీ అడిగింది భోజనాలయ్యాక పడుకోబోతూ.

"చేసి తీరాలి జై.. 'ఆదివిష్ణు చేతిలోంచి ఆ స్లిప్పు ఎంతమంది చేతులైనా మారి ఉండొచ్చు కదా' అంది సంయుక్త. అలాగే ఆ మల్లాదిగారి చేతిలోంచి కూడా మారి ఉండొచ్చు కదా. ఈయన అసలు మల్లాది అవునా కాదా అన్నది తేలేవరకు మనం ఇలా కష్టపడవలసిందే తప్పదు" అంది మౌళవిక ధృఢంగా.

శారీరకంగా, మానసికంగా ఎంతో అలసిపోయిన వారిద్దరూ అతి తొందరగానే నిద్రలోకి జారుకున్నారు.

## 12

తెల్లవారుఝామున సుమారు నాలుగు గంటలకి ఎవరో కొట్టినట్టు మెలుకువ వచ్చింది మౌళవికకి.

"జై..జై" అంటూ జయశ్రీని తట్టింది.

చివాలున లేచి కూచుందామె "ఏంటి విక్కీ మళ్ళీ పాడుకలేమైనా వచ్చిందా?" అంటూ.

"అబ్బెబ్బే అదేం కాదు. మద్రాసు నుంచి యస్పీ బాలసుబ్రహ్మణ్యంగారు వచ్చే ఫ్లయిట్ ఎన్ని గంటలకి వస్తుందో ఫోన్ చేసి కనుక్కోనా?"

తలెత్తి చూసింది జయశ్రీ 'మానసికంగా ఎంత నలిగిపోతోందీ పిచ్చిది' అన్నట్టుగా.

"హాల్లో పడుకున్న యాదగిరి లేచి వింటే?"

పొరపాటే అన్నట్టు పెదవి విరుస్తూ తలాడించింది మౌళవిక.

"ఉండు ఇప్పుడే వస్తాను" అంటూ మెల్లగా హాల్లోకి వచ్చింది జయశ్రీ పేపరు తీస్తుండగా అనుకున్నంత అయింది.

యాదగిరి లేచాడు "ఏంటమ్మా" అంటూ.

"నిద్రపట్టకపోతే ఏదైనా చదువుదామని అని పేపరు తీసుకుని లోపలికి వచ్చిందామె.

"చెప్పానా చీమ చిటుక్కుమంటే చాలు పుటుక్కుమని లేస్తాడు" అంది మౌళవికతో.

"అందుకే డాడీకి కుడిభుజం అయ్యాడు మరి"

పేపరు విప్పి ఫ్లయిట్ ఎరైవల్స్ చూశారిద్దరూ. ఏడుగంటలకి వస్తుంది మద్రాసు నుంచి.

"ఆయన ఏ హోటల్లో దిగుతాడో ఏంటో? ఎయిర్ పోర్టుకి వెళ్ళిపోదామా?"

"ఫ్లయిట్ ఎన్ని గంటలకి వచ్చినా సరే ఎనిమిదిన్నరలోగా మనం యిల్లు కదలడానికి వీల్లేదు. యాదగిరి మీ డాడీకి చెపితే ఆయనకేం సమాధానం చెప్తాం?"

"మనం వెళ్ళేసరికి ఆయన ఎక్కడికైనా వెళ్ళిపోతే?"

"విక్కీ నువ్విప్పటిదాకా ఎవరికీ ఏ అన్యాయం చెయ్యలేదు. నేనూ అంతేననుకుంటున్నాను. మంచి మనసుతో చేసే ప్రతిపనికీ ప్రకృతి కూడా సహకరిస్తుందని, తప్పకుండా మనకి అనుకూలంగానే అన్నీ జరుగుతాయి. నాకా విశ్వాసం ఉంది. కాస్త ఓపిక పట్టు" అంది జయశ్రీ ఆమె మాటలు వేదమంత్రాల్లా పనిచేశాయి.

ఎనిమిదిన్నరవరకూ ఎంతో నిగ్రహంగా గడిపింది మౌళవిక.

సుమారు తొమ్మిదవుతుండగా హోటల్ బంజారాలో అడుగుపెట్టారు యిద్దరూ. లోపలికి అడుగు పెడుతూనే చల్లగా అరికాళ్ళని స్పృశించే ఎయిర్ కండిషన్ గాలి, ఆ పక్కనే అద్దాలలోంచి ఫోటోజెనిక్‌గా కనిపించే చిన్న కొలను. ఒక్క క్షణంపాటు యిహలోకాన్ని మురిపించేటంత మనోహరంగా ఉందక్కడ.

"హాజ్ మిష్టర్ యస్.పి.బాలసుబ్రహ్మణ్యం ఫ్రమ్ మద్రాస్ చెక్ డ్ ఆన్ ప్లీజ్" అని అడిగింది జయశ్రీ

"యా.. రూమ్ నెంబర్ ఫోర్ జీరో వన్. బట్ హి హాజ్ గాన్ అవుట్" అంది రిసెప్షనిస్టు.

"డు యు హేవ్ ఎనీ అయిడియా వెన్ హి కమ్స్ బ్యాక్."

"నో.. ప్లీజ్" అంటూ అప్పటికే బిక్కచచ్చిపోయి వున్న మౌళవిక ముఖంలోని నైరాశ్యాన్ని చూసి "సమ్ బడీ ఇన్ హిజ్ రూమ్. ఇఫ్ యు వాంట్ యు కెన్ చెకప్ విత్ దెమ్" అందామె. వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టయింది ఇద్దరికి. రెండున్నర నిమిషాల్లో రూమ్ నంబర్ నాలుగువందల ఒకటి ముందున్నారు.

"ఇంత పెద్ద హోటల్‌లో రూమ్స్‌కి బెల్ లేకపోవటం విచిత్రం కదూ" అంది జయశ్రీ తలుపు తడుతూ.

"వెల్ కమ్ గ్రూప్స్ హోటల్స్‌లో అంతేట. మా డాడీ చెప్పారు."

తలుపు తెరుచుకుంది. పత్తికాయల్లాగా విచ్చుకున్న పెద్ద కళ్ళతో ఉన్న ఓ తెల్లటి అమ్మాయి మొహం బయటపెట్టి "ఎవరూ?" అని అంది.

"బాలసుబ్రహ్మణ్యంగారు" అంటూ నసిగింది మౌళవిక. "లేరండి రికార్డింగ్‌కి వెళ్ళారు"

"రికార్డింగ్?" అంటూ ఆశ్చర్యపోయిందామె. ఎందుకంటే అంతవరకూ హైదరాబాద్ రికార్డింగ్స్‌లో బాలసుబ్రహ్మణ్యం పాడినట్టు ఎక్కడా చదివినట్టు గుర్తులేదు.

"వసంతా.. ఎవరదీ?" అంటూ లోపల్నించి ఓ గొంతు ప్రశ్నించింది.

**మౌళవికకి** బాగా పరిచయం ఉన్న కంఠం అది "లోపలున్నది శైలజగారాండీ?" అని అడిగిందామె.

"అవునండి. రండి" అంటూ తలుపు బాగా తీసి "శైలూ నీ గురించి, మణి అన్న గురించి వచ్చారు" అని టేబుల్ మీదున్న మేగ్‌జైన్‌ను తీసుకుని ప్రక్కగదిలోకి వెళ్ళిపోయింది వసంత.

"నమస్కారం అండీ" అంది శైలజ వచ్చి.

ముగ్గురూ కూర్చున్నారు.

"నా పేరు మౌళవిక అండి. ఈమె జయశ్రీ" ఒక్క అరనిముషంపాటు నిశ్శబ్దం తర్వాత 'మీ పాటలంటే మాకు ఎంతో యిష్టం' అంది మౌళవిక.

"థ్యాంక్సండీ" అంది శైలజ చిరునవ్వుతో.

"సాగర సంగమంలో మీ పాటలు మా డాడీ ఎప్పుడూ పెట్టుకుని వింటూ ఉంటారు.

"మీరు వినరా?"

చాలా రోజుల తర్వాత మౌళవిక నవ్వింది అందంగా. "భలే వారే నాకు మీ సినిమా పాటలేకాకుండా హైదరాబాద్ టీవీకి పాడిన ప్రయివేట్ సాంగ్స్ కూడా కంఠతా అండి" అంది.

"ఆహా.." అంది శైలజ సాదరంగా.

"మీ బ్రదర్ ఎప్పుడొస్తారండీ?" అడిగింది జయశ్రీ

"ఇంకో గంటలోనో గంటన్నరలోనో ఉంటాడండీ ఇక్కడ, తనొచ్చాక మేం షాపింగ్‌కి వెళ్ళాలని చెప్పాం కూడా."

"ఏదో రికార్డింగ్ అన్నారు."

"అవునండి. రాఘవగారి 'ఈ ప్రశ్నకు బదులేది'లో ఓ రెండు పాటలు."

"హైదరాబాద్‌లో రికార్డింగ్ ఇదే పస్టు టైమండి?" అంది మౌళవిక సందేహ నివృత్తికోసం.

"కరెక్టే.. మీరు సినిమా పేపర్స్ అవీ బాగా ఫాలో అవుతార్లావుంది."

మౌళవిక మళ్ళీ అందంగా నవ్వింది ఆ అభినందనకు.

"రెండు గంటల్లోగా రెండు పాటలయిపోతాయండీ?" అడిగింది ఉత్సాహంగా.

"ఏం .. ఎందుక్కావు?"

"మీరు షాపింగ్ అన్నారు కదాని తొందర తొందరగా పాడేసి వచ్చేస్తారేమోనని."

"అబ్బే.. అదేం లేదండీ తను తొందరగా నేర్చుకుని పాడగలడు గాని తొందరపడి మాత్రం పాడేయ్యడండీ" అంది శైలజ.

"అవునండి మేమూ అలాగే విన్నాం. స్పీడుగా ప్రొడ్యూస్ చెయ్యగలరని" అంది జయశ్రీ

"అందుకే తన ఫ్రెండొకాయన యస్పీ బాలసుబ్రహ్మణ్యంలోని యస్పీ అంటే యమస్పీడు అని అంటూ ఉంటాడు తమాషాగా."

"ఆయనెవరో గానీ అచ్చు మల్లాదిగారిలాగే అన్నాడు కదే?" అంది మౌళవిక జయశ్రీ వంక తిరిగి.

"మల్లాదిగారంటే రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారేనా?"

"అవునండీ. మీరాయన నవలలు చదివారా?"

"చదివానండీ. ఇందాక మీ పేరు విన్నప్పటినించీ అనుకుంటున్నా మల్లాదిగారి నవలల్లోలాగా పేరు భలే కొత్తగా వుందని."

అంతే మౌళవిక మనసు వశం తప్పిపోయింది. మల్లాది పరిచయం అయిన మొదటిరోజు మోటార్ సైకిల్ స్టార్టు చేస్తూ అన్న మాటలు గుర్తొచ్చాయామెకి.

ఆమెలోని ఆ మార్పు గమనిస్తూనే ఉంది శైలజ. "హలో ఏమిటీ అవుటాఫ్ ఫ్యూజ్ అయిపోయారు?" అని అడిగిందామె. ఆమె ఈ లోకంలోకి వచ్చిన తర్వాత.

"మల్లాదిగారంటే మా మౌళవికకి ప్రాణం అండీ. ఆ ప్రభావమే అది" అంది జయశ్రీ సిగ్గుపడుతున్న మౌళవికని కవర్ చేస్తూ.

"నాకూ ఓ ఫ్రెండుందండీ వైజంతి అని. ఆమెక్కూడా మల్లాదిగారి రచనలంటే ఎంతో ఇష్టం. మీకు తెలుసుగా అమరసందేశం, దాగుడుమూతలు, అబ్బాయిగారు - అమ్మాయిగారు సినిమాలు తీశారు. డి.బి.నారాయణగారని, ఆయన బ్రదర్ డాటర్లెండి. ఇప్పుడు విజయవాడలో ఉంటోంది. ఒకసారి నేను చక్రవర్తిగారి మ్యూజికల్ నైట్‌కని వెళ్ళినప్పుడు నన్ను కలవడానికి వచ్చిందావిడ. ఆ రోజు విజయవాడ జనరంజనిలో మల్లాదిగారితో ఇంటర్వ్యూ ప్రసారం అయింది. ఇక చూడాలి ఆవిడ గాభరా. అప్పటికప్పుడు నా దగ్గరున్న ఓ టేపు తీసుకుని రికార్డు చేసుకునేదాకా ఎవ్వర్నీ ఊపిరి తీసుకోనిచ్చింది కాదనుకోండి."

మౌళవిక ముఖం వెయ్యి ట్యూబ్ లైట్లు ఒక్కసారిగా వెలిగినంత కాంతి కనిపించింది. "నాక్కూడా అర్థమయింది" అన్నట్టుగా ఆమె చేతిని నొక్కుతూ అడిగింది జయశ్రీ

"విజయవాడలో ఎక్కడుంటారండీ ఆవిడ?"

"అడ్రస్సు కరెక్టుగా నాకిప్పుడు గుర్తులేదుకానీ వాళ్ళాయన శశికాంత్ శాతకర్ణి అని బాలజ్యోతి పిల్లల పత్రికలో పనిచేస్తూ వుంటారు" అంది శైలజ.

"ఉన్నపాటున మాయమై విజయవాడలో ప్రత్యక్షం అవగలిగితే ఎంత బావుండును" అని అనుకుంది మౌళవిక.

"పిల్లల పత్రిక అంటే జ్ఞాపకం వచ్చింది. మీ మొదటి సినిమా 'మార్పు'లో మీతోపాటు ఆ పిల్లల పాట పాడిన మీ సిస్టర్ వసంత, ఇప్పుడు తలుపు తీసిన అమ్మాయి ఒకరేనా అండీ" అందామె తేరుకుని.

అవునన్నట్లుగా తలూపింది శైలజ.

"మరి ఈవిడ సినిమాలో ఎక్కువగా పాడలేదేమండి?"

తను చదువుమీద ఎక్కువగా కాన్సన్‌ట్రేట్ చేస్తుంది. మొన్ననే పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది కూడా. మీకింకో విషయం తెలుసా హైదరాబాద్ టీ.వీల్లో నేను పాడిన పాటల్లో ఒక పాట తానే రాసింది."

"ఏది 'ఈ జగతిలోని అణువణువులోని ప్రతి సడీ సంగీతమే' అదేనాండి?"

"అదికాదండీ 'నిన్ను పిలిచాను ఎదుట నిలిచాను' అనే పాట.

"ఆ.. గుర్తొచ్చిందండీ 'అయినా కానరాకున్నావు. మురళిని మ్రోగించు. జాలిని చూపించు' అని ఆ తర్వాత వస్తుంది కదూ?" అంది మౌళవిక.

శైలజ, జయశ్రీలతోపాటు తన ప్రసక్తిని గదిలోంచి వచ్చిన వసంత మెచ్చుకోలుగా చూసిందామెని, అంతలో తలుపు చప్పుడు.

"మణి అన్నే - అప్పుడే వచ్చేశాడే" అంటూ తలుపు తీసింది వసంత.

"సారీ పిల్లలూ మీ షాపింగ్ మరొక్క రెండు గంటలు లేటవుతుంది" అంటూ అడుగుపెట్టాడు యస్పీ బాలసుబ్రహ్మణ్యం.

"ఇంకా రెండు గంటలా"

"అవునమ్మా ఓ పాట అయిపోయింది. ఆ పాట సుశీలగారితో మిక్స్ చేస్తున్నారు తర్వాత ఆవిడది ఇంకోపాట ఉంది. ఆ తర్వాత నా రెండో పాట అలా ఎడ్జస్టు చెయ్యాల్సి వచ్చింది ఓ గంట గ్యాప్ దొరికింది కదా అని"

మౌళవిక, జయశ్రీలకి ఈ వేగం, ఈ అరేంజ్‌మెంట్‌లు చాలా కొత్తగా ఉన్నాయి.

"ఆ గదిలో కూడా ఫోనుంది కదూ?" అంటూ అటువైపు వెళ్ళబోయాడతను.

"అన్నా వీళ్ళు నీకోసం వచ్చారు" అన్నది వసంత.

"ఓహ్.. నీ ఫ్రెండ్సనుకున్నాను" అంటూ వచ్చి కూచున్నాడు.

"సారీ అండి మీరేదో అర్జంట్‌గా ఫోన్‌లో మాట్లాడాలేమో అంది జయశ్రీ

"ఫర్వాలేదండి.. వన్ మినిట్" అంటూ ఫోన్ ఎత్తి బొంబేకి ఒక కాల్ బుక్ చేసి రూమ్ సర్వీస్‌కి ఫోన్ చేసి "టూ పాట్స్ కాఫీ" అని ఇటువైపు తిరిగి "చెప్పండి" అన్నాడు బాలు.

"అన్నా. ఈవిడ జయశ్రీ ఆవిడ మౌళవిక పేరు తమాషాగా వుందికదూ" అంది శైలజ.

"మల్లాది హీరోయిన్స్‌లాగా" బాలూ కూడా అలాగే అనగానే ముఖం మరింత విప్పారింది మౌళవికకి.

"నిజంగా మౌళవిక కొత్తపేరే. ఇప్పటివరకూ మాళవిక అనే విన్నానుగాని మౌళవిక అని వినటం యిదే ఫస్టు టైమ్" అన్నాడు బాలు.

"మీకు మల్లాదిగారు తెలుసాండి?"

"తెలుసే.. నిన్నరాత్రి ఫంక్షన్‌లో కలిశాను కూడాణు."

"రెండు రెళ్ళు ఆరు హండ్రడ్డేస్ ఫంక్షన్ కదండీ."

"ఆ.. అక్కడే చూశానాయన్ని. హోటల్ ఫ్రామ్ గ్రోవ్‌లో" అన్నాడు బాలు.

"ఎలా ఉన్నారండీ ఆయన?" అంది మౌళవిక.

"ఫస్టుక్లాస్‌గా ఉన్నాడు. ఏం ఆయన మీకు తెలుసా?"

"అబ్బెబ్బే అది కాదండి చూడ్డానికి ఆయన ఎలా ఉంటారూ అని అడుగుతోంది" అని సర్దిచెప్పింది జయశ్రీ

"మంచి పొడవు, వెడల్పు చక్కటి పర్సనాలిటీ. తెల్లగా"

"మరి కళ్ళజోడు?"

"అది ఆయనకి కవచకుండలాల్లాగా ఎప్పుడూ ఉంటూ ఉంటుంది కదండీ. ఇంకా బాగా మాట్లాడతాడు"

మౌళవికకి ఆ వర్ణన ఎంతో తృప్తి కలిగించింది. 'ఇక లేద్దామా' అన్నట్టు జయశ్రీ వంక చూసింది వచ్చిన పని వదిలేసి.

ఇంతలో యోగానంద్. "ఎవరు శాస్త్రా? నేను బాలూని. జంధ్యాలగారున్నారా. ఆ.. తెలుసు. ఏదయినా గ్యాప్‌లో వెనక్కి వచ్చారేమోనని. నేను రేపు మార్నింగ్ ఫ్లయిట్‌లో వస్తున్నాను. ఈలోగా జానకిగారి పాటలు అయిపోతాయి కదూ. ఓ.కే ఆవిడెంతసేపు. ఈవినింగ్ కల్లా మొత్తం ఫినిష్ చేసేస్తారు ఓ..కే.. రేపొస్తున్నాను. జంధ్యాలగారికి చెప్పండి" అని ఫోన్ పెట్టేశాడు.

"జంధ్యాలగారు బాంబేలో ఉన్నారాండీ?" అడిగింది జయశ్రీ మెల్లగా నాలుక కొరుక్కుంది మౌళవిక.

జంధ్యాలగారి ప్రసక్తి తీసుకురాకుండా వెళ్దామని సంజ్ఞ చేసినందుకు.

"అవునండి. నటరత్న అనే సినిమాకి ఫస్టు టైమ్ ఆర్డీ బర్మన్ గారు తెలుగు సినిమాకి మ్యూజిక్ చేస్తున్నారు. ఆ పాటల రికార్డింగ్‌లో ఉన్నాడాయన.

"ఎక్కడండి?"

"అదే బాంబే ఫిల్మ్ సెంటర్ రికార్డింగ్ స్టూడియోలో అవుతోంది రికార్డింగ్.

"జంధ్యాలగారు అక్కడ దొరుకుతారాండి?"

"రికార్డింగ్ థియేటర్‌లో లేకపోతే బాంద్రాలో సిరాక్ హోటల్లో ఉంటారాయన. ఆయనతో ఫోన్‌లో మాట్లాడతారా?"

"లేదండి పర్సనల్‌గా కలవాలి" అంది జయశ్రీ.

"రేపు సాయంత్రం దాకా ఆయన బాంబేలోనే ఉంటారండి."

"మరి ఎల్లుండి మద్రాసు వస్తారో, ఇంకెక్కడికెళ్తారో తెలీదు."

"బట్. మరో రెండు మూడు రోజుల్లో ఆయన అమెరికా వెళుతున్నారు."

కాఫీ వచ్చింది. డికాషన్, పాలు, షుగర్ క్యూబ్స్ అన్నీ బాలుయే మిక్స్ చేసి 'తీసుకోండి' అన్నాడు. అంతవరకు ప్రశ్నోత్తరాలతో వడగళ్ళ వానలా ఉన్న వాతావరణం నిశ్శబ్దంగా మారిపోయింది వరద తీసిన పిల్ల కాలువలా.

"మేం వస్తామండి. మాతో ఇంతసేపు మాట్లాడినందుకు చాలా థాంక్స్" అంది జయశ్రీ కాఫీల పర్వం ముగియగానే.

"అరె. మేమూ మనుషులమేనండీ. వు ఆల్సో వాంట్ పీపుల్" అన్నాడు బాలు నమ్రతగా. శైలజ, వసంత కూడా 'ఇక ఉంటాం' అన్నట్లు తలూపారు.

"ఇప్పుడేం చేద్దామ జై. బాంబే పోదామా? విజయవాడా?" అంది మౌళవిక లిఫ్టులో దిగుతూ.

జయశ్రీ ఆశ్చర్యంగా చూసిందామెవైపు. "నీకేమయినా పిచ్చెక్కిందా కొంపదీసి?" అంది.

"లేదు జై. వెళ్ళి తీరాలి"

"అలా ఆయన అవునో కాదో తెలుసుకోవడానికి ఎన్ని ఊళ్ళని తిరుగుతావు?"

"ఎన్ని ఊళ్ళు, ఎంత ఖర్చు అని ఆలోచించడంలేదు. ఆయన మల్లాది అవునో కాదో అన్నది ఎంత తొందరగా క్లియర్ అవుతుందా అనే నా బాధ. నీకు తెలుసుగా జై.. నేనెంత టార్చర్ ఫీలవుతున్నానో" అన్నదామె దీనంగా.

జయశ్రీ కరిగిపోయింది. ఆమె కంఠంలో ధ్వనించిన ఆ ఆర్ద్రతకి. "ఓ..కే విక్కీ.. ముందు బాంబే వెళ్తేనే బావుండేటట్టుంది. ఎందుకంటే మరో రెండు రోజుల్లో జంధ్యాలగారు అమెరికా వెళ్ళిపోతున్నారు కాబట్టి ఫస్ట్ ఆయన్నే చూద్దాం" అంది.

వెంటనే మౌళవిక రెసెప్షనిస్టు దగ్గరకెళ్ళి ఫ్లయిట్ యెన్ని గంటలకుందో కనుక్కుంది. "ఇలారా జై ఇక్కడ కూర్చుని మాట్లాడదాం" అంటూ ఎదురుగా ఉన్న సోఫాలవైపు నడిచింది.

"మరి బాంబే వెళ్ళిరావడానికి టిక్కెట్లు, డబ్బు దస్కం అన్నీ చూసుకోవద్దూ?"

"నో ప్రాబ్లం. నా దగ్గర యింట్లో వెయ్యిరూపాయలదాకా కేష్ వుంది. అది మనం బాంబేకి, విజయవాడకి వెళ్ళడానికి సరిపోతుంది.

"ఆ వెయ్యి మన ఖర్చులకి. నా దగ్గర డాడీ బ్యాంక్ కార్డ్ ఉంది. అందులో యాడ్ ఆన్ మెంబర్స్‌లో డాడీ నా పేరు కూడా చేర్చారు కాబట్టి ఫ్లయిట్ టిక్కెట్లు క్రెడిట్‌లో తీసుకుంటాను" అంది మౌళవిక.

"మీ డాడీ ఆ బిల్లు చూసి అడిగితే?"

"బాంబే నుంచి రాగానే నా బ్యాంక్ అకౌంట్ లోంచి డ్రా చేసి కట్టేసి మా అకౌంటెంట్‌కి ఫోన్ చేస్తాను. దాంతో బిల్లు డాడీ దాకా వెళ్ళదనే నా ఉద్దేశ్యం. ఒకవేళ ఆయన తర్వాత అడిగినా ఏ స్నేహితురాలి పెళ్ళికో సడెన్‌గా వెళ్ళాల్సి వచ్చింది అని చెప్తాను. ఏం అనర్లే" అంది మౌళవిక నిశ్చయంగా.

జయశ్రీ ఆనందంతో ఉప్పొంగిపోయింది. మల్లాది విషయంలో ఆమె చూపిస్తున్న శ్రద్ధకి, ఏకాగ్రతకి, కొన్ని కొన్ని సమయాలలో ఆమె తీసుకుంటున్న నిశితమైన నిర్ణయాలకి.

"జై. ఇప్పుడో పని చేద్దాం. నేనిలా డైరెక్ట్‌గా ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళి టిక్కెట్లు కొని బోర్డింగ్ పాస్ తీసుకుని రెడీగా ఉంటాను. నువ్వింటికి వెళ్ళి నా బీరువాలో ఉంచిన కేష్ తీసుకుని వచ్చెయ్" అంది తాళాలు యిస్తీ.

"ఎందుకన్నా మంచిది నా బ్రీఫ్ కేసులో నీవి నావి ఓ జత చీరలు వేసుకొచ్చేసాను చేతికాపుకి."

"ఎందుకూ నైట్ కల్లా రిటర్న్ అయిపోతాం."

"రేపొద్దున్న మీ డాడీ అడిగితే యాదగిరి సాక్ష్యం ఇవ్వద్దూ" అంది జయశ్రీ

కాలానికి కళ్ళెం, వేగానికి వంతెన వేస్తున్నంత స్పీడుగా దూసుకుపోయారిద్దరూ చెరోవైపుకి.

సుమారు గంటంపావు గడించింది.

ఎయిర్‌పోర్టులో అసీజీగా తిరుగుతోంది మౌళవిక. అప్పటికే రెండు అనౌన్స్‌మెంట్స్ యిచ్చేశారు.

మరొక్క మూడు నిమిషాల్లో సెక్యూరిటీ తలుపు వేసేస్తారనగా ఆటో దిగింది జయశ్రీ బ్రీఫ్ కేసుతో.

అప్పటికే బోర్డింగ్ పాస్, లగేజ్ టాగ్ తీసేసుకుని ఉండటం వల్ల లోపలికి వెళ్ళడం పెద్ద కష్టమేం కాలేదు. సెక్యూరిటీ దాటుతుండగా తమ పేర్లు ఫైనల్ అనౌన్సుమెంట్‌లో చెప్పడం ఇద్దరికీ వినిపించింది.

"ఎందుకింత ఆలస్యం అయింది?" అంది మౌళవిక కూచుని స్థిమితపడ్డాక.

"ఏం చెయ్యను మరి. అవతల యాదగిరి సవాలక్ష ప్రశ్నలతో ప్రాణం తీసేస్తుంటే ఎక్కడికెళ్తున్నారు? ఎవరి పెళ్ళి? అడ్రసు ఏమిటి? వాళ్ళింట్లోగాని, పక్కింట్లోగాని ఫోన్ వుందా? అయ్యగారొస్తే ఎప్పుడొస్తారని చెప్పమంటారు? రంపంలా కోసేసాడనుకో."

"అందులో మనం నిజంగా విసుక్కోడానికేం లేదు జై. హీ హాజ్ బీన్ పెయిడ్ ఫర్ దట్.. దటీజ్ హిజ్ డ్యూటీ."

**"నేను పెద్దగా** విసుక్కోలేదులే - ఈలోగా బయల్దేరుతుంటే మీ డాడీ ఫోన్. అఫ్ కోర్స్. ఫోన్‌లో కూడా అదే అబద్దం మెయిన్‌టెయిన్ చేశాన్లే. ప్రస్తుతానికి ప్రోబ్లెమ్ లేనట్లే."

వింటున్న మౌళవిక సీటుకి చేరబడి నీరసంగా కళ్ళుమూసుకుంది.

ఇంకా ఏదో చెప్పాలనుకున్న జయశ్రీ ఊరుకుంది ఆమె పరిస్థితి చూసి.

ఫిల్మ్ సెంటర్ రికార్డింగ్ స్టూడియోలోకి ప్రవేశం సులువుగానే దొరికింది ఇద్దరికీ. కారణం ఇద్దరూ ఆడపిల్లలు కావటం, జంధ్యాల, ఆర్డీ బర్మన్, నటరత్న, జంధ్యాల అసిస్టెంట్ శాస్త్రి పేర్లు సమయానికి వీళ్ళు చెప్పగలగటం.

"ఇధర్ జంధ్యాల కా అసిస్టెంట్ శాస్త్రి కహామిల్తే" అని జయశ్రీ అడిగింది బాణంలా దూసుకుపోతున్న ఓ సన్నటి కళ్ళజోడు కుర్రాణ్ణి.

"నేనే శాస్త్రిని చెప్పండి" అన్నాడతను.

ఆశ్చర్యంగా ఇద్దరూ ముఖాలు చూసుకున్నారు. వెదకబోయిన తీగ కాలిగి తగిలినందుకు. హిందీలో అడిగితే అతడు తెలుగులో సమాధానం చెప్పినందుకు.

"మీ డిక్షన్ ఈ హైదరాబాద్ శ్లాంగ్ మన చెవికి కొట్టిందిలెండి రండి" అంటూ అతడే సందేహ నివృత్తి చేసి ముందుకు తీసుకు వెళ్ళాడు.

"ఆయనే జంధ్యాలగారు" అంటూ చూపించాడు. వరండాలో త్రిబుల్ ఫైవ్ సిగరెట్ కాల్చుకుంటున్న ఒకాయన్ని చూపించి.

"నమస్కారం సార్" అన్నారిద్దరూ.

"సార్ హైదరాబాద్‌నుంచి."

"ఆదరాబాదరాగా వచ్చారా" అన్నాడు జంధ్యాల సరదాగా సన్నటి చిరునవ్వుతో.

"అవునండీ. మీరు ఫ్రీగా ఉంటే ఒక్క అయిదు నిమిషాలు మీతో మాట్లాడాలి."

"శాస్త్రి! లోపల పాట రిహార్సిల్ ఎంతవరకూ వచ్చాయో కనుక్కో" అని అతడికి చెప్పి 'రండి ఆ లాన్‌లో కూచుందాం' అన్నారాయన.

"మీ సినిమాలు అవీ చూస్తుంటాం. శ్రీవారికి ప్రేమలేఖలో 'నిన్ననే వచ్చి మెట్లకింద దాక్కున్నాను' అనే వీరభద్రరావు డైలాగు మా నాన్నగారు ఎప్పుడూ తల్చుకుంటూ ఉంటారు. అలాగే 'రెండురెళ్ళు ఆరు'లో చొక్కాలు చింపుకోవటంకూడా" అని ప్రారంభించింది మౌళవిక.

"మీ ఫాదర్ ఏం చేస్తుంటారు?"

"బిజినెస్ బాలానగర్‌లో పార్థసారథి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ మాదే"

"యస్.. నేనూ విన్నానా పేరు. బాంబే ఏదయినా పని మీదొచ్చారా?" అన్నారు జంధ్యాల సిగరెట్ పారేస్తూ.

"ఓ ఫ్రెండ్ మ్యారేజ్ ఉంటేను ఇలా వచ్చి మీరు ఇక్కడున్నారని తెలిసి మిమ్మల్ని చూద్దామని" అంది జయశ్రీ

"మల్లాదిగారు మాకు బాగా తెలుసండి. మీ గురించి చెపుతుంటారు అప్పుడప్పుడు" అంది మౌళవిక.

"అలాగా!"

"ఓసారి మేం పిక్నిక్ వెళ్ళినప్పుడు మీరు అశోకా హోటల్లో ఆదివిష్ణుగార్ని 'ఒకటి రెండు మూడు' అనడం ఇన్సిడెంట్ చెప్పారు. మాకెందుకో బాగా హత్తుకుపోయింది ఆ రోజు మీరు చేసిన ఆ మేజిక్."

"అదా.. ఏదో ఫ్రెండ్స్ మధ్య సరదాగా కాలక్షేపం అన్నారు జంధ్యాల ఇంకో సిగరెట్ వెలిగిస్తూ."

"మల్లాదిగారు మీకు బాగా ఫ్రెండా అండీ?"

"విజయవాడలో మేం చదివింది ఒకే కాలేజీలోనండీ?"

మౌళవిక సంతోషానికి అవధులు లేవు. ఆమె మనసులో మల్లాది రూపం నిముషానికి కోటిసార్లు ప్రింట్ అవుతోంది.

"సార్ టేక్ తీస్తారట" అంటూ వచ్చి చెప్పాడు శాస్త్రి.

"లోపల జానకిగారి పాట వుంది. వస్తారా?" అని అడిగారు జంధ్యాల.

"రావాలనే ఉందిగాని నెక్స్ట్ ఫ్లయిట్‌కి టైమ్ అయిపోతోందండీ" అంది జయశ్రీ

"ఓ...కే ఉంటానండి. శాస్త్రీ వీళ్ళని డ్రాప్ చేసే కార్యక్రమాన్ని చూడు."

"అదేనండి ప్రొడ్యూసర్ గారు మనకి ఉంచిన కారు కనిపించడంలేదు" అన్నాడు శాస్త్రి.

"అది కాకపోతే ఇంకోటి."

"అక్కడో కారు ఇందాకటి నుంచీ ఖాళీగా ఉందండి అది ప్రొడ్యూసర్‌గారిదే అనుకుంటా."

"ఓ పని చెయ్యి. ఆ కారు నెంబర్ ఆర్.టి.ఓ ఆఫీసుకు తీసుకెళ్ళి ఇది ఆయన పేరు మీద ఉందోలేదో కనుక్కో. ఇటీజ్ వెరీ సింపుల్" అని నవ్వుతూ చేతిలోని సిగరెట్ పారేసి లోపలికి వెళ్ళిపోయాడు జంధ్యాల.

శాస్త్రికి జంధ్యాల టైపు జోకులు అలవాటే కనుక వెంటనే నవ్వేశాడు. అది జోక్ అని అర్థం చేసుకోవడానికి ఓ రెండు క్షణాలు పట్టింది మౌళవికకి, జయశ్రీకి.

"మీ డైరెక్టర్‌గారు భలేగా జోక్ చేస్తారే?" అంది ఆమె క్షణం తర్వాత.

"మేము ఇల్లూ వాకిలి కూడా మర్చిపోయి నెలల తరబడి ఎలా బయట ఉండగలం అనుకుంటున్నారు? ఈయనతో వర్క్ అంటే మాకు అందుకే ఎంతో సర్దాగా వుంటుంది" అన్నాడు శాస్త్రి కారెక్కేస్తూ.

అనుకున్న పని ముందే అయిపోవడం వలన కన్ఫర్మ్‌డ్ టిక్కెట్లు ఉండటం వల్ల తిరుగు ప్రయాణం కూడా సునాయసంగా గడిచింది ఇద్దరికీ. "చాలా చిత్రంగా వుంది కదూ. ఉదయం మద్రాస్ నుంచి వచ్చిన బాలుగార్ని కలుసుకుని మధ్యాహ్నం బాంబేకి వెళ్ళి జంధ్యాల గారిని కలుసుకుని రాత్రికల్లా హైదరాబాద్ వచ్చెయ్యటం" అంది జయశ్రీ బేగం పేట ఎయిర్ పోర్టులో దిగాక.

"జానకిగారి పాటకూడా చూడాల్సింది."

"రిటర్న్ ఫ్లయిట్‌కి మనకి ఎంత టైముందని ఏదో మల్లాదిగారు తెలుసనేసరికి కారిచ్చారు కాబట్టి సరిపోయిందిగాని లేకపోతే జంధ్యాలగారన్నట్టు ఆదరాబాదరా అని తెగ చచ్చేవాళ్ళంకదూ? పైగా విజయవాడ కూడా వెళ్ళి తీరాలంటివే నువ్వు?"

"అవును, డెఫినెట్‌గా వెళ్ళితీరాలి. ఆ టేప్‌లో మల్లాదిగారి గొంతు విని తీరాలి."

"అక్కడితో నీకు మైండ్ క్లియర్ అయిపోయినట్టేనా?"

"ఇంకొక్కటుంది. ఇందాక జంధ్యాలగారు అంటుంటే తట్టింది. విజయవాడనుంచి వచ్చాక ఆర్.టి.ఒ ఆఫీసుకి వెళ్ళి మన మల్లాదిగారు వాడే రాజ్‌దూత్ ఎ.బి.యక్స్ 9570 ఆయన పేరు మీద రిజిష్టర్ అయిందో లేదో కొంత క్లూ దొరుకుతుందేమో" అంది మౌళవిక.

"ఎక్కడెక్కడికి ముడిపెట్టి ఆలోచిస్తోంది" అని అనుకుంది జయశ్రీ సంభ్రామాశ్చర్యంతో.

"నా ఊహలకి మించి ఎగిరిపోతున్నావు విక్కీ! నీకు డెఫినెట్‌గా మంచే జరుగుతుంది. అభీ చలో విజయవాడ" అందామె హుషారుగా.

మరో అరగంటలో వారెక్కిన ప్రయివేట్ బస్సు విజయవాడకి పయనిస్తోంది.

## 13

మలక్ పేట రోడ్ దాటగానే "ఠప్"మని లైట్లు ఆర్పేశాడు కండక్టర్.

"ఛస్.. అంటూ చేతిలోని పుస్తకంతో గట్టిగా కొట్టుకున్నాడు ఓ కుర్రాడు.

మౌళవిక, జయశ్రీ ఇద్దరూ అతడివైపు తిరిగారు ఒకేసారి "ఏమిటి బాబూ" అంటూ.

"కనీసం హయత్ నగర్ వెళ్ళేవరకూ లైట్లు ఉంచొచ్చు కదా. కథ మంచి సస్పెన్స్‌లో ఉండగా ఆగిపోయింది" అని విసుకున్నాడతను.

సుమారు పదేళ్ళుంటాయతనికి. బస్సు బయల్దేరుతుండగా ఆకరి నిమిషంలో వచ్చి ఎక్కాడు. అదే సమయంలో బస్సు మలుపు తిరుగుతుండటం వల్ల తూలిపడబోతుంటే మౌళవిక అతడిని పట్టుకుని ఆపింది. 'థాంక్స్' చెప్పి సీట్లో కూచుని సెటిల్ అయి చందమామ చదువుతుండగా లైటు ఆర్పేశాడు కండక్టర్.

"ఇంతలేవు. నీకు సస్పెన్స్, థ్రిల్లునా?" అంది మౌళవిక సరదాగా.

బస్సులో లైటు డిమ్‌గా వెలుగుతోంది. కిటికీలోంచి చల్లటిగాలి హాయిగా తగుల్తోంది. స్పీకర్స్‌లోంచి పాటలు వినిపిస్తున్నాయి. ఆ పాటలకు ఎలాగూ నిద్రపట్టేట్టు లేదు. కనీసం కాలక్షేపం అయినా అవుతుందని పలకరించిందామె సరదాగా.

"ఏం ఉండకూడదా?" అని ఎదురు ప్రశ్న వేశాడాకుర్రాడు.

"అహ. కాదు గాని ఏం కథ అని?"

"బేతాళ కథ."

"అబ్బో.. బేతాళ కథే నీకు అర్థం అవుతుందా?" అడిగింది జయశ్రీ

"ఎందుక్కాదు? అయినా ప్రతి ఆదివారం టీవీలో విక్రమ్ ఔర్ బేతాళ్ చూట్టంలేదూ? అలాగే ఇదీను."

"అది చూస్తున్నావుగా, మళ్ళీ ఇదెందుకు?"

"ఇది చాలా పాత చందమామ. ఈ బేతాళ కథలకోసం అబిడ్స్‌లో ఫుట్‌పాత్ మీద మొన్ననే ఓ పది కొన్నా" అన్నాడు కుర్రాడు.

"నీకు పుస్తకాలు చదవడం అంటే బాగా యిష్టంగా ఉందే?" అంది మౌళవిక.

"కాదు సినిమాలు చూడ్డం అంటే కూడా."

"వెరీగుడ్ అయితే మనిద్దరం ఫ్రెండ్స్ అన్నమాట" అందామె హుషారుగా.

"ఇప్పుడా! మనిద్దరం ఎప్పట్నించో ఫ్రెండ్స్ కదా?"

"ఎప్పట్నించోనా? అంటే?"

"అంటే నేను పడిపోకుండా మీరు పట్టుకున్నప్పట్నించి" అంటూ గలగలా నవ్వేశాడు కుర్రాడు.

మౌళవిక నవ్వు ఆపుకోలేకపోయింది. 'భలే సరదాగా మాట్లాడుతున్నాడు కదే?" అంది జయశ్రీ వైపు తిరిగి.

"మల్లాదిలాగా అని అనమంటావా?" అందామె మౌళవిక చెవిలో రహస్యంగా.

వెంటనే ఆమె కళ్ళలో అతని రూపం ప్రత్యక్షం అయింది. "మన పెళ్ళయ్యాక ఇలాగే రాత్రిపూట బస్సులో కూచుని ఈ డిమ్ లైట్ల మధ్య కబుర్లు చెప్పుకుంటూ ఎక్కడికైనా వెళ్దామా?" అంటూ అతడు అడిగినట్లు అనిపించింది. అంత మసక వెలుతురులోనూ మౌళవిక నవ్వటం, ఆమె దొంతి పన్ను మెరియటం జయశ్రీకి స్పష్టంగా కనిపించింది.

"ఏవండోయ్ చెప్పండీ మనం ఫ్రెండ్స్‌కదా" అని అడిగాడా కుర్రాడు గట్టిగా.

దెబ్బతో ఈ లోకంలోకి వచ్చి పడిందామె. బస్సులో ఇద్దరు ముగ్గురు ఒక్కసారి ఉలిక్కిపడి చూసినా 'పోనీలే కుర్రాడు' అని సర్దుకుని తిరిగి నిద్రలోకి జారుకున్నారు.

"ఎందుక్కాదు? నా పేరు మౌళవిక, ఈవిడ పేరు జయశ్రీ మరి నీ పేరు?"

"నా పేరు ప్రశాంత్"

"చాలా బావుంది నీ పేరు" మది మౌలవిక.

"థాంక్యూ .. షేమ్ టు యూ.. షేమ్ టు యూ."

కళ్ళు చిన్నవి చేసి అతడివైపు చూసిందామె. ఏమిటిలా అంటున్నాడు అన్నట్లు.

"సేమ్ టు యూ అని అనాలి" అని దిద్దింది తర్వాత.

"అది నాకూ తెలుసు. మీరింత మంచి పేరు పెట్టుకుని నా పేరు బావుందంటారే. అందుకే షేమ్ టు యూ అని కావాలాని అన్నా" అని అన్నాడు ప్రశాంత్.

"కుర్రాడు కత్తిలా ఉన్నాడు" అంది జయశ్రీ

"టైమ్‌కి కంట్రోల్ చెయ్యకపోతే సుత్తిలా కూడా అయిపోతా చూస్కోండి మరి."

ఆ... అంత మొనగాడివా. ఏది నేనో వాక్యం తప్పుగా చెప్తాను దాన్ని కరెక్టు చేయగలవా. దాన్ని నువ్వు మళ్ళీ తప్పు మీనింగ్ వచ్చేట్టు అరేంజ్ చెయ్యకూడదు మరి. ఓ..కే?" అంది మౌళవిక.

"ఓ...కే"

"బర్న్ వుడ్ కాంట్ డ్రై. చెప్పు చూద్దాం."

"ఆంటీ దీన్ని అరేంజ్ చేస్తే డ్రై వుడ్ కాంట్ బర్న్ అని వస్తుంది. దాని మీనింగ్ తప్పు ఇలాంటివి టెస్టు యువర్ సెల్ఫ్ అనే పుస్తకంలో జనరల్ ఇంటలిజెన్స్ చాప్టర్‌లో ఉన్నాయి. ఆ పుస్తకం అబిడ్స్‌లో రోడ్డుమీద దొరుకుతుంది. కరెక్టేనా?" అన్నాడు ప్రశాంత్.

మౌళవిక, జయశ్రీ ఇద్దరూ ఒకర్నొకరు "గట్టిపిండమే" అన్నట్లు చూసుకున్నారు.

"మనకెందుకు ఆంటీ ఆ ఫారిన్ ఫజిల్స్. బుర్రలో సరుకుండాలేగానీ ఇండియన్ ఫజిల్స్‌లోనే అదరగొట్టచ్చు తెలుసా?

"ఏదీ ఒకటి చెప్పు చూద్దాం" అందామె.

"మీరు షోలే సినిమా చూశారా?"

"ఆహా"

"ఎన్నిసార్లు? "

"ఓ నాలుగయిదు సార్లు" అంది మౌళవిక.

"అయితే మొత్తం సినిమా బాగా గుర్తుండి ఉండాలే"

"బ్రహ్మాండంగా గుర్తుంది"

"అసలు విషయం చెప్పు మరి."

"జాగ్రత్తగా వినండి చెప్తాను. ఎన్.టి.ఆర్‌లా మాట్లాడాను కదూ దీన్నే 'తెలుగు తెలుగు' అంటారుట. షోలే చివరి సీను గుర్తుందా?" అని అడిగాడూ ప్రశాంత్.

"ఊఁ.. అమ్‌జాద్ ఖాన్, ధర్మేంద్ర కొట్టుకుంటారు."

"అంతకుముందు?"

"అమితాబ్ చచ్చిపోతాడు."

"అప్పుడు జయబాధురి ఏడుస్తూంటే సంజీవ్ కుమార్ ఏడుస్తాడు గుర్తుందా?"

"యస్... అయితే ఏవిటట?"

"ఏం లేదూ అప్పుడు జయబాధురిని సంజీవ్ కుమార్ ఉత్తర భారతదేశపు పద్దతిలో ఓదారుస్తాడా, దక్షిణ భారతదేశపు పద్దతిలో ఓదారుస్తాడా?"

"అంటే నాకర్థంకాలేదు" అంది మౌళవిక.

"ఉత్తర భారదేశ పద్దతి అంటే తలమీద చెయ్యివేసి నిమిరి ఓదార్చడం, దక్షిణ భారతదేశ పద్దతి అంటే మన సినిమాలో చూస్తున్నాంగా అన్నయినా, చెల్లయినా ఎవరికి ఎవరయినా మగాడి గుండెలమీద ఆడది పడిపోయి ఏడవాల్సిందే ఆమెని గట్టిగా పట్టుకోవాల్సిందే"

మౌళవిక, జయశ్రీ ఇద్దరూ ఒకేసారి సిగ్గుపడిపోయారు ఆకుర్రాడి లాంగ్వేజికి.

"వేలెడు లేవు. ఇలాంటి మాటలు మాట్లాడొచ్చా?" అంది జయశ్రీ

"నాలాంటి కుర్రాళ్ళతో ఏ సర్టిఫికెట్ సినిమాలు తియ్యగాలేంది నేను మాట్లాడితే తప్పా? సరిసరి తప్పుకోడానికి ఎత్తులు వేయకండి. టాపిక్ మార్చకుండా ఆన్సర్ చెప్పండి" అన్నాడు ప్రశాంత్ స్టయిల్‌గా.

"ఇంతకీ ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశం ఎందుకొచ్చింది?"

"ఎందుకా యాక్టు చేసింది బాంబేవాళ్ళు కనుక ఉత్తర భారతదేశం. ఆ సీను తీసింది బెంగుళూరులో కనుక దక్షిణ భారతదేశం."

మౌళవిక, జయశ్రీ ఈ అయిదు నిమిషాలపాటు తర్జన భర్జన పడ్డారు.

"ఎంత బెంగుళూరులో తీసినా జయబాధురి అలాంటి ఓవరాక్షన్‌కి ఒప్పుకోదు కనుక ఉత్తర భారతదేశ పద్ధతి ప్రకారమే ఓదార్చాడు" అని అన్నారు.

"అయితే తలమీద చెయ్యివేసి నిమిరే ఓదార్చాడంటారు"

"అవును" అన్నారిద్దరూ దృఢంగా.

"అయితే పప్పులో కాలేశారు. ఆ సీన్‌లో సంజీవ్ కుమార్‌కి అసలు చేతులే వుండవుగా" అన్నాడు ప్రశాంత్ కాలర్ ఎగరేసి.

"సినిమా విషయంలో నిన్ను మట్టి కరిపించాడంటే వీడెవడో అసాధ్యుడేనేవ్"

"అవునండీ నేను పాపం అసాధ్యుణ్ణేనట"

మౌళవిక మళ్ళీ నవ్వింది ఆ కుర్రాడి మాటలకి, "ఓ...కే ఇప్పుడు నేనో ప్రశ్న వేస్తాను చెప్పు. విజయనిర్మలా" అని అంటుండగానే అందుకున్నాడు ప్రశాంత్.

"కృష్ణకూతురిగా నటించిన చిత్రం 'పాపకోసం' అండి.

సంభ్రమం, ఆశ్చర్యం, దిగ్భ్రమలాంటి పదాలకన్నా గొప్పదయిన పదం ఏదైనా ఉంటే దాన్ని ఉపయోగించవచ్చు ఆ క్షణంలో మౌళవిక, జయశ్రీల ముఖంలో కనబడిన భావానికి.

"నేను అడుగుదామనుకుంటున్న ప్రశ్నకూడా ఎలా తెలిసింది నీకు?"

"ఎలాగేమీటి? విజయనిర్మల, కృష్ణమీద కలిసి కంబైన్డ్‌గా ఉన్న క్విజ్ అదొక్కటే కనుక."

"నీతో లాభంలేదుగాని నువ్వే ఇంకోటేదయినా చెప్పు" అన్నారిద్దరూ ఓటమిని ఒప్పుకుంటూ.

"తెల్లగా వున్న ఓ భారతదేశపు అమ్మాయిని ఇంకా తెల్లగా వున్న ఓ అమెరికన్ పెళ్ళి చేసుకున్నాడట. వారికో కొడుకు పుట్టాడు. అప్పుడే పుట్టిన ఆ కుర్రాడికి జుట్టు బ్రౌన్ కలర్‌లో వుందట. మరి బుగ్గలు ఏ కలర్‌లో ఉంటాయి?"

"తెల్లతెల్లగా కొద్దిగా ఎర్రగా."

"కళ్ళు?"

"బ్రౌన్ కలర్‌లో"

"చేతులు?"

"తెల్లగా?"

"కాళ్ళు?"

"తెల్లగా."

"గోళ్ళు?"

"తెల్లగా."

"పళ్ళు?"

"పళ్ళు ఇంకో కలర్‌లో ఉంటాయేమిటి తెల్లగానే ఉంటాయి"

"అక్కడే దెబ్బతిన్నారు. గారపట్టి నల్లగా ఉండకూడదా?" అన్నాడు ప్రశాంత్.

"అప్పుడే పుట్టిన పిల్లాడికి పళ్ళు ఎలా గారపడతాయి? ఇంపాసిబుల్" అంది మౌళవిక.

"అప్పుడే పుట్టిన పిల్లాడికి పళ్ళు ఉండగాలేనిది గారపడితే తప్పేముంది ఆంటీ?"

ఈసారి ఇద్దరూ చాలా గట్టిగానే నాలిక కొరుక్కున్నారు.

"కొన్నాళ్ళు వీడి శిష్యరికం చేయక తప్పదే మనకి" అంటూ 'మరోటి చెప్పండి గురూజీ' అని మళ్ళీ రిక్వెస్టు చేశారు.

"ఓ ధనవంతుడికి ముగ్గురు కొడుకులున్నారు. మొదటివాడికి పదాహారేళ్ళు, రెండోవాడికి తొమ్మిదేళ్ళు, మూడోవాడికి రెండేళ్ళు ఓసారి మొదటివాడు భాగాలు వేశాడు. రెండోవాడు పంచాడు. మూడోవాడు తీసుకుంటూ 'నాకు ఆరు వచ్చాయి' అన్నాడు ఇప్పుడు చెప్పండి ఎవరెవరికి ఎన్నెన్ని వచ్చాయో?"

**"ఇందులో ఏదో** తిరకాసుందే ముగ్గురి వయసులలోనూ ఏడేసి ఏళ్ళు తేడా వుంది. తొమ్మిది తెచ్చాడు నిష్పత్తి కడితే" అని ఆలోచించసాగింది జయశ్రీ.

"ఎంత నిష్పత్తి కట్టిన ఆఖరివాడికి ఆరెందుకు వస్తాయే? అలా అయితే రెండోవాడికి రెండు, మొదటివాడికి ఒకటి వస్తాయో? ఖచ్చితంగా ఇందులో ఏదో మతలబు ఉంది. బాబూ ప్రశాంతూ మళ్ళీ ఓడిపోయాంగానీ నువ్వే చెప్పేద్దూ" అని బ్రతిమాలింది మౌళవిక.

"ఏం లేదు. ఇది చాలా సింపుల్ ఆఖరివాడి వయసు రెండేళ్ళే కదా! అందునుంచి లెక్కలు, అంకెలు సరిగ్గా రావు అంతే అదే దీని ఆన్సరు."

"ఓహ్" అంటూ కడుపు పట్టుకుని నవ్వసాగారిద్దరూ. బస్సులో కునికిపాట్లు పడుతున్నవారు కొద్దిగా లేచి "ష్" అన్నారు మర్యాదతో కూడిన మందలింపుతో. చేత్తో నోరు నొక్కుకుంటూ పొట్ట ఒత్తుకుంటూ నానా అవస్థపడ్డారు ఆ అమ్మాయిలిద్దరూ ఓ అయిదు నిమిషాలపాటు.

"ప్రశాంత్ నువ్వుగాని భేతాళుడివి అయివుంటే విక్రమార్కుడు అక్కడే తల పగలగొట్టుకుని చచ్చివుండేవాడోయ్" అంది మౌళవిక అతడి భుజం తడుతూ.

"ఎంతపని చేశారాంటీ సగంలో ఆగిపోయిన ఆ భేతాళకథ గుర్తుచేసి నా మూడ్ చెడగొట్టేశారు" అన్నాడతను తలపట్టుకుని.

"నిన్నే పజిల్‌లో పడేసిన అంత గొప్ప కథేంటి నాయనా. చెప్పు విందాం" అంది జయశ్రీ

"ఏం లేదాంటీ. ఒకమ్మాయి ఒకబ్బాయిని ప్రేమిస్తుంది కానీ ఇంకొకరి అబ్బాయిని పెళ్ళి చేసుకుంటుంది. ఓసారి ఈ ముగ్గురూ కలిసి ప్రయాణం చేస్తుంటే విధివశాత్తూ ఓ ప్రమాదం జరిగి ఆ అబ్బాయిలిద్దరి పీకలు కట్ అయిపోతాయి. అప్పుడు ఆ అమ్మాయి భగవంతుడితో మొరపెట్టుకుంటుంది. అప్పుడు దేవుడు ప్రత్యక్షమయి ఓ మంత్రజలం ఇచ్చి దాని సాయంతో బ్రతికించుకోమంటాడు.

"ఆ అమ్మాయి కంగారులో మొగుడి తల ప్రియుడు శరీరానికి, ప్రియుడి తల మొగుడి శరీరానికి అతికించేసి మంత్రజలం జల్లుతుంది. ఇద్దరూ బ్రతుకుతారు ఇప్పుడు ఆ అమ్మాయి ఎవరితో కాపురం చెయ్యాలి? మొగుడి తలవున్న ప్రియుడి శరీరంతోనా, ప్రియుడి తల వున్న మొగుడి శరీరంతోనా? ఆ పేరా చదువుతుండగానే లైట్లు ఆర్పేశారు" అన్నాడు ప్రశాంత్ ఊపిరి పీల్చుకుంటూ.

"బాబూ.. ఛోటా చేతన్.. మినీ భేతాళ్ దయచేసి పడుకో నాయనా. రేపు ఉదయాన్నే సమాధానం మొత్తం ఈ బస్సులో వున్న వాళ్ళందరిచేతా చెప్పించే పూచీ నాది. ఇంకోళ్ళని విసిగించకుండా పడుకోవటం ఎలా అనే సమస్యని ఆలోచిస్తూ పడుకో నాయనా. తండ్రీ మహాప్రభూ" అంటూ రెండు చేతులూ జోడించాడు అంతకుముందు మర్యాదగా "ష్" అని మందలించిన వారిలో ఓ పెద్దాయన.

"సర్లెండి రేపు ఉదయానికి నేనే చూసుకోగలను ఈ పుస్తకంలో" అంటూ ముడుచుకుని పడుకున్నాడు ప్రశాంత్.

జయశ్రీ కూడా "పడుకోవే" అంది మెల్లిగా. మౌళవిక మాత్రం ఆ సమస్యకి పరిష్కారం ఆలోచిస్తూనే వుంది. తెలియకుండానే నిద్రపట్టేసిందామెకి.

తెల్లవారుఝామున నాలుగున్నరకి విజయవాడ చేరుకుంది బస్సు.

ఇంకా చీకటిగానే వుంది. "ఇప్పుడు వెళ్ళి ఎంక్వయిరీ చేస్తే బావుంటుందంటావా" అంది జయశ్రీ

"కొంచెం తెల్లవారేదాకా ఆ హోటల్లో కూచుందాం. బాగా ఆకలిగా కూడా వుంది."

"అన్నట్లు ప్రశాంత్ ఏడి?"

"మళ్ళీ బస్సెక్కి సీట్లో నిద్రపోతున్నతడిని లేపి తీసుకొచ్చింది మౌళవిక.

"నువ్వెక్కడికి వెళ్ళాలి?"

"ఇక్కడే ఏలూరు రోడ్డులో రామమందిరం దగ్గర విజయకుమార్ గారని బుక్స్ అవీ ప్రింట్ చేయిస్తూ వుంటారు. ఆయన దగ్గరకి వెళ్ళాలి. ఫర్వాలేదండి వెళ్ళిపోతాను" అన్నాడు ప్రశాంత్.

"వెళ్దువుగాని కాస్త ఛాయ్ తాగి."

"మన హైదరాబాద్‌లో లాగా చాయ్ గీయ్ అంటే కుదర్దిక్కడ. టీ అనాలి. తెల్లవారు ఝామునే ఈ పక్కనే వున్న కాకా హోటల్స్‌లో వేడి వేడి ఇడ్లీలు తిని కాఫీ తాగితే ఉంటుంది మజా. చెప్పలేం అనుకోండి."

నోట్లో ఊటలూరాయి మౌళవికకి. జయశ్రీకి కూడా.

"మరొక్క అయిదు నిమిషాలు ఓపిక పట్టారనుకోండి. గాంధీనగర్‌కెళ్ళి అక్కడ బాబాయ్ హోటల్‌లో తిన్నాం అనుకోండి. ఇక జన్మ ధన్యం అన్నమాటే."

" బాబాయ్ హోటలా? ఆయన మీకు బంధువా?"

"బంధువుకాదు. ఆ హోటల్‌ని బాబాయ్ హోటలనే అంటారు. కె.విశ్వనాథ్, యస్పీ బాలసుబ్రమణ్యం, చంద్రమోహన్ ఎప్పుడొచ్చినా బాబాయ్ హోటల్ ఇడ్లీలు తినకుండా వెళ్ళరు. అసలు సాధారణంగా ఏ సినిమా వాళ్ళొచ్చినా బాబాయ్ హోటల్ ఇడ్లీలు తినాల్సిందే వేడి వేడీ ఇడ్లీలమీద స్వచ్ఛమైన నెయ్యి వేసి ఆ పక్కనే కారప్పొడి, అల్లం పచ్చడి, చట్నీ సాంబారు.. అబ్బ.. పదండాంటీ నేనింక ఆగలేను" అని తొందరచేశాడు ప్రశాంత్.

"మనం కనీసం పళ్ళయినా తోముకోలేదెలాగే" అంది జయశ్రీ

"అక్కర్లేదాంటీ పంటికి పాచి బలం, వంటికి మురికి బలం అని అన్నారు నాలాంటి పెద్దలు. అసలు బాబాయ్ హోటల్లో ఇడ్లీలు తింటే చాలు ఆ వాసనే ఉంటుంది సాయంత్రందాకా. పళ్ళు తోముకోలేదన్న సంగతి కూడా గుర్తుండదు మీకు. పదండి మరి

అతడి వర్ణనలతో ఇక ఆగలేకపోయారిద్దరూ. జఠరాగ్ని బడబాగ్నిలా ప్రజ్వరిల్లసాగింది. వెంటనే రిక్షా ఒకటి మాట్లాడుకుని గాంధీనగర్ చేరుకున్నారు ముగ్గురూ.

అప్పటికే బాగా రష్‌గావుందక్కడ. "నే చెప్పలే. బాబాయ్ హోటల్ డిమాండ్ గురించి" అని అన్నాడు ప్రశాంత్.

ఎట్టకేలకు ఓ పది నిముషాల తర్వాత ముగ్గురికీ ఒక దగ్గరే సీట్లు సంపాదించగలిగారు.

"ఆంటీ?"

"ఏంటీ?" అంది మౌళవిక చిలిపిగా.

ప్రశాంత్‌ని చూస్తే ఆమెకు చాలా ముచ్చటగా వుంది.

"రాత్రి భేతాళ కథకి సమాధానం దొరికిందా మీకు?"

"ఓ..చెప్పనా? నువ్వు చూసి చెప్తావా?" అంది మౌళవిక.

"మీరు చెప్పండి తర్వాత కంపేర్ చేస్తాను."

"శరీరంలో ఏ భాగానికి ఆజ్ఞ ఇవ్వాలన్నా మెదడే ముఖ్యం. మెదడు ఉండేది తలలోనే కాబట్టి భర్త తల ఏ మొండానికి ఉంటే దానితోనే కాపురం చెయ్యాలి ఆ అమ్మాయి. అదీగాక ఏ మనిషినైనా గుర్తుపట్టేది ముఖం చూసే కదా. రేపొద్దున్న భర్త అనగానే ఆమెకు గుర్తొచ్చేది అతని ముఖమేకదా. కనుక భర్త తల ఉన్న శరీరంతో కాపురం చెయ్యటమే కరెక్ట్ అని నా అభిప్రాయం" అంది ఆమె.

ఇడ్లీలు వచ్చాయి వేడివేడిగా ఘుమఘుమలాడుతూ.

"మరో మూడు ప్లేట్లు కూడా ఆర్డరిద్దాం ఆంటీ. అతడు వెళ్ళిపోతే మరో అయిదు నిమిషాలదాకా దొరకడు."

"సరే" అని ఆర్డరిచ్చి 'వెళ్ళిపోతే ఏం మళ్ళీ వస్తాడుగా అప్పుడివ్వచ్చుగా ఆర్డరు?'

"ఆ సరికి ఇడ్లీలు అయిపోతాయి. వెంటనే ఇంకో వాయికి రెడీగా ఉండకపోతే కంటిన్యుటీ దెబ్బ తింటుందాంటీ?" అన్నాడు ప్రశాంత్ ఇడ్లీని కుక్కేసుకుంటూ.

"ఆహా కంటిన్యుటీ దెబ్బతినడమా. చూడవే సినిమా పరిభాష మాట్లడుతున్నాడు. ఇలా తమాషాగా మాట్లాడేవాళ్ళన్నా, కడుపునిండా భోంచేసేవాళ్ళన్నా, నాకు భలే ఇష్టం. తృప్తి కనబడుతుంది వాళ్ళ కళ్ళలో, జీవితాల్లో"

నిజంగానే చాలా రుచిగా ఉన్నాయి ఇడ్లీలు. ఒక్కొక్కరూ రెండ్రెండు ప్లేట్లు సునాయాసంగా లాగించేసారు.

"వేరే చెప్పేదేముం ది. మీరే కరెక్టు. అదే వేశారీ పుస్తకంలో"

"అదెప్పుడు చూశావు?"

"ఇందాక రిక్షాలో వీధిలైట్ల వెలుగులో చూశా."

"హమ్మయ్య ఇప్పటికి గెలిచానన్నమాట" అంది మౌళవిక బిల్లు పే చేస్తూ.

"గెలిచినవాళ్ళు బిల్లు యివ్వడం కూడా యిదే ఫస్టు టైమ్ కదాంటీ" అన్నాడు ప్రశాంత్.

"అది సరే హైదరాబాద్‌లో నువ్వెక్కడుంటావు. మళ్ళీ ఇక్కడ్నుంచి ఎప్పుడు బయల్దేర్తావు?"

"రెండు రోజులు తర్వాతగానీ కుదరదాంటీ. మీ అడ్రస్సు ఇవ్వండి నేనే వచ్చి కలుస్తాను."

మౌళవిక అడ్రసు రాసి ఇచ్చింది. వేరే రిక్షా మాట్లాడుకుని ప్రశాంత్ వెళ్ళిపోయాడు. లబ్బీ పేటలో ఇంకో రిక్షా బేరం చేసుకుని ఎక్కారిద్దరూ.

"మల్లాది మద్రాసు వెళ్ళాక గుండెలనిండా నవ్వి, కడుపునిండా తిన్నది ఇందాకే అనుకుంటానే" అందామె.

"నాకూ అలాగే అనిపిస్తోంది నిన్ను చూస్తుంటే. ఇప్పుడు ఆంధ్రజ్యోతి ఆఫీసులో ఎవరైనా ఉంటారంటావా?"

"డెయిలీ పేపరు కదా. ఉదయాన్నే పట్టుకెళ్ళే పేపరు బాయ్స్, ఏజెంట్లు ఉంటార్లే. అదీగాక వాచ్‌మెన్ ఉంటాడుగా అతడి ద్వారా అడ్రసు తెలుసుకోవటం పెద్ద కష్టమేం కాదనుకుంటా."

మౌళవిక కరెక్టుగానే ఊహించింది. బాలజ్యోతిలో పనిచేసే శశికాంత్ శాతకర్ణి అని అడగ్గానే వాచ్‌మెన్ ఓ పేపర్ బోయ్‌ని తోడిచ్చి పంపించాడు. ఈ పక్కనేనమ్మా ఇల్లు అంటూ. అదే రిక్షా ముందుకు సాగిపోయింది.

"ఇంత పొద్దున్నే దిగిపోతే ఏమనుకుంటారో ఏమోనే" అంది జయశ్రీ

"చూద్దాం. ఎలాగోలాగ మేనేజ్ చేద్దాం"

రిక్షా ఆగింది. "ఇదేనండి ఆయన ఇల్లు. నేను వస్తానండి పేపరు పంచే టైమయింది" అంటూ తుర్రుమన్నాడా అబ్బాయ్. ఓ రెండు నిముషాలు తటపటాయిస్తూనే తలుపు కొట్టింది మౌళవిక.

"ఎవరూ?" అంటూ తలుపు తెరిచిందొకావిడ.

"శశికాంత్ శాతకర్ణిగారు."

"కూచోండి రాత్రి కొంచెం లేటుగా వచ్చారు. లేపుతానుండండి"

"అసలు మేం వచ్చింది మీ కోసమేనండి" అని మౌళవిక అనబోయేంతలోనే ఆవిడ స్పీడుగా లోపలికెళ్ళి శశికాంత్‌ని లేపి వచ్చింది.

"సారీ అండీ. ఉదయాన్నే డిస్టర్బ్ చేస్తున్నందుకు."

"ఫరవాలేదులెండి. చెప్పండి"

"అసలు నిజం చెప్పాలంటే మేం వచ్చింది మీ మిసెస్ కోసమేనండి. మొన్న యస్.పి.శైలజగారు చెప్పారు. మల్లాది వెమక్ట కృష్ణమూర్తిగారి రేడియో ఇంటర్వ్యూ మీ మిసెస్ టేప్ చేశారట. మేము మల్లాదిగారి అభిమానులం లెండి. రాత్రి పనిమీద ఇక్కడికొచ్చాం మరో గంటలో హైదరాబాద్ వెళ్ళిపోతాం. మీరు మరోలా అనుకోకపోతే ఆ టేపొకసారి వేస్తే విందామని ఆయన వాయిస్ ఎలా వుంటుందోనని ఎప్పట్నించో అనుకుంటున్నాం. మీకు శ్రమ ఇస్తున్నందుకు దయచేసి మరోలా అనుకోకండి."

మౌళవిక కంఠంలో వినిపించిన ఆ మార్దవానికి, ఆర్ద్రతకి ఎంతటి వాడయినా 'సరే' అనాల్సిందే జయశ్రీ కూడా ఆశ్చర్యపోయింది ఆమె కంఠంలో చూపించిన ఎక్స్‌ప్రెషన్‌కి.

"ఒన్ మినిట్. వైజయంతీ మల్లాది వున్న టేప్ పట్టుకురా ఓసారి. నేనిప్పుడే ఫ్రెష్ అయివస్తాను" అంటూ బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు శశికాంత్.

వైజయంతి వచ్చి టేపులు వెతకసాగింది.

"ఎప్పుడో 83లో రికార్డు చేశామండి దాన్ని" అంది.

అయిదు నిముషాలు గడిచాయి. 'దొరికిందా?' అంటూ వచ్చాడతను ముఖం తుడుచుకుంటూ.

"నిన్న పార్టీ ఉంది అంటూ మొత్తం టేపులన్నీ కెలికేశారుగా మీరు. ఎక్కడా దొరకటంలేదు" అందామె.

"అయితే క్యాసెట్ ఆల్బమ్‌లో వుండి వుంటుంది. నిన్న అదేగా పట్టుకెళ్ళాను వుండు" అంటూ షెల్ఫ్‌లో ఉంచిన క్యాసెట్ ఆల్బమ్ తీసి 'ఇదిగో ఇక్కడ వుంది' అన్నాడు తెరిచి.

"హమ్మయ్య" అనుకున్నారు ముగ్గురూ.

"వైజయంతి ఒక పని చెయ్యి. నేను వీళ్ళకి టేపు వినిపిస్తాను. నువ్వీలోగా మొహం కడుక్కుని కాస్త కాఫీ చేసుకొచ్చెయ్."

"అలాగే" అంటూ బాత్‌రూమ్‌లోకి దూరిందామె.

"సారీ అండీ. మీకు బాగా శ్రమ ఇస్తున్నాం" అంది మౌళవిక మరోసారి.

"అలాంటిదేం లేదండీ. నేనూ ఈ ఫీల్డు వాడ్నే కనుక డెఫినెట్లీ ఐ కెన్ అండర్ స్టాండ్ యువర్ ఎఫెక్షన్" అంటూ టేప్ ఇన్‌సర్ట్ చేసి ప్లే నొక్కాడతను.

ఇద్దరూ ఎంతో ఆసక్తిగా ముందుకు జరిగారు.

పరిచయం అయి 'నమస్కారం' అంటూ వినిపించగానే గొంతు గుర్తుపట్టింది మౌళవిక. 'ఆయనేనే' అంటూ 'అవును అలాగే ఉంది' అంది జయశ్రీ

న్యూస్ పేపర్ వచ్చింది. "అక్కడ కూర్చుని చదువుకుంటూ ఉంటాను. మీరు వింటూ వుండండి" అంటూ పేపరు అందుకోవడానికి వీధిలోకి వెళ్ళాడు శశికాంత్.

అడ్వర్టయిజ్‌మెంట్‌లు వచ్చిన దగ్గర ఆపేసి ఫాస్టు ఫార్వర్డ్ చేసేసి, రీవైండ్ చేసేసి విన్న చోటనే విని పసిపిల్లలాగా తెగ సంబరపడిపోయింది మౌళవిక.

వైజయంతి కాఫీలు తీసుకొస్తుండగా కరెంట్ పోయింది. 'ఇదేమిటి ఆగిపోయింది, అప్పుడే అయిపోయిందా?' అంటూ లోపలికి వచ్చేశాడతను.

"కరెంటు పోయినట్టుందండీ."

లైటుకున్న స్విచ్ వేసి చూసి "అవునండీ పోనీ ఆ కార్డు తీసెయ్యండి, బ్యాటరీ మీద విందురుగాని" అంది వైజయంతి.

పవర్ కార్డు తీసేసింది జయశ్రీ సౌండ్ బొంగురుగా వస్తోంది.

"మొత్తం బ్యాటరీ అవగొట్టేసారా నిన్న?" అని అడిగింది అతడ్ని.

"డాబామీదకి ఎక్సటెన్షన్ లేదు బ్యాటరీ మీద నడిపించక తప్పలేదు మరి. ఉండు ఇప్పుడే తీసుకొస్తాను కొత్త బ్యాటరీలు" అంటూ తాగుతునన్ కప్పు ఖాళీచేసి లేచాడతను.

"నో..నో ప్లీజ్. అంత అవసరంలేదండి. ఆయన వాయిస్ విన్నాం, అదేచాలు. ఇంకా ఎక్కువ శ్రమపడకండి. ఇప్పటికే యు హావ్ టేకెన్ లాట్ ఆఫ్ పెయిన్స్" అంది జయశ్రీ లేచి నిలబడి.

"మౌళవిక కూడా లేచి ఇంక వస్తామండి. చాలా థ్యాంక్స్" అంది.

"నేనూ మల్లాదిగారి అభిమానినే. ఈ పూట మా యింట్లో భోంచేసి వెళ్ళండి" అంది వైజయంతి.

"ఉందామా" అన్నట్లు చూసింది మౌళవిక జయశ్రీవైపు.

ఒద్దని కళ్ళతోనే వారించి "లేదండీ ఈ బస్సుకే వస్తామని చెప్పాం. ఇంట్లో ఎదురుచూస్తూ ఉంటారు. చెప్పిన బస్సుకి బయలుదేరకపోతే గాబరాపడతారు కూడా" అంటూ బొంకింది జయశ్రీ

"ఈసారి విజయవాడ వచ్చినప్పుడు తప్పకుండా రండి మళ్ళీ ఆ టేపు హాయిగా విందాం"

"అలాగే ఉంటామండి. ద్యాంక్యూ ఫర్ ది కర్టెసీ అండ్ హాస్పటాలిటి" అని సెలవు తీసుకున్నారిద్దరూ.

బయటకొచ్చాక "మల్లాది పేరు చెప్పి ఎవరు ఎక్కడ ఉండిపోమన్నా ఉండిపోతావా విక్కీ నువ్వు?" అందామె మందలింపుగా.

"ఏం చెయ్యను జై.. కన్నుమూసినా తెరిచినా ఆయనే గుర్తొస్తున్నారు. ఆయన గొంతు కూడా వినగానే నేనిక ఉండలేనేమోననిపిస్తోంది. నవలలు, సినిమాలలోని డైలాగు అని అనుకోకు నా మనసంతా ఆయన పూర్తిగా ఆక్రమించుకున్నారు జై."

"సర్లే పద... మరి ఆయన మీద అనుమానం పూర్తిగా తొలగిపోయినట్లేనా?"

"నిజం చెప్పాలంటే నాకసలు అనుమానం అన్నదే లేదు. ఆ మాత్రం కూడా జంకు, శంక, మనసు పీకటంలాంటివి నాకిష్టంలేక మనసు హాయిగా క్లీన్‌గా వుంచుకోవడానికి ఈ ప్రక్షాళన కార్యక్రమం తప్పడంలేదు."

"సో..రేపు ఆర్.టి.ఓ ఆఫీసు మీదనా మన దండయాత్ర?"

అవునన్నట్లు తలూపింది మౌళవిక - హైదరాదుకి వెళ్ళే బస్సు ఎక్కుతూ.

14

మెత్తగా, నిశ్శబ్దంగా, అక్వేరియమ్‌లో చేపలా దూసుకుపోతోంది బస్సు.

"మేడమ్..."

తలపక్కకి తిప్పింది మౌళవిక.

తల యెత్తింది జయశ్రీ మరొక్క నిమిషం ఆలస్యం అయితే ఆ బ్రీఫ్‌కేసు ఆమె మొహం మీదనో, మౌళవిక నడినెత్తినో పడివుండేదో.

చటుక్కున లేచి బ్రీఫ్ కేసుని అందుకుని కాళ్ళదగ్గర పెట్టుకుందామె.

"చాలా థ్యాంక్స్ అండీ" అంటూ పరీక్షగా చూసింది మౌళవిక.

అంత పొడవు కాదు, అంత పొట్టీకాదు. చామనఛాయలో రెండు జళ్ళతో ఉందామె. చేతిలో మల్లాది వెంకట కృష్ణమూర్తి రాసిన 'మిసెస్ పరాంకుశం' పుస్తకం.

ఫరవాలేదన్నట్టు నవ్విందామె.

మౌళవిక మనసు జివ్వున లాగేసింది. ఎన్నాళ్ళయిందో ఆ పుస్తకం చదివి.

"జై.. ఆవిడ మల్లాది పుస్తకం చదువుతోందే" అంది చెవిలో రహస్యంగా.

అవునన్నట్లు తలూపింది. ఆమె మరొకసారి ఇటు తిరిగితే బావుండునని అనుకుంటోంది మౌళవిక. మన అభిరుచితో కలిసిన వారితో పరిచయం పెంపొందించుకోవాలని ఎవరికైనా ఉంటుంది. కానీ ఆమె ఆ పుస్తకంలో పూర్తిగా నిమగ్నురాలై వుంది.

రాత్రంతా బస్సు కుదుపులతో తమాషా కాలక్షేపంతో సగం సగం నిద్ర మాత్రమే పోయిన జయశ్రీ కునకడం మొదలుపెట్టింది. మౌళవికకి కూడా మగతగా నిద్ర ఆవహిస్తోంది కానీ ఒక్కసారి ఆవిడతో మాట్లాడాలని వుంది.

**సుమారు రెండున్నర** గంటల కాలప్రవాహంలో కలిసిపోయాయి.

"ఇక్కడ కాఫీలు తాగొచ్చు" అన్నాడు డ్రైవరు బస్సు ఆపి వెనక్కి తిరిగి.

ఆమె చేతిలోని పుస్తకం మూసి లేచి నిలబడింది.

అప్పటికే బస్సులో ఉన్న మగాళ్ళందరూ దిగడం మొదలుపెట్టారు. ఇంకెవరూ ఆడవాళ్ళలో ఆ ముగ్గురూ తప్ప.

"మీరు రారా" అని అడిగిందామె.

"రావాలనే ఉంది. మా ఫ్రెండు నిద్రపోతోంది" అని చెప్పి "జై - జై" అంటూ లేపడానికి ప్రయత్నించింది.

పాపం ఆవిణ్ణెందుకు డిస్టర్బ్ చేస్తారు? నిద్రపోతున్న వాళ్ళని లేపి స్లీపింగ్ పిల్ ఇచ్చినట్లు రండి మనం కాఫీ తాగొద్దాం."

"జైకి కాఫీ అంటే ఎంతో యిష్టం" అంది మౌళవిక నిస్సహాయంగా.

"ఫరవాలేదు రండి నా దగ్గర ఫ్లాస్క్ వుంది. ఆవిడకు కూడా పట్టించుకుద్దాం. ఎప్పుడు తెలివొస్తే అప్పుడే తాగుతుంది" అందామె వెనక్కి వచ్చి ప్లాస్టిక్ బుట్టలోంచి ఫ్లాస్క్ తీసుకుని.

"ఇలా ఇవ్వండి అది నేను పట్టుకుంటాను" అని ఆమె చేతిలోంచి ఆ నవలని అందుకుంది మౌళవిక.

ఫ్లాస్క్ అనుకుని అందించబోయిన ఆమె పల్చగా నవ్వేసింది "సారీ" అంటూ.

హోటల్లోకి వెళ్ళి అయిదు కాఫీలు ఆర్డరిచ్చిందామె.

"అన్ని ఎందుకూ?"

"ఎందుకేమిటి. రెండు ఇక్కడ మనకి ఆవిడ లేస్తే బస్సులో మళ్ళీ మన ముగ్గురికి.

"భలేవారే మీకూ కాఫీ అంటే బాగా ఇష్టంలా వుంది"

అవునన్నట్టు తలాడించిందామె.

"నా పేరు మౌళవిక. ఆమె పేరు జయశ్రీ ఇద్దరం చదువుకుంటున్నాం. మరి మీరు?"

"నేను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్నాను. నా పేరు వేదకుమారి" అందామె.

"తమాషాగా ఉందండీ మీ పేరు. వేదవతి, వేదవల్లి అనే పేర్లు విన్నానుగాని వేదకుమారి అని వినడం ఇదే మొదటిసారి."

"మీరింకా భలేవారు. మీ పేరు కన్నానా? నేనూ ఇప్పటిదాకా ఏదో మౌళవికాగ్నిమిత్రం, మౌళవికా సర్కార్ పేర్లే తప్ప మౌళవిక అనే పేరు వినడం నాకూ ఇదే ఫస్ట్ టైమ్. నిజంగా మీ పేరు చాలా చాలా అట్రాక్టివ్‌గా ఉంది. అఫ్‌కోర్స్ మీలాగే" అంది వేదకుమారి.

సంతోషం, సిగ్గు రెండూ కలగలుపుతూ నవ్వి కాఫీ సిప్ చేస్తూ "మీరు మల్లాదిగారి నవలలు బాగా చదువుతారా?" అడిగింది మౌళవిక.

"విపరీతంగా ఈ 'పరాంకుశం' చదవడం నాకిది యాభయిఆరోసారనుకుంటా. మరి మీరు?"

"నేనలా లెక్కపెట్టలేదుగానీ నాకూ ఆయన నవల్సంటే చాలా యిష్టం."

"ఆయన్ని ఎప్పుడయినా చూశారా?"

ఆమె సమాధానం చెప్పేలోగానే హారన్ మ్రోగించాడు డ్రయివర్.

"పదండి" అంది వేదకుమారి బిల్లు పే చేస్తూ.

సరిగ్గా సమయానికి అంతరాయం కలిగించి తన నోటివెంట అబద్దం వచ్చే తప్పిదాన్ని తప్పించినందుకు మనసులోనే డ్రయివర్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంది మౌళవిక.

బస్సు బయలుదేరిన ఒక నిముషంకల్లా చల్లటిగాలి రివ్వున ముఖాన కొట్టడంతో లేచి సరిగ్గా కూచుంది జయశ్రీ

"మల్లాదికి సంబంధించిన ఓ గమ్మత్తయిన ఇన్సిడెంట్ ఒకటుందండీ" అని అంటున్న వేదకుమారిని చూసి "అప్పుడే మీరిద్దరూ ఫ్రెండ్సయిపోయారా?" అని నవ్వింది పలకరింపుగా.

"ఆహా. ఇందాకే కాఫీ కూడా తాగాం చక్కగా" అందామె టీజింగ్‌గా.

"చాలాసార్లు 'జై..జై' అంటూ మీకు జేజేలు కొట్టారీవిడ. మీరెక్కడ. ఎక్కడో ఊర్ధ్వలోకాల్లో విహరించేస్తున్నారు. బట్ కాఫీ మాత్రం బ్రహ్మాండంగా ఉందండీ. అప్పుడే ఆడించిన విత్తనాల తాజాదనం. కమ్మటి రుచి"

"అన్యాయం విక్కీ" అంది జయశ్రీ గొంతు జీరబోతుండగా.

"లేదు జై. నీకు అన్యాయం చెయ్యగలనా? ఫ్లాస్కులో మూడు కప్పుల కాఫీ ఉంది. కావాలంటే మొత్తం లాగించెయ్యి" అంది మౌళవిక ఫ్లాస్క్ తీసి కాఫీ ఒంపుతూ.

"ఇప్పుడు చెప్పండి. ఏమిటో మల్లాది, గమ్మత్తయిన ఇన్సిడెంటు అంటున్నారు" అంది జయశ్రీ రెండు గుటకలు కాఫీ గొంతులో పడ్డాక.

"ఏంలేదూ. వైజాగ్‌లో మా కజినొకతను డాక్టరుగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. అతనిపేరు కూడా మల్లాదిగారి పేరులాగే ఉంటుంది."

"మల్లాది పేరులా... అంటే?"

"ఏవుందీ? మల్లాది పేరు మల్లాది వెంకటకృష్ణమూర్తి అయితే మావాడి పేరు మల్లాది వెంకట రామకృష్ణమూర్తి. అంతే తేడా?"

"ఆయన రాస్తుంటాడా?"

"ప్రిస్కిప్షన్లు తప్ప ఇంకేం రాయడండి. తనకసలు ఈ నవలలు చదవటంలాంటి ఇంట్రస్టులేదు కూడా" అంది వేదకుమారి.

మౌళవిక, జయశ్రీ ఇద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు గుండెల్లో రాయి పడ్డట్టుగా.

"తమాషా ఏమిటంటే పాపం తనవెంట ఆటోగ్రాఫ్‌లిమ్మని ఆడపిల్లలు పడేవారు" అని చెప్పుకుంటూ పోతున్న ఆమె వాక్ప్రవాహానికి అడ్డువస్తూ.

"ఆయనెలా ఉంటారండీ?" అని అడిగింది మౌళవిక.

"సన్నగా, కొద్దిగా నల్లగా, మరీ అంత పొడవుకాదనుకోండి ఏం ఎందుకు?"

"అబ్బే ఏం లేదు. అన్నట్టు కళ్ళజోడు పెట్టుకుంటారా?" అంది జయశ్రీ

"అస్సల్లేదు. ఏం అలాంటి వాళ్ళెవరయినా మీకు తగిలారా?"

"అలాంటిదేమీ లేదండీ. ఇంట్రస్టు కొద్దీ అడిగాం. ఎందుకంటే మల్లాదిగారు కళ్ళజోడు పెట్టుకుంటారని విన్నాం. కనీసం ఆ రిజంబ్లెన్స్ అయినా ఉందేమోనని" అంది మౌళవిక.

"పోలికల దేముందండీ. ఎన్నయినా తెచ్చుకోవచ్చు. అసలు రైటరు మల్లాదిగారు తన ఫోటో ఎలాగూ వేయించుకోరు కదా. అవతల వాళ్ళ జ్ఞానం ఎంత ఎక్కువగా ఉంటే మా కజిన్‌లాంటివాళ్ళు అంత స్టయిలు కొట్టవచ్చు."

"ఎవర్ని గురించి మీరంటున్నది"

"అదే ఆ వెంటపడ్డ ఆడపిల్లల గురించే మావాడికి అసలు ఈ ఇంట్రస్టులేవీ లేవు కనుక సరిపోయింది. అదే ఇంకొక స్మార్టు ఫెలో అయితే ఈ అవకాశాన్ని ఒదిలిపెడతాడా?"

"జై.. నువ్వేటురా. నాక్కొంచెం నిద్రొస్తోంది" అంటూ కిటికీవైపు వచ్చి తలవాల్చి కళ్ళుమూసుకుంది మౌళవిక ఆ టాపిక్ తనకిష్టం లేదన్నట్టుగా.

జయశ్రీ వేదకుమారి మాట్లాడుకుంటూనే ఉన్నారు ముఖం మీద వెలుగుపడకుండా ఉండడం కోసం అన్నట్లు పైట కప్పుకుంది మౌళవిక. కానీ ఆమె ఉద్దేశం వేరు. పొరలు పొరలుగా వస్తున్న కన్నీటిని అదుపుచేసుకోలేకపోతుందామె.

"భగవంతుడా నన్నెందుకింత చిత్రవధకి గురి చేస్తున్నావు? ఆశ చూపించినట్టే చూపించి అంతలోనే మళ్ళీ ఎందుకు దూరం చేస్తున్నావు? ఆయన మల్లాది కావటం నీకు ఇష్టంలేదా? నీ ముగింపేమిటి? మానసికంగా దేనికైనా తయారుగా వుంటే ఏ దుర్ఘటనా బాధించదని జై అంది కదా చూస్తాను. అప్పుడు నువ్వు నన్నెలా ఏడిపించగలవో నా జీవితంలో ఎలా ఆడుకోగలవో అదీ చూస్తాను" అని పరిపరివిధాల తలపోస్తోందామె.

సుమారు మూడున్నరకి బస్సు హైదరాబాద్‌కి చేరుకుంది. వస్తున్న త్రోవలోనే దిల్‌సుఖ్ నగర్ దగ్గర దిగిపోయింది వేదకుమారి.

"ఇక్కడ్నించి డైరెక్టుగా ఆర్.టి.ఓ ఆఫీసుకెళ్దామా ఇంటి కెళదామా? అని అడిగింది జయశ్రీ

"చేరేసరికి ఎంతలేదన్నా నాలుగు దాటుతుంది. ఆ టైమ్‌లో సీట్లలో ఉంటారంటావా?"

"ఏమో నాకయితే నమ్మకం లేదు. ఇంటికి వెళ్ళినట్టయితే ముఖ్యమైన పని వుంది."

"అయితే ఇంటికే వెళదాం ఏంటది?"

"ప్లే బ్యాక్ సింగర్ యస్. జానకి ఈమెకి పిన్నిగారవుతారట. ఆవిడకి ఫోన్ చేసి కనుక్కుంటే తెలిసిపోతుంది కదూ?"

"ఏమిటి తెలిసేది?" అంది మౌళవిక.

"అదే వేదకుమారి చెప్పినట్టు ఇలా ఆవిడకి ఓ కజిన్ ఉన్నాడా లేదా? వుంటే అతని పేరుకూడా మల్లాదిగారి పేరులాగే ఉంటుందా లేదా? అని కనుక్కోవచ్చు కదా?"

"దాని వలన ప్రయోజనం?"

"అసలు మల్లాదిపేరు మీద ఇంకొక వ్యక్తి చలామణి అవడానికి అవకాశం ఉందా లేదా అన్నది తెలుస్తుంది కదా?"

"ఓ...కే అలాగే ఫోన్ చేద్దాం. దానివలన ఈయన మల్లాది అవునా కాదా అన్నది ఎలా తెలుస్తుంది?"

"తెలియకపోవచ్చు. చీకటిగదిలో చేతికి ఓ స్విచ్ తగిలింది. అది వేస్తేనే కదా తెలిసేది. ఆ స్విచ్ లైటుకి సంబంధించినదో ఫ్యాన్‌కి సంబంధించినదో. అసలు కరెంట్ ఉందోలేదో అన్నది తేలేది అప్పుడే కదా. ఓ చిన్న విషయం

అడగడానికి జంధ్యాల దగ్గరికి వెళితే ఆర్.టి.ఓ ఆఫీసుకు వెళ్ళి ఎంక్వయిరీ చెయ్యాలన్న ఐడియా నీకు రాలేదూ? అలాగే ఇదీనూ" అంది జయశ్రీ

"ఇప్పుడు జానకిగారి ఫోన్ నెంబరెలా తెలుస్తుంది?" అంది మౌళవిక ఇల్లు చేరాక.

"ఏ ఫిలిం డైరక్టరీ చూసినా తెలుస్తుంది, లేదా ట్రంక్ అసిస్టెన్స్ ఫోన్ చేసి మద్రాసు బోర్డుకి కనక్షనిమ్మని అడిగి అక్కడ్నించి సంపాదించొచ్చు ఆవిడ నెంబరు."

"ఈ టైములో ఆవిడ వుంటారంటావా?"

"ట్రై చేసి చూద్దాం. మన లక్ ఎలా వుందో?"

"డెఫినెట్‌గా ఉంటార్లే సినిమా వాళ్ళకి మధ్యాహ్నం పడుకునే అలవాటు వుంటుందని చదివాను ఎక్కడో" అంది మౌళవిక.

త్వరగానే దొరికింది నెంబరు.

"హలో జానకీగారి ఇల్లేనా? ఉన్నారాండి? హైదరాబాద్ నించి మాట్లాడుతున్నాం. కొంచెం పిలుస్తారా?"

"ఒక్క నిముషం" అంటూ వినిపించింది. తర్వాత బజర్ చప్పుడు, బహుశా ఎక్స్‌టెన్షన్ వుండి వుండాలి.

"హలో...ఎవరూ?" అందొక మగకంఠం.

"మంచి నిద్రలో ఉంది. ఏం కావాలి?"

"మీరెవరండీ?"

"నా పేరు రాము. జానకి మా ఆవిడే చెప్పండి"

"ఏం లేదండీ వైజాగ్‌లో మల్లాది వెంకట రామకృష్ణమూర్తి అనే ఒకాయన మీకు బంధువాండి?"

"ఆ...ఆ.. మా జానకి అక్కాచెల్లెళ్ళు చాలామంది. ఒకావిడగారబ్బాయి అతను ఏం? ఏమిటి సంగతి?"

"ఏం లేదండీ ఆయన అడ్రస్ కావాలండీ?"

"అడ్రసూ... అడ్రసు. ఓ గంటాగి ఫోన్ చేస్తారా. లేకపోతే తిరుపతిలో బాలకృష్ణప్రసాద్ అని అన్నమాచార్య ప్రాజెక్టులో పనిచేస్తూ వుంటాడు. మీకు తెలుసా? అతన్ని అడిగినా తెలుస్తుంది. మీరు మాట్లాడింది హైదరాబాద్ నుంచేకదూ. అక్కడే స్టేట్ బ్యాంక్‌లో వేదకుమారి అని ఒకావిడ పని చేస్తూంటుంది. సైఫాబాద్ బ్రాంచి అనుకుంటా. అక్కడికయినా ట్రై చేయండి. తప్పకుండా దొరుకుతుంది. లేకపోతే ఓ గంట తర్వాత మళ్ళీ ఫోన్ చేయండి జానకి లేచాక అడిగి చెప్తాను."

"అలాగేనండి. చాలా థ్యాంక్సండీ" అంటూ ఫోను పెట్టేసింది మౌళవిక.

"ఏమయింది?"

"కథ మళ్ళీ వేదకుమారి దగ్గరకే వచ్చింది."

"అయితే ఆవిడ చెప్పింది కరెక్టే అన్నమాట"

"అబద్దం చెప్పాల్సిన అవసరం ఆవిడకేముంది? పైగా మనం మల్లాదిగారి గురించి ఎంక్వైయిరీ చేస్తున్నట్లు ఆవిడికి తెలీదు కదా అబద్ధమైనా, నిజమైనా ఏదో ప్రయోజనాన్ని ఆశించి ఆవిడ చెప్పలేదు. మాటల సందర్భంగా ఏదో ఫ్రెండ్లీగా చెప్పిందంతే."

"ఈయన మల్లాది అక్కేనా కాదా అనే విషయాన్ని తేల్చుకోడానికి మనం పడ్డశ్రమ, ఖర్చుపెట్టిన డబ్బు, టైంలో పదోవంతు కాన్సన్‌ట్రేషన్ సరిగ్గా చేసివుంటే ఈపాటికి అసలు మల్లాదిగారి అడ్రసు తెలుసుకోగలిగేవాళ్ళమేమో?" అంది జయశ్రీ ఆలోచిస్తూ.

"అంటే"

"అదే ఇందాక నువ్వు జానకిగారి హజ్బెండ్‌తో వేదకుమారిగారి మల్లాది అడ్రసు కావాలంటే అనిపించింది. రేపెలాగూ ఆర్.టి.ఓ ఆఫీసులో ఆ బండి మల్లాది పేరుమీద వుందా లేదా అన్నది చూస్తాంగా. అక్కడే ఆయన అడ్రస్ సంపాదిస్తే పోలా. డెఫినెట్‌గా వెహికల్ ఓనర్స్ అడ్రసులుంటాయి అదా?"

"కరెక్టే దెబ్బతో ఈ మోటార్ సైకిలు ఎవరిదో తెలుస్తుంది. ఒకవేళ ఆయనదే అయితే ఈయన ఇంటి అడ్రసు తెలుస్తుంది" అంది మౌళవిక.

"అయితే కోర్టు రేపటిదాకా వాయిదా వెయ్యబడిందన్నమాట?

"ఇన్వెస్టిగేషన్ వాయిదా వెయ్యబడిందే తప్ప ఈ మనసు కోర్టులో నిజానిజాలు విశ్రాంతి కూడా లేకుండా ఆర్గ్యూ చేసుకుంటున్నాయి జై."

"నాకు తెలుసు విక్కీ. ఈ పరిశోధన ఫలితం యెలా వున్నా ముందర నువ్వు డిసైడ్ చేసుకోవాల్సింది ఒకటుంది. ఇతను మల్లాది కాకపోతే జరగబోయేదేమిటి? నిర్దాక్షిణ్యంగా బయటకి పంపెయ్యడమేనా?"

"అదే తేల్చుకోలేకపోతున్నానింకా. కళ్ళు మూసినా తెరిచినా ఆయన రూపమే గుర్తొస్తోంది. ఆ చిలిపి మాటలు, హుషారైన మనస్తత్వం, చురుకైన కళ్ళు, వీటన్నిటిని మించి 'ఇతను నాకున్నాడు' అని ఏ ఆడపిల్లలయినా ధైర్యంగా చెప్పుకోగల ఆ విగ్రహం. ఆ సంస్కారం ఉట్టిపడే చూపులు. జై ఆయన మల్లాదికాకపోతే అన్న సంగతికన్నా, ఒకవేళ నిజంగా మల్లాది కాకపోతే నన్నెందుకు చీట్ చేస్తున్నాడు అనే బాధే ఎక్కువైపోతుంది. నేనేమౌతానో నాకే తెలియకుండా

వుంది" అంది మౌళవిక వొంగుని మోకాళ్ళమీద తలపెట్టుకుని. కళ్ళలోని కన్నీరు ఒక జీవితకాలానికి సరిపడా ఇగిరిపోయి కేవలం నేల చూపులు మాత్రమే మిగిలిపోయినదానిలా వుందామె.

"ధైర్యంగా ఉండు విక్కీ అన్నీ సర్ధుకుంటాయి" అంది జయశ్రీ అనునయంగా ఆమె వీపు నిమురుతూ.

మర్నాడు పదిన్నరకల్లా ఆర్.టి.ఓ ఆఫీసులో ఉన్నారిద్దరూ.

"ఎ.బి.యక్స్ అయితే ఆ పక్క వెళ్ళి అడగండి"

"టూ వీలర్ కదా అయితే ఇక్కడ."

"9570..? అయితే ఖచ్చితంగా ఏడెనిమిదేళ్ళ క్రితం అయివుంటుంది. లాభంలేదు. ఓ నాలుగురోజులు పోయాక రండి రికార్డులు తియ్యాలి"

హతాశురాలయిపోయింది మౌళవిక.

"లేదండీ మీరెలాగైనా దయచేసి ఇవాళే చూసి చెప్పాలి. ఆ వెహికల్ రేపటికల్లా మేం కొనితీరాలి. దాని ఓనర్ షిప్ ఎవరి పేరుమీద ఉందో తెలియాలి" అంది జయశ్రీ అర్ధింపుగా.

ఆడపిల్లలు మోటారు సైకిల్ కొనడమేమిటన్నట్లు చూసి "ఏమిటంత అర్జంటు?" అన్నాడతను.

"రేపు మా బ్రదర్ ఫారిన్ నుంచి వస్తున్నాడండి. అతను వచ్చేసరికి ఆ బండి మా ఇంట్లో ఉండి తీరాలి" అంది మౌళవిక.

"ఆశ్చర్యంగా ఉందే, ఫారిన్ నుంచి వచ్చేవాళ్ళు సెకెండ్ హాండ్ బళ్ళు కొనుక్కుంటారా?"

"సెంటిమెంటండీ. అతను ఫారిన్ వెళ్ళేముందు పాస్‌పోర్టుకి, వీసాకి అన్నింటికీ ఈ బండిమీదే తిరిగాడు. అది ఆయన ఫ్రెండు ఎవరిదోనట. ఆ ఫ్రెండు అడ్రసు రాయకుండా బండి నంబరు మాత్రం రాశాడు. దీన్నిబట్టి ఆ ఫ్రెండు అడ్రసు కనుక్కుని ఆయన్ని ఒప్పించి కొనాలి. ఇంత తతంగం వుంది. కాబట్టి మీరెంత త్వరగా చెపితే మాకంత హెల్ప్ చేసిన వాళ్ళవుతారు ప్లీజ్"

ఆమె ముఖంలో కనిపించిన దైన్యానికి అతడు సీట్లో కూచోలేకపోయాడు. "కూర్చోండి ఇప్పుడే వస్తాను" అని లేచి ఇంకో గదిలోకి వెళ్ళాడు. వాళ్ళిద్దర్నీ దాటుకుంటూ గుప్పుమంది సెంటువాసన. చార్మినారు పక్కన రోడ్డుమీద నాసిరకం అత్తరు అయివుంటుంది.

ఓ అరగంట పోయాక వచ్చాడతను ఓ రిజిష్టర్‌తో. "మొత్తానికి దొరికిందండీ" అంటూ.

"చాలా థ్యాంక్సండీ. రేపెలాగూ రిజిస్ట్రేషన్ ట్రాన్స్‌ఫర్‌కి వస్తాంగా అప్పుడు మా బ్రదర్ ఫారిన్నుంచి తెచ్చిన ఓ సెంటు బాటిల్ ఇస్తాను. మీరు దయచేసి మరోలా అనుకోకూడదు" అంది మౌళవిక.

**అంతే కీలెరిగి** వాత పెట్టినట్టు గిలగిలలాడిపోయి లొంగిపోయాడతను. అబ్బే ఎందుకండీ. మీకు పనయితే చాలు. ఏదో లేడీస్ ఎన్నాళ్ళని తిరగ్గలరు చెప్పండి" అన్నాడు పేజీ తిప్పుతూ.

ఓ రెండు నిమిషాల తర్వాత "ఆ...దొరికింది. ఆ బండి మల్లాది వెంకట కృష్ణమూర్తి అనే ఆయనది.

అడ్రసు - 701 బ్లాక్ బి, మాతృశ్రీ అపార్ట్‌మెంట్స్, హైదర్‌గూడా"

అక్షరం పొల్లుపోకుండా నోట్ చేసుకుందామె."మరొకసారి థ్యాంక్స్ చెప్తున్నందుకు, మళ్ళీ మళ్ళీ అంటున్నందుకు మరోలా అనుకోకండి. మీకు అక్కర్లేకపోయినా సరే వచ్చి ఇచ్చి వెళతాను. ఇంత త్వరగా ఈ రోజుల్లో హెల్ప్ చేసేవాళ్ళెవరండి? మీరు కాబట్టిగానీ"

"అబ్బెబ్బే అదేం ఫరవాలేదండి అన్నట్టు ఫారిన్ సెంట్లన్నీ స్ప్రేతోనే వుంటాయాండీ?" అడిగాడతను కుతూహలంగా.

"అవునండీ రేపు తెచ్చిస్తానుగా చూద్దురుగానీ" అంటూ బయటకి వచ్చేసింది మౌళవిక.

"కేసుపోతే పోయింది గానీ లిటికేషన్లు మాత్రం క్షుణ్ణంగా తెలిశాయి అన్నాడట ఓ లాయరు. అలా ఆయన మల్లాది అవునో కాదో కానీ సమయస్ఫూర్తితో అబద్ధాలు చెప్పడం మాత్రం బాగా వచ్చేసింది మనిద్దరికీ" అంది జయశ్రీ ఆమెను అనుసరిస్తూ.

"రైటరు మల్లాదిగారేనాండి? ఇక్కడ వుండేవారు ఒకప్పుడు. ఈ ఫ్లాట్స్‌లో వున్నప్పుడే ఆయన 'అపార్ట్‌మెంట్' అనే సీరియల్ రాశారు" అని చెప్పారు మాతృశ్రీ అపార్టుమెంటులో

ఎదురుగా కుర్చీలో నీరసంగా కూలబడిపోయింది మౌళవిక."

"ఆయనిప్పుడు ఎక్కడుంటున్నారో ఇక్కడెవరికీ తెలియదాండి?" అంది జయశ్రీ

"ఉండండి కనుక్కుని వస్తాను" అంటూ లోపలికి వెళ్ళి ఆర్.టి.సి క్రాస్ రోడ్స్‌లో సంగం థియేటర్ ఉంది కదండీ, ఆ పక్కనే రైట్ సైడు సందులో ఫస్ట్ ఫ్లోర్‌లో ఉంటారండీ ఆయన" అని చెప్పాడతను ఓ పదినిముషాల తర్వాత.

"ఇంటి నెంబరూ...అదీ"

"తెలీదండి. అయినా ఆయన పెద్ద రైటరు కదా బహుశా మీకు ఈజీగానే దొరుకుతుంది లెండి."

మళ్ళీ కొనసాగింది వారి 'అనంత వేట'

"నయిజీ నీచే వాలోంకో పూఛియే. షాయద్ ఉన్ కో మాలుమ్ హోతా" అన్నారు ఆ ఇంటి ఓనర్లు. అసలు ఆ ఇంటిని పట్టుకోవడానికే ఓ అరగంట పట్టింది వాళ్ళకి.

నశిస్తున్న ఓపికని పుంజుకుని క్రింద వాటాకి వెళ్ళారు.

"ఇప్పుడు ఆయనో ఇల్లు కట్టుకుని అక్కడికి మారిపోయారు. గాంధీనగర్‌లో ఆ యిల్లు" అని చెప్పారక్కడ.

"గాంధీ నగర్ అంటే ఎక్కడండీ?"

"ముషీరాబాద్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ దాటాక ఎన్.టి.ఆర్ ఎస్టేటుందాండీ. దానిముందు సందులో బాలాజీ థియేటర్ దగ్గర ఓ సందులో రైటుకో, లెఫ్టుకో తిరగాలండీ. ఆ తర్వాత మళ్ళీ లెఫ్టుకే తిరగాలి. ఆ తర్వాత కొంచెం ముందుకుపోతే వస్తుందాయన ఇల్లు"

"ఇది సొంతిల్లు అంటున్నారు కాబట్టి ఇంక మారే ఛాన్సులుండవులే పద" అంది మౌళవిక ఆటోలో కూచుంటూ.

భూమి గుండ్రంగా ఉండును అనే విషయం చదువుకున్నారేగానీ, ఎప్పుడూ చూసిన పాపాన పోలేదు వాళ్ళు. ఆ రోజు అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. బాలాజీ టాకీస్ దగ్గర్నుంచి వున్న అన్ని సందులూ తిరిగారు. తిరిగి తిరిగి సంగం టాకీస్‌కే చేరుకుంది ఆ ఆటో. ఏ సందులోనూ ఎవ్వరూ చెప్పలేదు.

"ఒక్కరు కూడా చెప్పకపోవటం ఆశ్చర్యంగా లేదు?" అంది జయశ్రీ

"అసలాయన యిల్లు కట్టుకున్నట్లు నాకే ఇంతవరకూ తెలియదు. తన గురించి పదిమందికి తెలియాలనుంటే ఆ అడ్రసు ఏ పుస్తకంలోనో ఇంకెక్కడో అవుట్ చేసేవారు. అలా గుప్తంగా వుంటారు కాబట్టే చుట్టుపక్కల వాళ్ళక్కూడా తెలియటంలేదేమో" అంది మౌళవిక.

"అయితే ఇప్పుడేం చేద్దాం?"

"ఏముందీ మళ్ళీ వీళ్ళనే డిటైల్డ్‌గా అడుగుదాం. ఈసారి ఓ కాగితం మీద కూడా రాసుకుందాం. ఎలాగూ తిరిగి సంగం టాకీస్‌కి వచ్చాంగా."

"దొరకలేదా?" అందావిడ వీళ్ళని చూడగానే.

"లేదండీ"

"అప్పుడెప్పుడో మూడేళ్ళ క్రితం వాళ్ళ గృహప్రవేశానికి పిలిస్తే వెళ్ళాను. అప్పటికీ ఇప్పటికీ చాలా మారిపోయి వుంటుంది. ఓ పని చెయ్యండి ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ అని సికింద్రాబాద్‌లో ఉంట్ంది మీకు తెలుసా?"

"ఆ ఎమెస్కో 'మందాకిని' వేసారు వాళ్ళే కదూ?"

"అవునండి. దానికి సంబంధించిన ఎమ్.ఎస్.కుమార్ గారని ఆయన ఆ రోజు వీరింటి గృహప్రవేశానికి వచ్చారు. ఆ రోజు చలామంది వచ్చారనుకోండి. నేనూ హెచ్.ఎల్.పీలో సభ్యురాల్ని కనుక ఆయన బాగా గుర్తున్నారు. ఆయన్ని ఏ.పి.బి.డి.కుమార్ గారని అంటారట. ఈయన పుస్తకం వేశారుగా. అడ్రసు ఆయన దగ్గర తప్పకుండా వుంటుంది" అందామె.ఎగిరి గంతెయ్యాలనిపించింది మౌళవికకి. పరుగు పరుగున పోయి ఆటోని చేరుకుంది.

"ఏదో సమయస్ఫూర్తి, ఎంక్వయిరీ, ఇన్వెస్టిగేషనూ అంటూ తెగ ఫోజులు కొట్టేశాం గానీ ఆయన అడ్రస్ ఒక పబ్లిషర్ ద్వారా సంపాదించవచ్చునన్న సంగతి ఇన్నాళ్ళవరకూ తట్టలేదంటే నిజంగా బుర్రలు స్క్రాప్ కిందకూడా కొనరేమోనే" అంది ఆమె మార్గమధ్యంలో.

సుమారు నాలుగయింది వాళ్ళు ఏ.పి.బి.డి.కుమార్ గార్ని చూసేసరికి. ఆయన్ని చూస్తే అబద్ధం చెప్పి అడ్రసు సంపాదించాలనిపించలేదామెకి. పూర్తిగా నిజం చెప్పకుండా, అసలు అబద్ధం ఆడకుండా అడిగిందామె.

"దయచేసి ఆయన్ని ఎలాగయినా చూడాలండీ" అంటూ ఉదయం ఆర్.టి.ఓ ఆఫీస్ నుంచి జరిగిన కథ చెప్పింది.

"చాలా ఇంట్రస్టింగ్ గా ఉందండీ" అన్నాడాయన.

"అందుకే ప్లీజ్" అంది జయశ్రీ

"నేను వెళ్ళాను గానీ ఇంటి నంబరయితే గుర్తులేదు. ఉండండి. ఇక్కడ ఫైల్లోనే ఆయన గృహప్రవేశానికి సంబంధించిన ఇన్విటేషన్ ఉండాలి. అడ్రస్ రాసుకుందురుగాని" అంటూ ఫైల్ తియ్యమని పురమాయించాడాయన.

ఓ పది నిమిషాల తర్వాత ఆ ఫైల్ దొరికింది. మౌళవిక ఎంత ఆత్రంగా అందుకుందా ఫైల్ని.

"ఫ్లాట్ నెంబర్ 90 గాంధీనగర్

హైదరాబాద్ - 500080 అని వుంది ఇన్విటేషన్లో.

"మొత్తానికి ఆయన అడ్రస్ పట్టుకున్న మొదటి పాఠకురాలిగా నీ కీర్తి సాహితీ చరిత్రలో నిలిచిపోతుంది విక్కీ" అంది జయశ్రీ షేక్‌హాండ్ యిస్తూ.

"మీరిప్పుడు ఆయన ఇంటికి వెళతారా?" అని అడిగారు కుమార్ గారు.

"అవునండి. అందుకే కదా ఈ శ్రమంతాను."

"అయితే ఫోన్ చేసి వెళ్ళండి"

"ఆయనకు ఫోను ఉందా?"

"ఆ..62244. ఉండండి నేను కూడా మాట్లాడతాను" అంటూ డయల్ చేసి "హలో మల్లాదిగారేనా? నేను కుమార్‌ని. నమస్కారం ఎవరో ఇద్దరు అమ్మాయిలు మీ అడ్రస్ కావాలంటూ వచ్చారు మాట్లాడతారా? వన్ మినిట్" అంటూ రిసీవర్‌ని మౌళవిక చేతికి ఇచ్చారాయన.

"ఆయన ఊళ్ళోనే ఉన్నారా? ఎప్పుడొచ్చారు?" అని ఆశ్చర్యపోతూ అందుకుందామె."

"హలో" వినిపించింది అవతల్నుంచి.

"హలో.. మల్లాదిగారేనా?"

"అవును. మల్లాదినే మాట్లాడుతున్నాను."

చెవిలో డైనమెట్ పేలినట్టనిపించిందామెకి.

ఆ గొంతు తనకు పరిచయం ఉన్న మల్లాది కంఠం కాదు. "నేను మిమ్మల్ని అర్జంటుగా కలవాలనుకుంటున్నాను. కలవచ్చా? ఇది నా జీవిత సమస్య. ప్లీజ్" అందామె రుద్ధ కంఠంతో.

"రండి. ఫరవాలేదు."

రిసీవర్ని పెట్టేసి, కుమార్‌గారికి థ్యాంక్స్ చెప్పేసి కిందకి వచ్చి ఆటోలో కూలబడి వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది మౌళవిక.

"విక్కీ. ఏం జరిగింది విక్కీ?" అంది జయశ్రీ ఆ వెనకే పరిగెత్తుకుంటూ వచ్చి.

"ఆయన ఆయనకారు జై"

ఆటో గాంధీనగర్ వైపు ప్రయాణం సాగించింది.

"కాస్త ధైర్యం చిక్కబట్టుకో విక్కీ. అంతా మన మంచికే" అంటోంది జయశ్రీ తోవపొడుగునా.

ఈసారి సులువుగానే దొరికింది ఇల్లు. కోణార్క్ రథచక్రాలు గుర్తువచ్చేట్టుగా నల్లటి గీటులో తెల్లని వీల్స్. గేటుకి ఇంటికి మధ్య చాలా ఖాళీస్థలం. ఇంటి గుమ్మం దాకా సిమెంట్ రోడ్డు.

బెల్లు కొట్టింది జయశ్రీ

తెల్లగా, మంచి పొడవుతో, కళ్ళజోడుతో ఉన్న ఒకాయన తలుపు తీశాడు.

"మీరు..."

"లోపలికి రండి. నేనే మల్లాది వెంకట కృష్ణమూర్తిని" అన్నాడతను తలుపు పూర్తిగా తెరుస్తూ.

జరుగుతున్నదేమిటో, వింటున్నదేమిటో అర్థం కావటంలేదు మౌళవికకి. అసలు నేను మౌళవికనేనా అనే అనుమానం వచ్చిందామెకు క్షణంపాటు.

"అతను 'ఎవరుకావాలి' అన్నాడా? 'నేనే మల్లాది వెంకటకృష్ణమూర్తి' అని అన్నాడా?"

"మల్లాదిగారు కావాలండీ" అందామె తనకు తాను కంట్రోల్ చేసుకుంటూ.

"వన్ మినిట్. ముందు లోపలికి రండి" అంటూ పక్కకి జరిగాడతను.

మౌళవిక, జయశ్రీ ఇద్దరూ లోపలికి వచ్చి కూర్చున్నారు.

"మూర్తి" పిలిచాడు.

మేడమీద నుంచి దిగి వచ్చాడు మల్లాది. అతన్ని చూడగానే ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒక్క ఉదుటున లేచి ఎదురెళ్ళి "ఎప్పుడొచ్చారు మద్రాసు నుంచి?" అడిగింది.

"ఉదయమే.. ముందు కూర్చోండి."

"ఊ ఇప్పుడు చెప్పండి మీకు ఏ మల్లాది వెంకట కృష్ణమూర్తి కావాలో?" అని అన్నాడు ఆ తలుపు తీసినతను.

అతను అడుగుతున్నది బోధపడక మల్లాది వంక చూసిందామె. 'ఫర్వాలేదు చెప్పు' అన్నట్లు కళ్ళతోనే సంజ్ఞ చేశాడతను.

"చెప్పండి ఏ మల్లాది వెంకటకృష్ణమూర్తి కావాలి?"

"ఆయనే కావాలి" అంటూ మల్లాదివేపు చూపింది.

"అయినా ఏ మల్లాదేంటి?" అని అడిగిందామె.

"ఎందుకంటే మీరు చూపించిన మల్లాది ఇన్నాళ్ళూ సీరియల్, కథలు, నవలలు రాసిన మల్లాది వెంకట కృష్ణమూర్తి కాబట్టి."

ఈ వార్త ఎప్పుడు వినాల్సి వస్తుందోనని కొన్ని రోజులుగా మానసికంగా సమాయత్తం అవుతున్న ఆమె గుండెలు బ్రద్దలు కాలేదు. ఆశ్చర్యంగా చేష్టలుడిగినదానిలా చెవులకి కళ్ళకి తప్ప శరీరంలోని తక్కిన భాగాలన్నిటికీ పక్షవాతం వచ్చేసినదానిలా అలా చూస్తూ వింటూ ఉండిపోయిందామె ఆ తలుపు తీసినాయన వంక చూస్తూ.

"ఇతని పేరు కూడా మల్లాది వెంకట కృష్ణమూర్తే. కొద్దో గొప్పో సాహిత్యంలో ప్రవేశం, అభిరుచి ఉన్నవాడే. పేరులో మా ఇద్దరికీ సామ్యం ఉండడం చేత తన రచనలన్నిటినీ ఏ పత్రిక్కీ పంపకుండా దాచుకుంటూ వచ్చాడు. పేరు మార్చుకుంటే అతి త్వరలో మంచి రైటర్స్‌లో ఒకడిగా పేరు తెచ్చుకుంటాడు. ఇక అసలు విషయం. రచయితగా పేరు తెచ్చుకున్న మల్లాది వెంకట కృష్ణమూర్తిని నేనే. ఇప్పుడు చెప్పండి" అని అన్నాడాయన.

నివ్వెరపోయిందామె. జయశ్రీ వంక బిత్తరచూపులు చూస్తూ ఏం చేయాలి? అన్నట్లు కళ్ళతోనే అడిగింది. ఆమె ముఖంలో ఏ భావమూ కనిపించలేదు.

"చెప్పు విక్కీ"

తుళ్ళిపడి పక్కకి తిరిగింది మౌళవిక. అనుకోకుండా అక్కడ వినిపించిన తన తండ్రి గొంతు విని.

కళ్ళజోడు తుడుచుకుంటూ పక్కగదిలోంచి వచ్చి ఆమె పక్కనే సోఫాలో కూర్చున్నాడు పార్థసారథి.

"డాడీ" అంటూ చెప్పబోయిందామె మాటలు పెగలలేదు.

"నాకు జరిగినదంతా తెలుసమ్మా. ఇప్పుడు చెప్పు నీకు మనతోపాటు మనింట్లో ఇన్నాళ్ళూ ఉండి సరదాగా, తమాషాగా కాలం గడిపిన ఆ మల్లాది కృష్ణమూర్తి కావాలా? ఈ పాపులర్ రైటర్ మల్లాది వెంకట కృష్ణమూర్తి కావాలా?" అన్నాడు చిన్నపిల్లని బుజ్జగిస్తున్నట్లు.

పరిస్థితిని అవగాహన చేసుకోలేక, వివేకం, విచక్షణ నశించిన దానిలా చూపుల్ని నలుదిక్కులా ప్రసరించసాగిందామె.

"మీ వయసెంత?" అని అడిగాడు రైటర్ మల్లాది.

"ఇరవయి."

"అనుకున్నాను. మీకు క్రికెట్ అంటే ఆసక్తిలేదా?" అడిగాడు.

కాస్త స్థిమితపడిందామె. ఆయన స్వరంలో వినిపించిన అభిమానానికి.

"అసలా ఆట ఎలా ఆడతారో కూడా తెలియదండి"

"నాలాగ అన్నమాట" అంటూ చిరునవ్వు నవ్వాడు. కొద్దిసేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు. తర్వాత చెప్పాడు.

"మౌళవికగారూ మీ వయసులో నేను మీరు పుస్తకాలు చదువుతున్నంత ఆసక్తిగా ఇంగ్లీష్ సినిమాలు చూస్తూ ఉండేవాడిని. ఎలిజబెత్ టైలర్ అంటే నాకు వెర్రి అభిమానం. అప్పటిలో ఆమెకు కేరాఫ్ యూనివర్సల్ స్టూడియోస్ - లాస్ ఏంజెల్స్‌కి ఒకటి రెండు ఉత్తరాలు కూడా రాశాను. టీనేజ్‌లో ప్రతి మనిషీ ఎవర్నో ఒకర్ని ఆరాధించడం మామూలే. ఉదాహరణకి మీ నాన్నగారే ఉన్నారు. ఆయన తన చిన్నతనంలో కాంచనమాలని ఎంతో అభిమానించేవారట."

అంటూ పార్థసారథి వంక చూశాడాయన చెప్పమన్నట్లుగా.

"అబ్బో! ఇలాగలాగా? ఆవిడ నటించిన ప్రతి సినిమా మూడుసార్లుకు తక్కువ కాకుండా చూసేవాడ్ని. ఆఖరికి ఒకసారి పరీక్షరోజులలో ఆవిడ సినిమా రిలీజ్ అయితే ఉదయం ఓ పేపరు రాసి, మర్నాటి పేపర్‌కి మధ్యాహ్నం అంతా కూర్చుని చదివేసి, సాయంత్రం కాంచనమాల సినిమా చూసి రాత్రంతా ఆ ఊహల్నే నెమరువేసుకుంటేనే గాని మర్నాడు ఎంతో సక్సె ఫుల్‌గా ఎగ్జామ్స్ రాయలేకపోయాను. అప్పటిలో శ్రీశ్రీ కవిత్వం నాకర్థం కాకపోయినా రాక్సీలో నార్మా షేరక్,

బ్రాడ్వేలో కాంచనమాల అని రాశాడనే ఆయన మీద అభిమానం పెంచుకుని ఆ తరువాత ఆయన కవిత్వం చదివి అర్థం చేసుకుని, ఆరాధించడం మొదలుపెట్టాను.

అలాగే నాకు ఇంకో ఫ్రెండ్ వుండేవాడు గోవిందరావని. ఇప్పుడు వైజాగ్ ఆంధ్రా యూనివర్సిటీలో ప్రొఫెసర్గానో, రీడర్గానో ఉంటున్నాడు. అతనికి నాగేశ్వరరావు అంటే విపరీతమయిన అభిమానం. ఎంత ఇష్టం అంటే అప్పట్లో ఫస్ట్ షో అంటే సాయంత్రం ఏడుగంటలకి మొదలుపెట్టేవారు. చీకటిపడగానే పిల్లలకి అన్నాలు పెట్టేసేవారు కూడా. భోంచేసి చెరో మిఠాయి కిళ్ళీ కొనుక్కుని నాగేశ్వరరావు సినిమాలకి వెళ్ళేవాళ్ళం. తెరమీద నాగేశ్వరరావు ఎప్పుడు కనపడితే అప్పుడు ఆ కిళ్ళీ నోట్లో పెట్టుకునేవాడు. అంటే ఆ హీరో కనబడగానే తానుపొందే ఆ తీయని అనుభూతికి ఈ మిఠాయి కిళ్ళీ తీయదనాన్ని మేళవించి సైకలాజికల్గా ఇంకా ఎక్కువ మాధుర్యాన్ని ఫీలయ్యేవాడన్నమాట. అతనికీ అలవాటు అయ్యేసరికి 'బాలరాజు' సినిమావొచ్చి వెళ్ళిపోయింది. మొదటిసారి రిలీజ్లో ఆ సినిమా అతను చూడలేకపోయాడు. రెండోసారి రిలీజ్ అయినప్పుడు వెళ్ళాం. ఆ 'బాలరాజు' సినిమాలో నాగేశ్వరరావు ఎంట్రన్స్ చాలాసేపటివరకు ఉండదు. ఎదురుచూసి ఇతను బిక్కమొహం పెట్టేశాడు. 'ఇందులో నాగేశ్వరరావు లేడేమిరా' అంటూ. అలా ఉండేవి మా కాలం అభిమానాలు, అయిన ఏ మాటకామాట చెప్పుకోవాలి. నేనెప్పుడూ కాంచనమాలని చూసే ప్రయత్నం చేయలేదు. వైజాగ్లో 'కులగోత్రాలు' సినిమా షూటింగ్ అవుతున్నప్పుడు నాగేశ్వరరావుని చూసే ప్రయత్నం ఆ గోవిందరావూ చెయ్యలేదు.'' అని ఆగాడాయన.

మౌళవిక, జయశ్రీ ఆసక్తిగా వింటున్నారు. మరో మల్లాది కూచుని చిరునవ్వుతో చూస్తున్నాడు. పార్థసారధి వచ్చి కూచుని చెప్పడం ప్రారంభించిన దగ్గర్నుంచి మౌళవిక మనసులోని వాతావరణమే మారిపోయింది. ఇంట్లో కూచుని సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నట్టే వుంది.

**''నా చిన్నతనంలో** కొమ్మూరి సాంబశివరావు డిటెక్టివ్, సాంఘిక నవలలు ఎంతో ఇష్టంగా చదివేవాడిని'' అని చెప్పటం మొదలు పెట్టాడు రైటరు మల్లాది వెంకట కృష్ణమూర్తి. అందరూ తమ చూపుల్ని అటువైపు తిప్పారు.

''ఇప్పటికీ ఆయనే నా అభిమాన రచయిత. ఆ అభిమానం ఆయన రచనలవరకే పరిమితం చేసుకున్నాను. ఇంతవరకూ నేనాయన్ని ఒక్కసారి కూడా చూడలేదు. అనేకసార్లు ఆయన ఉంటున్న మద్రాసు వెళ్ళినా. అలాగే రచయిత్రి డి.కామేశ్వరిగారంటే కూడా. ఆమె ఫోటో చూసి ఆమె రచనలని ఇంకా అభిమానించేవాడిని. రచయిత్రులలోని అందగత్తెలలో ఆవిడ ఒకరు. ఇవన్నీ టీనేజ్లో సర్వసాధారణం.

ఓ వ్యక్తి మీద మనకి అతని టాలెంట్ వల్ల అభిమానం కలిగితే ఆ అభిమానాన్ని ఆ టాలెంట్ వరకే పరిమితం చేసుకోవాలి. కానీ అది అందరికీ సాధ్యపడదు. టాలెంట్ వల్ల ఏర్పడ్డ ఆ అభిమానం క్రమంగా ఆ వ్యక్తిమీదకి మారడం ప్రపంచంలో ఏ చోటయినా జరిగేదే ఇక్కడే మనిషి రేషనల్ థింకింగ్ కోల్పోకుండా తనని తాను చెక్ చేసుకోవాలి. అదుపులో ఉంచుకోవాలి. నాకు డి.కామేశ్వరిగారు నచ్చారనో లేదా ఎలిజబెత్ టేలర్ నచ్చిందనో కాదు. వారి టాలెంట్స్ నచ్చాయి కాబట్టి, ఆ పరిధిలో మాత్రమే వారిని అభిమానించడం సబబు" అని అప్పట్లో నాకు అనిపించబట్టే వారిని కలుసుకునే ప్రయత్నం చేయలేదు.

రచయితగా స్థిరపడ్డాక ఓసారి డి.కామేశ్వరిగారు నాకు పరిచయం అయ్యారు. మా ఇద్దరి వయసుల్లోని తారతమ్యం అప్పుడుగాని గుర్తించలేకపోయాను. మా మధ్య ఆ టాపిక్ వచ్చింది. ఆవిడ సరదాగా నవ్వేస్తూ "ముసలితనం శరీరానికిగాని మనసుకి కాదు" అని కూడా అన్నారు అంటూ ఓ నిముషం గ్యాప్ ఇచ్చాడాయన.

"మీరన్నా, మీ రచనలన్నా మా విక్కీకి ఎంతో అభిమానం అని మొదటిసారి తెలుసుకున్నప్పుడు కళాకారుల్ని, వారి టాలెంట్స్‌ని గౌరవించడం మా బ్లడ్‌లోనే ఉంది కాబట్టి నా పోలికే తనకి వచ్చిందనుకున్నాను" అని ఆగి మౌళవిక వంక చూశాడు పార్థసారథి.

అవునన్నట్లు తలూపిందామె.

"కానీ అది రోజురోజుకి విపరీత ధోరణిలో ముదురుతోందని తెలిసి ఆమె మిమ్మల్ని కలుసుకునే ప్రయత్నం ఉధృతం చేస్తున్నకొద్దీ ఈ అభిమానం ఎటు పోతుందా అని చాలా మధనపడ్డాను. సరిగ్గా అటువంటి సమయంలో నా కంపెనీ ఉద్యోగానికి ఓ అప్లికేషన్ వచ్చింది. అప్లికెంట్ పేరు చూస్తే మల్లాది వెంకట కృష్ణమూర్తి అని వుంది. ఏజ్, అడ్రస్ అన్నీ చూసేసరికి డౌటొచ్చింది. వెంటనే పర్సనల్‌గా కలుసుకోమని హోటల్‌లో రూమ్ బుక్ చేసి కబురుపెట్టాను" అని మల్లాది వంక తిరిగాడాయన.

అంతవరకూ నిశ్శబ్దంగా వున్న మరో మల్లాది అందుకున్నాడు.

"సుమారు ఓ గంటసేపు నన్ను ఇంటర్వ్యూ చేసి నాకు ఈ రైటరు మల్లాదిగారికి ఎటువంటి సంబంధం లేదనీ, పూర్వీకులతో ఏవో బాంధవ్యాలు ఉండబట్టి పేర్లు, ఇంటి పేర్లు ఒకటిగా ఉన్నాయని తెలుసుకోగలిగారు పార్థసారథిగారు. రైటరు మల్లాదిగారి అడ్రస్సు ఒక్కరోజులో సంపాదించగలిగితే ఉద్యోగం ఇస్తానన్నారు."

"అప్పుడు ఈ మల్లాది ఏం చేశాడో తెలుసా విక్కీ సినిమా తీస్తానంటూ ఓ ప్రొడ్యూసర్‌లాగా నాటకం ఆడేసరికి ఒక పబ్లిషర్ ఆయన అడ్రస్సు ఇచ్చేశాడు. అప్పుడు కుర్రాడి తెలివితేటల మీద నమ్మకం కలిగింది. ఇతనితో ఏదో కొంత

సాధించవచ్చుననే చిన్న ఆశ నాలో ఏర్పడింది. అప్పుడు ఇద్దరం ఈ రైటరు మల్లాదిగారి దగ్గరికి వచ్చి విషయం మొత్తం వివరించాం" అన్నాడు పార్థసారథి.

"అవును. ఈ ఇన్సిడెంటు వినగానే పదిహేనేళ్ళ క్రితం జయబాధురి నటించిన 'గుడ్డి' సినిమా గుర్తొచ్చింది నాకు. అందులో ఉత్పల్ దత్, జయబాధురిని ప్రేమించినతను కలిసి నాటకం ఆడతారు. జయబాధురిని ఆమె ఎంతగానో అభిమానించిన ధర్మేంద్ర దగ్గరికి తీసుకెళ్ళి అతని ఫైట్స్ డూపుల మీద ఆధారపడి ఉన్నాయని చెప్పి నిజజీవితంలో అతడు అన్ని సాహసాలు చేయడని ఓ చిన్న డ్రామా ప్లే చేస్తారు.

కానీ ఇక్కడ అలా కాదే? నిజజీవితంలో నేను రైటర్ని కానని అబద్దం చెప్పలేనుగా. అందుకే ఈ డ్రామాకి హీరోగా ఈ మల్లాదిని ఎన్నుకున్నాం. అతనితో కొంతసేపు మాట్లాడిన తర్వాతనా హీరోలకుండే వాక్చాతుర్యం, ఐ.క్యూ మొదలయిన అన్ని గుణాలు ఉన్నాయనిపించింది. నా రచనల బట్టి నేనిలా ఉంటానని ఓ సగటు పాఠకురాలు ఎలా ఊహించుకుంటుందో దానికి అక్షరాలా ప్రతిరూపంలా తోచాడతను నాకు. సరిగ్గా అదేరోజు సిటీ సెంట్రల్ లైబ్రరీలో రచయితల మీటింగుంది. దానికి మీరొస్తారని ఊహించి విజయవాడలో పబ్లిషర్స్తో పనుందని చెప్పి ఎగ్గొట్టాను. అదే సాయంత్రం ఆదివిష్ణు వచ్చి మీరిచ్చిన అడ్రస్సు కాగితం ఇచ్చాడు. అతను వెళ్ళాక మీ డాడీకి, ఈ మల్లాదికి ఫోన్ చేశాను.

అప్పటికే ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో ఒక ప్రణాళికగా రూపొందించుకుంటున్న మాకు అదే మంచిదనిపించింది. ఆదివిష్ణు ఇచ్చిన మీ అడ్రస్సు చీటీని అతనికిచ్చి పంపించాం. మీ మనసులో ఇతనే రైటర్ మల్లాది అని ఆ క్షణంలో బలంగా నాటుకోడానికి అది మంచి ఎవిడెన్స్గా ఉపయోగపడింది. అతను మిమ్మల్ని రూమ్ అడిగి తిరిగి ఇక్కడికి వచ్చి చెప్పేవరకూ మీ డాడీ ఇక్కడే ఉన్నారు.

ఆ రోజు నుంచి ఈ మల్లాదికి నా మోటార్ సైకిలు ఇచ్చాను. మేం ఇద్దరం 'రెండు రెళ్ళ ఆరు' శతదినోత్సవానికి వెళ్ళడానికి ముందురోజు అదే మీరు ఇతనితో కలిసి పిక్నిక్ నుంచి తిరిగొచ్చిన రోజు సాయంత్రం మాత్రం పనుండి తీసుకుని మర్నాడు ఉదయం తిరిగి ఇచ్చాను" అన్నాడు రైటరు మల్లాది వెంకటకృష్ణమూర్తి.

"అదే ఆ రోజు పిక్నిక్లో జయశ్రీగారు ఆ రీలుని ఫాగ్ చెయ్యగానే ఆవిడమీద నాకెందుకో విపరీతమైన నమ్మకం ఏర్పడింది. నా ఆబ్సెన్స్లో మీ శ్రేయోభిలాషిగా మా ప్లాన్ని చక్కగా, గుంభనంగా, ఎంతో బాలెన్స్తో నిర్వహించగల నేర్పు ఆవిడకి మాత్రమే ఉందనిపించింది. వెంటనే మీ డాడీ, మల్లాదిగార్ల పర్మిషన్ తీసుకుని మర్నాడు ఉదయాన్నే ఆవిడ యింటికి వెళ్ళి సహకరించమని కోరాను. ఆవిడ పరిస్థితిని సహృదయంతో అర్థం చేసుకుని వెంటనే ఒప్పుకున్నారు. అప్పుడే మేం ఇద్దరం కలిసి వచ్చాం" అన్నాడు మల్లాది.

మౌళవిక ఆశ్చర్యంగా చుసింది జయశ్రీవైపు.

ఆమె మనసులోని భావాల్ని అప్పటికే గ్రహించేసింది జయశ్రీ

"అవును విక్కీ. అసలు రైటరు మల్లాదిగారి పట్ల నీకున్న అభిమానం కేవలం ఆరాధన మాత్రమేనా? అది జీవితాన్ని కూడా పంచుకునేటంత బలీయమైన బంధంగా దారితీస్తుందా అనే విషయాన్ని తెలుసుకోవడానికి మాత్రమే ఈయన నీ జీవితంలోకి అడుగుపెట్టారు. తన తెలివితేటలతో, చమత్కారాలతో నీ మనసులో ఈ మల్లాదిగారు ఓ స్థానాన్ని ఆక్రమించుకున్నారు. కానీ అది ప్రేమ అని నాద్వారా కన్ఫర్మ్‌డ్‌గా తెలుసుకున్న ఈ మల్లాదిగారు ఎంతో అభిమానంతో తన ఇష్టాన్ని కూడా తెలియజేశారు. అందుకే ఆ రోజు లంచ్ రూమ్‌లో అన్నాను. ఓ రకంగా నీకన్నా అతనిదే గొప్ప ప్రేమ అని. ఎందుకంటే నీ ప్రేమలో ఓ వ్యామోహం వుంది. ఆయన ప్రేమలో మానవత్వం వుంది. నిన్ను తనవైపుకి తిప్పుకోగలనన్న గట్టి నమ్మకం వుంది.

ఈ విషయంలో నిజంగా ఆయన సక్సెస్ అయ్యారనే చెప్పొచ్చు. నేను నిన్ను చాలాసార్లు అడిగాను. ప్రతిసారీ నువ్వు ఒకే సమాధానం ఇస్తూ వచ్చావు. కన్నుమూసినా తెరిచినా ఆయన రూపమే ప్రత్యక్షమవుతోందని రైటరు మల్లాదిగారి టాలెంట్ మీద అభిమానం ఉన్నా నీ మనసులో వున్నది మాత్రం ఈ మల్లాదిగారే" అని అందామె.

మౌళవిక వెంటనే విజయవాడ వెళుతున్నప్పుడు ప్రశాంత్ చెప్పిన బేతాళ కథకి తను ఇచ్చిన జవాబు గుర్తొచ్చింది.

"అవును విక్కీ ఇది మనసుకు సంబంధించిన అతి సున్నితమైన సమస్య. దీన్ని ఎంతో నేర్పుగా నిర్వహించడానికి రైటర్ మల్లాదిగారు మన ఈ మల్లాది, జయశ్రీ ఎంతో రిస్క్ తీసుకున్నారు" అన్నాడు పార్థసారథి.

మౌళవిక కన్నులు నిండిన నీరుతో అందరివైపు ఒక్కసారి ఎంతో ఆరాధనాభావంతో చూసింది. వీళ్ళందరికీ తనంటే ఎంతో అభిమానం, శ్రద్ధ. ఓ విధంగా తనగురించి ఎంతో శ్రమించేవారున్నారు. నిజంగా తనెంతో అదృష్టవంతురాలు.

"మౌళవికగారూ" అన్న పిలుపు విని తిరిగిందామె రైటర్ మల్లాదివైపు.

"మల్లాది రచనలు నచ్చాయి కాబట్టి అతన్ని పెళ్ళిచేసుకోవాలి అని అనుకునే ఆడపిల్లలు ఆంధ్రదేశంలో అనేకమంది ఉంటారని నా ఊహ. ఈ ప్రముఖ రచయిత భార్య అవాలనే తపననో అతనితో జీవిస్తూ ఆయనెలా రచనలు చేస్తారో తెలుసుకోవాలనే కోరికో, ఆయన పేరుకు ఉండే గ్లామర్ వల్ల ఆకర్షింపబడో లేదా ఏ ఆఫీసులోనో పనిచేసుకునే ఓ అనామకుడ్ని కట్టుకునే బదులు సంఘంలో ఓ ప్రత్యేకమైన స్థానం, గుర్తింపు పొందిన వ్యక్తిని చేసుకోవటం మంచిదనో.. ఇలా కారణాలు ఏవైనా కావొచ్చు కానీ అలా కోరుకోవటం జరుగుతూనే వుంది.

అందుకే ఒకప్పుడు అక్కినేనికి, ఎన్.టి.ఆర్.కి ప్రేమలేఖలు రాసేవాళ్ళు. ఇప్పుడు చిరంజీవికి, కమల్‌హాసన్‌కి రాస్తున్నారు. అలా సునీల్ గవాస్కర్‌కి, రవిశాస్త్రికి, అజరుద్దీన్‌కి కూడా రాస్తున్నారు. రాస్తారు కూడా. పాఠకుల్లో గ్లామర్

సంపాదించుకునే స్థాయికి ఎదిగిన రచయితలకి కూడా అలాంటి ఉత్తరాలు వస్తున్నాయి ఇప్పుడు. ఇది చూడండి'' అంటూ ఓ ఉత్తరం తీసి యిచ్చాడు.

అందుకుని అక్షరాలు చూసి ఉలిక్కిపడింది మౌళవిక.

''మైగాడ్! రక్తంతో రాసారా?'' అంది.

అభిమానం హద్దులు దాటరాదనడానికి ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. ఇలాంటి దృష్టాంతాలు అనేకం.

అసలు మల్లాది ఎవరు? వ్యక్తిగతంగా ఎలాంటివాడు? అతనికిదివరకే వివాహం అయిందా? లేదా? అతని మనస్తత్వం జీవన విధానం నా మనసుకి సరిపడుతుందా లేదా ఇవేవీ ఆలోచించకపోవటం మీ తప్పు. ఇంత మంచి రచనలు చేసిన మల్లాది తప్పకుండా ఆదర్శ భర్త అవగలుగుతాడనుకోవడం మీ అవివేకం. సామాన్యులనేకమంది జీవితాల్లోలాగానే నా జీవితంలో కూడా అనేక లోపాలున్నాయి. నాలోనే ఎన్నో బలహీనతలున్నాయి. నాకే లెక్కలేనన్ని సమస్యలున్నాయి.

ఇంత చదివి, అనేక విషయాల్లో మీరెంతో తెలివిగా ప్రవర్తిస్తూ కూడా పెళ్ళిలాంటి అతి ముఖ్యమైన విషయంలో మీరు ఎన్నడూ చూడని, ఒక్క క్షణం పరిచయంలేని వ్యక్తిని ప్రేమించి గుడ్డిగా పెళ్ళాడేయాలనుకోవటం...ప్చ్... మీ మేధస్సు, మీ తెలివితేటలు, మీ వివేకం ఏమయ్యాయి?

ఇదే మల్లాదికాక మరొక వ్యక్తిని వివాహం చేసుకోమని మీ నాన్నగారు మిమ్మల్ని కోరితే సరేనని తలూపి ఒప్పుకుంటారా లేక అసలతనెలాంటివాడు అని ఆలోచిస్తారా? అతనితో కలిసి, మాట్లాడి వీలైతే అబ్జర్వ్ చేసి మీకు నచ్చితే అప్పుడే ఒప్పుకుంటారు కదా''

ఔనన్నట్టు తలూపింది మౌళవిక. మంత్రముగ్ధులై వింటున్నారు పార్థసారథి, జయశ్రీ, మరో మల్లాది.

''చిట్టిబాబులా ఎవరూ వీణ వాయించలేరు. బాలమురళీకృష్ణలా ''ఏమి సేతురా లింగా'' పాటని ఎవరూ పాడలేరు. గవాస్కర్‌లా క్రికెట్ ఎవరూ ఆడలేరు. కమల్‌హాసన్‌లా ఎవరూ నటించలేరు. ఆయా ఫీల్డ్స్‌లో వాళ్ళు గొప్పవాళ్ళు అయినంత మాత్రాన వాళ్ళ అభిమానాలు ప్రేమలు, జీవితాలు తమతోనే పంచుకుని తీరాలని వాళ్ళ అభిమానులందరూ అనుకుంటే అది ఆ అభిమానుల వెర్రితనం.''

మీకు గుర్తుండే వుంటుంది ''గుప్పెడు మనసు'' సినిమాలో శరత్ బాబు అంటాడు సరితతో 'నీ కిష్టమైన వాడిని పెళ్ళిచేసుకో' అని. దానికి సరిత అంటుంది ''నాకు బాలమురళీ అంటే ఇష్టం. చిట్టిబాబంటే ఇష్టం. ఇలా ఎంతమంది ఇష్టమైన వాళ్ళని చేసుకోను?'' అని. నా విషయంలో కూడా అలాగే అని మీరు ఎందుకు ఆలోచించలేదు?

ప్రేమించడం కన్నా ప్రేమించబడటం గొప్ప అనే డైలాగు సినిమాల్లోనూ, నవల్లోనూ బాగుంటుంది. కానీ రియల్ లైఫ్‌లోకొచ్చే సరికి దాని విలువలు, అప్లికబులిటీస్ ప్రాక్టికల్‌గా చాలా మారతాయి.''

తన అభిమాన రచయిత, కొన్నివేల పాత్రలని మరిన్ని వేల వాక్యాలని మనసుకు హత్తుకుపోయేలా సృష్టించిన "అబ్బా" అనిపించేలా ట్విస్టులని తిప్పిన కొన్నివందల కథలు రాసి, సునిశిత హాస్యంతో తన రచనల ద్వారా చక్కిలిగిలి పెట్టిన తన ఊహల్లోని ఆ రైటరు మల్లాది వెంకట కృష్ణమూర్తి చిన్న పిల్లలు తప్పుచేస్తే కోప్పడుతున్న తండ్రిలా ఇలా మెత్తగా చివాట్లేసే ఈ రైటరు మల్లాది వెంకట కృష్ణమూర్తి పూర్తిగా వేరేనేమోనని అనిపించింది మౌళవికకి.

తన ఊహల్లోని ఆ రైటరు మల్లాదిని అలాగే ఉంచేసుకుని అసలీ అసలు మల్లాదిని కలవకపోయి వుంటే ఎంత బావుండేది అనిపించింది క్షణకాలం. హాస్యంగా తమాషాగా సరదాగా మాట్లాడతాడని పెద్దగా ఎక్స్‌పెక్ట్ చేసింది తను. ఇతనేమిటి ఇంత ప్రాక్టికల్‌గా ఇంత సీరియస్‌గా క్లాస్ తీసుకుంటున్నాడు?

తన ఇంట్లో రూమ్ అడిగిన మరో మల్లాది వైపు దృష్టిని తిప్పిందామె. అతడు తనవంకే చూస్తున్నాడు. "ఏమిటి నీ నిర్ణయం" అన్నంత ఆసక్తిగా ఎంత చక్కగా మాట్లాడుతాడితను? ఆమె కళ్ళనిండా ఈ మల్లాది రూపం ఎదురెదురుగా అద్దాల్ని పెట్టినట్లుగా ఎన్నోవేల రూపాలుగా చూస్తున్న కొద్దీ గుండె లోతుల్ని స్పృశించేటంత బలంగా ప్రతిఫలించసాగింది.

"అందుకే ప్రాక్టికల్‌గా నీ జీవితంలోకి ఈ మల్లాదిని దింపి కొన్నాళ్ళు ఇంటిమసీని పెంచి తాపీగా నీ మనసులోని ఆ రచయిత మల్లాది వ్యామోహాన్ని దూరం చేసి ఈ మల్లాదిని దగ్గర చేద్దాం అనుకున్నాం. పైగా ఇంటర్వ్యూలోనే నాకీ కుర్రాడు నచ్చాడు కూడా" అంటూ ఆగాడు పార్థసారథి.

ఓ అరక్షణం తర్వాత మళ్ళీ మొదలుపెడుతూ "ఇక్కడ నువ్వు నన్ను 'అపార్థ సారథి'గా ఊహించుకోకూడదు మరి. నువ్వు ఆ రైటరు మల్లాదిగారిని కలుసుకోడానికి ప్రయత్నం చేస్తున్నప్పుడల్లా నా గుండె గుభేలుమనేది. ఏమో ఈ పరిచయం ఎంతదాకా వెళుతుందో ఎక్కడయినా ఒక చిన్న అపశ్రుతి ధ్వనిస్తే నీ జీవితం ఏమౌతుంది? నువ్వసలు బ్రతుకుతావా అని అనిపించేది."

**ఎక్కడయినా** ఒక చిన్న అపశ్రుతి ధ్వనిస్తే నీ జీవితం ఏమౌతుంది? నువ్వసలు బ్రతుకుతావా అని అనిపించేది. అటువంటి సమయంలో రైటరు మల్లాదిగారు సూచించిన ఈ ఉపాయం నాకు నచ్చింది. నిన్ను తనవైపుకు తిప్పుకొనే కుర్రాడికి నీకిష్టమైన ధోరణిలో ప్రవేశించటం తప్ప గత్యంతరం లేదనిపించింది. "

వెంటనే జయశ్రీ అందుకుంది “ఈ మల్లాదిగారు ఆ రోజు ఉదయం మా ఇంటికి వచ్చి మొత్తం అంతా చెప్పినప్పుడు నాకు అదే సబబని అనిపించింది దానికి. నా వరకు నేను ఇది కరక్టే అనుకోడానికి కారణం ఒక్కటే వుంది నీకు గుర్తుందా విక్కీ– సిటి సెంట్రల్ లైబ్రరీ నుంచి మనం గండిపేటకి వెళుతున్నప్పుడు నీ దగ్గరున్న ఆటోగ్రాఫ్ బుక్ చూపించి ఇందులో అన్ని పేజీల్లోను మల్లాదిగారి సంతకమే తీసుకుంటానన్నావ్ .... గుర్తొచ్చిందా? "

అవునన్నట్లు తలూపింది మౌళవిక.

“మరి ఈ మల్లాదిగారు నీ ఇంట్లో దిగాక అలా సంతకాలు తీసుకున్నావా? "

అడ్డంగా తలూపిందామె లేదన్నట్లు.

“ అప్పుడే అనిపించింది నీ అభిమానం క్రేజ్ పాళ్ళు ఎక్కువ వున్నాయని, దానికి ఇదొక్క సైకాలజికల్ ట్రీట్ మెంట్ అని కూడా నీ హితైషిగా కోరుతున్నాను. అలా తన వాక్చాతుర్యంతో స్ఫురద్రూపంతో నిన్ను ఆయన ఆకట్టుకున్నాక కాస్త విరహం సృష్టించి ఆయన మీద అభిమానాన్ని మరింత పెంచాలనుకున్నాం. అందుకే ఆయన రైటరు మల్లాదిగారితోపాటు మద్రాసు వెళ్ళారు. ఈలోగా సంయుక్త నీ మనసులో విషబీజాలు నాటింది ... అఫ్ కోర్స్ అదీ ఒకందుకు మంచిదే అయిందనుకో.”

" నువ్వు అలా స్పృహ తప్పి జయశ్రీ ఇంట్లో పడిపోగానే తను వచ్చి ఫోన్ చేసి నాకు చెప్పింది. నేను డాక్టర్ని తీసుకు వచ్చాను. మరో అరగంటలో స్పృహ

వస్తుందన్నాడాయన ఈలోగా నేను మద్రాసుకీ యస్.టి.డి. చేసి ఇద్దరు మల్లాదులతోనూ మాట్లాడాను.

ఎన్నో కథల్ని ఊహించి మలుపు తిప్పిన ఆ రైటరు మల్లాది. ఆ మాత్రం చూపిస్తే చాలు, చొరవగా తెలివిగా అల్లుకుపోయే ఈ మల్లాది ఇద్దరూ అయిదు నిమిషాల్లో మొత్తం ప్లాన్ అంతా సిద్ధం చేసి తిరిగి నాకు ఫోన్ చేశారు. ఆ ప్రకారం ఎన్ని ఆధారాలు దొరికితే అన్నీ ఈ మల్లాదే ఆ మల్లాదిని ప్రూవ్ చేయాలి దానికి. జయశ్రీ సహకరించింది" అన్నాడు.

పార్ధసారథి మాళవిక కూడా మనస్ఫూర్తిగా మెచ్చుకోకుండా ఉండలేకపోయింది ఈ వ్యూహానికి. అందువల్లనే తనకు మల్లాది అంటే తనింట్లో అద్దెకొచ్చిన ఈ మల్లాదే అనిపిస్తున్నాడు గాని తనకు క్లాసు పెట్టేసిన ఆ మల్లాది తన ఊహల్లో సృష్టించుకున్న రచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తిలా కనిపించటం లేదు.

"దానికి తోడు రూపాల్లో మా ఇద్దరికీ చాలా తేడాలున్నా ఒడ్డు, పొడవులలో, కలర్స్ లో, కళ్ళజోడు పెట్టుకోవటంలో చాలా సామ్యం ఉండటం చేత, మీరు కల్సుకున్న వారందరూ నాకెంతో ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, మంచి స్నేహితులు కనుక మీకు పాజిటివ్ ఆన్సర్లే ఇచ్చారు" అని అన్నాడు రైటర్ మల్లాది.

"మరి విజయవాడలో ఆ టేపు ...." అని అర్ధోక్తిలో అడిగిందామె.

నిజంగా మీరు చాలా షార్ప్ మౌళవికగారూ ..! మద్రాసులో " రెండు రెళ్ళ ఆరు ఫంక్షన్ అయిపోగానే మర్నాడు సెకండ్ ఫ్లయిట్ లో హైదరాబాద్ వచ్చాం ఇద్దరం.

ఫస్టు ఫ్లయిట్ లో వచ్చివుంటే బాలూ గారికి నేను కనబడి ఉండేవాడ్ని. ఆయన ఫస్టు ఫ్లయిట్ లో బయలుదేరుతున్నారని తెలిసి మేం సెకండ్ ఫ్లయిట్ లో వచ్చాం. అక్కడ మీకు శైలజ చెప్పింది నేను మాట్లాడిన టేపు శశికాంత్ శాతకర్ణి ఇంట్లో ఉందని– అప్పుడు జయశ్రీ తెలివిగా బొంబాయి ప్రయాణం ముందు పెట్టించి బ్రీఫ్ కేస్ కోసం, క్యాష్ కోసం మీ ఇంటికొచ్చి అక్కడ్నుంచి మాకు ఫోన్ చేశారు. కలకత్తా వెళతానని చెప్పి ఈ ఊళ్ళోనే ఓ హోటల్ లో రూమ్ తీసుకొని మీ మూమెంట్స్ అబ్జర్వ్ చేస్తున్న మీ డాడీ కూడా అదే సమయానికి ఇంటికి ఫోన్ చేశారు. ఆయన కూడా జయశ్రీకి జరిగింది చెప్పారు. ఆ టేపు గొడవ మేం చూసుకుంటాం అని చెప్పాం.

మీరలా బాంబే వెళ్ళగానే మేం ముగ్గురం కారులో విజయవాడ వెళ్ళాం. శశికాంత్ శాతకర్ణిని కలుసుకున్నాం. విషయం చెప్పాం. ఆ రాత్రి మేం ఉన్న హోటల్ రూమ్ కి శశికాంత్ గారు ఆ టేపుతో, టేప్ రికార్డర్ తో వచ్చారు. 'ఇంట్లో ఏదో పార్టీ ఉందని చెప్పి!' అలాంటి టేప్ ఇంకోటి కొని మా దగ్గరున్న టేప్ రికార్డర్ తో ఆ టేప్ లోని సంభాషణలని జాక్ పెట్టి ట్రాన్స్ ఫర్ చేశాం. నా వాయిస్ వచ్చిన చోటల్లా ఈ మల్లాది తన వాయిస్ మంచి టైమ్ సెన్స్ తో మిక్స్ చేశాడు''అన్నాడు రైటరు మల్లాది.

" ఇక్కడ మనం శశికాంత్ గారికి థ్యాంక్స్ చెప్పాలి మొన్న రాత్రి ఆయన ఇంటికి వెళ్ళేసరికి బాగా లేటయింది కదా వాళ్ళవిడకి జరిగిన విషయం చెప్పలేదట. నిన్న ఉదయాన్నే మీరు విజయవాడకి చేరుకున్నారు. నా వాయిస్ టేప్ లో విని వై.జయంతిగారు ఇదేమిటని ఆశ్చర్యపోతే మొత్తం ప్లానంతా చెడిపోతుందని ఆవిడ్ని

కాఫీలకి పంపించి ఆవిడ తిరిగి ఆ రూమ్ లోకి వచ్చేటప్పుడు మెయిన్ స్విచ్ ఆఫ్ చేసేసి నానా అవస్థ పడ్డారు. 'అందులోని బ్యాటరీలు కూడా మనకు సమయానికి సహకరించాయి.' అని అరగంట క్రితమే ఫోన్ చేసి చెప్పాడాయన" అన్నారు మరో మల్లాది.

వింటుంటే మౌళవికకి ఎంతో థ్రిల్లింగ్ గా ఉంది. తను ఎన్నో నవలలు చదివింది కానీ నిజజీవితానికి వచ్చేసరికి ఎంతో ఫర్ ఫెక్ట్ గా ప్లాన్ చేసిన రైటర్ మల్లాదిపై గౌరవభావం, దాన్ని ఎంతో సమయస్ఫూర్తితో నిర్వహించిన ఈ మల్లాదిపై ఓ రకమైన హీరోవర్షిప్ ఏర్పడ్డాయామెలో, అలా ఆ ఇద్దర్నీ చూస్తూ తనకళ్ళని పక్కనే కూచొని ఉన్న జయశ్రీ వంక తిప్పింది.

" ఫ్రెండ్ ఫిలాసఫర్ గైడ్ అంటూ ఉంటారు. దానికి సరియైన నిర్వచనం ఈమే అయివుంటుంది" అనిపించింది. ఆప్యాయంగా ఆమె చుట్టూ చేయివేసి లాక్కుంటూ.

" చూడగా చూడగా మాతోపాటు విజయవాడకీ బయల్దేరి బేతాళ ప్రశ్న ఇచ్చిన ఆ బుడతడు కూడా మీ గ్యాంగేలా ఉంది? "అంది

"ఆహా! అతడు నా ఫ్రెండ్ మెజీషియన్ పట్టాభిరాంగారి అబ్బాయి" అన్నాడు రైటరు మల్లాది.

మౌళవిక పూర్తిగా నార్మల్ కండీషన్ లోకి వచ్చేసింది. ఆమె హృదయం ఇప్పుడు ఎంతో ప్రశాంతంగా, నిర్మలంగా వుంది.

"ఇవన్నీ నాకెందుకు చెప్పారు? నన్ను ఆ భ్రమలోనే ఉంచొచ్చుగా?" అని అడిగింది నవ్వుతూ.

"ఉంచొచ్చు కానీ అది కొన్నాళ్ళే! మొత్తం పూర్తిగా చెప్పడం వల్ల మిమ్మల్నెంతో అభిమానించే మీ నాన్నగారు, జయశ్రీ గార్ల మీద మీ కృతజ్ఞత రెట్టింపవుతుంది మీ కోసం ఈ అబ్బాయి మల్లాది ఎంత శ్రమించాడో మీకు అర్థం అవుతుంది. అది భవిష్యత్తులో మీ ఇద్దరి జీవితాలకు కాంక్రీట్ పునాది అవుతుంది." అన్నాడు రైటరు మల్లాది.

ఆయన సైకలాజికల్ స్టడీకి మెచ్చుకోకుండా వుండలేకపోయారు అహాల్లో కూచొని ఉన్న వారందరూ.

"ఒక్క మాట మల్లాదిగారూ! మిమ్మల్ని అభిమానించే వాళ్ళందరికీ ఇదే మీ సమాధానమా?" అడిగింది మౌళవిక.

"ఇక్కడ చిన్న లిటెకేషనుంది అభిమానించే వాళ్ళందరికీ కాదు ... అభిమానించి జీవితం పంచుకోవాలని ఆశించే వాళ్ళకి అవన్ని అడిగుండాల్సింది మీరు. నన్ను అభిమానించే అమ్మాయిలని వివాహం చేసుకోవాలంటే ఇప్పటికి నాకు అనేకసార్లు వివాహమయి ఉండాలి" అని నవ్వాడాయన.

తిరిగి కొనసాగిస్తూ "నా నవల్లోని హీరోలు కొంటెగా, తమాషాగా, సరదాగా లవబుల్ గా ఉంటారు కాబట్టే పాఠకురాళ్ళు నా హీరోలని అభిమానిస్తున్నారు. మీలాంటి కొందరు నేను కూడా ఆ హీరోలలాగా ఉంటానని ఆశించటంలో

తప్పులేదు. కానీ నేను మితభాషిని. ఏ మనిషయినా బాగా నచ్చి గుండెల్లోకి వచ్చేదాకా ఆప్యాయంగా ఉండలేకపోవటం నా మనస్థత్వం. నాకంటూ ఓ చిన్ని ప్రపంచం ఉంది. అది దాటి బయటికి రావడం నాకట్టే ఇష్టం లేదు. రాలేను. ఇతరులు అందులోకి రావటానికి కూడా ఇష్టపడను. నేనిప్పటిదాకా ఫోటో వేయించుకోకపోవటానికి గాని, నా అడ్రసు అవుట్ చేయకుండా పోస్టుబాక్స్ నంబర్ ని మాత్రమే ఇస్తూ ఎంతో మందికి దూరంగా, సాధ్యమైనంత అజ్ఞాతంగా ఉండడానికి ఈ మనస్థత్వమే కారణం" అని అన్నాడు రైటరు మల్లాది గంభీరంగా.

అక్కడి వాతావరణం కూడా ఒక్కసారిగా ఎంతో గంభీరంగా మారిపోయింది. రెండు క్షణాలపాటు ఎవ్వరూ మాట్లాడలేదు. అది గమనించిన పార్ధసారధి లేచాడు ముందుగా.

".... కే మల్లాదిగారూ! ఇంక మేం వెళ్ళిరావొచ్చా ... మీకు నేను జీవితాంతం కృతజ్ఞుడిగా ..."

వెంటనే ఆయన చేతులు పట్టుకొని వారించేడు రైటరు మల్లాది

"పెద్దవారు ... అంతమాట అనకండి ... మీ అమ్మాయిలో అటువంటి ఇంప్రెషన్ కలగడానికి ఓ విధంగా కారణం నేను, నా రచనలూ కాబట్టి దాన్ని సరియైన పద్ధతిలో పెట్టడం కూడా నా బాధ్యతగానే భావించి చేశాను" అంటూ పార్ధసారధి ఆప్యాయంగా అతని చేతుల్ని అదిమాడు.

"ఏమ్మా ... ఇంక మనం ఇంటికి బయల్దేల్దామా? మనతోపాటు ఈ అద్దె మల్లాదిని కూడా తీసుకువెళదామా– ఒద్దా?" అన్నాడు ఛలోక్తిగా (మరో) మల్లాది, మౌళవికల వంక చూస్తూ,

మౌళవిక సమాధానం చెప్పలేదు. ముందుకు నడిచి (మరో) మల్లాది దగ్గరికి వచ్చి "రండి వెళదాం" అంది.

ఒక్కసారిగా అందరి హృదయాలు తేలికపడ్డాయి.

ఇంటి గుమ్మం నుంచ గేటు వరకు ప్రత్యేకంగా సిమ్మెంట్ రోడ్డు మీద నడుస్తూ హఠాత్తుగా వెనక్కి తిరిగి "మల్లాదిగారు ... నాదో చిన్న రిక్వెస్టు" అందామె.

'ఏమిటన్నట్టు' చూశాడు రైటరు మల్లాది.

"ఇప్పటికైనా మీ ఫోటో పేపర్లలో రావడానికి ఒప్పుకోవటం నైతికంగా మీ బాధ్యత. అది మా పెళ్ళి కానుకగా ఇస్తారో మాకు పుట్టబోయే పిల్లల పెళ్ళికి కానుకగా ఇస్తారో మీ ఇష్టం "అంది రెండు చేతులూ జోడిస్తూ, అందరికీ వీడ్కోలు చెబుతూ మౌళవిక అన్న మాటల్నే మననం చేసుకుంటూ అలోచించసాగేడు రైటరు మల్లాది వెంకట కృష్ణమూర్తి.